తాళ్లపాక సాహిత్యము

# శృంగార సంకీర్తనలు



తాళ్లపాక అన్నమాచార్యులు

# శృంగార సంకీర్తనములు

(అన్నమాచార్య విరచితములు)

పరిష్కర్తలు :

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

గౌరిపెద్ది రామసుబ్బశర్మ

తిరుమల తిరుపతి దేవస్థానముల బోర్డు ఆఫ్ ట్రస్టీస్‌వారి అనుమతితో

ఎగ్జిక్యూటివ్ ఆఫీసరువారగు

శ్రీ పి. ఎస్. రాజగోపాలరాజు బి. ఏ., బి. యల్. గారి-

అనుమతిని ప్రకటింపఁబడినది.

తిరుమల తిరుపతి దేవస్థానముల ముద్రణాలయము,

తిరుపతి.

1975

Rs. 5-00.

సర్వహక్కులు
తి. తి. దేవస్థానములవారివి

మొదటి ముద్రణము
1,000 ప్రతులు

ముద్రణము :
తి. తి. దే. ముద్రణాల
తిరుపతి.

# సహృదయులకు సాదరాంజలి.

తాళ్లపాక వంశీయ సంకీర్తన మహాసాగర మథనములో వెలువడిన దీ-ఇరువదిరెండవ రత్నసంపుటి. ఇది పదకవితా పితామహులు, సంకీర్తనాచార్యులునగు తాళ్లపాక అన్నమాచార్యులు, శృంగారరసదేవతగా, మధుర భక్తి కాలంబనముగ శ్రీవేంకటేశుని భావించి, తా నొకనాయికగా నాతనిని స్మరించి, వరించి, కీర్తనలు రచించి తరించిన శృంగారరసరాగసంపుటి.

అన్నమాచార్యుని గురించి మేముగా ప్రత్యేకించి తెల్పునదేమియు లేదు. సంకీర్తనల పరిష్కరణభారమును వహించిన సంస్కృతాంధ్రోభయ భాషాకోవిదులు, అవధాన శేఖరులు, శ్రీవేంకటేశ్వర ప్రాచ్యకళాశాలాధ్యాపకులు, శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మ ఈకార్యక్రమము పుట్టుపూర్వోత్తరముల గురించి విపులముగ **తమ** మున్నుడిలో తెలియపరచినారు.

విషయమునకు దగినస్థాయిగలవిద్వాంసులు లభించుట యొకవిధముగ నీకార్యక్రమమునకు క్రొత్తమలుపనవచ్చునేమో!

సుమారు ముప్పదిరెండువేల కీర్తనలు రచించి, ఆంధ్రసాహితీ లోకమున ధ్రువతారగా నాచంద్రతారకము వెలుగొందు నన్నమయ్య-సాహిత్యమును ఆదరింప గల్గినచో నది ఆంధ్రుల అదృష్టము, దేవస్థానమునకు సంతృప్తి.

ప్రచురణకర్త:

**పి. యస్. రాజగోపాలరాజు, బి.ఏ., బి.యల్,**

# ఆముఖము

కడచిన పదిసంవత్సరాలుగా నిలబడియుండిన అన్నమాచార్య సంకీర్తనల ప్రకటనకార్యము ఈసంపుటముతో పునరారంభమైనదని నా హృదయము ఆనందముతో పొంగి పొరలుచున్నది. అట్లే ఈమహా శ్రీనివాస కైంకర్యమునకు వయోదోషముచేత నేను మరల చేయివేయ లేనిస్థితిలోనున్నానే అను నిర్వేదమున్నది. కాని యీకార్యము సంపన్నముగా నిర్వహింపగల శక్తియుక్తిరక్తులు నిండిన నాఅంతరంగమిత్రులు శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మగారే ఇందుకు నియమింపబడుట నా హృదయమున కెంతోనెమ్మది నిచ్చినది. వారిని ప్రత్యేకముగా ఈ పనికి నియోగించిన తి. తి. దేవస్థానముల నిర్వాహక సంఘాధ్యక్షులు శ్రీ చెలికాని అన్నారావుగారు, కార్యనిర్వాహణాధికారము వహించిన శ్రీ పి. ఎస్. రాజగోపాలరాజుగారును శ్రీ శ్రీనివాసులపరమానుగ్రహ పాత్రులు; సంగీత సాహితీ రసికులందరి ధన్యవాదములును హార్దాభినందనములును ముఖ్యముగా వారికి చెల్లవలసినవి; చెల్లగలవు.

నేను, శ్రీ రామసుబ్బశర్మగారును కలసి పనిచేయుచుండగా ఈ సంపుటమునందలి చాలాభాగము పరిశోధించి ముద్రణార్హముగా వ్రాయబడినది. అప్పుడే ఆపనికి అచింతితముగా విఘ్న మేర్పడినది. ఆచిక్కు దీర్చుకొని మరల నుపక్రమించుటకు ఇంతకాలము కావలసి వచ్చినది. దీనికి కారణములు అనేకవిధములు; అనేకములు. వాని నిక్కడ తడవ నక్కరలేదు. ఆయధికారమును నాకు లేదు.

కీ. శే. శ్రీప్రభాకరశాస్త్రిగారు మొదలు మావరకును జరిగిన యీ సంకీర్తన పరిశోధనకార్యములో మానవజ్ఞానమితికి సహజములైన లోపములు కొన్ని దొరలి యుండగలవు. దోషజ్ఞులైన సహృదయులు వాటిని తెలిపి ప్రతిబోధింపగలరు. వారు మాకృతజ్ఞతను చూరగొను వారు. వట్టిపురోభాగిత్వముచే స్వచ్ఛందముగా ఖండనకు పూనుకొను

వారివిషయమున ఈక్రింది మాయాచార్యశ్రీపాదులసూక్తిని స్మరించి యూరకుందుము.

"నిందతువా నందతువా మందమనీషో నిశమ్య కృతిమేతామ్
హర్షం వాఽమర్షం వా సర్షపమాత్రమసి నైవ విందేమ"

శ్రీ రామసుబ్బశర్మగారి యీప్రయత్నము సాంగముగా తుది దాకించునట్లు, అందుకు వలయుదీర్ఘాయురారోగ్యాదిసమృద్ధిని శ్రీ శ్రీనివాసులనుగ్రహింతురు గాక! అనన్యసామాన్యసౌందర్యసురభిళమైన తాళ్ళపాకవారి యీభాగవతసాహిత్యసంపత్తి మనదేశమున సర్వంకషముగా ప్రసరించునుగాక।

బెంగుళూరు,
16-12-74.

సుధీపాదపాంసువు,
రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ.

# పీఠిక

పూజ్యపాదులు శ్రీమాన్ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ గారికి సహాయకుడుగ 1964 ఆగస్టు నుండి దాదాపు సంవత్సర కాలమునకు పైగా నేనీ పరిష్కరణ కార్యమున పాలుపంచుకొంటిని. ఆ సేవయే సుమారు పది సంవత్సరములకు తరువాత రెండవ సారిగ మరల నన్నీ-కార్యమున నియోగించుటకు కారణమైనది. కొన్ని అసాధారణ-కారణములతో ఈ పని యింతకాలము గాఢనిద్ర ననుభవించినది. నడుమ రెండుమూడు పర్యాయములు అధికారులు దీనిని సాగింప సంకల్పించుకొన్నను ఎందుకో ముందుకు సాగలేదు.

ప్రస్తుతము తి.తి. దేవస్థానముల ధర్మకర్తల మండలికి అధ్యక్షులుగ శ్రీ చెలికాని అన్నారావుగారు వచ్చుటతో దీని కొక మేలుకొలుపు గలిగినది. శ్రీ చెలికాని అన్నారావుగారు, తాము ఎగ్జిక్యూటివ్ ఆఫీసరుగ నున్నప్పుడు ఎంతో సంరంభముతో ప్రారంభించి సాగుచుండిన ఈ కార్యము మూల పడియుండుటకు వారిమన సొప్పుకొనలేదు. అట్టి చిత్తవృత్తియేగల ప్రస్తుతము ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు శ్రీ పి. యస్. రాజగోపాలరాజుగారు, కమిటీ ఛేర్మెన్ శ్రీ చెలికాని అన్నారావు గారును నన్ను పిలిపించి, పెద్దలు, ప్రసిద్ధులు నగు కీర్తిశేషులు వేటూరి ప్రభాకరశాస్త్రిగారు, శ్రీమాన్ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ గారును సాగించిన ఈ పరిష్కరణకార్యమును, ఇక మీరు సాగింపవలె నని నన్నీ కార్యభారమున కాదేశించిరి.

నేను, వారు పేర్కొన్న పెద్దలతో పోలినవాడను కాకపోయి నను, నాపై అధికారులు చూపిన ఆదరమునకు, ఇచ్చిన ఆదేశమునకు కృతజ్ఞుడనై 'పెద్దలు చేసినపని' యని వారుచెప్పుట నాకు హెచ్చరికగ భావించి, ఇహపరసాధకమైన ఈ తాళ్లపాక కవుల రచనల పరిష్కరణ మునకు పూనుకొంటిని. ఆపై శ్రీనివాసునిదయ, తాళ్లపాక కవుల

యనుగ్రహము. పూజ్యపాదులు శ్రీమాన్ గౌళ్లపల్లి అనంతకృష్ణశర్మ గారి మంగళాశాసనములు నా కీపనిలో అండగ నిల్చి నన్ను కృతార్థుని చేయగలవని నమ్మక మున్నది. శ్రీ శర్మగారితో కలిసి పని చేయుటచే సిద్ధించిన అనుభవముతో వారియొరవడిలోనే నేనీకార్యము నడుపుచూనిక గలదు.

## 2. రాగిరేకుల చరిత్ర

అనితర సాధారణ సాహిత్య చైతన్యము గల తాళ్లపాక వారి రచనలతో పవిత్రములైన ఈ రాగిరేకులు, కొన్నిశతాబ్దములుగ శ్రీవేంకటేశ్వరుని ఆలయములో ఒక అరలో అజ్ఞాతవాసము చేయు చుండినవి. 1922 – 23 ప్రాంతమున, అప్పటి దేవస్థానపుటుద్యోగి-యగు శ్రీ సాధుసుబ్రహ్మణ్యశాస్త్రిగారి సూచనపై ఈ రాగిరేకుల పరిష్కరణ ప్రకటన కార్యములు ప్రారంభములైనవి. అవి యొందు లకో కుంటినడక నడుచుచుండినవి. తరువాత 1935 వ సంవత్సరము పండిత శ్రీ వి. విజయరాఘవాచార్యుల(Epigraphist, Devasthanams) వారి పరిష్కరణముతో, మహారాజరాజశ్రీ రావుబహద్దూరు శ్రీ కె. సీతారామిరెడ్డి B.A., B.L. (Commissioner, T.T.D)గారి అధికారము క్రింద, 'తాళ్లపాకకవులలఘుకృతులు' (The Minor Works of Tallapakam Poets) అను పేరుతో కొన్ని రాగిరేకులు (1935) తొలుతగా మొదటి సంపుటముగ ప్రకటితములైనవి. తరువాత రెండవసంపుటముగ కొన్ని 'అధ్యాత్మకీర్తనలు', మూడవ సంపుటముగ కొన్ని 'శృంగార సంకీర్తనలు', ప్రకటితములైనవి. ఆ తరువాత కీర్తిశేషులు వేటూరి ప్రభాకరశాస్త్రిగారిసంబంధము ఈ రాగిరేకుల కబ్బినది.

మూడవ సంపుటమువరకు జరిగిన పరిష్కార ప్రకటనములు శ్రీ శాస్త్రిగారికి రుచింపకపోవుటచే, ముందు ముద్రితములైన వాటితో పాటు రాగిరేకులలోని వాఙ్మయమంతయు సంపుటములవారీగా

ప్రకటించుట కొకపథకమును తీర్మానించుకొని దానికి పునాదిగ రాగిరేకుల లెక్కలను 4 వ సంపుటముకు పీఠికలో 1947 వ సంవత్సరము శ్రీ శాస్త్రిగారు విశదముచేసిరి. అది మొదలు నేటిదాక రాగిరేకుల లెక్కవిషయమున శ్రీ శాస్త్రిగారి పీఠికయే అందరికి ఆధారమైనది. ఆ సంపుట మిప్పుడు దుర్లభము. అది యింతలో పునర్ముద్రణ మగు ననుట 'నందో రాజా' వంటిది.

శ్రీ శాస్త్రిగారు, తాళ్లపాక వారి లఘుకృతులుగా ప్రకటితము లైన రేకులను, అహోబిలమునుండి తెప్పించినట్లుగా చెప్పబడుచున్న పెద్దరేకులను తమపీఠికలో పేర్కొనలేదు. వారుపేర్కొన్న లెక్కలలో విడివిడిగా పేర్కొన్న లెక్కకు, మొత్తముగ పేర్కొన్న లెక్కకు ఎట్లు చూచినను పొత్తు కుదురుట లేదు. వారు ప్రామాణికులు, వారి సంస్కరణమే తరువాతివారికి జీవగట్టు యైన దనుటలో సందేహములేదు. ప్రథమ గణనము కాబట్టి, ఎవరి కనుజారుబాటో దీనికి కారణము కావచ్చును. ఇవి గాక తాళ్లపాక అన్నమయ్య, పెద తిరుమలయ్య, చిన తిరుమలయ్యల అధ్యాత్మ, శృంగార సంకీర్తనల రేకుల విభాగమునకు కూడ శ్రీ శాస్త్రిగారు కొన్ని కొలతలను చూపిరి. ఆకొలతలివి–

| | | | | పొడవు. | వెడల్పు. |
|---|---|---|---|---|---|
| 1) | అన్నమాచార్యుల | అధ్యా. సం. | రేకులు | 15½ అం. | 7 అం. |
| 2) | ,, | శృంగా. సం. | ,, | 15½ అం. | 7 అం. |
| 3) | పెదతిరుమలాచార్యుల | అధ్యా. సం. | రేకులు | 15¾ అం. | 6¾ అం. |
| 4) | ,, | శృంగా. సం. | ,, | 16 అం. | 7 అం. |
| 5) | చినతిరుమలాచార్యుల | అధ్యా. సం. | ,, | 15 అం. | 7½ అం. |
| 6) | ,, | శృంగా. సం | , | 15½ అం. | 7.2అం. |

చిన తిరుమలాచార్యుల అధ్యాత్మ. శృంగార సంకీర్తనల రేకు లన్నిటియందు ఆయనపేరే వ్రాయబడియుండుటచే వాటిలో సంశయావకాశమే లేదు. అన్నమాచార్యుల, పెద తిరుమలాచార్యుల రేకుల విభాగమునందు పై కొలతలు అంత నిష్కర్షగ నున్నవని చెప్పలేము. సమసంఖ్యగల రేకులు కొన్ని ఒకే కొలతలో నుండుట నా యీ ఊహకు కారణము. శ్రీ శాస్త్రిగారి లెక్కలనుండి చూచుచున్నవారందరు ఆ కొలతలనే ఆధారముగ చేసికొని చూచిరో, లేదో చెప్పలేము. అధ్యాత్మ కీర్తనల రేకులందుగాని, శృంగార సంకీర్తనల రేకులందుగాని, మొదటి వందలో మాత్రమే ఈ విభాగ మావశ్యకమైనది. రెండవవందనుండి శృంగారాధ్యాత్మములు రెండింటి యందును అన్నమయ్యదే రాజ్యము.

ఈ కొలతలు తడబడు చుండుటచే నే నొకగుర్తు కనుగొంటిని. రేకుల నడుమ వేసిన రంధ్రములు, అన్నమయ్య రేకులలో చదరముగ నుండును. పెదతిరుమలయ్య రేకులలో ఆ రంధ్రముల స్థలమున కొంత పైకి ఉబ్బుదేరి యుండును. కాని, ఈవిభాగము గూడ సాంతముగ నిలుచుటలేదు ఇంతవరకు ప్రకటితములైన అన్నమయ్య, పెద తిరుమలయ్యల శృంగారాధ్యాత్మ సంకీర్తనలలో ఈ రేకుల గజిబిజిచే కొంత కలగాపులగ మయియుండునేమో యని నాభావము. ఈ దోషము దుష్పరిహారము. భాషతో, భావముతో వానిని వన్నెగట్టుట కూడ అంత సులభసాధ్యముకాదు.

శ్రీ శాస్త్రిగారి పీఠికలో రేకుల లెక్క ముద్రితాముద్రితాది విషయములతో కలిసియుండుటచే, రేకుల లెక్క మాత్రము తెలిసికొను పాఠకునకు కొంత పరిశ్రమ తప్పనిసరియై యుండును. ఆ పరిశ్రమ నే ననుభవించి శ్రీ శాస్త్రిగారి పీఠికలోని లెక్కలతో సరిపోల్చుకొనుచు నాగణనకు వచ్చిన రాగిరేకుల మొత్తమును వందలవారీగా, విషయమువారీగా, కవులవారీగా ఈ క్రింది పట్టికలలో చూపుచున్నాను.

---

N.B :- ఈ క్రింది పట్టికలో శ్రీ శాస్త్రిగారి పీఠికకు శా.పీ. అని సంకేతముంచి, వారి లెక్కకు, నా లెక్కకు భేదము వచ్చిన పట్టున మాత్రము సహేతుకముగ వివరింతును. భేదము లేనిపట్టులందు ఏమియు వ్రాయలేదు.

# తాళ్లపాక కవుల రాగిరేకుల వివరణము

* * *

| రచన—కర్త | రేకుల వరుస (వందలలో) | ఉన్న రేకులు | విశేషములు |
|---|---|---|---|
| అధ్యాత్మ సంకీర్తనలు అన్నమయ్య | 1-100 | 83 | 51 నుండి 60 దాక 10; 71 నుండి 77 దాక 7; మొత్తం 17 రే. లేవు. |
| | 101-200 | 90 | 21 నుండి 30 దాక 10 రేకులు లేవు. |
| | 201-300 | 99 | 216వ సంఖ్యగల రేకు లేదు. |
| | 301-400 | 91 | 392 నుండి 400 దాక 9 రే. లేవు. |
| అధ్యాత్మ సంకీర్తనలు పె. తిరుమలయ్య | 1-100 | 76 | శా.పి. 11, 30 సంఖ్యగల రేకులు రెండు; 78 నుండి 100 దాక 23 రేకులు, వెరసి 25 రేకులు లేవు. కాని 98వ సంఖ్యగల రేకు 1 గలదు. |
| అధ్యాత్మ సంకీర్తనలు చి. తిరుమలయ్య | 1-100 | 10 | ఇప్పటివరకు దొరకినవి రేకులు పదే |
| శృంగార సంకీర్తనలు అన్నమయ్య | 1-100 | 94 | 19వ సంఖ్యగల రేకు ఒకటి; 96 నుండి 100 దాక 5, వెరసి 6 రే. లేవు. |
| | 101-200 | 100 | — |
| | 201-300 | 100 | — |
| | 301-400 | 100 | — |
| | 401-500 | 90 | 451 నుండి 460 దాక 10 రే. లేవు. |
| | 501-600 | 90 | 521 నుండి 530 దాక 10 రే. లేవు. |
| | 601-700 | 100 | — |
| | 701-800 | 99 | 706వ సంఖ్యగల రేకు ఒకటి లేదు. |
| | 801-900 | 99 | 889వ సంఖ్యగల రేకు ఒకటి లేదు. |
| | 901-1000 | 98 | 912, 915 సంఖ్యగల రే. లేవు |

| రచన-కర్త | రేకుల వరుస (వందలలో) | ఉన్న రేకులు | విశేషములు. |
|---|---|---|---|
| శృంగార సంకీర్తనలు అన్నమయ్య | 1001-1100 | 100 | — |
| | 1101-1200 | 89 | 1105, 1151 నుండి 1160 దాక 10 వెరసి 11 రేకులు లేవు. |
| | 1201-1300 | 90 | 1271 నుండి 1280 దాక 10 రే. లేవు. |
| | 1301-1400 | 100 | — |
| | 1401-1500 | 100 | — |
| | 1501-1600 | 80 | 1521 నుండి 1530 దాక 10; 1581 నుండి 1590 దాక 10; వెరసి 20 రే. లేవు |
| | 1601-1700 | 100 | — |
| | 1701-1800 | 100 | — |
| | 1801-1800 | 100 | — |
| | 1901-2000 | 90 | 1911 నుండి 1920 దాక 10 రే. లేవు. |
| | 2001-2100 | 2 | 2001, 2002 సంఖ్య రేకులే గలవు. |
| శృంగార సంకీర్తనలు పె.తిరుమలయ్య | 1-100 | 89 | శా. పీ.తో 51 నుండి 60 దాక 10 రేకులు లేవు. నా గణనలో పై పదితోబాటు 98వ సంఖ్యగల రేకుతో కూడ వెరసి, 11 రేకులు లేవు. పె తి అధ్యాత్మ సం. రే. లో నాగణన కెక్కువ వచ్చిన 98 వసంఖ్యగల రేకు, ఈతని శృంగార సంకీర్తనల రేకులలో కలిసి యుండవచ్చును. |
| శృంగార సంకీర్తనలు చి.తిరుమలయ్య | 1-100 | 20 | ఈ చి.తి.శృ. సం. రే.లలో శా. పీ లో గుర్తింపబడినవి 10. నాగణనలో 20 గుర్తింపబడినవి. కాని ఈ 20 రే. 16వ సంపుటమున శ్రీ ఎ. వి. శ్రీనివాసాచారిగారిచే ప్రకటితములైనవి. |

## శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు పీఠికలో పేర్కొనని తాళ్లపాకవారి లఘుకృతుల రేకుల వివరణము.

* * *

| వరుస నెం. | విషయము | కర్త | రేకుల సంఖ్య | ముద్రిత సంపుటము |
|---|---|---|---|---|
| 1. | శృంగార మంజరి | అన్నమయ్య | 5 | 1వ సంపుటము |
| 2. | సీస పద్యములు | పెదతిరుమలయ్య | 10 | ,, |
| 3. | చక్రవాళ మంజరి | ,, | 2 | ,, |
| 4. | సుదర్శన రగడ | ,, | 1 | ,, |
| 5. | శృంగార దండకము | ,, | 3 | ,, |
| 6. | రేఫ 'అ'కారములు | ,, | 4 | ,, |
| 7. | వేంకటేశ్వరోదాహరణము | ,, | 3 | ,, |
| 8. | వృత్తపద్య శతకము | ,, | 7 | ,, |
| 9. | వైరాగ్యవచనమాలికాగీతములు | ,, | 10 | ,, |
| 10. | అష్టభాషాదండకము | చినతిరుమలయ్య | 3 | ,, |
| 11. | సంకీర్తన లక్షణము | ,, | 4 | ,, |

# కవులవారీగ రేకుల లెక్క

| వరుస సంఖ్య | కవి | రచన | రేకుల సంఖ్య | |
|---|---|---|---|---|
| 1. | అన్నమయ్య | శృంగార మంజరి | 5 | |
| | | అధ్యాత్మ సంకీర్తనలు | 363 | |
| | | శృంగార సంకీర్తనలు | 1921 | |
| | | | | —2289 |
| 2. | పె. తిరుమలయ్య | సీస పద్యము | 10 | |
| | | చక్రవాళమంజరి | 2 | |
| | | సుదర్శనరగడ | 1 | |
| | | శృంగారదండకము | 3 | |
| | | రేఫ ఱకారములు | 4 | |
| | | వేంకటేశ్వరోదాహరణము | 3 | |
| | | వృత్తపద్యశతకము | 7 | |
| | | వైరాగ్యవచనమాలికాగీతములు | 10 | |
| | | అధ్యాత్మ సంకీర్తనలు | 76 | |
| | | శృంగార సలకీర్తనలు | 89 | |
| | | | | —205 |
| 3. | చి. తిరుమలయ్య | అష్టభాషాదండకము | 3 | |
| | | సంకీర్తన లక్షణములు | 4 | |
| | | అధ్యాత్మ సంకీర్తనలు | 10 | |
| | | శృంగార సంకీర్తనలు | 20 | |
| | | | | —37 |
| | | | | —2531 |

పై పేర్కొన్న సాధారణమైన రేకులు కాక మిగిలిన సన్న-పెద్ద రేకుల వివరణము.

| | | |
|---|---|---|
| 1. | కడియములు వేసినవి వేయనివి 28 అం.పొ. 16 అం.వె గల పెద్ద రేకులు (పె.రే.) | 36 |
| 2. | శాసనములు వగైరాదులు కలిగి కడియములు వేసినవి వేయనివి దాదాపు .11 అం. పొ. 8 అం. వె. గలిగిన రేకులు (శా. రే.) | 10 |
| 3. | తాళపత్రాకృతితో 33 అం. పొ. $2\frac{1}{2}$ అం. వె. గల నిడుద రేకులు (ని.రే) | *119 |
| | వీని తుంటలు | 5 |
| | | 170 |
| | ముందు చూపిన సాధారణమైన రేకులు | 2531 |
| | (రెండువేలా ఏడువందలా ఒకటి) మొత్తము .... | 2701 |

---

*. శా పీలో ఇవి 120 అని గుర్తింపు.

సాహిత్యమునకు, దేవస్థానము వారికి పెద్ద ఆస్తిగనున్న ఈ రేకుల నింతవరకు తి. తి. దేవస్థానములవారు కాపాడుచున్నందులకు వారికి సాహిత్య రసికు లందరు కృతజ్ఞులై యుండగలరు. కాని, ఈ రేకులు కట్టలు కట్టలుగ పేర్చి యుండుటచే, రాగి లోహము గావున నడుమ చిలుమూరి కొన్ని రేకులలో అక్షరములను, కొన్నిట రేకుల పయినున్న సంఖ్యను తినివేయుచున్న ప్రమాదము ఇప్పటికే ఏర్పడినది. ఈ విషయమై రాసాయనిక ప్రక్రియతో తగుజాగ్రత్త గైకొనుట మంచిదని అధికారులకు మనవి చేసియున్నాను. వారును శ్రద్ధగనే గమనింపగలరు.

అన్నమయ్య కీర్తనలు మొత్తము 32000 అని చిన్నన్నగారి మాట. అట్లైనచో సాధారణముగ రేకుకు 6 పాటల వంతున వారి రేకులే దాదాపు 5,400 కావలసియున్నవి. కాని, మనకు లభించిన అన్నమయ్య రేకులు 2,284. పెద తిరుమలయ్య, చిన తిరుమలయ్యల రేకుల లెక్కను చూడకయే అన్నమయ్యవే సగానికి తక్కువగామనకు దొరికినట్లు. మిగిలినవానికై అహోబిలము, శ్రీరంగము, సింహాచలము లందలి అధికారులతో తి. తి. దేవస్థానము వారు సంప్రదించుచున్నారు. మరెక్కడనైనను లభించినను మనము ధన్యులమే. 'కాలోహ్యయం నిరవధిః విపులా చ పృథ్వీ' అని గదా అభియుక్తోక్తి.

## 3. వ్రాతలు — ముద్రణములు

పదునెనిమిదవ సంపుటమును పరిష్కరించిన వారు ఈ రేకుల లోని వ్రాతను, భాషను, ముద్రణమునుగూర్చి చర్చించి ఈ భాషనంత గ్రాంథికమగునట్లు వడియగట్టవలె నని సంకల్పించిరి. ఆ చర్చలో పది యంశములతో నానా విషయములపైచర్చ సాగించిరి. పరిష్కరణము నందు ఇట్టివిషయ చర్చ అనవసరమైనదనుటలో సందేహములేదు.

తాళ్లపాక కవులవాఙ్మయమునకు మురిసి, దాని నుద్ధరించుటయే జీవిత పరమార్థముగ తలచి, ఆ పనిలో మునిగితేలి, ఆ వాఙ్మయమును ప్రచారము చేయించుటకుగా పరిష్కరణ కార్యముతోపాటు అన్నమయ్య వర్థంత్యుత్సవములను నెలకొల్పి, ఆ సమయములందు పండితులు చేసిన యుపన్యాసములను, గాయకులు పాడిన కీర్తనములను ఆలిండియా రేడియో - విజయవాడ కేంద్రమువారిచే ప్రసారింపజేసిన కీర్తిశేషులు వేటూరి ప్రభాకరశాస్త్రిగారు, తమ 'అన్నమాచార్య జీవిత చరిత్ర పీఠిక' అను గ్రంథములో 100-101 వ పుటలలో 'భాషావిశేషములు' అను శీర్షిక క్రింద పైపరిష్కర్తలు పేర్కొన్నవి మాత్రమేగాక ఇంకను చాల విశేషములను చూపియున్నారు. ఆ యకృత్రిమ వ్యావహారిక రూపములను పరిష్కరించుటకు ప్రయత్నింపలేదు.

రాగిరేకులలోని వ్రాత, పాతకాలము శాసనముల వ్రాతకు చాల సన్నిహితమైనది. అందులోని భాష, అరసున్నలు, శకటరేఫలతో గ్రాంథికవేషము సంతరించుకొన్న వ్యావహారిక శబ్దరాశితో నిండినది. చాలభాగమింతే. పదబంధము, భావకల్పనము మాత్రము లాక్షణికముగ గన్పట్టును.

## ఈ రేకుల వ్రాతలో,

1. విసంధిగ వ్రాయుట 2. ఉకారాంతములపై గూడ అచ్చులకు యవలు సంధించుట. 3. ద్రుత సంధులు అక్కడక్కడ యథేచ్ఛముగ మానుట. 4. సకారాదులు శకారాదిగనుండుట. 5. ఎంత, ఎల-మొదలగువానికి బదులు యంత, యాల-అని యుండుట 6. ఇతర ప్రయోగములందు కానరాని అరసున్నలు కొన్నిపట్ల కానవచ్చుట (ఈ యంశము భాషా వ్యాకరణ శాస్త్రములలో సంవదించి

నిర్ణయింపవలసినది) 7. ఎనఁగులో, 'అంటకు' ప్రతియగు 'అఁట' లో చాల స్థలముల అర్ధానుస్వారము లేకుండుట 8. వ్యావహారిక పదము లందు సైతము అవ్యవస్థగా శకటరేఫలుండుట, 9. ఒకేపదము సాధు, శకట రేఫలతో ఉండును. కాని, యతిప్రాస స్థలములలో ఏదైన ఒకటియే యుండును 10. గ్రాంథికరూపములకు సన్నిహితములగు వ్యావహారిక రూపములలోఁగూడ అరసున్నలు పట్టువిడువక నిలుచుట 11. అజాది పదములు యకార, వకారాదిగా నుండుట మొదలగు విషయములన్నిటిని, కీర్తిశేషులు ప్రభాకరశాస్త్రిగారు, శ్రీమాన్ అనంతకృష్ణశర్మగారును గుర్తించియే వాని స్వరూపమును చెరపరాదని, భావిసాహిత్య రసికులు ఈ వ్రాతతో భాషా చరిత్రను చర్చింపగలరని ఊహించి అట్లట్లనే ముద్రించుచు వచ్చిరి.

ఈ వాఙ్మయ పరిష్కరణములో పండిత పరిష్కర్తలుగ తొలుత సంస్కారమునకు పూనినవారు కీర్తిశేషులు వేటూరి ప్రభాకరశాస్త్రి గారు. వారు ఎందుకో, పాట మొదటనున్న యకార వకారాది తెనుగు పదములను మాత్రము అజాదిగా, తెనుగు పదములలోని శకారమును సకారముగ చేసి, తక్కినదంతయు ఉన్నరూపుననే యుంచి ప్రకటించిరి. శ్రీశాస్త్రిగారిచేతనే 'సంగీతసాహిత్యపుష్టి గలవారు' అని కొనియాడబడిన శ్రీమాన్ రాళ్ళపల్లివారును శ్రీశాస్త్రిగారి పరిష్కరణ పద్ధతినే భూషించి పరిష్కరించుచుండిరి. ఆ త్రోవనే నేనును నడుప దలచితిని.

ఇంతకు, పదాది యకారవిషయమున ఆదివ్యాకర్తయగు నన్నయ్యగారే 'అద్యః క్రియాసు భూతార్థద్యోతిన మాద్యగం వినా సర్వః' అని సూత్రించి 'సర్వ ప్రాజ్ఞ త్కార్యం జ్ఞేయం యస్య ద్రుత ప్రకృతికేభ్యః' అని నిజస్వరూపమును నిలబెట్టుకొనిరి. ఈ వ్యాకరణ వ్యాఖ్యాతలుఁగూడ 'యెవ్వాని వాకిట' ఇత్యాదిగ నుదాహరించి సమన్వయించిరి.

పదాది యకార. వు, వూ, వొ, వో — లు స-స్థాన శకారము ఇవి, సాధారణ జనాభ్యాసమున వ్రాతలలో నిండి ఎంతగా పండితు లీసడించుకొన్నను తొలగనంత లోకసిద్ధిని సంపాదించుకొన్నవి. ఈ రాగి రేకులపై వ్రాత పెద్ద పండితులచేత సాగినది కాదు. అవ్యుత్పన్ను లైనపోగరపని వారితో సాగియుండును. వారి కై వాడము కొంత సహకరించియుండును. అదిగాక ఈ పద కవిత్వమున కవులే పనిబూని వ్యావహారికపదములను వాడినారు. అది వారి ఉద్దేశము, అభినివే నము, హక్కులకు సంబంధించినది.

ఈ తాళ్లపాక కవులు గ్రాంథికరూప సన్నిహితములగు వ్యవ హార భాషా పదములలో అరసున్నలు, శకట రేఫలు గ్రాంథికరూప మున కనువుగా ఆయాపట్టుల వాడుచు రచన సాగించినారు. ఇట్లు గ్రాంథిక, వ్యవహార భాషల సాంకర్యముతోనే వీరి పదవాఙ్మయ మంతయు భావ బంధురమై, బహుజనోపయోగ్యమై. భక్తిసంభరితమై-అలరారుచున్నది. వీరు పదకవిత్వమందుమాత్రమే వ్యావహారిక భాష నుపయోగించిరి.

ఈవాఙ్మయము నంతటిని గ్రాంథికశబ్దసారముగ వడియగట్టు-పూనిక ఆ కవుల సంకల్పమునకు దూరమగుటయేగాక, సముద్రమున కేత మెత్తినట్లు కాగలదని నా భావము.

ఈ పరిష్కరణ చర్చా సందర్భమున బహు గ్రంథపరిశోధకులు, వ్యాఖ్యాన పరిష్కరణములందు అనుభవము, ప్రసిద్ధి గలవారగు బ్రహ్మశ్రీ దీపాల పిచ్చయ్య శాస్త్రిగారి మాటలు చాలప్రయోజన కరము లని ఉదాహరించుచున్నాను. వారు, ఆంధ్రసాహిత్య అకా డమీ వారి సారంగధరచరిత్ర పీఠికలో ప్రబంధములందు వ్యవహార భాషనుగూర్చి చర్చించుచు, ఆ గ్రంథములో 'పవ' అనుటకు 'యావ' 'ఆశించియున్నాను' అనుటకు "ఆశించియున్నా' 'కొండెమునకు'

అనుటకు 'కొండేనకు' అను ప్రయోగములను, 'ఆమె + అట' అనుస్థలమున 'అమట' అని సంధించుట మొదలగు విషయములను ప్రస్తావించుచు, "శివకవులుగాని, వేంకటకవిగాని, భారత భాష యెఱుఁగని వారు కారు. ఎఱిఁగియు, తద్భిన్నముగా ప్రయోగము లేల చేసి రనగా, వారు వ్యవహారసిద్ధ భాషాప్రవర్తకులు. కాలక్రమమున భాషయు, దాని మర్యాదలును మారుచుండు ననియు, కవియైన వాడు తనకాలమున వ్యవహారసిద్ధమైన భాషను యథోచితముగ నుపయోగించు ననుట సంభావ్యమనియు, కావ్యములోని భాష వ్యవహారమున కెంత సమీపముగా ఉంటే, పఠితల కంత ఆనందదాయకమనియు భావించి, వారు భారతమున కెక్కని భాషను సంతరించియు, భారతకాలమునాటి నియమ బంధములను కొంతవరకు సడలించియు, వాడుకొన్నారు. అదియొక మార్గము. దానినే దేశి అంటారు. ఆ తత్త్వము తెలుగని పెద్దలు పరిష్కర్తలై, వారి ప్రయోగములు దుష్టములని, తమ ఇష్టప్రకారము ఆయా కవుల ప్రయోగములను మార్చివేశారు. ముందటి కవుల ప్రయోగము లుండిననేగాని, భాషా పరిణామ చరిత్రను తెలిసికొనుటకు వెనుకటివారి కాధార ముండదు. కాబట్టి వాటిని మార్చగూడదు.

అది యట్లుండగా కవి యిష్టపడి వాడుకొన్న భాషను మార్చుటకు పరిష్కర్త కేమధికారము? అట్లు మార్చుట 'లిటరరీ ఫోర్జరీ' అనిపించుకొనును. కనుక పరిష్కర్తలు చేయుచున్న పని అక్రమమైనది" అని వ్రాసినారు. ఇది అందరును గమనింప వలసినదే.

తాళ్లపాక వారికి తరువాతి వారగు క్షేత్రయ్య, సారంగపాణి, ప్రభృతుల పదసాహిత్యము గూడ నిట్టిదే. ప్రాచీన గ్రంథావళి - 9 వ సంపుటముగ వెలసిన 'క్షేత్రయ్య పదములు' అను గ్రంథమునకు సంపాదకులు, పీఠికాకర్తలు నగు శ్రీ విస్సా అప్పారావుగారు, పై

గ్రంథావళిలో శ్రీ పురిపండ అప్పలస్వామి సంపాదకత్వమున 10 వ సంపుటముగ వెలసిన "సారంగపాణి పదములు" అను గ్రంథమునకు పీఠిక వ్రాసిన శ్రీ మండపాక పార్వతీశ్వర శాస్త్రిగారును, ఆ పద సాహిత్యములోని వ్యావహారిక పదసంపదకు మురిసి, అది మన తెలుగు వారి 'అకృత్రిమసాహిత్యసంపద' యని భూషించి యథా లిఖిత ముగ ముద్రింపించి, ఆంధ్రులమన్ననలకు పాత్రులైనా రనుట మనము మరువరాని విషయము.

## ఇప్పటి 22 వ సంపుటము.

ఈ సంపుటములో ముద్రితము లగుచున్న 701 మొదలు 800 వరకు గల వంద రేకులలో 82 రేకులు (782) నేను, శ్రీమాన్ రాళ్ల పల్లి వారును కలిసి పని చేసినప్పుడే (దాదాపు పదేండ్ల క్రింద) వ్రాత ప్రతి తయారుచేసి యుంటిమి. దాని శేషము రేకులను నే నిప్పటి నియోగములో పూర్తి చేసితిని.

శ్రీమాన్ రాళ్లపల్లివారు, నేను కలిసి ప్రకటించిన 19, 20 వ సంపుటములయందు, ఈ తాళ్లపాక కవుల అపూర్వ పద ప్రయోగ ములు కొన్నింటికి, 'సందిగ్ధపదసమీక్ష' - అను ఒక అనుబంధముక్రింద మాకు తోచిన ఉపపత్తులను వ్రాసియున్నాము. ఈ సంపుటములో కొంత భాగము పదేండ్లక్రితము, తరువాతి భాగ మిప్పుడు పూర్తి యగుటచే అసందిగ్ధపదసమీక్షకై మేము గుర్తుంచుకొన్న పదముల-చిత్తుప్రతి ఇప్పుడు కానరాలేదు. అందులకై ఈ పూర్తిసంపుటమును నేను శ్రీమాన్ రాళ్లపల్లి వారియొద్దకు తీసుకొని పోయి, సంపూర్ణ ముగ చదివి కొన్ని పదముల నుద్ధరించుకొని, వాని అర్థ నిర్ణయాదు లను గూడ తేల్చుకొనవలెనని, దానికై నన్ను on duty గా శ్రీమాన్ రాళ్ళపల్లి వారి యొద్దకు (బెంగుళూరు) పంపుట కనుమతి యిచ్చు

నటులు ఎగ్రికల్చరల్ ఆఫీసరు శ్రీ P. S. రాజగోపాలరాజు గారిని ప్రార్థించితిని. అడిగినదే తడవుగ సరసులు సాహిత్య ప్రియులు అగు వారు నా కర్జ్లే అనతిచ్చిరి. వారికీ విషయమున నేనెంతయు కృతజ్ఞుడను. వారిఆదరమే పై పై సంపుటములయందు నాపనికి శ్రీరామ రక్షగా ఉండగలదని భావించు చున్నాను.

ఎనుబది యేండ్లు దాటిన వృద్ధులయ్యును, మద్రాసు సంగీత అకాడమీపని వారి నొత్తుచున్నను, నాయందలి పుత్రవాత్సల్యముతో, తాళ్ళపాక కవుల రచనలపై గల భక్తితో, అన్నమయ్యకు కన్నివిధముల ప్రతిరూపులగు శ్రీమాన్ రాళ్ళపల్లి వారు, ఓపికతో నాకు తగిన సలహాల నిచ్చి ఆ యనుబంధమును పూర్తి చేయించిరి. వారికి నమస్కారములకంటె నే నిచ్చు బహుమాన మేమియు లేదు. వారికి నాపయి గల అపూర్వ వాత్సల్యమునకు, నేను పూర్వ మెంతో పుణ్యము చేసినవాడ నని గర్వించు చుందును. వారి కీ సహాయమున నే నెంతయో ఋణపడియున్నాను. నాబలవంతముపై పరిష్కర్తలలో వారి పేరు గూడ ఈ సంపుటమున ముద్రించుట కంగీకరించి, దీనికి ఒక అముఖమును వ్రాసిపంపిన వారికి నా యభివాదములు. పదేండ్లుగ మూలబడియుండిన పనిని మరల మేలుకొలుపుటకు ఉదయభానునివలె వచ్చిన శ్రీ చెలికాని అన్నారావు (తి. తి. దేవస్థాన ధర్మకర్తలమండలి అధ్యక్షులు) గారికి నా ధన్యవాదములు తెల్పుకొనుచున్నాను. శ్రీ చెలికానివారివట్లు శ్రీ పి. ఎస్. రాజగోపాలరావుగారి ఉత్సాహము ఈ పనిని ముందు ముందు ఇంతకంటె తెజస్విగ సాగించుటకు సహాయపడగలదని నానమ్మకము. పదేండ్లనాటి వ్రాతపతిని చెక్కు చెదరకుండ భద్రపరచిన సప్తగిరిసంపాదకులు శ్రీ సుబ్బారావు గారికి నా అభినందనలు. ఉత్సవమునకు సరిగ సంపుటమును వెలువరించవలెనను దీక్షతో శ్రద్ధగా సుందరముగా వీలైనంత నిర్దుష్టముగా పనిచేయించిన, చేసిన తిరుమల తిరుపతి దేవస్థానము ప్రెస్సు మేనేజరు గారికి,

అచ్చు కూర్పరులకు నా కృతజ్ఞత వెల్లడించుకొను చున్నాను. అచ్చు కూర్పరు లెంత మెలకువగ పనిచేసినను, నే నెంతగ కంటికి వత్తివేసి కొని ప్రూఫులు దిద్దినను, మాకండ్లుగప్పి నిలిచిన దోషములను సహృదయులు మన్నింపగలరు. అపార్థముల నిచ్చుదొడ్డదోషములు దొరలి యుండిన తెలిపినచో పైపై సంపుటము లందు మెలకువగ నుండగలము

తిరుపతి
12-1-75

బుధవిధేయుఁడు
గౌరిపెద్ది రామసుబ్బశర్మ
తాళ్ళపాకకవుల వాఙ్మయ పరిశోధకుడు.



శ్రీ తాళ్ళపాక అన్నమాచార్యులు

శ్రీరస్తు

# శ్రీ తాళ్లపాక

# అన్నమాచార్యుల శృంగార సంకీర్తనలు

## 22-వ సంపుటము

స్వస్తి శ్రీ జయాభ్యుదయ శాలివాహన శకవరుషంబులు ౧౩౪౬ అగు నేఁటి క్రోధి సంవత్సరమందు తాళ్లపాక-అన్నమాచార్యులు అవతరించిన పదారు యేండ్లకు తిరువేంగళనాథుండు ప్రత్యక్షమై తేను అది మొదలుగాను శాలివాహన శకవరుషంబులు ౧౪౨౪ అగు నేఁటి దుందుభి సంవత్సర ఫాల్గుణ బహుళ ౧౨ నిరుధానకు [1] తిరువేంగళనాథునిమీఁదను అంకితముగాను తాళ్లపాక అన్నమాచార్యులు విన్నపము చేసిన శృంగార సంకీర్తనలు.

రేకు 701 దేసాళి

ఏల రట్టు చేసుకొనే విప్పుడు నీకు నీవే
కోలుముందుగా నాపె గుంపించెనా నిన్నును ॥పల్లవి॥

కలికితనాన నిన్ను కన్నుల జంకించెఁ గాక
యెలమిఁ గోపగించెనా యింతి నీపైని
వలపు చూపవలసి వడిగా మాటాడెఁ గాక
అలరి నిన్నేమైనా నదలించెనా ॥ఏల॥

---

1 ఈ శబ్దము 'నిరోధ' 'నిరుద్ధ' శబ్దములకు వ్యావహారిక రూపముగా గాన వచ్చుచున్నది. అడ్డగింపు, అవధి అని యర్థము. ఆనాఁడు కడపటిదినమని తాత్పర్యము. కీ॥శే॥ ప్రభాకరశాస్త్రిగారూహించిన "వరియుగు" అను నర్థము తాత్పర్యార్థము గావచ్చును. 'అవధి' అను నర్థములో "ఈ నిరుద్ధమునకుఁ గుశలంబు మాకు" అను తరిగొండ – వెంగమాంబగారి ప్రయోగము దీనికి సహాయపడుచున్నది. సాహిత్య అకాడమీవారి 'విష్ణుపారిజాతము' 55 పుట. నేనీ ప్రయోగ మివ్వగా శ్రీమాన్ రాళ్లపల్లి—అనంతకృష్ణ శర్మగారు, "నిఋత్తం" అను అరవ పదముగూడ 'నిలువు' అను నర్థముతో దీనికి సహాయపడుననిరి.

నంటున నీపై బత్తిని నాటఁజూచెఁగాక యింతి
ఇంటల నీమీఁదఁ బగ సాదించెనా
యింటిలోన నీగుణాలు యెరిఁగి తా నవ్వెఁగాక
వెంటనే వెంగేలు నీపై వెదచల్లెనా ॥ఏల॥

కడుఁ దమకించి నిన్నుఁ గాఁగిలించుకొనెఁ గాక
తొడిఁబడ నిచ్చట నీతోఁ బెనఁగెనా
కడఁగి శ్రీవేంకటేశ కాంత నిట్టె యేలితివి
అడియాలాలకుఁగాక అంటించెనా గురుతు ॥ఏల॥ 1

నాట

చెప్పితే నెవ్వరికైనా సేసినదోసము వాసు
చిప్పిల నీవిందుకుఁగా సిగ్గువడకు వయ్యా ॥పల్లవి॥

అంతటనుండే మమ్మేల ఆకెవేళ లడిగేవు
మంతనాన నున్నదిదే మాటాడరాదా
యెంత కొంచేవు నీవల్ల నేమినేరమి గలదో
పంత మిచ్చి యిప్పుడే తప్పక వేఁడుకోవయ్యా ॥చెప్పి॥

చేముంచి అప్పటి మాతో చేసన్న వేమి సేసేవు
రామయెదుటికి నీవె రారాదా
యేమరి నీవెందైనా నెంగిలి సేసుకొంటివో
ఆముకొని యిప్పుడే స(సు?)ద్దాత్ముఁడవు గావయ్యా ॥చెప్పి॥

యిమ్ముల మాచేత నెట్టు యెడమాట లాడించేవు
కొమ్మ నిప్పుడే వచ్చి కూడఁగరాదా
యెమ్మెల శ్రీవేంకటేశ యెంతవుద్దండుఁడవైనా
నెమ్మిఁ గూడితి విప్పుడే నిజమియ్యవయ్యా ॥చెప్పి॥ 2

లలిత

చేరి నీవేడుకలెల్లాఁ జెల్లీఁగాని
తారుకాణలయ్యా యేకతానకు రారాదా ॥పల్లవి॥

అచ్చలాన నీవు నన్ను నడిగేవు మాటలెల్లా
రచ్చలోనఁ జెప్పుదురా రాములసుద్ది
కచ్చువెట్టి మోహ మంతగలవాఁడవై తేను
తచ్చి నీవు వేచి యేకతానకు రారాదా ॥చేరి॥

పిలిచి సన్నచేసేవు ప్రియురాలిరాకకు
కొలువులోకిఁ దెత్తురా కోమలిని
కలయఁగ నీ కిప్పుడు కడు వేడుకై తేను
తలకొని యిట్టె యేకతానకు రారాదా ॥చేరి॥

చెక్కు నొక్కి వేఁడుకొని చెలియఁ జూపు మనేవు
పక్కఁ దెచ్చి పెట్టుదురా పడఁతులను
యిక్కడ శ్రీ వేంకటేశ యేలితివి నన్ను నేఁడు
దక్కితివి యిట్టె యా(యే?)కతానకు రారాదా ॥చేరి॥ 3

శుద్ధదేశి

చూడవయ్యా నీ దేవుల సుగుడతనము నేఁడు
యీడనే బుద్ధులు చెప్పి యియ్యకొలువరాదా ॥పల్లవి॥

పీడెము నీ చేతి కిచ్చి విడ్డుపీఁగితేఁ దనకు
తోడిసవతులు పంకింతురా యిపుడు
వేడుక గలితే నీతో వినోదము లాడుఁగాక
వాడవారినల్లాఁ దా వంచుకొనఁ గలదా ॥చూడ॥

సరసము నీతో నాడి సలిగెలు చూపితేను
సరివారు వెరతుగా సారెఁ దనకు
దొరయైతే యిట్టె నీతోడ యెక్కుకొనుఁగాక
పెరవారితో నీడు వెట్టుకొనఁగలదా ॥ చూడ ॥

పెనఁగి నిన్నుఁ గూడి తా పెద్దరికాన నుండితే
వొనరి పెండ్లాడినవా రొాదుగుదురా
ఘనుఁడ శ్రీవేంకటేశ కాఁగిట నన్నేలితివి
పనివడి మాతోను పంతమాడఁ గలదా ॥ చూడ ॥ 4

భైరవి

ఏమి సేయవచ్చు నిఁక నివెల్లా నానేరములే
దీమసాన లోలోనే తెలుసుకోనైతి ॥ పల్లవి ॥

చెప్పేఁగా నీగుణాలెల్లా చెలియ నాతో నాఁడె
నెప్పున నీసేవ సేయ నేరనైతి
వొప్పగించెఁగా నీవుంగరము నా చేతికి
చొప్పులవి సాధించి చూడనైతి ॥ ఏమి ॥

నవ్వేఁగా వూడిగమాపె నను నిన్నూ నిట్టె చూపి
జవ్వనమదమున విచారించనైతి
పువ్వులను వేసెఁగా పొంచి యాకె వుండుమని
యెవ్వతో నీవద్ద నుంట యెరఁగనైతి ॥ ఏమి ॥

సన్న సేసెఁగా నాకు సరుస నా చెల్లెలు
అన్నిటా నిన్ను మాటపట్టడుగనైతి
యిన్నిటా శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
యెన్నుకొని నీ రతులు యిటు వొగడనైతి ॥ ఏమి ॥ 5

సాళంగనాట

నీకు నాపెకు నింతేసి నేస్తములు గలిగెను
దాకొనీ నీకింతేసి తగులా నీకు (?) ॥పల్లవి॥

సెలవుల నవ్వేది చేతులు చాఁచేది
కలికితనా లాపెకుఁ గంటివా వోయి
వలపులు చల్లుతాను వట్టిమాఁట లాడుతాను
పిలిచీ నిన్నుఁ జేరఁ బ్రియమా నీకు ॥నీకు॥

మోము దప్పక చూచేది ముందట నిలుచుండేది
గామిడితనా లీమెకుఁ గంటివా వోయి
వేమారుఁ గొసరుతాను వేడుకలు చూపుతాను
ప్రేమానఁ జెనకీ నిన్నుఁ బ్రియమా నీకు ॥నీకు॥

శిరసు వంచి మొక్కేది సిగ్గులెల్లఁ జూపేది
గరిమ నీపై సొలసీఁ గంటివా వోయి
యిరవై శ్రీ వేంకటేశ యేలితివి నన్ను నేఁడు
బిరుదులు నాకిచ్చీఁ బ్రియమా నీకు ॥నీకు॥ 6

ముఖారి

అందు కెంత గడించేవే ఆతనిమీఁద
పందెము వేయఁగా చేయి పట్టేఁగాక ॥పల్లవి॥

ఘనుఁ డాతఁ డేమైనా కాముకుఁడా చెలితోను
ననుపున నూరకే నవ్వేఁగాక
అనిశ మందరువంటి ఆరజపువాఁడా
చెనకి పెనఁగఁగాను చేతనంటెఁ గాక ॥అందు॥

యిన్నిటా సరసుఁ డీతఁ డెమ్మెకాఁడా, ఆవనిత
చన్నులు మోపఁగా సరసమాడెఁగాక
సన్నల నందరిమీఁదాఁ జల్లే జాజరకాఁడా
కన్నెవు వంతమాడఁగాఁ గప్రాన వేసెఁగాక ॥ అందు ॥

రసికుఁ డాతఁడు కాతరపువాఁడా మానినులు
కొసరి పై కొనఁగాను కూడెఁగాక
యెసగ శ్రీవేంకటేశుఁ డితఁడె మాయేలిక
సుసరాన నిన్ను నేవె సుగుణ గాక ॥ అందు ॥ 7

పాడి

ఉల్లము గలయుదాఁకా వూరకుండుటే మేలు
మల్లాడి తా వలెనంటే మైకొనే నపుడు ॥ పల్లవి ॥

మనసు నిర్మలమైతే మాట విన నింపౌను
ననుపు గలవారికి నవ్వ నింపౌను
చనవు గలిగితేను సాదించ నింపౌను
యెనయనిచోటికి నేమిటికి మాటలు ॥ ఉల్ల ॥

తలయెత్తి చూచితేను దండకుఁ రాఁ నింపౌను
చెలిమి సేసితే విందు చెప్ప నింపౌను
పిలుపు గలిగితేను పెనఁగఁగ నింపౌను
వొలిసి నొల్లమికిని వొడి వట్ట నేఁటికే ॥ ఉల్ల ॥

కరఁగి లోనైతేను కాఁగిలించ నింపౌను
సరస మాడితే చెయి చాఁచ నింపౌను
యిరవై శ్రీవేంకటేశుఁ డితఁ డిట్టె నన్నుఁ గూడె
తరితీపై నందుకు తామసించ నేఁటికే ॥ ఉల్ల ॥ 8

సామంతం

ఆతని నేల సాదించే వప్పుడే నీవు
మాతోడిదానవా మగువరో నీవు ॥పల్లవి॥

వాసితోడఁ బెనఁగేటివలపు లీడేరుఁ గాక
వేసరి అలుగఁబోతే వేడుక లౌనా
సేసతోఁ బెండ్లాడినదే చెల్లుబళ్లాఁ గాక
పూసుగోఁడై అంటుకొన్న పొందులు నిజమౌనా ॥ఆత॥

చేకొలఁది మెలఁగితే చేఁతలెల్లఁ జెల్లుఁగాక
దీకొని బలిమి సేసితే మెచ్చౌనా
యేకడా మంచిగుణాలే యెన్నికకు నెక్కుఁగాక
కాకరి విద్యలకు లోకమువారు మెత్తురా ॥ఆత॥

పాయకున్నకూటమికి భావము గరఁగుఁ గాక
చాయపాటు చెనకులు చవులయ్యీనా
యీ యడ శ్రీవేంకటేశుఁ డేలె నన్ను నీవనిత (నీవతని?)
నా యీడుకుఁ గూడితివి నను.పయ్యీనా ॥ఆత॥ 9

శుద్ధవసంతం

ఎంత వేగిరకాఁడవు యిదేమయ్యా
కాంత నూరకే నీవు గయ్యాళిఁ జేసేవు ॥పల్లవి॥

వుదుటునఁ జెలి నిన్ను నొడివట్టి తీసెనంటా
పెదవులనే తిట్టేవు ప్రియురాలిని
కదిసి నీతురుము గక్కన జారఁదీసె నంటా
పొదిగొని యీకె నిట్టె బొమ్మల జంకించేవు ॥ఎంత॥

చేరి నీతోఁ బెనఁగుతా చెమటపైఁ జిందె నంటా
ఆరితిఁ గన్నులనే అదలించేవు
కూరిమిఁ గైదండ ఇచ్చి గోరు సోకించె నంటా
నేరుపరితనమున నెపాలు వేసేవు ॥ఎంత॥

గరిమఁ జన్నుల నూఁది కాఁగిలించుకొనె నంటా
గరువపు మాటలాడి గద్దించేవు
యిరవుగ శ్రీవేంకటేశ యింతి నేలితివి
విరులను వేసె నంటా వెక్కసా లాడేవు ॥ఎంత॥ 10

మాళవిగౌళ

కద్దు లేదనఁగ నేల కమ్మటిఁ దాను
యిద్దరు సతులపొందూ నీడేరె ననవే ॥పల్లవి॥

సందడి నాపెతోడ సరసము లాడీఁ దాను
అందుకు నాతో మాట లాడు మనవే
గొందిఁ జిక్కించుక మిమ్ము గుట్టున నొడఁ బరచీ
కందువ నేఁ దెలిపే నిక్కడికి రమ్మనవే ॥కద్దు॥

ఎట్టిదో ఆపెగురుతు యెఱఁగ ననీఁ దాను
చుట్టమైన దీకె మోము చూడు మనవే
మట్టుమీర నవ్వి మిమ్ము మాఁటలు మరపించీని
పట్టితిఁ దనలేక లంపఁగా విను మనవే ॥కద్దు॥

తనదేవులై వుండఁగాఁ దలఁచుకొనీఁ దాను
గొనకొని యింకా నేల కూడు మనవే
నను నేలె మిమ్ముఁ జూచి నగీ శ్రీవేంకటేశుఁడు
పనిలేనిచలములు పట్టఁగ వద్దనవే ॥కద్దు॥ 11

ఆహిరి

ఎక్కడ పరాకు నీకు నింతిఁ గరుణించరాదా
నెక్కొని నీయెదుటనే నిలుచున్న దిదివో ॥పల్లవి॥

చెలియచెక్కుల వెంటఁ జెమటలు గారఁగాను
మలసి సొలసి నీతో మాటలాడీని
తలఁపులో వలపులు తమకము రేఁచఁగాను
కలువపువ్వులు నీకుఁ గానుకిచ్చీ నిదివో ॥ఎక్క॥

పడఁతి తురుము చెంపలమీఁద జారఁగాను
నడుమ నూరకే తాను నవ్వు నవ్వీని
పుడివోక పులకలు వొడలెల్లా నిండఁగాను
కడు మూడిగాలు నీకుఁ గమ్మటిఁ జేసీని ॥ఎక్క॥

కొమ్మ తనపయ్యెద కుచములపై జారఁగా
కమ్మినవేడుక నిన్నుఁ గాఁగిలించీని
నెమ్మది శ్రీవేంకటేశ నీవు దన్ను నేలఁగాను
సమ్మతితో మెచ్చి సంతోసించీని ॥ఎక్క॥ 12

రేకు 708. మలహరి

నిన్నుఁ జూచి వేడుకాయ నేఁడు మాకెల్లాను
పన్నిననీకోరికలు ఫలియించె నిపుడు ॥పల్లవి॥

జవ్వనమదముతోడ సతి నీవద్దఁ గూచుండి
నవ్వులు నవ్వఁగా నీకు నాటె మోహము
పువ్విళ్లూర నాపె నిన్ను వడి వట్టి తియ్యఁగాను
నివ్వటిల్లుఁ జెమటలు నిలువెల్లా నిండెను ॥నిన్ను॥

కులుకుఁజన్నులతోడ కొమ (మ్మ?) నిన్నుఁ గొసరుచు
పలుకఁగా నీమర్మాలు పచ్చి దేరెను
మొలకసిగ్గులతోడ ముంచి నిన్నాపె చూడఁగా
కళలెల్లా నీమోమును కారు కమ్మెను ॥ నిన్ను ॥

కామిని నిన్నేకతానఁ గాఁగిలించుకొనఁ గాను
దోమటి మెయిఁ బులకలు తొట్టుకొనెను
కామించి శ్రీ వేంకటేశ కలికి నిన్నుఁ గూడఁగ
నీమనసులో వలపు నిండుకొనెను ॥ నిన్ను ॥ 13

## దేశాక్షి

మేలమ్మా నీనేరుపు మెచ్చితి మిందరమును
పాలుపడి వూడిగాలు పయికొని సేసేవు ॥ పల్లవి ॥

కొత్తలుగాఁ జెలి వొద్దఁ గూచుండఁగా నతనితో
పొత్తు గలసి నీవునుఁ బొదిగేవు
బత్తి సేసి విడె మాపె పతిచేతి కిచ్చితేను
హత్తి నీవు నంతలోనే ఆకు మడి చిచ్చేవు ॥ మేల ॥

వేమమున నింటి కాపె పిలుచుక వచ్చితేను
కామిం చాతనిపాదాలు గడిగేవు
గోమునఁ బాన్పుపై కాంతుఁ గోరి పవ్వళింపించితే
యేమే నీవు వచ్చి సారె నేకతాలాడేవు ॥ మేల ॥

వేడుకతో నాతనికి విం దాపె వడ్డించితేను
తోడనే నీవు దోమటి దొడికేవు
యీడనె శ్రీ వేంకటేశు నీపె కాఁగిటఁ గూడితే
వాడిక నీవు నిట్టే వలపు చల్లేవు ॥ మేల ॥ 14

దేసాళం

ఆన తియ్యవయ్యా నిన్ను నడిగేము చెలులము
అనుక నీచేఁతలకు నరుదయ్యీనా(మా?)కు ॥ పల్లవి ॥

వలపు నీకుఁ గలదో వట్టి వినోదములో
చెలియకుఁ బ్రియములు చెప్పేవు నీవు
కలగంటివో కాక కార్యవసమునకో
యెలమి నీయంతనే యింటికి వచ్చితివి ॥ ఆన ॥

చవి నీ వెరుఁగుదువో సంగడి నేస్తాలకో
వువిదమో విమ్మని నోరూరేవు నీవు
యివల నీయెమ్మెలో యెలయించేజాడలో
నవకపు సెలవుల నవ్వేవు సారెకు ॥ ఆన ॥

చుట్టరికము చూపేవో జూటుఁదన మిదియో
గట్టిగాఁ గాఁగిలించేవు కాంతను నీవు
యిట్టె శ్రీ వేంకటేశ యేలితి విదేమి గొత్తో
నెట్టన నురముమీఁదఁ బెట్టుకొంటి విపుడు ॥ ఆన ॥ 15

మంగళకౌశిక

అప్పటి నాసపడేవు అంగనలకు
పిప్పిగాఁ గొంగువట్టి పెనఁగేవా రెవ్వరు ॥ పల్లవి ॥

తొడమీఁదఁ గూచుండి తొయ్యలి నీతో నవ్వఁగా
యెడ చొచ్చి మాటాడే దెవ్వతె యిఁక
విడువ కాపె నీవద్ద వెసఁ గాచుకుండఁగాను
చిడుముడి నూడిగాలు సేసేవా రెవ్వరు ॥ అప్ప ॥

చనవున నెలయించి సన్న లాపె సేయఁగాను
యెనయ నిన్నుఁ బిలిచే దెవ్వతె ఇఁక
మునుపనే నిన్నుఁ గోరి మోమే ఆపె చూడఁగాను
వొనర మందెమేళాన నొరసేవా రెవ్వరు ॥ అప్ప ॥

కాఁపురము సేసేయాపె కాఁగిలించుకుండఁగాను
యేపున నిన్నుఁ జెనకే దెవ్వతె యిఁక
ఆపె గూడె శ్రీవేంకటాద్రిఁ బ్రహ్లాదవరద
కాపాడి నన్నేలితివి కాదనేవా రెవ్వరు ॥ అప్ప ॥ 16

నాట

అన్నిటా జాణవౌదువు ఔభళేశ్వర
యెన్ని చూచుకొంటేను ఇట్టుండు మోహము ॥ పల్లవి ॥

మారుగొండలపైనుండి మగువఁ బాయఁగ లేక
కోరి వచ్చితి విందిరగుడిలోనికి
అరితేరినదేవుఁడ వగ్గళ్లురుకుదురా
యేరీతివారికైనా నిట్టుండు మోహము ॥ అన్ని ॥

నడుమను భవనాశినది వారుచుండఁగాను
కడు దాఁటి వచ్చితివి కాంత యింటికి
వడిఁ బారఁగా నే రీఁది వత్తురా సాహసమున
యెడయ కెవ్వరికైనా నిట్టుండు మోహము ॥ అన్ని ॥

యెదురుగద్దల నెక్కి యెక్కుడు తమకమున
కదిసి కూచుంటి వింతిగద్దెమీఁదను
పొదిగి శ్రీ వేంకటేశ పూఁచి మేరమీరుదురా
యెదలో నెవ్వరికైనా నిట్టుండు మోహము ॥ అన్ని ॥ 17

బౌళి

చూచినసతు లెల్లాను సొరిది సంతోసించేరు
యేచిన మీనేరుపులు యెన్నికకు నెక్కెను ॥పల్లవి॥

చెలి చేయెత్తి మొక్కితే చెక్కు నీవు నొక్కితివి
అల మీమోహములు యేమని చెప్పేము
తెలిగన్నులఁ జూచితే తీఁగెలు సాగ నవ్వితి —
వెలమి మీ జాణతనా లెట్టు వొగడేము ॥చూచి॥

తరుణి కాను కిచ్చితే దండఁ గూచుండు వుంటివి
యిరవై నీ మంచితనా లేది (లకేది?) గొలఁది
సురుటి నాపె వీచితే సొమ్ములు నీ విచ్చితివి
సరుస మీ గుణాలు మెచ్చఁగ వసమౌనా ॥చూచి॥

కాంత పాదము లొత్తితే కాఁగిలించుకొంటివి
వింత మీరతులు భావించే దెట్టు
యింతలో శ్రీవేంకటేశ యేలితివి మగువను
మంతనపు మీమహిమ మరుఁడే యెరుఁగును ॥చూచి॥ 18

రేకు 704 దేవగాంధారి

ఏమని విన్నవించేము యీ వనిత సింగారము
ఆముకొన్న వినోదము లవధరించవయ్యా ॥పల్లవి॥

నగవులు సెలవుల నాటుకొన్న లాగులు
చిగురుఁబెదవిమీఁదఁ జిమ్ము ప్రియములు
పగటుఁ జన్నులమీఁదఁ బాదుకొన్న మించులు
జగి మించె నీచెలికిఁ జిత్తగించవయ్యా ॥ఏమ॥

నిలువెల్లా సిగ్గులే నిండుకొన్న విధములు
పలుకులఁ దేనెగారే భావములు
కలువకన్నులఁ గారుకమ్మెనొబగులు
చెలరేఁగి నతివకుఁ జిత్తగించవయ్యా ॥ ఏమ ॥

మనసులో సారె సారె మలసేటితమకము
వినయములోఁ దొలఁకేవేడుకలు
వనితకు నీకాఁగిట వాడికాయ వలపులు
చెనకి శ్రీవేంకటేశ చిత్తగించవయ్యా ॥ ఏమ ॥ 19

ఛాయానాట

నేనే తప్పు సేసే నంటే నీవు మానుపఁగలవా
మోనముతో నే నూరకే మొక్కేఁగాని ॥ పల్లవి ॥

నవ్వ నవ్వ నెంతలేదు నడుమ నీ మాటలకు
చివ్వన నిన్నింత గోరసేయఁగాని
రవ్వసేయ నేమి దొడ్డు రచ్చల నీసేఁతలకు
పువ్వువలె గుట్టు సేసి పొదిగేఁ గాని ॥ నేనే ॥

సాదించ నెంతలేదు సరుస నీవిద్యలకు
భేదము లేకల్లిబిల్లె పెనఁగేఁగాని
సోదించ నెంతలేదు సోరిది నీమేనెల్లా
కాదుగూడ దనక నేఁ గాఁగిలించేఁగాని ॥ నేనే ॥

చక్కఁబెట్ట నెంతలేదు సారెకు నీ గుణా లెల్లా
కక్కసించగా కందముఁ గైకొనేఁగాని
యిక్కడ శ్రీ వేంకటేశ యేలితివి నన్ను నేఁడు
మిక్కిలి నిన్నింక నిట్టె మెచ్చేఁగాని ॥ నేనే ॥ 20

నారాయణి

నేరుపరి వై తేను నెలంత నీ వాతనికి
నారుకొన్న ప్రియముతో నయములే చూపవే ॥ పల్లవి ॥

సన్నలనే పతికి నిచ్చకురాలవై యుండవే
విన్నపాలు సేయకువే వేమారును
మిన్న కాతనికి మందెమేళముల మీరకువే
మన్నన సతులమీఁద మచ్చరము మానవే ॥ నేరు ॥

తలఁపులో మెలఁగవే తప్పులు వట్టకువే
చలము సాదించకువే సముకానను
అలుగకువే నీవు ఆతనితో నెప్పుడును
బలిమిఁ బెనఁగుతాను పంతము లాడకువే ॥ నేరు ॥

వూడిగాలు సేయవే వొద్దనే గాచుకుండవే
వేడుకలు నెరపవే విసువకువే
కూడె శ్రీ వేంకటేశుఁడు కోంకక కడపలోన
మేడెపురతుల నిట్టె మెప్పించవే ॥ నేరు ॥ 21

రామక్రియ

ఇంతికి నీవు వలచు టిందరము నెఱుఁగుదు -
మంతలోనే ఆపె మొక్కి నాదరించరాదా ॥ పల్లవి ॥

సిగ్గుపడి వుండఁగాను చెయివ ట్టేల తీసేవు
అగ్గమై ముందు సరస మాడరాదా
దిగ్గనఁ గాను కియ్యఁగా తెర యేల వేసేవు
వెగ్గళించక చేతికి విడె మియ్యరాదా ॥ ఇంతి ॥

గుట్టుతోనే వుండఁగాను కుచము లేలంటేవు
ఒట్టబయలుగా నవ్వి పైకొనరాదా
చుట్టమైనదానివాసులు రేఁచ మరి యేల
అట్టు సేయక పొత్తుకు యిట్టె రమ్మనరాదా ॥ ఇంతి ॥

తలవంచు కుండఁగాను తప్పక యేమి చూచేవు
మలసి కాఁగిట నించి మన్నించరాదా
యెలమి శ్రీ వేంకటేశ యెనసితి నీపెను
తలకొని రతులను దప్పి దేర్చరాదా ॥ ఇంతి ॥ 22

శ్రీరాగం

చిత్తాన మఱవకుమీ చెప్పితి నాగుణమెల్లా
బత్తి సేతుఁ గాని నీతో పంతగత్తె గాను ॥ పల్లవి ॥

వీడె మందుకోకుండితే వేడుకొందుఁ గాని, నిన్ను
తోడి సతులతో నెల్లా దూరఁ జాలను
వేడుకతో మరచినా విన్నపము సేతుఁగాని
వూడిగానకు రాక నే నొడ్డారించ నోపను ॥ చిత్తా ॥

పరాకై నీ వుండితేఁ బాదము లొత్తుదుఁగాని
కరుణించ వని నీతోఁ గాఁతాళించను
పొరుగాపెతో నవ్వినా పొందు లొనరింతుఁగాని
యెరవు సేసుక నీకు నీసడము చూపను ॥ చిత్తా ॥

చెనకక మానితేను చేరి యెచ్చరింతుఁగాని
చనవు గద్దని నే సాదించను
నిను శ్రీ వేంకటేశ్వర నే నలమేలుమంగను
మనసిచ్చి కూడితివి మదినేఁ గొసరను ॥ చిత్తా ॥ 23

పాడి

ఇందరు నాతనినేరా లేల యెంచేరు
కందువ నాకు మగఁడు గాకుండఁ గలడా ॥పల్లవి॥

నావిభుఁ డెవ్వతెతోడ నవ్వినా నవ్వేఁగాక నా -
భావములోఁ దను నిలుపఁగ నీయఁడా
వావు లెక్కడెక్కడ వడిఁ గలసి వుండినా
చేవమీరఁ బెండ్లాడె సేవించ నీయఁడా ॥ఇంద॥

మిట్టు మీర నెవ్వతెతో మాటాడినా నాడెఁ గాక
అట్టె తనపేరు నానోరంట నీయఁడా
వొట్టి తా నన్ను మరచి వుండినా నందు కేమాయ
గట్టి తనరూపు వా(వా?)సి కనుఁగొన నీయఁడా ॥ఇంద॥

కోమలి నెవ్వతెను తాఁ గూడినాఁ గూడెఁ గాక
ఆమాట విని సంతస మంద నీయఁడా
చేముంచె నలమేల్మంగ శ్రీ వేంకటేశుఁడు తాను
కామించి నన్నేలె నిదె కడు మెచ్చ నీయఁడా ॥ఇంద॥ 24

రేకు 705. సాళంగనాట

ఎంచి చూడ నేమున్నది యిదిగో తనసుద్దులు
పొంచి నాకునాకే నేను పొగడుకోఁ గాక ॥పల్లవి॥

చెలులెల్లా వినఁగాను చేరి తా నాడినమాట
కలుగవద్దా కోప మాఁపితిఁ గాక
వలపించి నన్నింత వలలఁ బెట్టినందుకు
నొలయవద్దా అదిఁ జూడనైతిఁ గాక ॥ఎంచి॥

సిగ్గులు నేఁ బడఁగా నే సేసినతన సేఁతకు
వొగ్గి ప్రతి సేయవద్దా వోర్చితిఁ గాక
వెగ్గళించి యాపెఁ దన వెంటఁ దెచ్చిన యందుకు
యెగ్గు పట్టవద్దా నే నెరఁగనైతిఁ గాక ॥ఎంచి॥

గుఱి గడచి తా నాకొప్పు పట్టినయందుకు
మఱి యాన వెట్టవద్దా మానితిఁ గాక
నెఱి శ్రీవేంకటేశుఁడు నే నలమేల్మంగను
మెఱసెఁ బోం దింత వద్దా మెప్పించితిఁ గాక ॥ఎంచి॥ 25

శ్రీరాగం

ఇచ్చకము సేయవే యియ్యకొనవే
రచ్చల నాతని నింత రాఁపు సేయఁ దగునా ॥పల్లవి॥

వొడి వట్టి తియ్యఁగాను వోప నందురట వే
కడఁగి యాతనిమాట కైకొంట గాక
వుడివోని జవ్వనము వొడలిపైఁ బెట్టుకొని
పడఁతికి నలుకలు పాటించఁ జెల్లునా ॥ఇచ్చ॥

తగిలి నీతో నవ్వఁగా తల వంతురట వే
మగని చిత్తము రాను మనుట గాక
తెగరాని తమకము దేహములో నించుకొని
మగనితో చలములు మరి సేయ వచ్చునా ॥ఇచ్చ॥

పిలిచి కాఁగిలించఁగా పెనఁ గుదు రట వే
సొలయక సంతోసానఁ జొక్కుట గాక
అలమేలు మంగవు నీ వాసలకు లోనై
యిల శ్రీవేంకటేశుఁ గూడె లయించఁ దగవా ॥ఇచ్చ॥ 26

రీతిగౌళ

నీకంటె నేరుపరి యీనెలంత గాంబోలును
వాకున మాటాడకే వద్దికే రప్పించెను ॥ పల్లవి ॥

మంతనానఁ జెలి నీతో మాటలాడే నని రాఁగా
అంతలో వేరొకతె నీయండ నుండెను
పంతాన లోనికి నేఁగి పవళించెఁ బానుపుపై
చింత దీర నాపెవద్దఁ జేరి కూచుండితివి ॥ నీకం ॥

అట్టె నీతో సరసము లాడే నని సతి రాఁగా
పట్టి వేరొకతె నీపాదా లొత్తెను
బట్టబయలు గాకుండా పచ్చడము నీకుఁ గప్పె
వొట్టి నీ వాపెతొడపై నొరఁగి మెచ్చితివి ॥ నీకం ॥

అలమేలుమంగ నిన్నటు కాఁగిలించ రాఁగా
వెలయ భూకాంత నీకు విడె మిచ్చెను
కలసి యందుకు నీకు కంఠహారమై నిలిచె
చెలఁగి శ్రీ వేంకటేశ సేసలు వెట్టితివి ॥ నీకం ॥ 27

కాంబోది

వలచినకోలఁదే వాడికెల్లా
బలిమి సేయఁగఁ బోతే పనికి వచ్చీనా ॥ పల్లవి ॥

సొలసి నీమర్మములు సోఁక నిన్నుఁ బలుకఁగా
వెలఁదిమాటలు నీకు వేడుకాయను
యెలమితో వింతవారు యిచ్చకము లాడినాను
వెలుచుఁదనమే కాక ప్రియ మయ్యీనా ॥ వల ॥

చేకొని చెక్కులు మోవ చేయి చాఁచి పెనఁగఁగా
ఆకెచేఁతలే నీకు నందమాయను
యీకడాకడివారు నీ కెంత సేవ సేసినాను
మేకుల కందువు గాక మెచ్చఁ బొయ్యేవా ॥ వల ॥

కడఁగి చన్నుల నొత్తి కాఁగిట నిన్నలముఁగా
పడఁతిరతులు నీకుఁ బాఁతాయను
విడువలేక శ్రీ వేంకటేశ నన్నేలితి—
వొడబాటాయఁగా కింక నోప ననేవా ॥ వల ॥ 28

సాళంగనాట

నాటకమునకు మాతో నవ్వేవుగాక
మాటమాత్రపువారిని మన్నించేవా ॥ పల్లవి ॥

అంటి వూడిగాలు సేసేఅతివలు నీకుండఁగా
యింటిలో సతులపొందు యింపు వుట్టీనా
దంటలై నసతు లెల్లా దగ్గరి కొసరఁగాను
వెంట వచ్చేగుట్టుతోడివెలఁదుల మెచ్చేవా ॥ నాట ॥

పోరచి వెట్టేవారు పొరుగున నుండఁగాను
మేరతోడికామినుల మేకొనేవా
సారెఁ దరితీపు సేసేసతులు పైకొనఁగాను
ఆరీతి కాంతలపై నాస వుట్టీనా ॥ నాట ॥

సన్నలనే యెలయించేసతులు కాను కియ్యఁగా
పన్ని పట్టపుదేవుళ్ళు బాఁతయ్యేరా
యిన్నిటా శ్రీ వేంకటేశ యిటు నన్ను నేలితివి
వున్నవారిమీఁద నీకు నున్నదా మనసు ॥ నాట ॥ 29

ముఖారి

నీకు నిచ్చకురాలనై నే నుండుచే మేలు
కాకు సేసి నిన్ను నింత గరిసించ నేఁటికి ॥ పల్లవి ॥

వంతులకు నాపెమీఁదివలపు నీవు మానేవా
చింతతోడ నొకమాట చెప్పితిఁ గాక
యెంతలేదు నీవింకా నెందరిఁ బెండ్లాడినాను
సంతోసమే నాకు నిన్ను సాదించ నేఁటికి ॥ నీకు ॥

యేతులకు నాపె నీవూ యెనసి వుండ కుండేరా
చూతమంటా మీదిక్కు చూచేఁ గాక
కాతర మే లెందరితోఁ గాఁపురాలు సేసినాను
నీతి గా దనుచు నిన్ను నియమించ నేఁటికి ॥ నీకు ॥

మోము చూచి ఆపెతోడ ముచ్చటాడ కుండేవా
ప్రేమముతో నీపై సేస పెట్టితిఁ గాక
సాము చేసి యెందరితో సందడిఁ బెనఁగినాను
యేమాయ (శ్రీ) వేంకటేశ యెలయించ నేఁటికి ॥ నీకు ॥ 30

* 706-వ రేకు లేదు

* రేకు 707. వసంతవరాళి

ఇంటికి వచ్చినమీఁద నిఁకఁ గాదందు రటవే
జంట వాయ కుండఁగాను జంకింతు రటవే ॥ పల్లవి ॥

రమణుఁడు నీవద్ద నూరక పవ్వళిం చుండఁగా
తమకించి మాటలాడఁ దగవౌనటే
చెమటలు గారఁగాను చేతఁ దుడుచుకొనీని
సముకమున నీవింత సాదింతు రటవే ॥ ఇంటి ॥

తొడమీఁదఁ దొడవేసి తోఁడ బుసకొట్టఁగా
బెడఁగుగాఁ జూచి కోపింతు రటవే
అదరి నీపానుపుపై నలయుచు నున్నాఁడు
యెడనెడఁ గాఁతాళించి యెలయింతు రటవే ॥ఇంటి॥

వెస నీకాఁగిటఁ దాను వెరఁగువడి వుండఁగా
కొసరులు పైపైఁ జిలుకుదు రటవే
యెసఁగ శ్రీ వేంకటేశుఁ డిదె నిన్నుఁ గూడినాఁడు
పసలుగఁ దొల్లింటివను లెంతు రటవే ॥ఇంటి॥ 31

## బౌళి

ఆలికి మగనికి సిగ్గంత చెల్లునా
మేలుమీఁదివాఁడవు మెచ్చఁగద వోయి ॥పల్లవి॥

భావములో బయలీఁత పాదపునేలల వాఁ (వ్రాఁ?) త
యీవలఁ గంటివా వోయి యీపెవల్లను
నీవద్ద నుండేయాస నీతోఁ బలికేబాస
చేవదేరీ నీకెవల్లఁ జిత్తగించ వోయి ॥ఆలి॥

కన్నుల నీమీఁదిచూపు కాఁకలలో తరితీపు
చెన్నుమీరె నిది దెలిసితివా వోయి
మున్నిటి మాటలపొందు మోవిపై తేనెలవిందు
సన్నల నీకిపెఁ జూ (పెచూ?) పీఁ జన వియ్యావోయి ॥ఆలి॥

విరహాపువసివాడు వెలయ నీతో జోడు
గరిమ నచ్చెనా యీకెకాఁగిట నోయి
నిరతి శ్రీ వేంకటేశ నేఁడు నన్నుఁ గూడితివి
సరివచ్చెనా రతిజాడల నోయి ॥ఆలి॥ 32

పాడి

మీరే యెఱఁగవలె మీవలపులు
తారుకాణలెల్లా లోలో తలఁచుకోరయ్యా ॥పల్లవి॥

మొగమిచ్చుచెలులము మొనసి మీ కిద్దరికి
తగవులు చెప్పేమా దండ నుండి
నగవుల చుట్టాలము నడుమ బుద్ది నేర్పేమా
పొగడి పొగడి మిమ్ముఁ బోదిసేతుముగాక ॥మీరే॥

వూడిగపువారము వొరపులు దిద్ది దిద్ది
జాడలు దెలిపేమా సారె సారెకు
వేడుకపడేవారము వెగటుగాఁ గొసరేమా
జోడు గూడించి మిమ్ముఁ జొక్కింతుము గాక ॥మీరే॥

చనవరి వారము సరికి బేసికి మిమ్ము
పెనఁగు లాడించేమా బీరముతోను
యెనసితివి శ్రీ వేంకటేశ నీవు నాపెను
వొనర మిమ్ము మెప్పించి వుండుదుముగాక ॥మీరే॥ 33

భైరవి

ఉండరయ్యా వేడుకతో నొక్కమనసున మీరు
కొండవంటి చుట్టాలు మీకునుఁ గల రెపుడు ॥పల్లవి॥

మంతనాన నాపెఁ బెట్టి మాటలు నీకుఁ జెప్పి
ఇంతు లెడ తాఁకేరు ఇందు నందును
పంత మాపె కిప్పించి నీ పాదాలకు మొక్కించి
సంతోసాలు రేఁచిరి యీ సతులెల్ల మీకును ॥ఉండ॥

నీరూప మాకెకుఁ జూపి నీవద్ది కాపెనుఁ దెచ్చి
చేరి పొందులు సేసేరు చెలులెల్లాను
సారె నాపెఁ దలఁపించి సన్న లాపె చేఁ జేయించి
నేరిపిరి చేఁతలు యీ నెలఁతలు మీకును ॥ ఉండ ॥

నీతొడపై నాపెఁ బెట్టి నిన్నాపెఁ గాఁగిలింపించి
నీతితో మిమ్ముఁ గూర్చిరి నీరజాతులు
యీతల శ్రీ వేంకటేశ యేలితివి నన్ను నేఁడు
యేతుల మిమ్ము మెప్పించిరి సతులెల్లాను ॥ ఉండ ॥ 34

నాట

పడ నేరుచుకొంటిరే యిపెల్లా మీరు
వాడికలు నెరపేరు వంతులకు మీరు ॥ పల్లవి ॥

మచ్చిక నాతఁడు నేనూ మాటాడఁగానే మీరు
యిచ్చటఁ బతికి మాట లేమి చెప్పేరే
కచ్చుపెట్టి నావంటి కాంతలఁ దెచ్చేరటరే
ఇచ్చకములు సేసేరు ఇటు నటు మీరు ॥ పడ ॥

తలి నిద్దరము నేకతాన నుండఁగానే మీరు
యితనికి సన్నలు మీరే (రియే?)మి సేసేరే
యితవుగా నావలెనే ఇంపులు చూపేరటరే
కతకారితనములు గరపేరు మీరు ॥ పడ ॥

శ్రీ వేంకటేశుఁడు నేనుఁ జేరి కూడఁగానే మీరు
యీవల నేమి కానుక లిపుడిచ్చేరే
చేవదేరఁ జేసేసేవ సేయించేరటరే
వావు లెవ్వరివో చెప్పవచ్చేరు మీరు ॥ పడ ॥ 35

శ్రీరాగం

ప్రియములే చెప్పి పతిఁ బిలుచుక రాఁగదరే
క్రియ యెరఁగక మరి కెరలించ నేఁటికే ॥పల్లవి॥

వాడికగా నందరిపై వలపులు చల్లుఁగాక
వేడుకకాని కెంతైనా వేసట గద్దా
జాడతో మోవితేనెల చవి మరిగినవాఁడు
ఆడికకు వెరచీనా అదలించ నేఁటికే ॥ప్రియ॥

పోసరించి కెళవుల పొందులే వెదకుఁ గాక
ఆసోదకాని కెంతైనా నలపు గద్దా
రాసికెక్కఁ గాంతలతో రచ్చలు సేసేటివాఁడు
దోసానకు లోఁగీనా దూర నీఁక నేఁటికే ॥ప్రియ॥

రాతిరి బగలు నిట్టే రతుల నోలాడుఁ గాక
యేతరికాని కెంతైనా నెంగిలి గద్దా
యీతల శ్రీవేంకటేశుఁ డిదె నన్ను నేలినాఁడు
నీతి యిఁకఁ దప్పీనా నేర మెంచ నేఁటికే ॥ప్రియ॥ 36

రేకు 708. శ్రీరాగం

ఎటువంటి జాతియ్యామో యేరుపరచఁగరాదు
కుటిలకుంతలులాల కొమ్మఁ జూడరమ్మ ॥పల్లవి॥

పడఁతి సెలవులను పలుమారు నవ్వఁగాను
విడువక చందురుఁడు వెన్నెల గాసె
బడి బడి నప్పటిని పాటలు పాడఁగాను
యెడ నెడఁ గోయిలలు యెలుఁగియ్యఁ దొడఁగె ॥ఎటు॥

చందపుఁజూపుల నీపె సారె సారెఁ జూడఁగాను
పొందులకుఁ జకోరాలు పొలయఁ జొచ్చె
మందలించి చన్నులచెమట లార్చుకొనఁగాను
గొంది నున్న జక్కవలు గుంపుగూడఁ దొడఁగె ॥ఎటు॥

శ్రీ వేంకటేశుకడకు చెలి యేఁగి రాఁగాను
వేవేగ రాయంచలెల్లా వెంటరాఁ జొచ్చె
చేవదేరి యీపె మేను చెంగలించి వుండఁగాను
పూవుఁదీగె మిక్కిలిని పొదలఁగఁ దొడఁగె ॥ఎటు॥ 37

గుజ్జరి

నీచిత్త మెట్టున్నదో నే నెరఁగను
నీ చనవు గలుగఁగా నెమ్మది నుండానను ॥పల్లవి॥

నమ్మిక మాటలాడి నన్ను నీవు లాలించఁగా
యెమ్మెలెల్లాఁ జెప్పుకొంటి నిందరితోను
పమ్మి నీవు నాదిక్కు పలుమారుఁ జూడఁగాను
వుమ్మడి నాసాసల నుండాన నిపుడు ॥నీచి॥

నయగారితనమున నాతో నీవు నవ్వఁగాను
ప్రియముతోఁ గడు సింగారించుకొంటిని
దయతోడ నీవు నన్నుఁ దమకము రేఁచఁగాను
నియతాన నూడిగాలు నీకు నేఁ జేసితిని ॥నీచి॥

మందెమేళముగ నన్ను మన్నించి కూడఁగాను
కందువరతుల నిన్నుఁ గాఁగిలించితి
విందువలె నిన్నిటా శ్రీ వేంకటేశ నన్నేలఁగా
పొందులు సేసి ని న్నెప్పుడుఁ దలపోతును ॥నీచి॥ 38

లలిత

తనమేలె చూచుఁగాక తరుణుల యెడలను
యెనలేని మగవాని నే మనఁగవచ్చును ॥పల్లవి॥

మంతనాన నాకె నీవు మాటలాడేచోటికి
వింతది రా సిగ్గుగాదా విచారించితే
చెంత నీవి దెరఁగక చెలి నిందుకుఁ బిల్చేవు
యెంతైనా మగవాని కెక్కుడిది తగవు ॥తన॥

గారవాన నాకె నీవు కాఁగిలించుకుండఁ గాను
మారుసతి తోఁ (తొం)గి చూడ గోరము గాదా
ఆరీతి వాకిటనుంటే ఆపెఁ దెమ్మనేవు వీడె-
మారజపుమగవాఁడు ఆడికెకు లోఁగునా ॥తన॥

శ్రీ వేంకటేశుఁడ ఆకె చెయిపట్టి పెండ్లాడఁగా
సేవ సేయ నొకతెకు సెగ్గెము గాదా
యీవల నన్నేలితివి యీపెఁ నాపె గూడితివి
కావరపుమగవాని కత లిట్టే కాదా ॥తన॥ 39

శంకరాభరణం

ఎంతైనా నిన్ను నమ్మినా యెగసక్కేలే గాక
కాంతతోడ నీవేల కతలు చెప్పేవు ॥పల్లవి॥

నెలఁత నీవద్దనుండి నేరములు మోపఁగాను
యెలమి లేదంటూ నాన లేల పెట్టేవు
చలపట్టి కమ్మటిని సాకిరులు దెలుపఁగా
బలిమి నీ వేఁటికి బాసలు చేసేవు ॥ఎంతై ॥

మగువ నీమేనిమీఁద మచ్చములు చూపఁగాను
పగటున నీ వేమి నెపాలు చెప్పేవు
తగ మిమ్మిద్దరి నేకతమునఁ జూచుచుండఁగాను
వెగటుగాఁ జొక్కిం చేల వేసాలు చేసేవు ॥ఎంతై॥

కామిని నీయింటిలోనఁ గాఁపురము సేయఁగాను
ఆముకొని నీవెట్లా నరుదంటేవు
చేముంచి నన్నేలితివి శ్రీ వేంకటేశ్వర
నామోము చూచి యేరా నవ్వులు నవ్వేవు ॥ఎంతై॥ 40

నాదరామక్రియ

అట్టె నీకు నితవైతే నాయఁగాక
గుట్టుతోడిసతులకుఁ గోపము రాదా ॥పల్లవి॥

సన్నలు చేసి నీ కాపె సలిగెలఁ బొరలఁగా
యెన్ని చూచి తక్కినవా రెట్టోరుతురు
మన్ననదాననంటా మాటలు నీతో నాడఁగ
విన్నవారిచెవులకు వెగటు గాదా ॥అట్టె॥

యేతులకు నాపె నీతో యీడుజోడై నవ్వఁగాను
యీతలాతలిసతులు యిచ్చగింతురా
పోతరించి తానే నీపొత్తుల నారగించఁగా
కాతరించి చెలులు గక్కన నిన్ను దూరరా ॥అట్టె॥

కందువనుండి నిన్నాపె కాఁగిలించుకొనఁగాను
సందడిసవతు లెల్లా సమ్మతింతురా
విందువలె నన్నును శ్రీ వేంకటేశ కూడితివి
ముందు పెండ్లాడినవారు మోములు చూచుకోరా ॥అట్టె॥ 41

పాడి

ఇంకా నిట్టే లాలించుమీ యెప్పుడూ మఱవకుమీ
పొంకముగా చెలి నింత పోదులు సేసితివి ॥ పల్లవి ॥

సేవ చేసి యాపె నీచిత్తము రా నడవఁగా
వావిరి నాపెకు నీవు వలచితివి
కైవశమై యేపొద్దుఁ గాచుక వద్ద నుండఁగా
వేవేలు తెఱఁగుల నీవే మన్నించితివి ॥ ఇంకా ॥

పలుమారు నీపదాలు పాడి నిన్ను మెప్పించఁగా
చెలఁగి పట్టపుదేవిఁ జేసుకొంటివి
కలకాలమును నీవె గతి యని మొక్కఁగాను
జలజాక్షి కియ్యరానిచనవు లిచ్చితివి ॥ ఇంకా ॥

కాంతలచే నాటనుండి కానుకలు నీ కంపఁగా
అంతరంగముగ నేలి యలమితివి
యింతిచెలులము గాన యిన్ని విన్నవించితిమి
యింతటా శ్రీవేంకటేశ యీపెవాఁడ వైతివి ॥ ఇంకా ॥ 42

రేకు. 709. వరాళి

నెరజాణవిభునికి నేర మున్నదా
అరమరపులమతి అలయించీఁ గాక ॥ పల్లవి ॥

తప్పక చూచినవాఁడు తలఁచ కుండీనా నన్ను
కప్పుర మంపినవాఁ డక్కర సేయఁడా
చిప్పిల నవ్వినవాఁడు చెనక కేఁటికి మాను
దప్పిదేరేవిరహాన దమకించేఁ గాక ॥ నెర ॥

మంచి మాటాడినవాఁడు మరుగక యేల మాను
కంచపుపొత్తుచుట్టము కాకు సేసీనా
పొంచి కాచుకున్నవాఁడు పొందు సేయఁడా నాతో
చంచలపుకాఁతాళము చలపట్టీఁ గాక ॥ నెర ॥

ననుపై యుండినవాఁడు నాకుఁ జన వియ్యఁడా
మనవి చేకొన్నవాఁడు మన్నించఁడా
యెనసె శ్రీ వేంకటేశుఁ డీడకుఁ దానే వచ్చి
తనిసినసంతోసానఁ దడఁ బడేఁ గాక ॥ నెర ॥ 43

లలిత

ఇందరివంటిదాననా యిచ్చకురాలను నేను
పొఁదువఱచితే వలపులు చెప్పనేల ॥ పల్లవి ॥

కూరిమిగలవిభుఁ డేకొలఁది మెలఁగినాను
నేరము లెంచవచ్చునా నెలఁతలకు
గారవించి మన్నించినకందువే చూచుట గాక
తారుకాణకుఁ దీసితే తగవే మున్నది ॥ ఇంద ॥

కైవసమయినవాఁ డేకరణి నేలినాను
ఆవేళఁ గొసరుదురా ఆసోదాలకు
వానితోఁ బెండ్లాడినవరుసే చూచుట గాక
చేవమీర దొరకొంటే సిగ్గు లేమున్నవి ॥ ఇంద ॥

నిచ్చలు శ్రీ వేంకటేశ నీ వెంత గూడినాను
పచ్చిసేయవచ్చునా పలుమారును
ఇచ్చట నీవు సేసినయిూతవే చూచుట గాక
కొచ్చి బలిమి సేసితే గుట్టు మరేమున్నది ॥ ఇంద ॥ 44

## దేసాళం

కన్నులారఁ గంటిమయ్యా కామినినేరుపులు
సన్నలా చాయలా నిన్ను జట్టిగొనె నిపుడు ॥పల్లవి॥

చిగురుల వేసి వేసి చెలియ నిన్నుఁ దన-
మొగము చేసుకొని మొక్కె నీకును
పగటుగుబ్బలమీఁదిపయ్యద జారఁగాను
నగవులు నగి నిన్ను నంటు చేసుకొనెను ॥కన్ను॥

నెట్టనఁ గానుక చూపి నిన్నుఁ జెయి చాపించి
అట్టె నీకు నాస రేఁచి ఆయా లంటెను
దిట్టతనమున మోవితేనెలు గారఁగాను
యిట్టు నట్టు మాటాడి నిన్నింటికి రప్పించెను ॥కన్ను॥

పాదములు నీకు నొత్తి భావములు గరఁగించి
బోదింపించుకొని నీతోఁ బొందు సేసెను
ఆదరించి శ్రీవేంకటాధిప నన్నేలితివి
నీదయతో నాపె చూచి నిమ్మలాన నుండెను ॥కన్ను॥ 45

## సామంతం

నీవేల సిగ్గు వడేవు నెలఁతతోను
వావు లిద్దరికిఁ గూడె వద్దికి రావయ్యా ॥పల్లవి॥

సలుపుఁజూపులఁ జూచి సారెఁ దప్పించుకొమ్మంటా
కలువరేకుల వేసీఁ గామిని
చెలప చెమట గోరఁ జిమ్మి చిమ్మి నీమీఁద
వలపులు చల్లీని వద్దికి రావయ్యా ॥నీవే॥

ముప్పిరి నవ్వులు నవ్వి మోవి దప్పిదేర్చు మని
కప్పురము పైఁజల్లీ కలికి
కప్పినగుబ్బలమీఁది కస్తూరి నీమేనఁ బూసి
చిప్పిలఁగఁ దమి రేఁచీఁ జిత్తగించవయ్యా ॥నీవే॥

అక్కరతోఁ గాఁగిలించి అలయకు మనుచును
పుక్కిటివిడె మిచ్చీఁ బొలఁతి
యిక్కడ శ్రీవేంకటేశ యింతి నిట్టె యేలితివి
యెక్కె నీవురముమీఁద నిదె మెచ్చవయ్యా ॥నీవే॥ 46

శంకరాభరణం

కాదు గూడ దనరాదు కమ్మటి నీకు
ఆదిగొని రతి నిన్నే అయము లంటుదురు ॥పల్లవి॥

చనవు గలిగినాపె సణఁగులు రాల్చితే
ననపు గలిగినాపె నవ్వఁ జూచును
వొనర నీ విద్దరిని వొక్కటి సేయఁ జూచితే
వెనుకొని నిన్నే తాను (ము?) నెంగెము లాడుదురు ॥కాదు॥

సేసపెండ్లికూఁతురు చేతులు చాఁచితేను
ఆసవడ్డ పెండ్లికూఁతు రడ్డాలు వొచ్చు
వేసరక యిరుమేలా వెస నీవు గైకొంటే
తాసువలె నీతోనే పంతాలు నెరపుదురు ॥కాదు॥

భూసతి నీసేవ సేసి బుజముపై నెక్కితేను
శ్రీసతి నీవురము మచ్చిక నెక్కెను
ఆసల శ్రీవేంకటేశ ఆపె నీపె నేలితివి
మోసపోక తాము నీపై మోహాము చల్లుదురు ॥కాదు॥ 47

శ్రీరాగం

తల వంచుకొన నేలే దండ మున్నాఁడు విభుఁడు
లలి వెనకటిసేఁతలకు నింత సేతురా ॥పల్లవి॥

చలము సాదించరాదు సరస మాడేయప్పుడు
వలపులు రేఁచి నవ్వవలెఁ గాని
అలుగఁ దగదు మరి ఆయము గోర నంటితే
పిలిచి సమరతులఁ బెనఁగఁగవలెను ॥తల॥

వేడుకపడేవేళ వెంగెములాడఁగ రాదు
వాడిక నిచ్చక మాడవలెఁ గాని
పాడి పంతా లెంచరాదు పక్కన వేఁడుకొనఁగా
పీడె మిచ్చి కప్పురాన వేయవలెఁ గాని ॥తల॥

పగటులు చూపరాదు పానుపుపై నుండఁగాను
వగవగరుగాఁ గూడవలెఁ గాని
బిగియఁగఁ బనిలేదు ప్రియము లొనగూడితే
తగిలి శ్రీ వేంకటేశు దక్కఁ గొనవలెను ॥తల॥ 48

రేకు 710. గుండక్రియ

చెలులాల వేగిరించఁ జెల్లునా మీకు
మలసి తా మన్నించితే మరుగుట గాక ॥పల్లవి॥

కూరిమి చాలనిపతిఁ గొసరఁగ నేమిటికి
సారెకు సిగ్గువడఁగ జరయ నేల
బీరములు నెరపఁగాఁ బెనఁగఁ దగవుగాదు
గారవించినప్పుడే కైకొనుట గాక ॥చెలు॥

తగవు దప్పినవేళ తప్పులు వట్టేది గాదు
మొగము చూడకుండఁగా మొక్క వచ్చునా
సొగయనిచోటను సుద్దు లడుగఁగ రాదు
నగినప్పుడే ఆస నాటుకొనీఁ గాక ॥ చెలు ॥

వింతవాఁడై యుండఁ గాను వేఁడుకొనఁ జోటేది
పంతముతో నుండఁ గాను పైకొందురా
యింతలో శ్రీవేంకటేశుఁ డేలె నన్ను నిపుడే
సంతోసమాయ నిట్టె సేస వెట్టుటగాక ॥ చెలు ॥ 49

సామంతం

వలపు దాఁచ నియ్యదు వడి నెట్టి వారినైనా
కలిగినదెల్లాను కంటిమి నీవల్లను ॥ పల్లవి ॥

వొప్పులుగా నాపె నీవు నొంటి నాడినమాటలు
చెప్పేవు చెలులతోడఁ జెలరేఁగి
చిప్పిల నీమీఁదఁ దాను చేసినగురుతు లెల్లా
చొప్పు లెత్తి కమ్మటిని చూపే వందరికి ॥ వల ॥

వొనర మీ రిద్దరును వుండేటివునుకులు
కనుసన్నఁ దెలిపేవు కాంతలకు
తనివోని వొండొరుల తలపోఁతల రతులు
ఘనముగా నప్పుడె లెక్కలు వెట్టేవు ॥ వల ॥

తగు నీదేవులజాణతనము లన్నియు నిట్టె
పొగడేవు నీవద్దిపొలఁతులతో
నగుతా శ్రీవేంకటేశ నన్ను నిట్టె యేలితివి
నిగిడి నీగుణమెల్లా నెరపే విచ్చటను ॥ వల ॥ 50

## సౌరాష్ట్రం

ఇచ్చకురాలనే నేను యేమయ్యా
యెచ్చరించ వచ్చేవు నన్నేమయ్యా ॥పల్లవి॥

అదనఁ బావముఁ దొక్కెనని నన్ను నడిగేవు
యెదురాడేనా నీతో నేమయ్యా
వదలుఁబయ్యదలోని వట్టువచన్ను లంటేవు
యిదె తప్పించుకొనేనా యేమయ్యా ॥ఇచ్చ॥

చెట్ట వట్టి తీసి నాచేతికి విడె మిచ్చేవు
యిట్టె వొల్ల ననేనా యేమయ్యా
పట్టి పాదా లొత్తుమని పైపైఁ దమకించేవు
యెట్టనెదుట నుందాన నేమయ్యా ॥ఇచ్చ॥

నెయ్యముతోఁ గాఁగిలించి నీ విటు వేఁడుకొనేవు
యియ్యకొననా నేఁ యేమయ్యా
చయ్యన నన్నేలితి వాసల శ్రీ వేంకటేశ్వర
యియ్యెడ నవ్వులు నవ్వే వేమయ్యా ॥ఇచ్చ॥ 51

## నాగవరాళి

ఓపమయ్యా నే మింతేసి; వూడిగాలు సేసేఁ గాని
యేపునఁ గొసరఁ బోతే నెమ్మొ సేసె నందువు ॥పల్లవి॥

పెనఁగులాడు మనుచుఁ బ్రియపడే వల్లైతే
చెనకి చన్నులు దాఁకించితి నందువు
ననుపు చేసుక నీతో నవ్వుమనే వల్లైతే
మనసునఁ జొక్కేవా మఁదెమేళ మందువు ॥ఓప॥

వొద్దఁ గూచుండు మనేవు వూరకే నన్నెట్లైతే
నిద్దుర వోనియ్యనంటా నేర మెంతువు
పెద్దగాఁగఁ గొప్పు నీకుఁ బెట్టు మనే వట్లైతే
వుద్దండానఁ గొనగోర నూఁదితి నే నందువు ॥ఓప॥

తొప్పఁదోఁగ గంద మలదు మనేవు అట్లైతే
చిప్పిలు నీమేను సోదించితి నందువు
యిప్పుడె నన్ను శ్రీ వేంకటేశ యేలితివి నేఁడు
కప్పు మనేవు పయ్యెద గయ్యాళి నందువు ॥ఓప॥ 52

## శోకవరాళి

ఎంతవోర్పు గలదాన వేమే నీవు
కాంతలెల్లా నీసుద్దులు కతలుగాఁ జెప్పేరే ॥పల్లవి॥

ఘనమైనవిరహాగ్నిఁ గాఁగియు నప్పటిఁ బతి -
మనసు నొవ్వకుండానే మాటలాడేవే
యెనయక మరుచేత నేటువడి యింకా నా-
తనితోనే పొందు సేయఁ దమకించేవు ॥ఎంత॥

వొల్లనే యాసతివద్ద నుండఁగా విభునిఁ జూచి
వొళ్లు దాఁకకుండాఁ బువ్వుల వేసేవే
పల్లదపుజవ్వనము పంచపాలై మరి -
నుల్లసాన నవ్వుతాను ఊడిగాలు సేసేవే ॥ఎంత॥

గక్కన శ్రీవేంకటేశుకాఁగిటఁ జిక్కి యప్పటి
కక్కసించ కేల మొగము చూచేవే
చక్కఁగా రతిపరవశమున నన్ని మరచి
చొక్కుచు నాతనినే మెచ్చులు మెచ్చేవే ॥ఎంత॥ 53

భైరవి

ఎటువలె నున్నదో యిప్పుడు నీ చిత్తము
తటుకన నన్నియును దలఁచుకో నీవే ॥ పల్లవి ॥

మూసినము త్తెమువలె ముంగిట నేనుండఁగాను
ఆసలఁ బెట్టితివిగా అప్పుడు నీవు
నీసరి నే నిలుచుండి నీ మొగము చూచితేను
సేసలు వెట్టితివిగా చేతులారను ॥ ఎటు ॥

చిమ్ముచు నేఁ గొనగోర చేతులెత్తి మొక్కితేను
నమ్మిక లిచ్చితివిగా నాకు నీవు
వుమ్మడి నే నెంతైనా వొడ్డించుకొనఁగాను
సమ్మతింపించితివిగా చలపట్టి నన్నును ॥ ఎటు ॥

కొలువులోపల నేను గుట్టుతోనే వుండఁగాను
పిలిచి నవ్వితివిగా ప్రియముతోను
ఆలమి శ్రీ వేంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
వలపు రేఁచితివిగా వాడికగాను ॥ ఎటు ॥ 54

రేకు 711. ధన్నాసి

ఇంకనైనా దయఁ జూడు మీపెను నీవు
లంకెలకే నీతోను లాఁచీఁ దాను ॥ పల్లవి ॥

తలఁపులో మోహము దాఁచఁజాలక రమణి
మలసి సొలసి నీతో మాటలాడీని
కలువకన్నులయాస కడుఁ దమి రేఁచఁగాను
పలుమారు నిన్నుఁ దప్పక చూచీని ॥ ఇంక ॥

అక్కరతోఁ దనవిరహము చల్లార్చు మంటాను
పుక్కిట నూర్పులు ముంచి పోసీ నీకె
యిక్కువైనకోరికలు యీరికె లొత్తఁగాను
చిక్కించుక నీకొలువు సేసీ నిపుడు ॥ఇంక॥

వేడుక నిన్నుఁ బెండ్లాడ విన్నవించ వచ్చి లోలో
మేడెపుసిగ్గుఁతోడ మెరసీ నిదే
జాడతో శ్రీ వేంకటేశ సతి నిట్టె కూడితివి
వాడిక నీగుణాలను వర్ణన సేసీని ॥ఇంక॥ 55

ఆహిరి

తనచిత్త మింతేకాక తగవులఁ బెట్టేనా
వినయాన విభునికి విన్నవించఁగదరే ॥పల్లవి॥

యెంత చనవిచ్చినాను యియ్యకోనఁ దగుఁగాక
పంతము లాడుదురా పతితోను
మంతనము లాడితేను మన సొగ్గవచ్చుఁగాక
వింతరీతి నుండితేను వేడుకలు వుట్టునా ॥తన॥

చెనకి గోరూఁదితేను చెలరేఁగవలెఁ గాక
కనలిపడుదురా ఘనునితోను
ననుపునఁ బైకొంటే నవ్వు నవ్వవలెఁ గాక
పెనఁగులాడితేను బీరములు రేఁగవా ॥తన॥

తగులాయ మైతేను తమిఁ గూడవలెఁ గాక
బిగి సిగ్గువడుదురా చెలువునితో
అగపడి శ్రీ వేంకటాధిపుఁడు నన్నుఁ గూడె
మిగులా నలయించితే మిక్కుటము గాదా ॥తన॥ 56

సామంతం

కోరి మమ్ము నీ వేల కొంగువట్టేవు
బీరపుసవతులెల్లాఁ బెనఁగఁగ వలదా ॥పల్లవి॥

కొలువులో నాపె నీకుఁ గోరి కొప్పు దువ్వఁగాను
చెలు లండ నుండేది సిగ్గుగాదా
చలపట్టి యప్పటిని సరసమూ నాడఁగాను
తిలకించినవారెల్లా తెరవేయ వలదా ॥కోరి॥

పనివడి వొయ్యనె నీపాదము లాపె వొత్తఁగా
ననుపునఁ బెరవారు నవ్వవచ్చునా
తనివి నొందక నీతోఁ దగ మాటలాడఁగాను
వెనకటిసతులెల్లా వెలి నుండవలదా ॥కోరి॥

కమ్మటిని సారె నాపె కాఁగిలించుకొనఁగాను
నెమ్మదిఁ గడమవారు నిక్కి చూచేరా
యిమ్ముల శ్రీ వేంకటేశ ఇందుకే నీ వేలితివి
సమ్మతించి లోలోనే సంతోసించ వలదా ॥కోరి॥ 57

దేసాళం

అన్నిటాఁ గాఁగలపను లాయఁగాక
కన్నులఁ దప్పక చూచి కాఁతాళించ నేఁటికి ॥పల్లవి॥

చెంత నీ వాపెపై బత్తి సేయఁగాఁ జూచినదాన
పంతపు మాటలాడఁ బని యేమి
వింతయైనమట్టెలు నీవేలఁ బెట్టుకుండఁగాను
చింతతో నీకు బుద్ధులు చెప్ప మరేమున్నది ॥అన్ని॥

గక్కన నిద్దరిమతకము నెరిఁగినదాన
దిక్కుల మీ సుద్దులు సోదించ నేల
వెక్కసపుమీగుణాలు వింతగా వినినదాన
అక్కరతో మిమ్ము నింకా నడుగఁగవలెనా ॥ అన్ని ॥

వేడుకతో మీచేత విడెము వట్టినదాన
వాడిక మీనేర్పు తడవ నేమిటికి
యీడనె శ్రీ వేంకటేశ యేలితివి నన్ను నేఁడు
జోడై నమిమ్ము మరి సొలయఁగఁ దగునా ॥ అన్ని ॥ 58

శంకరాభరణం

ఆతనికరుణ గల్తే నన్నియు నయ్యీఁగాక
కాతరానఁ బెడరేఁచి గాసి సేతురటవే ॥ పల్లవి ॥

తనబత్తే కలిగితే దండకు వచ్చీఁ గాక
పెనఁగి బలిమిచేసి పిలుతురటే
మనసునఁ గలిగితే మన్నన నేలీఁ గాక
కొనచూపులను జూచి కొసరుదురటవే ॥ ఆత ॥

నవ్వు నవ్వవలసితే నా మొగము చూచీఁ గాక
దవ్వులనుండి చేతఁ దట్టుదురటే
రవ్వఁ జుట్టరికమైతే రతులు నేర్చీఁ గాక
యివ్వలా నవ్వలా నుండి యెచ్చరింతురటవే ॥ ఆత ॥

కాఁపుర మియ్యకోలైతే కాఁగిలించుకొనీఁ గాక
మాపు రేపుఁ బైకొని మలతురటే
చేపట్టి నన్నుఁ గూడె శ్రీ వేంకటేశుఁడు నేఁడు
రాఁపుచేసి వలపులు రచ్చ వేతురటవే ॥ ఆత ॥ 59

తెలుఁగుఁగాంబోది

మఱచి వున్నాఁడేమో మగువలాల
యెఱుకలు చేసి కాను కియ్యఁగదరే ॥ పల్లవి ॥

చిత్తములో తమకము సిగ్గులకు వెఱవదు
కొత్తయిన రతికాంత గుట్టు సేయదు
మొత్తమైనవిరహము ముందువెనక చూడదు
బత్తిగలవిభునికి భావ మెఱిఁగించరే ॥ మఱ ॥

తడబాటు కోరికతగవుఁ దలఁచ నీదు
జడిగొన్నవయసు వేసట చూపదు
వుడివోనియాసకు వూరట యెందూ లేదు
విడువనిపతి కింకా విన్నవించరే ॥ మఱ ॥

యెనసేటివేడుక యింతంతని చెప్పరాదు
కనుకలీ వినుకలీఁ గడమ గాదు
గొనకొని నన్నింతలోఁగూడె శ్రీ వేంకటేశుఁడు
ఘనుఁ డాతనికి నాకందువలు చెప్పరే ॥ మఱ ॥ 60

రామక్రియ

కానవచ్చె నీ మేననే కళలెల్లాను
నాననితలపోఁతలు నవ్వులు గావా ॥ పల్లవి ॥

ఆముకొని మిక్కిలి మోహము లేనియడాటాన
వేమరు మాటలాడితే వేసట గాదా
యేమిటాఁ దనివిలేక యెరవెరవైనవేళ ॥
చేముట్టి చెనకితేను సిగ్గులు రావా ॥ కాన

పనిలేనిపనులకు పాలుపడి వద్దనుండి
వినయాలు చేసితేను వెంగెము గాదా
మనసు వేరొకతెపై మరిగి పైకొనఁగాను
కను విచ్చి చూచితేను కాఁతాళము రేఁగదా ॥ కాన ॥

ముంగిటను తనమీఁదిమొగమోట లేకుండఁగా
కొంగు వట్టి తీసితేను గొరబు గాదా
కందులేక నన్ను శ్రీ వేంకటేశుఁడ కూడితివి
యింగిత మెరిగితేను యింతా మేలే కాదా ॥ కాన ॥ 61

ముఖారి

ఎవ్వరు బుద్ధి చెప్పినా నేల మానేవు
పువ్వులవేట్లు మీకు పోదు లాయను ॥ పల్లవి ॥

చొచ్చి నీయిల్లాపె తోఁ(తొం?)గి చూడఁగాను వేడుకాయ
వచ్చి వచ్చి మాటాడఁగా వాడికాయను
తచ్చి మీఇద్దరిలోనా దాఁటులాని పొందు లాయ
నిచ్చలు మీమోవితేనె నిండువిందు లాయను ॥ ఎవ్వ ॥

రసికతఁ బెనఁగఁగా రతులకుఁ జోటులాయ
వసంతములో గందపువాటు లాయను
దొసఁగుఁగొప్పులు వీడి తుమ్మిదలమూక లాయ
సను లొత్తి వలపులు సరియాఁక లాయను ॥ ఎవ్వ ॥

చెలఁగి కాఁగిలించఁగా చెమటలరొచ్చు లాయ
మెలుపునఁ గూడఁగాను మెచ్చు లాయను
యెలమి శ్రీ వేంకటేశ యిట్టె నన్ను నేలితివి
తలపోఁత లాయ నీచేతలే వూఁత లాయను ॥ ఎవ్వ ॥ 62

### పాడి

వారివారివోజ లింతే వద్దన నేలే
తేరకత్తెలతో నెల్లా దీకొనఁగ నేఁటికే ॥పల్లవి॥

పెలుచుఁ దనమువారు పెనఁగులాడఁ జూతురు
బలిమి గలుగువారు పచారింతురు
చలపాదివారైతే సాదించ వత్తురు
వలపు గలితేఁ జాలు వాసు లెంచ నేఁటికే ॥వారి॥

వేసరినవారు కడు వెరగువడి వుందురు
దోస మెరఁగనివారు దూరుదురు
యీసున నుండేవారు యెగ్గులెల్లాఁ బట్టుదురు
సేస వెట్టినవెనక సిగ్గువడ నేఁటికే ॥వారి॥

సరస మాడేవారు చనవులు మెరతురు
మరిగినవారు మర్మ మంటుదురు
యిరవై శ్రీవేంకటేశుఁ డిదె నన్నుఁ గూడినాఁడు
దొరసెఁ బనులు సవతుల గొడ వేఁటికే ॥వారి॥ 63

### కన్నడగౌళ

దిష్టము చూచితిఁ దమ్ము దేవీదేవరా వలె
నిష్టూరము లేనిదే నిండుదొరతనము ॥పల్లవి॥

చేతికి లోనైనపొందు సేసితే దోసము గాదు
ఆతుమైనవారిమాట లాదరింతురు
యేతులకు నవ్వితేను యెగ్గు లెంచఁ బనిలేదు
యీతల నన్నుఁ జూచి తా నేల సిగ్గువడీనే ॥దిష్ట॥

మొదలిచుట్టరికము మొగమోడకుండ రాదు
కదిసి పైకొనఁగా కాదన నేల
మదిలోనితమకము మరి దాఁచ నేఁటికి
యెదుట నేనుండఁగాను యింతకొంక వలెనా ॥ దిష్ట ॥

రతి కెక్కినవెనక రాఁపులు సేయఁ దగదు
తతి వచ్చినప్పుడు దాఁతురా మేలు
యితవుగా శ్రీ వేంకటేశుఁడు తా నను గూడె
సతమైతి నా మోము చక్కఁ జూడుమనవే ॥ దిష్ట ॥ 64

## లలిత

విన్నకన్న వారికెల్లా వెరగయ్యీని
కన్నియను లాలించితే కాంతలెల్లా మెత్తురు ॥ పల్లవి ॥

సురటి విసరరాదా సుద్దు లడుగఁగరాదా
పొరుగున నుండి వచ్చె పొలఁతి
సరసము లాడితివి చవులెల్లా నేర్పితివి
యెరవు చేసుకుండితే నెట్టుండునో మనసు ॥ విన్న ॥

ననుపు చేసుకరాదా నవ్వులు నవ్వఁగ రాదా
చనవునఁ బెనఁగీని సకియ
వినయము లీడేరె వేడుకలు దైవారె
యెనసి వుండకుండితే నేమందురో చెలులు ॥ విన్న ॥

కదిసి కూచుండరాదా కాఁగిలించుకొనరాదా
యెదుట సేవలు సేసీ నీమగువ
పొదిగి శ్రీ వేంకటేశ పొందు లెరిఁగించితివి
వదలక వుండితేను వలపెంత హెచ్చునో ॥ విన్న ॥ 65

శంకరాభరణం

విభునితో నలుగక విడె మియ్యవే
సభలోన నెట్టుండినా సాధించఁ దగునా ॥ పల్లవి ॥

వొగ్గి యేపొద్దుఁ గాచుక వొద్ద నుండేవారికి
యెగ్గు లెంచుకొనే మంటే నెంత లేదు
కగ్గు లేక రతులను కాఁగిలించుకొన్నపుడు
సిగ్గులు వడేమనఁ జెల్లునా యెవ్వరికి ॥ విభు ॥

అదిఁ గొని మంచిమాట లాడఁగానే చూచి చూచి
వా దడఁచితేఁ గాదనేవా రెవ్వరు
పోదితోడఁ గంచముపొత్తులు గలసె మరి
కాదు గూడ దంటే సంగతు లయ్యీనా ॥ విభు ॥

అంతటాను చుట్టరిక మమరి వుండఁ గాను
పంతములు నెరపఁగఁ బాడి గాదు
ఇంతలోనే శ్రీ వేంకటేశుఁ డిదె నిన్నుఁ గూడె
వింతలు సేయఁ జూచితే వివరము లౌనా ॥ విభు ॥ 66

రేకు 713 సౌరాష్ట్రం

కానీమ (వ?) య్యా దాని కేమి కాదనేమా నిన్నును
పూని మమ్ము నిట్లానే భోగించేవు గాక ॥ పల్లవి ॥

వదలుఁబయ్యదతోడ వాసనగుబ్బలు చూపి
యెదుట నుండి చెలి యెలయించీని
మొదటనే యీపె నీకు మోహపుదేవులట
పదరి యిందుకు నీవు భ్రమయకుండుదువా ॥ కానీ ॥

సారె జారుఁ దురుములో జాజులు పై రాలించి
తేరకొన నిన్నుఁ జూచి తేలించీని
వూరటగా నెప్పుడూ నీవొద్దఁ బాయకుండే దిదె
చేరి యాపె చెప్పినట్టు సేయ కుండుదువా ॥ కానీ ॥

తేటలమాటలతోడ తియ్యనిమోవి యొసఁగి
గాఁటముగా నిన్ను నిదె కాఁగిలించీని
యీటుగా శ్రీ వేంకటేశ యేలితివి నిన్ను నేఁడు
వాఁటముగా నిదె నాకు వలవ కుండుదువా ॥ కానీ ॥ 67

మధ్యమావతి

ఇయ్యకోలైనచోట యెరవు లేల
చెయ్యారా వీడె మిచ్చి చెనకఁగ రాదా ॥ పల్లవి ॥

చనవరిదాన నంటా సలిగె నెంపే నంటా
పెనఁగేవు పతితోను పిలువఁ గానే
తనివోదు తమకము తడ వాయ సముకము
మనసిచ్చి యీతనితో మాటలాడ రాదా ॥ ఇయ్య ॥

చక్కనిదాన నంటా సాదించఁ గల నంటా
కక్కసించే వాతఁడు గారవించఁగా
మక్కువ తొల్లె కలదు మారుమాటాడ వలదు
చెక్కు నొక్కి యాతనిపై సేస వెట్ట రాదా ॥ ఇయ్య ॥

వంతపుదాననంటా పాయరాని దాననంటా
వింతలు చేసేవు శ్రీ వేంకటేశ,
యింతలోనే కలయిక యిద్దరికి నలయిక
చింత దీర నాతనికి చేత మొక్క రాదా ॥ ఇయ్య ॥ 68

### కురంజి

కానుక లందుకో వయ్యా కత లేమి యడిగేవు
మానాపతుఁలము నేము మరి దూర రాము ||పల్లవి||

వంచన సేయఁగ రాదు వలపు పెట్టనిదొంతి
పొంచి వేసె నింతే చెలి పూవుల బంతి
ముంచినసి గ్గయితేను మొదలఁ బెట్టనికోట
మించి కాంతల కేపొద్దూ నీ మీఁదిదే యాట ||కాను||

మట్టు లేనితమకము మలసి పారేయేరు
చుట్టి చుట్టి వచ్చి యాకె సోదించె గోరు
దట్టమైన జవ్వనము దాఁటఁగ రానికొండ
నెట్టన నందరికిని నీవే దాపుదండ ||కాను||

కలసిన కాఁగిలి కామశాస్త్రపుదొడ్డి
చెలఁగే పరవశము చీఁకటిదొడ్డి
యెలమి శ్రీ వేంకటేశ యేలితివి జవరాలి
పిలిచి మోవిచ్చినది పెండ్లివోలి ||కాను|| 69

### దేసాళం

గుట్టుతోడ నుండేదే గుణము గాక
అట్టడినై పతితోడ నిట్టె రాయడించేనా ||పల్లవి||

పెనఁగులాడఁగఁ బోతే ప్రియములు గరివడు
చెనకి చేవట్టితేను సిగ్గులు రేఁగు
మనసు లొరసితేను మర్మములు తడఁబడు
తనతో సాములు చేసి తప్పించుకోఁ గలనా ||గుట్టు||

సారెకు నన్నుఁ జూచితే సరసము చండిపడు
చేరి చెక్కు నొక్కితేను చెమటగారు
మేరతో నూరకుండితే మిక్కుటమౌఁ దమకము
యీరీతి నాతనితోడ నెదురాడఁ గలనా ॥గుట్టు॥

పంతములు నెరపితే పాయనే పై తరవౌను (?)
చింతించితే నాస లోలోఁ జిగిరించును
యింతలో శ్రీ వేంకటేశుఁ డితఁడె తా నన్నుఁ గూడె
వంతులఁ దా మన్నించఁగా వద్దనఁగఁ గలనా ॥గుట్టు॥ 70

## భైరవి

ఇంటికి రమ్మనవే ఇయ్యకొంటి రమణుని
జంటయై కూడుండేము సాదింపు లేల ॥పల్లవి॥

తనమనసే యెఱుఁగు తా నాతో నాడినమాట
పనివడి నేఁ జెప్పి పంపే దేమి
చెనకిన చెనకులు చనుఁగవపై నున్నవి
పెనఁగి సిగ్గులు మరి పెంచఁగఁ జోటేది ॥ఇంటి॥

మెడవి తనసొమ్ములు మేనవాఁడు మొదలనే
యెడయక వేఁడుకోను యిఁక నేఁటికి
వడిసీ మైఁ జెమటలు వలపులు తల కెక్కె
కడువాసి వంతు లెంచఁ గారణము లేమి ॥ఇంటి॥

కమ్మి శ్రీ వేంకటేశుఁడు కాఁగిటిపై నున్నాఁడు తా -
నిమ్ముల మోవిచవులు యెంచవలెనా
తమ్ములము పుక్కిటిది తనువెల్లాఁ బులకలే
కుమ్మరించి ముద్దులు గునియఁగ వలెనా ॥ఇంటి॥ 71

లలిత

తరుణికి నింత కూళతనములు చెల్లునా
పొరిఁ బొరి చెలులాల బుద్ది చెప్పఁ గదరే ॥పల్లవి॥

నిలిచి యాతఁడు నేను నేస్తములు చేసుకోఁగా
పొలఁతి తా నేల వచ్చి పొత్తు గూడీనే
మలసి మాలో మేము మంతనము లాడుకోఁగా
చలపట్టి యీకె యేల సాకిరి చెప్పీనే ॥తరు॥

ననిచి వొండొరులము నవ్వులు నవ్వుకోఁగా
పనివడి యీ వేల తప్పక చూచీనే
అనువుగా మాయంత నే మద్దములు మూచుకొంటే
చొనిపి తనయీ వేమి చూప వచ్చినే ॥తరు॥

శ్రీ వేంకటేశుఁడు నేనుఁ జేకొని కూడఁ గాను
వావు లప్పటి తా నేల వచ్చి చెప్పీనే
చేవ మీర మాకుమాకే సేసలు చల్లుకోఁగా
పూవులఁ గొని తా నేల పూఁచి వేసీనే ॥తరు॥ 72

రేకు 714. కేదారగౌళ

ఇంతి నీకు నొజ్జలాయ నిటువంటి చేఁతలకు
యింతేసి తొల్లి యెరఁగ విప్పుడే నేర్చితివి ॥పల్లవి॥

యేమని మాటాడెనో యేకతాన నాపె నీతో
నామోము చూచి నీవు నవ్వు నవ్వేవు
చేముంచి నీ కెట్లాను సిగ్గులు దేరిచెనో
ప్రేమముతో మోవి మోవిఁ బెనచ వచ్చేవు ॥ఇంతి॥

సారె నాపె నీకు నెట్టి చవులు మరిపెనో
చేరి నాపొత్తులకే చెయి చాఁచేవు
తోరముగా నేగతి నిందుకు సాము సేయించెనో
వీరముతోఁ గాఁగిటఁ బెనఁగఁ జూచేవు ॥ఇంతి॥

సన్న లేరీతిఁ జేసెనో సముకమున నీ కాపె
కిన్నెరవంటి గుబ్బలు గిలిగించేవు
యన్నిటా శ్రీవేంకటేశ యిటు నన్నుఁ గూడితివి
నున్ననిచెక్కులు గోర నొక్కఁ దలఁచేవు ॥ఇంతి॥ 73

శ్రీరాగం

అల్లవాఁడె నీవిభుఁడు ఆయము లంటీ వలపు
చల్లఁగదే మోహము చాలఁ గలిగీని ॥పల్లవి॥

చన్నుమొనలు గదలఁ జాఁచి చేతుల, నతని
సన్నలఁ బిలువఁ గదే చవు లయ్యీని
మున్నిటినీ పొందులు మోవితేనెలు గారఁగ
విన్నపము సేయఁగదే వేడుక పుట్టీని ॥అల్ల॥

నిలుచుండి యెలుఁగులు నిడుసాగిల నూఁకొని
సెలవుల నవ్వఁగదే చింత వాసీని
తలుపుమాటున నుండి తప్పక ఆతనిదిక్కు
సోఁకి చూడఁగదవే సొంపులై యుండీని ॥అల్ల॥

చెంగలించి నిట్టూర్పుల చెమట లార విసరి
సంగడిఁ గూచుండవే ఆసలు రేఁగీని
అంగవించి శ్రీవేంకటాధిపుఁడు నిన్నుఁ గూడె
కందు లేకుండఁగదవే కాఁపుర మీడేరీని ॥అల్ల॥ 74

ఆహిరి

ఈతఁడు నీకె మోహించు నిందరిలోన
యీతల నీ రాజసము యేమని చెప్పుదుమే ॥పల్లవి॥

చెంతల నాతఁడు నీకు చెప్పినట్టెల్లాఁ జేసె
మంతనానఁ జన విచ్చి మాడ లాడెను
యెంత భాగ్యమో నీది యేమేమి నోమితివో
వింతసతులందు నిట్టి వేడుకలు గంటిమా ॥ఈత॥

తోడిఁ బడ నీవు రాఁగా తొడపై నిన్నిడుకొనె
మెడఁ బెట్టీ సొమ్ములెల్లా మెచ్చి నీకును
వోడఁబాటు లేరితివో వుదయఫల మెట్టిదో
కడఁగి యీమహిమ యెక్కడనైనాఁ గలదా ॥ఈత॥

ముచ్చట దీరఁగ నీమోము చూచి నవ్వు నవ్వె
వచ్చిరేఁ గాఁగిలించి పైకొని కూడె
నిచ్చ శ్రీ వేంకటేశుఁడు నిన్నురాన నుంచుకొనె
తచ్చి యీసరసము లితరులకుఁ జెల్లునా ॥ఈత॥ 75

వసంతవరాళి

అతివసుద్దు లేమి యడిగేవు మమ్ము నిఁక
గతి నీవే వొనగూడి కరుణించవయ్యా ॥పల్లవి॥

యింటికి వచ్చినదాఁకా నింతి నీ కెదురుచూచు
నంటునఁ గలయ సగినాలు చూచును
అంటి పలకపై వ్రాసి అట్టె నీరూపు చూచు
వొంటి నిన్నుఁ గాఁగిటిలో నున్నట్టు చింతించును ॥అతి॥

నెలతలఁ గనుఁగొంటే నీవేళలే యెడుగు
తలఁపులో మోవి యాని తనివిఁ బొందు
చెలులచే నీగుణాలు చిరునవ్వులతో విను
వలపులయాందోళాలు వడిఁ జెంగలించును ॥ అతి ॥

కోరి నీ వేలినదాఁకా గుబ్బలు నీకు మీఁదెత్తు
కూరిమి నీమన్ననకు గుట్టుతో మెచ్చు
యీరీతి శ్రీవేంకటేశ యీడ నీకె నేలితివి
సారె నీచనవునకు సంతోసించి మొక్కును ॥ అతి ॥ 76

## ముఖారి

చెలిభ్రమల నీ వేల చిక్కకుందువు
తెలిపితే నీగుణము తీరుకు వచ్చీనా ॥ పల్లవి ॥

జలజాక్షి మోవితేనె చందమామ గుటుకలు
పొలసి నీకుఁ దరతీపులు సేసెను
కలికిచూపులు మరుగాలపు వేఁటకోలుకులు
తలఁపులోపలఁ జొచ్చి తగిలించుకొనెను ॥ చెలి ॥

మదిరాక్షిమాటలు మాయపు చొక్కు మందులు
యెదుట నిన్ను మదన మెత్తించెను
చెదరినచిరునవ్వు చిలుపాలవిందులు
వుదుటున నిన్ను నో రూరించకుండునా ॥ చెలి ॥

తరుణికాఁగిలి నీకుఁ దగినపెండ్లి చవికె
సరవి తోడుత సంతోసము రేఁచెను
అరయ శ్రీవేంకటేశ అలమేలుమంగ యీకె
నిరతి నన్నేలించి నిన్నుఁదా మెప్పించెను ॥ చెలి ॥ 77

బౌళి

అన్ని నీవల్లనే ఆపె యింత నవ్వేఁ గాక
యెన్నటివలెనే వుంటే యెమ్మెలు చూపీనా ॥ పల్లవి ॥

సలిగె గలయాడది చలము సాదించుఁ గాక
బలిమి లేకుండినది పంత మాడీనా
చెలిమి యీడేరితేను సేఁతలెల్లాఁ జేసుఁ గాక
వలసినొల్లములైతే వాసికిఁ బెనఁగీనా ॥ అన్ని ॥

మందెమేళమైనసతి మదించి చెనకుఁ గాక
కందువ దెలియనిది గరసించీనా
పొందు గడుఁదగులైతే పొత్తులకు వచ్చుఁగాక
సందడిలో మాటలకు సరుసఁ గూచుండీనా ॥ అన్ని ॥

బాస సేయించుకొన్నాపె పానుపుపైఁ బండుఁగాక
సేస వెట్టనిమగువ చిమ్మురేఁగీనా
ఆసల శ్రీవేంకటేశ అలమేలు మంగను నేను
నీసతి యైనంతలోనే నీ (నా?) సాటి వచ్చీనా ॥ అన్ని ॥ 78

రేకు 715. శంకరాభరణం

సిగ్గువడపు మీఁక చెలియకు వలపులు
అగ్గల మయ్యీను ఆదరించవయ్యా ॥ పల్లవి ॥

తమకము మదిలోఁ దడఁబడఁగా
సముకంబున నిను జరయుచును
చెమటలు చెక్కులఁ జిందఁగను
తమలఁ (లం?) బిసిగీ దయసేయవయ్యా ॥ సిగ్గు ॥

పులకలు మేనను పొదలఁగను
పలుకుల నిను నొడఁబరచుచును
నిలువున వెరగులు నిండఁగను
మలసీ రతులకు మన్నించవయ్యా ॥ సిగ్గు ॥

వేడుకతో నూర్పులు విసరఁగను
కూడీ నీకె నినుఁ గొసరుచును
యీడనె శ్రీ వేంకటేశ యేలితివి
జాడతో సరసమాడీఁ జనవియ్యవయ్యా ॥ సిగ్గు ॥ 79

నాదరామక్రియ

చెలికత్తెలతో నేమి చెప్పేవు సారె సారె
వలచినదాని నేల వట్టి నేరా లెంచేవు ॥ పల్లవి ॥

సిగ్గువడి వుండెఁగాక చేరి నీతోఁ గోపగించి
యెగ్గుపట్టి వున్నదా యింతి యేమైనా
వొగ్గి వేఁడుకొనెఁ గాక వూరకే చెక్కు చేనూఁది
వెగ్గళించి చేఁత చేసి విట్టువీఁగెనా ॥ చెలి ॥

అలయిక నుండెఁగాక అట్టె నీతో మాటాడక
చలము సాదించెనా సతి యేమైనా
అలరి నీ వొసఁగినవోరాలు చూపెఁ గాక
పలుమారు రొమ్ము దట్టి పంత మాడెనా ॥ చెలి ॥

తలితో నుపరిసురతమున మెప్పించెఁ గాక
రతి నిన్ను నోడించెనా రామ యేమైనా
సతమై శ్రీ వేంకటేశ జవ్వని నేలితి విట్లు
కత నీచే వినెఁ గాక గర్వము నెరపెనా ॥ చెలి ॥ 80

తెలుఁగుఁగాంబోది

నవ్వీ నూరక నాతోను వలపులు
తవ్వీ నిదివో తనలోనే తాను ॥ పల్లవి ॥

యేఁటికిఁ జెనకీ నీతఁడు మాఁటికి -
మాఁటికి నాకుఁ దా మరిగె నట
గాఁటపునాగుబ్బలు గదలించి పైపై -
నేఁటలు వేసీ నిది యేమే తాను ॥ నవ్వీ ॥

విసరీ సురటి నాకు వీఁ డిదివో నేఁడు
కొసరి కొసరి తొల్లె కూడె నట
పసలుగా నామోవిపండు గడుఁ దీపంటా
అసురుసురై మేలము లాడీఁ దాను ॥ నవ్వీ ॥

యెలమి నాతోఁ జెప్పె నిదియేలే రతి -
నలమి యలమి తా నలసె నట
తెలిపె శ్రీవేంకటాద్రిదేవుఁడఁ దానంటా నా -
అలపులు దీర్చీ నంటుచుఁ దాను ॥ నవ్వీ ॥ 81

సామంతం

వలవకుండునా నీకు వలరాజగురుఁ డిట్టె
యెలమి నీసొబగులు యివి నీకె దక్కెను ॥ పల్లవి ॥

కట్టిన బొమ్మల పట్టు కన్నె చంద్రవంకబొట్టు
మెట్టినపాదాల మీఁద మెరసేగుట్టు
పట్టిన సేవంతిజొంపముల పూవులబంతి
నెట్టన యీ సింగారాలు నీకే యమరునే ॥ వల ॥

వీడెపుమోవికప్పు విరులు జారేటికొప్పు
తోడనే కాటుకకనుదోయి చొప్పు
వేడుకై చెంపల మునివేళ్ళ నలఁదినవొప్పు
యీడులేని వొయ్యారము యివి నీకె తగునే ॥ వల ॥

చిలుగువాఁడిచూపు చెలికత్తె మూపు దాపు
తలకొన్న నవ్వుల తరితీపు
యెలమి శ్రీవేంకటేశుఁ డితఁడు గూడినయేపు
యిలపైఁ గలకాలము యింతా నీకె చెల్లునే ॥ వల ॥ 82

భైరవి

పాయరానిచుట్ట మైనప్రాణ బంధువుఁడు దాను
వేఁరైనాఁ దన చేఁతకు వేసరేనటే ॥ పల్లవి ॥

తలఁపులోఁ గలమాట తనతో నాడుదుఁ గాక
అలిగి వేరొకతెతో నాడేనటే
పిలిచి యంతై నాను ప్రియమె సేయుదుఁ గాక
చలము లందుకుఁగాను సాదించేనటే ॥ పాయ ॥

చేతికి లోనై నపని సేవగాఁ జూపుదుఁ గాక
ఆతల నొక్కరిని నే నడిగేనటే
యేతున మరచినాను యెచ్చరికె సేతుఁ గాక
కాతరించి వట్టిదూరు గట్టేనటే ॥ పాయ ॥

పట్టరానియాసలకు బలిమిఁ గూడుదుఁ గాక
బట్టబయలు సిగ్గులు వడుదునటే
యిట్టె శ్రీవేంకటేశుఁ డిన్నిటా నన్నేలినాఁడు
మట్టులేనితనమేలు మఱచేనటే ॥ పాయ ॥ 83

సాళంగనాట

[1] ఇప్పుడే నిన్నింత సేసె నింపుల తోడ
నెప్పుడుఁ జెప్పఁగదవె నీవున్నజాడ ॥పల్లవి॥

గాఁటపుఁదురుముచీఁకటి జారెను
తేటల చూపులనే తెల్లవారెను
మేఁటి నీమోముకళలు మితిమీరెను
వూటలై మోవితేనెలు వుట్టి పదనూరెను ॥ఇప్పు॥

తగు నిట్టూర్పుల దాని(వి?) దాడి ముట్టెను యెడ -
తెగని చెమటల ముత్తేలు వుట్టెను
నగవుల సిగ్గుల నాము దొట్టెను
మొగిఁ జను జక్కవలు ముంగిలెల్లా మెట్టెను ॥ఇప్పు॥

కడఁగి పులకల మొలకలు నిక్కెను
తొడరి మైఁదీఁగె రతుల కెక్కెను
యెడయక శ్రీవేంకటేశుఁడా వీఁడు
విడువక నిన్ను నేలె వేడుకలు దక్కెను ॥ఇప్పు॥ 84

రేకు 716 పడవంజరం

తాము విన్నసుద్దులకు తారుకాణ వచ్చెనంటా
నాములుగా చెలవుల నవ్వులు నవ్వేరు ॥పల్లవి॥

కామిని నీవద్దనుండి కనుసన్న సేసితేను
మోములు చూచుకొనేరు ముదితలెల్లా
ఆముకొని నీ వంతలో నాకెపాదము దొక్కితే
దోమటిఁ దమలోనఁ జేతులు చరచేరు ॥తాము॥

1 దీనిభావము సుస్పష్టమగుటలేదు.

చెలి నీసముకమున సిగ్గులు నెరపితేను
తల వూఁచుకొనే రిదే తరుణు లెల్లా
మలసి యాకెను నీవు మర్మాలు సోఁక నాడితే
కులికి వొండొరు లిదె గోళ్ళ నెచ్చరించేరు ॥ తాము ॥

యింతి నీ చెవులలోను నేకతము లాడితేను
సంతోసాన మురిసేరు సతులెల్లాను
యింతలో శ్రీవేంకటేశ యీకెను నీవు గూడితే
పంతము లొకరొకరు పచారించుకొనేరు ॥ తాము ॥ 85

దేసాళం

ఏమి సేయవచ్చుఁ దానే యెరిఁగీఁ గాక
సాములు సేసి పెనఁగీ జడియకువయ్యా ॥ పల్లవి ॥

వాసనకస్తూరి మేన వలపులు చల్లఁగానే
యీసు రేఁగి చెలి నీమో మిటు చూచెను
మోసపోక నీ వెందుఁడో మోచి తెచ్చినప్రయాస -
మోసరించి చూడదాయ నొక్కించుకైనాను ॥ ఏమి ॥

కొత్తయై కంటసరి కోరి మెడఁ గట్టఁగాను
హత్తి చెలి కోపగించి ఆన వెట్టెను
ముత్తాన నెందో గడించి మొగిఁ దెచ్చి యిచ్చినది
చిత్తమునఁ బెట్టదాయ చెప్పఁగ నేమున్నది ॥ ఏమి ॥

శ్రీవేంకటేశ నీవు దెచ్చినవీడె మిటు చూచి
భావనలు వేరె సేసి పట్టదాయను
ఆవటించి కప్పముగ నాడా నీడాఁ దెచ్చి నీవు
కావరించి కూడితివి కతలు మరచెను ॥ ఏమి ॥ 86

## మాళవిగౌళ

చక్కనుండితే నేము సడిఁ బెట్టేమా
పక్కనఁ దానే నవ్వి పచ్చిసేసెఁ గాక ॥పల్లవి॥

భావ మెఱిఁగినవాఁడు పంతాలు నెరపేవాఁడు
మావంటివారితోడ మాటాడ నేలే
దేవరవలెఁ దా నుండేఁ దిట్టాడ వచ్చేమా
తావుల నింతేసి మమ్ముఁ దానె పెంచెఁగాక ॥చక్క॥

తగ వెఱిఁగినవాఁడు తాలిమి గలుగువాఁడు
యెగసక్కేలు మాతోడ నింతేసి యేలే
నగుతాఁ దా నూరకున్న నాఁడె నేఁ బిలువనా
బిగిసి తా నింత మమ్ము పెనఁగించెఁ గాక ॥చక్క॥

చెప్పినట్టు సేసేవాఁడు శ్రీ వేంకటపతి దాను
తప్పులేని తప్పుచింత తన కేలే
యిప్పుడిట్టె నన్నుఁ గూడె యింకా నేఁ గాదనేనా
చెప్పలేఁ దనకుఁ దానే సిగ్గువడీఁ గాక ॥చక్క॥

## సాళంగం

ఇంతలోనె దాననా యేల నీవు లోఁగేవు
చెంతల నీచెప్పినట్లు సేతు నింతె కాక ॥పల్లవి॥

నిన్ను నేల దూరేను నీ వేమి సేసినాను
నన్నుఁ జూచుకొని నేనే నవ్వుదుఁ గాక
కన్నుల నేల తిట్టేను కాఁకలు సేసి నందుకు
మిన్నక చూచినవారి మెప్పింతుఁ గాక ॥ఇంత॥

ఆసల నేల పెట్టేను అప్పటి నీరాకలకు
వాసిఁ దలఁచుక నేనే వత్తుఁగాక
దోస మేల నీకుఁ గట్టే దొమ్మి నీ పెంత సేసినా
బాసలు నీకోప్పగించి పంత మిత్తుఁ గాక ॥ ఇంత ॥

బెట్టిమాట లాడేను నీపెలుచఁదనమునకు
ముట్టి వచ్చితే నీకే మొక్కుదుఁ గాక
గట్టిగా శ్రీ వేంకటేశ కలసితి విటు నన్ను
యెట్టైనా నీతగవే యెక్కు డందుఁ గాక ॥ ఇంత ॥ 88

నాదరామక్రియ

ఇంక నేల ఆసుద్దు లిన్నియు మఱచితిని
బొంకఁ బోతే నీమాటఁలు పొంక మయ్యీనా ॥ పల్లవి ॥

మిక్కిలి మేలువాఁడవై మించి నాతోఁ గూడుండఁగ
గుక్కుచు నందాలు సేసుకొంటిఁ గాక
చిక్కించి నీవు దొల్లి సేసినచేఁతల కెల్ల
తొక్కి ని న్నేమి సేసినా దోసమున్నదా ॥ ఇంక ॥

బంటువలె నీవు నాకు పనులు సేయఁగాను
కంటకము లేమి గల్లాఁ గప్పితిఁ గాక
రెంటి నీ విన్నాళ్లు దిరిగిన తిమ్మటలకును
దంటనై నిన్నుఁ దిట్టినాఁ దప్పు మోచీనా ॥ ఇంక ॥

మగఁడవై నీవు నన్ను మన్నించి కూడఁ గాను
జిగి నీకు బుద్దు లెల్లఁ జెప్పితిఁ గాక
నిగిడి శ్రీ వేంకటేశ నిన్న మొన్నటి రతికి
జగడ మెంతవెట్టినా సడి వచ్చీనా ॥ ఇంక ॥ 89

శుద్ధవసంతం

ఓరి నీవు నే నేమన్నా నోరుపలేవా
చీరాలు నెరపుదువు పిటిటీసేవా ॥పల్లవి॥

నవ్వులకు కొనగోరు నాటించిన యంతలోనే
యవ్వల నొచ్చ (చ్చె?) ననేవు యిది యేరా
రవ్వలుగాఁ దొల్లి నీవు రావణుతోఁ బోరినది
అవ్వల నే నెంచుకొంటే నరు దయ్యీ్యారా ॥ఓరి॥

మనసు చూడవలసి చనుఁగొండల నొత్తితే
కినిసి యంతటిలోనే కిందుపడేవు
నెనకకు మందరము వీఁపున మోఁచి తచ్చిన-
పనులు ని న్నెంచితేను పచ్చి దేరీరా ॥ఓరి॥

చుట్టమనై నిన్ను రతి నూడు వట్టి కూడితేను
అట్టె శ్రీవేంకటేశ అలసేవు
గుట్టునఁ బదారువేలఁ గూడితి వనేటిమాఁట
యిట్టె నీమీఁద మోపితే యెరవయ్యీ్యారా ॥ఓరి॥ 90

రేకు 717 రామక్రియ

తనంతఁ దా నెరఁగఁడు తలపించవే
వెనకటిమాయ నేఁడు విడు మనవే ॥పల్లవి॥

పీసమంత నవ్వితేనే వెడ్డు వెట్టి యడిగేవు
రేసుదీర నీతోడ రేపు చెప్పేనే
బేసబెల్లిరమణుఁడు పెనఁగీ నాతోఁ జెరఁగు -
మాసి వున్నదాన నేఁడు మాను మనవే ॥తనం॥

తలవంచుకొంటి నంటా తరచుగ నౌర సేవు
చలము బయట వేసే జాము వోసీవే
బలిమి రమణుఁ డేల పైకొనీ దోసముతోడ
తలఁగున్నదాన నిట్టె దగ్గరకు మనవే ॥తనం॥

సిగ్గుతో నుండాననంటా శ్రీవేంకటేశ్వరుఁ డెచ్చి
దగ్గరించి పై దొబ్బేవు తతి గానవే
యెగ్గు సిగ్గు నెఱఁగక యితఁ డిట్టె నన్నుఁ గూడె
వొగ్గి నానాళ్లు సేసి వున్నదాన ననవే ॥తనం॥ 91

ఆహిరి

చెల్లఁబో యింకా నేలే చేపట్లు
చల్లఁగా తా నుండ నే సాదించేనా ॥పల్లవి॥

మనసు వచ్చినవారిమాటలే యమరుఁ గాక
ననుపు చాలనిమాట నవ్వులు గావా
యెనసి నే నూరకున్న నేల దూరీనే నన్ను
తనమోహముకొలఁది తా నెరఁగఁడా ॥చెల్ల॥

పిలచినవారి రాక ప్రియములై యుండుఁ గాక
బలిమిఁ జొచ్చి వచ్చితే పాటివచ్చేగా
నిలిచీ దగ్గరనంటా నేర మేమెంచీనే నన్ను
తలఁచేటితనతమి తా నెరఁగఁడా ॥చెల్ల॥

సరసమాడేటివారి చనవులే చెల్లుఁగాక
యెరవులవారిచన వెందాఁకానే
యిరవై శ్రీవేంకటేశుఁ డిట్టె నన్నుఁ గూడినాఁడు
తరవాతిపని తా నెఱఁగఁడా ॥చెల్ల॥ 92

కన్నడగౌళ

ఏకతానకుఁ బోరయ్య యిద్దరు మీరు
మాకుఁ దెలియవు మీతమకము లెట్టివో ॥ పల్లవి ॥

మాయకొని నీతోడ మాటలాడ నోపదు
కేరి కేరి బొమ్మల జంకించ నోపదు
సారె జారుఁజెమటతో చల్లేటినిట్టూర్పుతోడ
వూరకే వున్నది మీవొడఁబాటు లెట్టివో ॥ ఏక ॥

కొంగు వట్టి నిన్నుఁ దీసి కోపగించఁ జాలదు
కెంగేలిగోరఁ గన్నీరు గీఁట నొల్లదు
ముంగిట వెరగులతో మొక్కేటి చేతులతోడ
అంగన అదివో మీఅలవాటు లెట్టివో ॥ ఏక ॥

గక్కన నీకాఁగిటిలో గద్దించ నేరదు
వొక్కటై కూడితివి నిన్నొద్దన లేదు
యెక్కువ సంతోషముతో యిట్టె శ్రీ వేంకటేశ
దక్కివున్న దాపె మీ తగులాయమిదివో ॥ ఏక ॥ 93

సాళంగనాట

ఎంత వేగిరకాఁడవు యేమందు నిన్ను
మంతుకెక్క నీవారమే మన్నించవయ్యా ॥ పల్లవి ॥

నమ్మిక నీమాటలకు నవ్వు వచ్చె నింతే పో
అమ్మరో నిన్ను గేలిసేఁయగ వచ్చేమా
చెమ్మఁజెమటఁతోడి చెక్కులతో నంతలో నీ-
వెమ్మెలకే కోపగించే విది యేఁటికయ్యా ॥ ఎంత ॥

దగ్గరేనీయాసలకుఁ దప్పక చూచితి నింతే
వెగ్గళించేనీమీఁది వెంగెమా యిది
సిగ్గువడ్డమొగముతో చీఁదర వాఁదరలతో
నిగ్గుదేర మొరఁగేవు నీ విదేమయ్యా ॥ ఎంత ॥

సంగడిఁ గూచుండఁగాను సరిపెనఁగితి మింతే
సంగతి మీరినయట్టి జాడ లేవి
ముంగిట శ్రీ వేంకటేశ మోహించి కూడితి నన్ను
అంగవించి తనియవు అప్పటి నేలయ్యా ॥ ఎంత ॥ 94

## శుద్ధవసంతం

ఇంగిత మిటు నీ వెరుఁగుదు నందువు
పొంగుచు నాపెనె పొదుగఁగ రాదా ॥ పల్లవి ॥

చౌకవునడపుల సందడింపులను
చేకొనఁ గై దండ చెలి మరచె
పై కొని కెంగేలు పట్టుక యీవేళ
యీకాంతకు చన వియ్యఁగ రాదా ॥ ఇంగి ॥

రమణికుచంబుల రాయిడింపులను
అమరి జారుఁబయ్యద మరచె
చెమటలు విసరెడిచేఁతల నెపమున
రమణుఁడ మరఁగుసురటి యిడ రాదా ॥ ఇంగి ॥

తుదఁ గనుచూపుల తోదోపులనే
కదిమిన నిదురలగతి మరచె
యిదివో శ్రీ వేంకటేశ నీ వీపెను
పదరి కూడితివి పలుకఁగ రాదా ॥ ఇంగి ॥ 95

నట్టనారాయణి

ఒక్కమనసున నన్ను నుండ నీరాదా
చిక్కులేల వేసేవు చెయ్యాల పట్టేవు ॥పల్లవి॥

సారె నాపయ్యెద వట్టి జవ్వనము రేఁచి రేఁచి
వూరకున్న వారి నేల వుడికించేవు
కూరిమి మరవనీవు కూడియుఁ గూడవు నీవు
నేరనివారిపై నేల నెపాలు వేసేవు ॥ఒక్క॥

వేసాన నన్ను నవ్వించి వెడ్డువెట్టి పలికించి
ఆసల నన్నేల వుస్సు రనిపించేవు
చేసేవు మంచితనాలు చిక్కియుఁ జిక్కవు నీవు
రాసిగొల్లవారి నేల రాఁపులఁ బెట్టేవు ॥ఒక్క॥

కన్నులఁ జూపించుకొని కాఁగిటనె కూడి కూడి
కన్నచోనే మమ్ము నేల కరఁగించేవు
యిన్నిటా శ్రీవేంకటేశ యేలితివి చేఁతలనే
కన్నెలైనవారి నేల కతల ముంచేవు ॥ఒక్క॥ 96

రేకు 718. సామంతం

నీ పొరుగున నుండేది నేరమే మాకు
యీపాటికే సిగ్గులు వాయుట వేతురా ॥పల్లవి॥

వాడుమోముతోఁ దలవంచుకుండఁగా నాతో
యేడనైనా నవ్వవచ్చే వింత గలదా
ఆడేవారి నెరఁగవు అఁటదాననై తేనే
కోడెకాఁడ మాకుఁ గొంత గుట్టు వలదా ॥నీపొ॥

ముదముతోడుత మాపుంగిట నే నుండఁగాను
యిదె నాచే పట్టి తీసే వింత గద్దా
మొదలు దుద యెంచవు మొకము చూచినంతనే
వెదకి పువ్వులఁ గొని వేయవలెనా ॥నీపా॥

మాటలాడ కొకరితో మాయంతనే వుండఁగాను
యేఁటికి మమ్ముఁ బిలిచే వింత గలదా
గాఁటపు శ్రీ వేంకటేశ గ్రక్కునఁ గూడితి నన్ను
వాఁటపు యింకాఁ గొంతవావి చెప్పవలెనా ॥నీపా॥ 97

## ధన్నాశి

అందాఁకాఁ దడవకురే ఆతని మీరు
విందు వెట్టి అలుకలు విడిపించేఁగాక ॥పల్లవి॥
అంతేసిపంతగాని కాడినదే మాటగాక
యెంత మీరు పిలిచినా నేల వచ్చీనే
బంతులనే పూవుటమ్ము బాసట మెక్కినప్పుడు
దొంతులతోనే తా నిందుకు వచ్చీఁగాక ॥అందాఁ॥

చెల్లుబడిగలవాఁడు చేసినదే చేఁతగాక
యెల్లవారు బోదించినా నేల వినీనే
యెల్లగా నాయాడుఁదన మీడేరినపుడే
వెల్లవిరివిన్నపాలు వినుకొనీఁ గాక ॥అందాఁ॥

ఇచ్చకుఁ డైనవాని కిన్నియుఁ దెలుసుఁ గాక
యెచ్చరించి మాపుదాఁకా నేమి సేసేరే
అచ్చపు శ్రీ వేంకటేశుఁ డంత సేసి నన్నుఁ గూడె
మచ్చిక గలదు నేఁడే మన్నించీఁ గాక ॥అందాఁ॥ 98

ఆహిరి

నెలవినవ్వులతోడ సిగ్గయ్యా నాకు
చెలులు చూడగ నింత సేతురా అయ్యా ॥పల్లవి॥

గందము పూసేటివేళ కంటమాల నామెడను
అందముగాఁ బెట్టితివి అవునయ్యా
యిందులోనే నీ సతులు యెవ్వరు చూచినాను
నింద లేమి గట్టుదురో నీ విదేమయ్యా ॥నెల॥

కొప్పు చిక్కుదీసుకొంటా గురుతైనకడియాలు
అప్పటి నాచేతఁ బెట్టే వవునయ్యా
వుప్పటించి నీసతులు వూరకైనాఁ దమవంటా
చొప్పున వత్తురో యేమో చూచుకోవయ్యా ॥నెల॥

పాదాలు గుద్దేటివేళ పచ్చడము నామీఁద
అదిగొని కప్పితివి అవునయ్యా
యీదెస శ్రీ వేంకటేశ యింత సేసి కూడితివి
వాదడిచే నీ సతుల వద్దనవయ్యా ॥నెల॥ 99

శంకరాభరణం

ఎంత చెప్పినా నెఱఁగవు తొలుతనె
శాంతం బయితే సరి గలదా ॥పల్లవి॥

కడవఁ బలకకువె కమ్మర నాతని
బడిఁ బ్రియములు చెప్పకువె మరి
అడరి చేదు దిని అటు దీపు దినఁగ
సడి, యందువలన చవి యేది ॥ఎంత॥

అలిగి రాకుండితే నాతని యింటికిఁ
బిలువఁ బోకువే పెనగొనుచు
పొలసి వేఁడిలోఁ బొరలి యాడుగా
చలువలఁ బొరలిన చవులవునా ॥ఎంత॥

తప్పక చూడకు తగిలి మొక్కకువె
యిప్పుడు శ్రీ వేంకటేశునకు
వొప్పుగఁ గూడితి యువిద లతని కిఁక
చప్పనె కాకిటు చవి వుట్టీనా ॥ఎంత॥ 100

## తెలుఁగుఁగాంబోది

అడుగరే చెలులాల ఆతని మీరు
అడరి యిందుకుఁగానే అరుదయ్యీ నాకు ॥పల్లవి॥

పిలువక తొల్లె వచ్చె ప్రియుఁడు; నేఁడై తేను
బలిమిఁ జెయివట్టినాను పరాకయ్యీని
వలరాజుకై దువుల వాఁడి వోయెనో కాని
పలికినమాటపట్టు పండి కై వాలెనో ॥అడు॥

కంటానే కాఁగిలించేఘనుఁడు నేఁ జెక్కు నొక్కి
అంటినాను బై కొనక అట్టె వున్నాఁడు
జంటలైనవావు లెల్ల సరి నుడివోయనో
రెంటాను జవ్వనములు రేఁగవో యింకాను ॥అడు॥

మాటలాడక తొలుతే మనసిచ్చేయాతఁడు
గాఁటానఁ బలికించఁగ కలసితిమి
యేఁటవెట్టి శ్రీ వేంకటేశుఁ డిట్టె నన్నుఁ గూడె
వాఁటాన మొక్కఁగఁ దానె వర మిచ్చీనో ॥అడు॥ 101

మలహరి

చెప్పరే బుద్ధులు నాకుఁ జెలులాల మిమ్ము
మెప్పించుదాఁకా నుంటి మీఁదిమాట లేఁటివే ॥పల్లవి॥

కన్నులఁ దప్పక చూచి కవకవ నవ్వివాఁడు
చన్నులపై నునుఁ గొంగు జారదియ్య
సన్నపుఁజెమటతోడ సారె నిట్టూర్పులతోడ
మిన్నకె నేనున్నదాన మీఁదిమాట లేఁటివే ॥చెప్ప॥

వూరకే వద్దఁ గూచుండి వొళ్లిమీఁదఁ జెయివేసి
ఖారపుఁదురుము వట్టి భ్రమయించఁగా
ఆరీతికరఁగులతో నట్టె నివ్వెరగులతో
మేర మీరకున్నదాన మీఁది మాట లేఁటివే ॥చెప్ప॥

గక్కన నాచెక్కు నొక్కి కప్పురపుమోవి ఇచ్చి
యెక్కువ శ్రీ వేంకటేశుఁ డిటు గూడఁగా
ముక్కు మీఁది వేలితోడ ముంచి సంతసాలతోడ
మిక్కుటమై వున్నదాన మీఁదిమాట లేఁటివే ॥చెప్ప॥ 102

రేకు 719 దేశాళి

ఎఱఁగవు గాక నీవెదిరిఁ జేసినమేలు
వెఱపేల పొదుగక విడుచునా నిన్నును ॥పల్లవి॥

సుదతి! పతిఁ గోపించి చూచినదోస మెల్ల
మదమై నీచెక్కులఁ జెమట గారీని
చెదర నాతని జంకించినకర్మమునసె పో
నుదుటికాంతుల నెల్లనూఁ గురులై పొదిగె ॥ఎఱఁ॥

అలిగి ఆవలి మోమైనపల్లద మెల్ల
కులిగి చన్నులవేఁగై కూడఁజొచ్చెనే
బలిమి నాతనిఁ జేతఁ బగచాటినపగెల్ల(?)
వెలుచు వాఁడిగోళ్లై బిరుదులు గక్కెను ॥ఎలుఁ॥

కడఁగి శ్రీ వేంకటేశుఁ గడవ నాడినముంపు
వొడికెమై నీపెదవుల నంటెనే
కడు నీ వాతని నిట్టె కలసిన కలయిక
చిడుముడి నీరతి చిత్తమున నిండెనే ॥ఎలుఁ॥ 103

సామంతం

నాఁటికి నేఁటికి మీరె నవ్వరా నన్ను
మేఁటి జవ్వన మింతయై మించెఁగా నాకు ॥పల్లవి॥

చెలుల దూరఁగా నేమి చింతఁ బొరలఁగా నేమి
చెఁగి నామోహ మింత సేసెఁగా నన్ను
బలిమి చూపఁగా నేమి పంతము లాడఁగా నేమి
నిలువునివ్వెరగులు నిండెఁగా నాకు ॥నాఁటి॥

వూరకె వుండఁగా నేమి వుస్సు రనఁగా నేమి
తీరనితమి యిందుకుఁ దెచ్చెఁగా నన్ను
నేరుపరిఁ గాఁగా నేమి నే నెంతైనా నేమి
గారవపుముచ్చటలు గలిగెఁగా నాకు ॥నాఁటి॥

వేసరుకొనఁగా నేమి వేగు రుండఁగా నేమి
రేసునాజవ్వన మింత రేఁచెఁగా నన్ను
ఆసల శ్రీ వేంకటేశుఁ డాతఁ డిట్టె నన్నుఁ గూడె
వాసు లెన్నైనా నేమి వన్నెగా నాకు ॥నాఁటి॥ 104

దేసాళం

ఎరపరికములు నీ వేల మానేవు గుట్టు
అరసి ఆవల నిన్ను నాడుకొనేనా ॥పల్లవి॥

చేముట్టి ఆపెను నీచేతికి నే నిచ్చితేను
నామోము చూచి నీవు నవ్వ నేఁటికి
యేమీ నాయెరుకైతే యేమాయ నీకు నేఁడు
నేమపునీబాసలలో నేర మెంచేనా ॥ఎర॥

ఆకె చేత నీకు నే నాకు మడి చిప్పించితే
చేకొని లోలో నీవే సిగ్గు వడేవు
యీకడ నే నీపనికి నింత దగనైతినా
పైకొని నీపనులు నే బయట వేసేనా ॥ఎర॥

కందువ మి మ్మిద్దరి నేఁ గాఁగిటఁ బట్టి వొత్తితే
సందు సేసుకొని నన్ను సరిఁ గూడేవు
చెంది యీపె వూడిగపుచెలి యింతె యిందు కేమి
నిందలు శ్రీ వేంకటేశ నిన్ను మోపేనా ॥ఎర॥ 105

శంకరాభరణం

నీ విన్నిటా జాణఁడవు నీకుఁ జెప్పేనా
ఆవల నేమి సేసినా నదలించఁ గలనా ॥పల్లవి॥

మంతనాన నీవు నాతో మాటలాడఁగాఁ గదా
చింత లెల్లఁ బాసె నేకచిత్త మాయను
పంతగాఁడవై నీవు పరాకున వుంటేఁ గన
కాంత నింతే నే నిన్నుఁ గాదనఁగఁ గలనా ॥నీవి॥

యిప్పు డిట్టె నీవు మాయింటికి రాఁగాఁ గదా
తప్పు లెల్లఁ దేరి మంచితన మాయను
అప్పటిఁ దొల్లిటి వలె నాడ నీడ నుంచేఁ గన
చప్పనివలపు చల్లి సాదించేనా ॥నీవి॥

చేరి నిన్నుఁ గాఁగిలించి చెక్కునొక్కఁగాఁ గదా
తారుకాణ వచ్చి మేను తనివొందెను
కూరిమి శ్రీవేంకటేశ కూడితి విట్టె కన
మేర మీర యింక నిన్ను మెచ్చకుండఁ గలనా ॥నీవి॥ 106

కన్నడగౌళ

నీవే అప్పటినుండి నిక్కేవు గాని
మోవులు రెండు నెత్తక మూసుకున్న దదివో ॥పల్లవి॥

పట్టినదే వ్రతమా పడఁతితో వాదించేవు
యెట్టకేల కన్నమాట యెగ్గు సేతురా
ముట్టి వచ్చితే నాపెకు మొగమోట దరచు
వొట్టులు సత్యాల కోప కూరకున్న దదివో ॥నీవే॥

ఇంతితోనే పంతమా యెత్తవు వంచినతల
మంతనపుచేఁతలకే మచ్చరించేవు
యెంత నీవు రేఁచినాను ఇచ్చక మాపెగుణము
అంతేసిరట్టు కోపక అణఁగున్న దదివో ॥నీవే॥

చేసినదే నీకు చేఁతా చెనకే వాపెను సారె
పాసినప్పటిచందాలు పాటి సేతురా
ఆసల శ్రీవేంకటేశ ఆపె నిట్టె కూడితివి
మోసములన్నిఁ దీర మొక్కుచున్న దదివో ॥నీవే॥ 107

తెలుఁగుఁగాంబోది

ఆసల నాలో నవె గుబ్బతిలఁగ
దోసము నీకే తరలీఁ జుమ్మీ ॥పల్లవి॥

కామించి నే నిన్నుఁ గలయఁగ వచ్చిన
ప్రేమపుసిగ్గునఁ జెనఁగేవు
వాములైన నావలపులు నీపై
భామరో వడ్డికిఁ బారీఁ జుమ్మీ ॥ ఆస ॥

చిడుముడి నే నినుఁ జెనకుచు నంటిన
వెడగిలిగింతల వీఁగేవు
బడి బడి నాలోపలితలపోఁతలు
తడయక నిను గురిదాఁకీఁ జుమ్మీ ॥ ఆస ॥

కందువ నే నినుఁ గాఁగిట నించిన
మందలించి మై మఱచేవు
యిందునె శ్రీ వేంకటేశుఁడ నే నినుఁ
బొందితి నివి నినుఁ బోనీవు సుమ్మీ ॥ ఆస ॥ 108

రేకు 720. కొండమలహరి

ఇన్నాళ్లు నెఱఁగవైతి వేమీ నీవు
కన్నుసన్న దొరకొంటి కడవారిమీఁదను ॥ పల్లవి॥

చలివాసి నవ్వితివి సతితో నేఁ జూడఁగానే
యెలమి నింతగాలాన కేమీ నీవు
తెలిసె నీమోహమెల్ల తీగెలువారఁ దొడఁగె
కలగఁ(ంపై?)పై నలువంక కన్నవారిమీఁదను ॥ ఇన్నా ॥

బత్తితో మాటాడితివి భామతో నాయింటనే
యిత్తల నెన్నఁడు లేని దేమీ నీవు
చిత్తిణి నీగుణ మెల్ల చిగుళ్లు వెళ్లఁదొడఁగె
అత్తి వసంతవేళ అండవారిమీఁదను ॥ ఇన్నా ॥

తొడపై నిడుకొంటివి తొయ్యలిని నా వొద్దనే
యెడపు శ్రీ వేంకటేశ యేమీ నీవు
కడఁగి నన్నుఁ గూడి నీ కాయమెల్ల ననలెత్తె
అడియాలమై నీమోహపు వారిమీఁదను ॥ ఇన్నా ॥ 109

రీతిగౌళ

నావల్లఁ గడమేది నన్ను మన్నించి యాతఁడు
యీవేళ విచ్చేసినదే యెన్నిక గాక ॥ పల్లవి ॥

తలఁచ నెంతదడవు దవ్వుల నున్న పతినిఁ
బలికించుమంటే వసపడదుగాక
పిలువ నెంతదడవు పేరుకొని యాతని
అలమి చేపట్టుమంటే అందదుగాక ॥ నావ ॥

నవ్వఁగ నెంతదడవు నంటుసేసు కాతని
రవ్వగా బలిమిసేయ రాదుగాక
దువ్వఁగా నెంతదడవు దూరి యాతనిశిరసు
యివ్వల బత్తి గొట్టాన నిడరాదుగాక ॥ నావ ॥

కూడఁగ నెంతదడవు గురిసేసుకాతఁడు (ని?)
వేడుకకు వెలలేక వింతాయఁ గాక
యీడనే శ్రీ వేంకటేశుఁ డింతలో నన్నుఁ గలసె(సి?)
ఆడుకొను సిగ్గువడి అలసేఁ గాక ॥ నావ ॥ 110

## సౌరాష్ట్రం

అప్పటి మానవు వేసా లంతేకాక
చెప్పగలది నీ సేవ సేయుటింతెకాక ॥ పల్లవి ॥

ఆడ నీడ నేర్చుకొన్న ఆనలేల పెట్టేవు
వేడుకకాఁడవు నీతో వెంగె మాడేమా
జాడతో నింతపనికి సరివారమా నీతో
వాడిక నీమన్ననలోవార మింతేకాక ॥ అప్ప ॥

యిచ్చకాలు సేసి నన్ను నేల వొడఁబరచేవు
వచ్చి వచ్చి నీతో నేము వాదువెట్టేమా
నిచ్చ నీ వంతవెరవ నీకంటె నెక్కుడా
వచ్చి వచ్చి నీచేతిలోవార మింతెకాక ॥ అప్ప ॥

నన్నుఁ జూచి నీవప్పటి నవ్వు లేల నవ్వేవు
మిన్నక యేమైనా నీకు మేనవారమా
యెన్నికతో శ్రీవేంకటేశ నన్ను నేలితివి
వన్నెల నీవూడిగేలవార మింతె కాక ॥ అప్ప ॥ 111

## పాడి

తానేల కొసరీనే తరుణి నన్ను
మోనాన నే సరివచ్చే మొక్కల మేది ॥ పల్లవి ॥

పిలిచితే రాఁగానే పెనఁగుతా నున్నాఁడ
యెలమి నాచేఁతలు నే నేమందునే
చలము చెల్లుండఁగాను జంకెనకు లోనైతి
పలుకులఁ దెల్లవారె పంత మేదె ॥ తానే ॥

తగవు నడపఁగానే తన్ను మెచ్చుచున్నాఁడ
అగపడి నావోరు పేమని మెత్తునే
మొగమోట గలిగియు మొరఁగుకు లోనైతి
నగవులే నానఁ జొచ్చె నాలి యేదే ॥ తానే ॥

మంచి నన్నుఁ గూడఁగానే మొక్కతా నేనున్నాఁడ
వంచనకు నాతో యెవ్వరు యీడె
యెంచ కిట్టె శ్రీవేంకటేశుఁడ నేఁ గూడితిని
మంచముపై వావి గూడె మఱఁ గేదే ॥ తానే ॥ 112

సింధురామక్రియ

నే నెంత మంచితనము నెరపినాఁ దనజాడ
మానదుగా అందుకేమి మంచిదయ్యాఁ బదవే ॥ పల్లవి ॥

నవ్వుచు నా రమణుఁడె నా వాఁడై వుండఁగాను
యెవ్వరికోపాలుఁ మమ్ము నేమి నేసీని
యివ్వల నాతఁడు మాయింట నిట్టె వున్నాఁడంటా
దవ్వుల నే మాటాడినఁ దా మాటలాడదు ॥ నేనెం ॥

వోలసి యాతఁడే ముద్దుటుంగర మిచ్చివుండఁగా
వెలుపటఁ దా మేమన్నా వెరపయ్యీనా
చెలఁగి యిప్పుడు నా చెయి మీఁదయి వున్నదంటా
కొలఁది మీరిన తనకుచ్చిత ముడుగదు ॥ నేనెం ॥

కప్పి శ్రీవేంకటేశుఁడు కాఁగిటిలో నుండఁగాను
వుప్పటించితేఁ దామె వుండ నీఁగదే
అప్పటి నెంత చెప్పినా ఆతఁడే నే నంటా
తప్పక వరుసిచ్చినాఁ దనివినే పొందదు ॥ నేనెం ॥ 113

లలిత

నీకు మేలైతేఁ జాలు నేను నీలోనిదాననే
యీకడ నీ వేమన్న నితవయ్యా నాకు ॥పల్లవి॥

బచ్చనకూరిమి చల్లి భ్రమయించేదాననా
పెచ్చురేఁగి యేల ఆన వెట్టు మనేవు
కుచ్చితపునీగుణము గురుతు గంటిఁగా నేఁడు
చెచ్చెర నీ వేమైనాఁ జేయవయ్యా ఇఁకను ॥నీకు॥

మాటల మూటలు గట్టి మచ్చు చల్లేదాననా
నాటకా లనుచు నేల నవ్వు నవ్వేవు
మాటుకుఁ బోయి రాఁగా నీమహిమెల్లఁ దెలిసెఁగా
చీటికి మాటికి నీచిత్తమయ్యా ఇఁకను ॥నీకు॥

కన్నుల సన్నలు చేసి కాఁక రేఁచేదాననా
చిన్ననంటా నన్ను నేల చిమ్మిరేఁచేవు
యిన్నిటా శ్రీ వేంకటేశ యెరిఁగి కూడితి విట్టె
మున్నిటి నీదయ నాపై ముంచవయ్యా ఇంకను ॥నీకు॥ 114

రేకు 721. సింధురామక్రియ

ఇంతి తాఁ జేసుకొన్న వే యిన్నియుఁ దొల్లి
చెంతల నేఁ డాపెఁ జేరి చిత్తగించె నిదివో ॥పల్లవి॥

పొలఁతి నిన్ను మొగ్గలఁ బూజ సేసెఁగాన తొల్లి
పులకమొగ్గలు మేనఁ బొదవె నేఁడు
చెలఁగి నీలాల నీపై సేస వెట్టెఁగాన నేఁడు
నిలువున దిగజారి నెరు లున్నవి ॥ఇంతి॥

వనిత పన్నీట నీపై వసంతము చల్లేఁగాన
 అనుఁగుఁ జెమటలపాలాయ నిపుడు
 మునుప నిన్నింత ఆపె ముట్ట వలపించెఁగాన
 పనివడి నేఁడు నీపై భ్రమ నున్నది ॥ఇంతి॥

కాఁగిట నిన్నాపె దొల్లి కడుఁ గరఁగించెఁగాన
 చేఁగదేర విరహానఁ జిక్కె మేనెల్లా
 వీఁగక కూడితివి శ్రీవేంకటేశ సతి నిట్టే
 మూఁగినసంతోషములు మొదలుకొనినవి ॥ఇంతు॥ 115

ఆహిరి

ఏమిటికి నిన్ను దూర నైంతైనను
 యేమరము మాగుట్టు యేమైనను ॥పల్లవి॥

మచ్చికలు చల్లి చల్లి మాటఁదొంతర వెట్టి
 యిచ్చకము లాడేమా యెంతైనను
 కొచ్చి కొచ్చి మా గంభీరగుణ మింక విడిచేమా
 యెచ్చి నీవు పదరితే నెంతైనను ॥ఏమి॥

సంతవాపు లటు చెప్పి సారెకును నవ్వు నవ్వి
 యింతలోనే పైకొనేమా యెంతైనను
 వింతదైన్యములు చూపి విరహము గనమంటా
 యింతులచేఁ జెప్పించేమా యెంతైనను ॥ఏమి॥

చెక్కులు నొక్కి నిన్నుఁ జేరి రతి నలయించి
 యిక్కువకు లోఁగేమా యెంతైనను
 గక్కన శ్రీవేంకటేశ కలసితి విటు నన్ను
 యెక్కడ నీకు వెలితి యెంతైనను ॥ఏమి॥ 116

కేదారగౌళ

ఊరకున్నాఁడ వదేమి వొకటి నౌఁగాదనవు
కోరితి నిన్నే సాకిరి కొంచకువయ్యా ॥ పల్లవి ॥

బచ్చనలు వచరించి బలిమి నే నీపొందు
నిచ్చఁ జేసితి వ(న?) నేరు నిజమా యిది
పచ్చిగా నీ సేరుపులు పైపై నే మెచ్చినది
గచ్చులకు ననేరు కలదా యిది ॥ ఊర ॥

కన్నులఁ గాఁకలు చల్లి కడు నిన్ను భ్రమయించి
అన్నిటా మీరితి ననే రవుసా యిది
మొన్నటనుండి నీమోము చూచి రమ్మంటా
సన్న సేసితి ననేరు సమ్మతా యిది ॥ ఊర ॥

కందువల నిన్నుఁ గూడి కమ్మటిఁ గొసరేనంటా
యిందరు ననేరు నీ కితవా యిది
అందపు శ్రీ వేంకటేశ అప్పటి నన్నుఁ గూడితి -
విందు నాగోరితాఁకు నీ కెరుకాయనో ॥ ఊర ॥ 117

నీలాంబరి

ఆఁటదాన మోదలనే అంతదంటనా
యేఁటికి నవ్వేవు నిన్ను యే మనఁగఁగలను ॥ పల్లవి ॥

మంతనము లాడఁగానే మాటలు నమి (మ్మి?)తిఁ గాని
యింత సేతువని నే నెరఁగఁ దొల్లి
బంతికిఁ బిలువఁగానే భ్రమసి వచ్చితిఁ గాని
వింత నీబుద్ధులెల్లాను వినఁ దొల్లి ॥ ఆఁట ॥

బగి వాయకుండఁగానే పట్టి పెనఁగితిఁ గాని
 తెగనినీజోలి యాట తెలియఁ దొల్లి
మొగము చూడఁగ నీముందరనే వుంటిఁ గాని
 వెగటైననీగుణము విచారించఁ దొల్లి ॥ ఆఁట ॥

చెయి వట్టి తియ్యఁగానే సిగ్గున నే నుంటిఁ గాని
 నయగారా లివి చూడ నాలోనఁ దొల్లి
దయతో శ్రీవేంకటేశ తగ మన్నించితి విట్టె
 నియతాన నెదురాడ నీతోఁ దొల్లి ॥ ఆఁట ॥ 118

అమరసింధు

ఇంతేకా నీజాణతన మెన్నాళ్ళకు
 కాంతుఁడ నీగుణమెల్లఁ గంటిమి యిన్నాళ్లకు ॥ పల్లవి ॥

మెల్లనె యేకతాన నే మేనవావి చెప్పితేను
 చల్లి చల్లి వూర నెల్లఁ జాటేవు
గొల్లజాణతన మెల్ల కోరి నీయందే కంటి
 పెల్లుగాఁ బదారువేల పెండ్లిట్లా నాడితివో ॥ ఇంతే ॥

కందువలు చూపి నీకుఁ గనుసన్న సేసితేను
 అంది బెట్టిమాటల నేల అడిగేవు
పొంది పేయలఁ గాచిన బుద్ధి నీకు నేల పోవు
 యిందునే పాండవులు ని న్నేల పూజసేసిరో ॥ ఇంతే ॥

గరిమె శ్రీవేంకటేశ కాఁగిట నేఁ బట్టితేను
 కెరలి నాకెంతో నీవు కిందుపడేవు
పెరిగినరేపల్లెవారు దెల్లఁ గానవచ్చె
 పురుషోత్తముఁడ వని పొగడేరు జనులు ॥ ఇంతే ॥ 119

సామవరాళి

ఇంకా నాకే పాటువడే వింత సేసినా నీవు
 తెంకినే యూనెఁ (నెం?)జెరివి తీరుట యన్నఁడురా ॥పల్లవి॥

వెంగెములే యాడి యాడి వేడుక నీసుద్దులెల్ల
 అంగడిఁ బెట్టితి నింత అయ్యో నేను
 చంగనిపాపజాతిని సారె నీవు మొక్కఁగాను
 వుంగిటిగోనఁ దిట్టితి వూరకే నిన్నును ॥ఇంకా॥

చేతులు చాఁచి చాఁచి చేరి నీతో వాదడిచి
 ఆతలఁ బంగించితిగా అయ్యో నిన్ను
 నీతిలేనిమంకుదాన నీవు చెప్పినపనులు
 తోతోయ నీపాదమునఁ దోసితిఁగా నేను ॥ఇంకా॥

తెరకొనఁ జూచి చూచి తియ్యని నీమోవెల్ల
 ఆరయఁ బచ్చి సేసితి నయ్యో నేను
 కూరిమి శ్రీవేంకటేశ కూడితివి నన్ను నిట్టె
 నేరుపు చెల్లించుకొంటి నీతోడ నిపుడు ॥ఇంకా॥ 120

రేకు 722. సాళంగనాట

నాలికాఁడ నీవు నాతో నవ్వులేలరా నీ-
 వేలిసన్నలకే నేను వెర గౌదునటరా ॥పల్లవి॥

తత్తరించి నే నిన్ను తగులనాడినమాట-
 కుత్తర మియ్యక యేరా వున్నాఁడవు
 కొత్తవారిఁ బాఁతవారిఁ గూడకట్టి నీవు వట్టి-
 పొత్తు గలసితే నిన్నుఁ బోనిత్తునటరా ॥నాలి॥

కొసరి కొసరి నీగురుతు చూచేమంటే
ముసుఁగు వెట్టుక యేరా మోము చూడవు
వెసఁ దీపు పులుసును వేరేవొక్కటిలోఁ బెట్టి
యెస రెత్తుకున్నాఁడవు యెరఁగ నే నటరా ॥ నాలి ॥

ముందర వెనక నీకు మొక్కులు నే మొక్కఁగాను
గొందినే నీ వది యేరా గుట్టు సేసేవు
అందుక శ్రీ వేంకటేశ అట్టె నన్నుఁ గూడితివి
పందెమాడి [1] నియ్యానకు భ్రమసితి నటరా ॥ నాలి ॥ 121

వరాళి

నిన్నే మీఁ బలుకనైతి నీకుఁ జాలదా
యిన్నేసి నీచేఁతలకు నిది చాలదా ॥ పల్లవి ॥

వచ్చినప్పుడె నిన్ను వద్దఁ గూచుండఁ బెట్టుక
యిచ్చకము లాడితిని యిది చాలదా
మెచ్చుగా నీ వప్పటి నీమేడమీఁది కెక్కఁగాను
వచ్చితి నీవెంటవెంట వడి నింత చాలదా ॥ నిన్నే ॥

జలకము లాడఁగాను చలియెల్లఁ బాపితిని
యెలయింపునవ్వులనే యిది చాలదా
వెలయ నీ వారగించేవేళ పొత్తుకు వచ్చి
అలుగక జాణతనా లాడితిని చాలదా ॥ నిన్నే ॥

పవళించి వుండఁగా నీపాదములు గుద్దిగుద్ది
యివల నీమాట వింటి నిది చాలదా
తవిలి శ్రీ వేంకటేశ తటి నన్నుఁ గూడితివి
వివరించి రతు లిఁక వేడుకొంటిఁ జాలదా ॥ నిన్నే ॥ 122

---

1. నీ + అనకు.

శంకరాభరణం

ఇంకా నీయాస లేలయ్యా
సంకె దీరె నీకు సట లేలయ్యా ॥ పల్లవి ॥

చెలఁగుచు నీకిదె చేతుల మొక్కే
వలవనిజగడము వద్దయ్యా
పిలిచెను నిన్నాపె పేరు నే వినఁగా
తల తల నన్నింకఁ దడవకువయ్యా ॥ ఇంకా ॥

కడు నీవాకిటఁ గాచుకవుండే
వడిఁబడె వలపులు వద్దయ్యా
యెడయక కాచుక యీపె వుండఁగా
నడువక నాతో నవ్వకువయ్యా ॥ ఇంకా ॥

అంకెల నీకిఁక అడ్డము లాడను
వంక లొత్తు నీకు వద్దయ్యా
కంకిగ శ్రీవేంకటపతి! కూడితి
కొంకు దేరితిని కొసరకువయ్యా ॥ ఇంకా ॥ 123

రీతిగౌళ

దోస మేల కట్టుకొనీ తోడనె తాను
వీసమంత పనికిఁగా వేసరించేనా ॥ పల్లవి ॥

మారునమ్మ్మ లేడ నామనసేడ నాటఁ జొచ్చె
యీరీతిపనులకు యెదురా నేను
గోరఁ బొయ్యేదానికిఁగా గొడ్డలేల రమణుఁడు
ఆరసి యడుగనేల అవుఁ గాదనేనా ॥ దోస ॥

వెన్నెలల యెండ లెంత వీరిడినా దేహ మెంత
యిన్నేసిపాట్ల కెల్ల యెదురా నేను
వెన్న నున్నగా నూర వేస నుక్కుగుండ్లల
నన్నుఁ దా నేమి సేసినా సాలిఁ బెట్టేనా ॥దోస॥

చల్లగాలివిస మెంత జవ్వనపు పాయ మెంత
యిల్లిదే యీ విరహాన కెదురా నేను
బల్లిదుఁడై శ్రీ వేంకటపతి నన్ను నిదె కూడె
చెల్లునంటా మన్నించి చేకొనకుండేనా ॥దోస॥ 124

కన్నడగౌళ

అలయించకురే నన్ను నండనున్న చెలులాల
చెలువుఁ డీడకుఁ దా విచ్చేసుదాఁకాను ॥పల్లవి॥

మన సెక్కడనో వుంది మాటలఁ బెట్టకురే
ఘనుఁడు నా రమణునిఁ గన్నదాఁకాను
తను వెక్కడనో వుంది దగ్గరి పిసుకకురే
గొనకొని యాతఁడు నేఁ గూడుదాఁకాను ॥అల॥

నగ వెక్కడనో వుంది నను వేగిరించకురే
మొగి నాతని నాచెయి మోచుదాఁకాను
పగ లెక్కడనో వుంది బలిమి సేయకురే
జిగి నాతఁడు నా చేతఁ జిక్కుదాఁకాను ॥అల॥

పాయ మెక్కడనో వుంది భ్రమలఁ బెట్టుకురే
యీయెడ నాతఁడు మంచ మెక్కుదాఁకాను
పాయక శ్రీ వేంకటాద్రిపతి నన్ను నిటు గూడె
మోయనాడకురే వీని మొక్కించుదాఁకాను ॥అల॥ 125

ముఖారి

ఇంతితో సరిఁ బెనఁగే వేమయ్యా
పంతముతో ఆపె నిట్టే పలికించఁ గలవా ॥పల్లవి॥

సెలవినే లోలోన చెలి యిట్టె నవ్వఁగాను
యేఁమి నీవూ నవ్వే వేమయ్యా
కులికి యిందుకు నాపె కోపగించుకొంటేఁగన
వెలికి లోనికి వచ్చి వేఁడుకొనఁ గలవా ॥ఇంతి॥

నిమ్మపంటఁ గొని యాపె నీమీఁద వేయఁగాను
యెమ్మెలకు నీవు వేసే వేమయ్యా
కమ్మి యాపెమేనుఁ దాఁకి కంది నొచ్చితేఁ గనక
దిమ్ముల నీ వానొప్పి తీరుచఁగఁ గలవా ॥ఇంతి॥

గట్టిగా ఆపె నిన్ను కాఁగిట బిగించఁగాను
యిట్టె నీవూ బిగియించే వేమయ్యా
నెట్టన శ్రీ వేంకటేశ నిన్ను నాపె గూడె నిదే
మెట్టుక యాపెను నీవు మెప్పించఁ గలవా ॥ఇంతి॥ 126

రేకు 723. పాడి

తనలోనే తనమాట తగు మామాట మాలోనే
కనుఁగొను టింతెకాక కాఁతాళించఁ జెల్లునా ॥పల్లవి॥

వేసరి యాడినమాట విని వాదులకు వచ్చి
పోసరించ[1]దేమి పొద్దువోదటే తాను
పూస గుచ్చినట్టు తనపురుషుని నను(గాక
యాసుల సవతులతో నింత చెల్లునా ॥తన॥

---

1. పోసరించి+అదేమి

చింతతో నే నుండఁ జూచి చేరి గరసించ వచ్చీ
యెంతలేదు తనకు నా కేమి వోదే
అంతబత్తి గలితే తా నాతనిఁ గొసరుఁ గాక
పంతగత్తెలకు నింతపని గలదా ॥తన॥

నవ్వు నవ్వఁగా మమ్ము నమ్మి కిట్టే సోదించీ
యెవ్వరు మెత్తురు తన కిది యేలే
యివ్వల శ్రీ వేంకటేశుఁ డింతలోనే నన్నుఁగూడె
రవ్వగా నక్కచెల్లెం(డ్రు రాయడింతురా ॥తన॥ 127

ఆహిరి

కటకటా యిది యేమే కడదానవా
ఘటనల నీకేల కడుగోలతనము ॥పల్లవి॥

తప్పక చూచినచూపు దగ్గరి వచ్చినరాక
యిప్పుడే యెఱఁగించవే యింతి నాతోను
అప్పుడే సిగ్గువడితి వాయము సోఁకితే నిఁక
చెప్పనేల నీలోని చిడుముడి తనము ॥కట॥

పుక్కిటపూచినమాట పొందఁ గూచున్న వునికి
తక్కక సూచించఁగదే తరుణిరో
చిక్కి యిందుకే లోఁగి చెయిఁజేయి గదిసితే
యెక్కడిదే ధైర్యము యెం(యిం)త సాదుఁదనము ॥కట॥

కందువఁ జూపినసన్న కాఁగిటఁ బట్టినపట్టు
మందలించఁగదే యిఁక మగువరో
విందువలెఁ గూడితి శ్రీ వేంకటేశుఁ డను నన్ను
దిందుపడె నీకు నిట్టె తేరి జాణతనము ॥కట॥ 128

బౌళి

కూచుండు మింతట నీకోరికె కొనలుసాగె
తాచి యిపుడైన మాపై దయ వుట్టెనా ॥ పల్లవి ॥

చెక్కు నొక్కి నిన్ను నింత సేదదేరుచక వుంటే
తెక్కుల నా మోము చూచి తిట్టకుండేవా
ముక్కుననే వుండె నీకు ముంగోప మప్పుడైతే
చక్కనిమన సింతటఁ జల్లనాయను ॥ కూచుం ॥

నగి సరసము లాడి నమ్మఁజాలక వుంటే
జిగి నిందరితో రట్టు సేయకుండేవా
జగడాలే నోట నుండె సరిబేసి కపుడైతే
నిగిడి యింతట నీకు నెమ్మదాయనా ॥ కూచుం ॥

కందువ నీచేయి వట్టి కాఁగిట నేఁ గూడకుంటే
నిందలు మామీఁద నీవు నించకుండేవా
విందుల నా సొమ్మయితే శ్రీ వేంకటేశుఁడను నేను
సందడి మామచ్చికలు చవులాయనా ॥ కూచుం ॥ 129

హిందోళవసంతం

నీవే యెరిఁగే వన్నియు నే నాడఁగ నేల
కామిం(విం?)చి యిప్పట నుండి కతలేలా ॥ పల్లవి ॥

మొదల నీయింటిలోన మూలనుండితేఁ జాలు
పదిమారులును నీతోఁ బంత మేల
పెదవు లెత్తక నాలో బింకాన నుంటేఁ జాలు
వదలక యెడలేనివాదు లేల ॥ నీవే ॥

పయ్యద గప్పుక వొద్దఁ బవ్వళించి వుంటేఁ జాలు
చయ్యన మా కంత నిన్ను సాదించనేల
నెయ్యానఁ దలవంచుక నిక్కి చూడకున్నఁ జాలు
అయ్యో నిన్ను మట్టు పెట్ట నంతయేల ॥నీవే॥

వేవరు నిన్ను నేను వేఁడుకోకుంటేఁ జాలు
చేముట్టి నీకిట్టె బుద్ధి చెప్పనేల
యీమేర శ్రీవేంకటేశ యిదె నన్నుఁ గూడితివి
నామనసు వచ్చె నీతో నవ్వనేల ॥నీవే॥ 130

## మధ్యమావతి

ఏలే మా ముందరనే యింత సేసే వింతెకాక
మీలోనే మీరైతే మెచ్చే కాదా ॥పల్లవి॥

ముసుఁగు దీసి నీమోము చూచి నవ్వెనంటా
కొసరి యాతని నేల కోపగించేవే
వసమై తనకు నీవు వదినె వంటాఁ గాక
యెసఁగి వింత వాఁడైతే నింత సేసీనా ॥ఏలే॥

పయ్యదకొంగు వట్టి బలిమిఁ బెనఁగెనంటా
నెయ్యాన నాతని కేల నింద వేసేవే
వొయ్యనె యిద్దరికిని వొక్కకోలమంటాఁ గాక
చెయ్యార మారుజాతైతే చెనక వచ్చీనా ॥ఏలే॥

ముందు గాఁగిలించి పట్టి మోవి గంటి సేసెనంటా
అందపు శ్రీవేంకటేశు నాన వెట్టేవు
చందాన నాతఁడు గూడె చనవు గద్దంటాఁ గాక
యిందరిని నీవలె నింత మెచ్చీనా ॥ఏలే॥ 131

శంకరాభరణం

మొన్నటిచేతకు మొక్కేనయ్యా
చన్ను మొనలు నిను సాదించీనా ॥ పల్లవి ॥

పాసి వుండి నినుఁ బలికినపలుకులు
మోసదీర నిదె మొక్కేనయ్యా
నీసరివారము నే మావలపులు
దోస మెఱఁగక తొడరీఁగాక ॥ మొన్న ॥

అక్కడ నీతో నలిగిన యలుకకు
ముక్కుమోవ నిదె మొక్కేనయ్యా
నెక్కొని నీ వెంత నే నెంత వయసే
పెక్కుగర్వములఁ బెంచీఁ గాక ॥ మొన్న ॥

పనివడి నీకొంగు వట్టినయందుకు
మునుప నే నిటు మొక్కేనయ్యా
యెనసితి శ్రీవేంకటేశ నన్ను నిదె
మనసే నీరతి మఱఁగీఁ గాక ॥ మొన్న ॥ 132

రేకు 724 దేశాక్షి

నీవు మంచివాఁడవే నిన్ను నాడఁ బోటు లేదు
వావిరి నీవద్దివారివాస నంటఁబోలును ॥ పల్లవి ॥

నీకంటె ముందర లేచి నీమోము చూచితిని
వాకుదోసాల నేఁటికి వాదు వచ్చెనో
ఆకడ నీ వెవ్వతెమో మటు చూచితివో దాని-
కాకగిగుణము లిందుఁ గలయఁగఁబోలును ॥ నీవు ॥

మంచివేళగాఁ జూచి మరి నీతో మాటాడితి
ఇంచుక నీ కిది వెంగె మేలాయనో
వంచి నీవద్ది కెవ్వతె వచ్చినభాగ్యమో దాని -
చంచలపుఁదన మిందు సరి చూపఁబోలును ॥ నీవు ॥

పొంతనా లిద్దరికిని పొసఁగఁ జూచి కూడితి -
నింతట శ్రీ వేంకటేశ యేమ నుంటివో
పొంతల నెవ్వతె నీకిబుద్ధులు చెప్పెనో దాని -
అంతటనేరుపులు నిన్నంటుకొనఁబోలును ॥ నీవు ॥ 133

శ్రీరాగం

అల్లదివో చేత నీకు నప్పగించితి
వల్లెవాటుతోడ నింతవలలఁ బెట్టేదా ॥ పల్లవి ॥

నిన్నుఁ బాసి విరహాన నెగులుతో నున్నసతిఁ
గన్నులఁ జూచి యేమి గట్టుకొంటివి
యెన్నిక రాజసము నీ కెంతగలిగిన భూమిఁ
బన్నినయాఁడువారిపైనే చూపేదా ॥ అల్ల ॥

పాయము నీకు మీఁదెత్తి పడఁతి వుండఁగ నీవు
చాయ సేసుకొని యం (యెం?) త జాణవై తివి
ఆయలే బిరుదుబంటవై మెరసినదెల్ల
రాయడి యింతుల నింత రవ్వసేసేదా ॥ అల్ల ॥

పిలిచేటినీమీఁది ప్రేమము గలయింతికిఁ
బలుకక యిప్పు డెంతపని సేసితి
నిలిచి శ్రీ వేంకటేశ నేఁడె యాపెఁ గూడితివి
వలచినవారికే వసమయ్యేదా ॥ అల్ల ॥ 134

సామంతం

ఇందులో నేనూ నొక్కతె నెంత లేదు
సందడివేళఁపు నాపైఁ జల్లఁగా నేమాయను ॥ పల్లవి ॥

యెంత నీ వాదరించినా నెగసక్కెమోఁ గాని
అంతరంగమున నిజమని పట్టదు
యింతుల నందరిని నీ విట్టె నమ్మించేది
సంతతము నలవాటు సారె నీకుఁ గలదు ॥ ఇందు ॥

సరసము నీ వాడితే జగడమై తోఁచుఁ గాని
కరుణించేవని యిచ్చకము వుట్టదు
తరుణుల కిందరికి తమి యిట్టె రేఁచేది
సరికి బేసికి నీకు సహజమే యెపుడు ॥ ఇందు ॥

గక్కన శ్రీ వేంకటేశ కాఁగిట నన్నుఁ గూడితి-
వక్కరతో నాకు నిది యరుదు గాదు
అక్కడ నెందైన నీకు నతివలఁ గూడేది
తొక్కి నీకఁ(?)దొల్లే వెన్నతోఁ బెట్టిన గుణము ॥ ఇందు ॥135

మాళవిగౌళ

ఇట్టె మాగుణవు లా నించుకంతా నెరఁగఁడు
పట్టినపంతమే కాక బతిమాలేమా ॥ పల్లవి ॥

తగులువిరిమోహాల తా నేడ నే నేడ
నగుతాఁ దనతో నేను నంటు సేసేనా
మగవాఁడు మన్నించితే మగువల మింతే నేము
మొగి విచ్చి తనకు నే మొక్కవచ్చేనా ॥ ఇట్టె ॥

దవ్వుల జాణతనాలు తన కేవి నా కేవి
పువ్వులవాట్లఁ దన్నుఁ బూజ సేసేనా
చివ్వన రమణునితో సిగ్గుగల ప్రియురాల -
నవ్వులఁ దా నేమనినా నౌఁగాదనేనా ॥ఇట్టె॥

తతి శ్రీ వేంకటేశుఁడు (ని?) తమి యెంత నే నెంత
రతికి విచ్చేయఁగాను రాకుమనేనా
యితవైనవాఁడు దాను యిచ్చకురాలను నేను
చతురుఁడై నన్నుఁ గూడె చాలుననేనా ॥ఇట్టె॥ 136

రామక్రియ

పట్టినప్పుడె నీకు పంత మెక్కెను
ముట్టినదే ముయ్యాయ మొక్కు లేఁటి కయ్యా ॥పల్లవి॥

సెలవి నవ్వులే వచ్చీ చేసన్న నీవు సేయఁగా
పలుకఁబోతే నామాట పచ్చిదోఁచీని
చెలులమోము చూచితే సిగ్గులును నొక్కవెద
వెలలేదు వేడుకకు వేగిర మేలయ్యా ॥పట్టి॥

చెమటే చెక్కులఁ గారీ చేత నీవు ముట్టఁగాను
గుమితాన నుంటేఁ బ్రేమ గుండె వట్టీని
తమక మందుకుఁదోడు తరవాయ నొక్కవెద
కొమరాఁక (?) కేది మేర కూచుండవయ్యా ॥పట్టి॥

కాయమెల్లా మరపయ్యా కాఁగిట నీవు గూడఁగ
నీయండఁ గూచుండేనంటే నివ్వెర గయ్యా
పాయక శ్రీ వేంకటేశ భావరతు లొక వెద
సేయింపులె నాయింపులు నెమ్మది నుందమయ్యా ॥పట్టి॥ 137

లలిత

నానాఁడు నిన్నుఁ దగిలే నాకే కాక
యేనుఁగుతో యేలాటాలు యెవ్వరి కేలోయి ॥పల్లవి॥

యెలుఁ గెత్తి పిలువఁగ నేమి సేసేవోయి నీవు
అలరి న కంటెఁ జుట్టా లాడ నున్నారా
వలపు మురుగఁ బెట్టి వట్టిగడ్డలు వేసితే
యెలమి నాకడివారి కేమి జాఁతి వోయి ॥నానాఁ॥

చేయి వట్టి తియ్యఁగాను చెంగి దిక్కులు చూచేవు
యేయడ నిన్నేలినవా రింక నున్నారా
పాయము ముంగిట వేసి పరుల కేఁకరితేను
చాయల వింతవారికి సద్ద యేఁటి కోయి ॥నానా॥

కాఁగిట నిన్నుఁ గూడితే గక్కనను భ్రమసేవు
వీఁగక నిన్నింతసేయ వేరే వున్నారా
మాఁగినమోవి చూపి మచ్చులు వేసితేను
పాఁగిన శ్రీవేంకటేశ పదరేరా వోయి ॥నానాఁ॥ 138

రేకు 725 భైరవి

ఊరకే నీవలలఁ జిక్కున్న దానను
తేరకొన నాపాలికి దిక్కు నీవే సుమ్మీ ॥పల్లవి॥

నీవు విచ్చేసినదాఁకా నేఁ జింతించితిఁ గాని
పూవువలెఁ బట్టి నిన్ను భోగించ నేర
వేవేలుఁ జెలులచేత విన్నవింపించితిఁ గాని
కావిరి నిన్ను సాదించి కట్టుకొనే దేదో ॥ఊర॥

నీమాట విన్నదాఁకా నే వేగిరించితిఁ గాని
దోమటి చే చాఁచి నిన్నుఁ దొడుక లేదు
వోముచుఁ బైకొని నీ వొద్దికి వచ్చితిఁ గాని
ఆ మీఁదటిపను లడిగే దేదో ॥ ఊర ॥

గక్కున నిన్నుఁగూడి కన్నుల వవ్వితిఁ గాని
తక్కక నీయాస లేమి దప్పించనైతి
వొక్కటైతి మిద్దరము వొరసి శ్రీ వేంకటేశ
మిక్కిలి నిన్ను మెప్పించి మెరసే దేదో ॥ ఊర ॥ 139

నాదరామక్రియ

ఎక్కడివలపు చల్లే వేమీ నీవు
చెక్కిట నున్నచేయి చెప్పఁగదవయ్యా ॥ పల్లవి ॥

వెన్నెలరాతిరులలో వేడుక లాడితిమంటా
యెన్నటిసుద్దులు చెప్పే వేమీ నీవు
నిన్న మొన్నఁ గానము నీ వెవ్వరు నే నెవ్వరు
అన్నియునుఁ జాఁతమర పాయఁగదవయ్యా ॥ ఎక్క ॥

భావమరఁదల మంటా పట్టపగ లేడనైన
యేవూరివావులు చెప్పే వేమీ నీవు
నీవు దొరవైతివి నిజ మేది కల్ల యేది
కావరా లన్నియుఁ దొంటి కత లాయనయ్యా ॥ ఎక్క ॥

వోడక చంద్రవంకలు వున్న వెక్కడనో యంటా
యేడ గురుతులు చెప్పే వేమీ నీవు
కూడితి శ్రీ వేంకటేశ గొబ్బన నిట్ల నన్ను
జాడ లిన్నాళ్లకు నేఁడు చవులాయ నయ్యా ॥ ఎక్క ॥ 140

రామక్రియ

నీజాణతనములు నే నెరఁగమా
రాజనంటా నేల మము రవ్వ సేసేవు ॥పల్లవి॥

చేరఁడేసికన్నులతో చేరి నిన్నుఁ జూడఁగాను
దార దప్పెనంటా నేల తప్పు వట్టేవు
బారెఁడు నెరులతో నీపాదాలకు మొక్కఁగాను
కోరి మమ్ము నేల నీవు కొంగువట్టేవు ॥నీజా॥

జుట్టెఁడేసిపాదాల నీచోటికి యెదురు రాఁగా
యిట్టివే తామరలంటా నేల పోల్చేవు
పట్టెఁడేసికుచముల బలిమి ని న్నానుకొంటే
కొట్టగొన వాండ్లంటా గోర సేసేవు ॥నీజా॥

వేలిఁడేసిగోళ్లతో నెసఁ గొప్పు నే దువ్వితే
నాలితో భ్రమసి యాల నవ్వు నవ్వేవు
యీ లీల శ్రీ వేంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
మే లనుచు మమ్ము నేల మెచ్చ వచ్చేవు ॥నీజా॥ 141

సాళంగం

నీకే అరుదు గాని నే మెరుఁగుదు మన్నియు
ఆకడ నంగడిఁ బెట్టి అమ్మరాదా ॥పల్లవి॥

పంచమవేదము నీకు పడఁతిమాట లెల్ల
సంచుల నెవరిమాట చవులయ్యీని
యెంచి సారె సారె నవె యేల మాతోఁ జెప్పేవు
కొంచక నీవే పాటము గొనరాదా ॥నీకే॥

కుందనపుఁబోడి నీకు కొమ్మసేసేప్రియములు
అందరుఁ జేసినవెల్ల అందుకు నీడా
చెంది మాతో నేల కొండసేసి చెప్పే వవి నీవే
బిందెఁ బోసుకొని నెత్తిఁ బెట్టుకోఁగాదా ॥నీకే॥

చక్కెరబొమ్మ సతి శ్రీ వేంకటేశుఁడ
యెక్కడఁ గన్నవారెల్ల యితవయ్యేరా
మిక్కిలి నన్నుఁ గూడి మెచ్చే వాపె నిఁక నీవు
తక్కక మూలలఁ బెట్టి దాఁచఁగాదా ॥నీకే॥ 142

తెలుఁగుఁ గాంబోది

అప్పటి నా తామక మట్టుండెఁ గాక మరి
నెప్పున నీవల్లను నేర మేమున్నది ॥పల్లవి॥

కొనమొద లెరఁగక కోపగించుకొంటిఁ గాక
ననిచి నీతో నే నవ్వవలదా
పనిమాలి వూరకే పంతము లాడితిఁ గాక
మునుప నీపాదాలకు మొక్కవలదా ॥అప్ప॥

దయ లేక నే నిన్ను తక్కక తిట్టితిఁ గాక
రయమున నిన్నట్టే రమ్మనవద్దా
క్రియ యెరఁగక నిన్ను కేలు వట్టుకొంటిఁ గాక
ప్రియాన నీసేవ చేసి బెరయఁగవలదా ॥అప్ప॥

కన్నులకాఁక నిన్నుఁ కడు జంకించితిఁ గాక
యిన్నిటా శ్రీ వేంకటేశ యిటు నన్నుఁ గూడితివి
వున్నతి నిన్నుఁ బొగడి వుండవలదా
నిన్ను నన్ను నెంచుకొని నిండు కుండవలదా ॥అప్ప॥ 143

శంకరాభరణం

అన్నిటా నీకుఁ బుణ్య మయ్యీఁగాని
మన్నించి నాతాపము మానుపరాదా ॥ పల్లవి ॥

తలపోఁత ఘనమాయ తత్తర మాఁపఁగరాదు
అలిగి నీతోఁ బాసినప్పటనుండి
పలికితి నీతోను పంతము లిచ్చితి నీకు
మలసిననావెద మానుపరాదా ॥ అన్ని ॥

కూచుండ సయించరాదు గుట్టున నుండఁగరాదు
ఆచాయ మారుమోమయినప్పటనుండి
చేచేత వద్ద నుండాన చేతు లెత్తి మొక్కితిని
కాచుకొని నన్నుఁ గరుణించరాదా ॥ అన్ని ॥

చెప్పరాదు విరహము సిగ్గులు బాయిటఁ బడె
అప్పసము వాదడిచినప్పటనుండి
ముప్పిరి శ్రీ వేంకటేశ ముంచి నన్నుఁ గూడితివి
దప్పిదేర నిఁక నన్ను దయఁ జూడరాదా ॥ అన్ని ॥ 144

రేకు 726. ఆహిరి

నెలఁతజీవనానకు నీవే మందు
చెలిమోహపువిభుఁడ చేకొనవయ్యా ॥ పల్లవి ॥

సతిమేనిచిత్తజబాసటము మానుప మాటు
తతితో నీయధరామృతము మందు
సతతము చందురునిశాఖాశైత్యము మాన
రతివేళ తాంబూలరసము మందు ॥ నెల ॥

కాంత కెత్తినవాయువుకసరు మానుప మాటు
మంతనాన సరసపుమాటలే మందు
రంతు కెక్క విరహతాపము మాన
కాంతుల నీసోయగపుకనుచూపే మందు ॥ నెల ॥

అంగనకు కర్పూరపారటము మాన మాటు
కంగులేనియిప్పటినీకాఁగిలే మందు
సంగతి శ్రీ వేంకటేశ సతి నీవుఁ గూడితివి
చెంగటిమరపులకు చెనకులే మందు ॥ నెల ॥ 145

ముఖారి

చెప్పరాదు మాయాస చేటలకొలఁదు లాయ
ముప్పిరిఁ జూచితి విఁక మోహమెంతో కాని ॥ పల్లవి ॥

చెప్పినమాటలు నీవు చెవి యొగ్గి వింటివి
యిప్పుడె మారుమాటాపె కేమంటివయ్యా
కప్పుర మిచ్చినందుకు గక్కన నవ్వితివి
చిప్పిల నెంతఘనము సేసేవో కాని ॥ చెప్ప ॥

చేయెత్తి మొక్కినందుకు చెప్పితివి ప్రియము
మాయింతి నెట్ల నీవు మన్నించేవయ్యా
నీయింటికి రాఁగానే నెయ్యము చేకొంటివి
కాయ మంటి ఆపె నెంత కలసేవోకాని ॥ చెప్ప ॥

ఇంతి నప్పగించినందు కియ్యకొంటి విపుడు
పంతాన నెట్ల నింతిఁ బాయ కుండేవో
చెంతల శ్రీ వేంకటేశ చేకొని కూడితివి
యెంతని యాపెకు సరి గిచ్చేవోకాని ॥ చెప్ప ॥ 146

సాళంగనాట

ఎందుకు రోయ విదేరా యెంతపాపము
ఇందరిచేతా వింటి యీ పాపము ॥ పల్లవి ॥

వూరకున్న యాఁటదాని నొక్కొక్క ఆసరేఁచి
అరయఁ బరాకుసేయు టది పాపము
చేరువ నుండినదానిఁ జేకొన కప్పటిని
కోరి వేరేసతిఁ దెచ్చుకొంట గడుఁబాపము ॥ ఎందు ॥

కలయనిముద్దరాలిఁ గన్నెరికము చేకొని
అలరుచు సిగ్గువడే దది పాపము
వలచినవా రుండఁగ వాడవారివెంటవెంట
మెలఁగి తిరిగాడేది మిక్కిలిఁ బాపము ॥ ఎందు ॥

వొప్పగుపట్టపుదేవి నురమునఁ బెట్టుకొని
అప్పటి దిక్కులు చూచే దది పాపము
యిప్పుడె శ్రీ వేంకటేశ యీడ నన్నుఁ గూడితివి
యెప్పటి కెప్పటిసుద్దు లేఁటిపాపము ॥ ఎందు ॥ 147

రీతిగౌళ

కాని కాని నీగుట్టు గంటిగా నేను
పానిపట్టి యింక నేల పచ్చిదేరీ నోయి ॥ పల్లవి ॥

నీమోహపుచెలిపేరు నేనేయంటాఁ జెప్పి నీ-
దోమతెరమంచములో దొమ్మిఁ గూడఁగా
కామించి యీపెనే యంటా కలసి మర్మములైన -
అమాట లెల్ల నాతో నాడితిగా వోయి ॥ కాని ॥

ఆపెయెలుఁగుననే ని న్నాయములు సోఁకఁ దిట్టి
తోపునఁ బాదాన నిన్నుఁ దోయఁగను
ఆపెనే యనుచు నాయడుగుల కటు మొక్కి
యేపున నెన్నైన బాస లిచ్చితిగా వోయి ॥కాని॥

రతి యాకె సేసినట్టే రమణఁ జేసి నానా-
గతుల నీమనసెల్లఁ గరఁగించఁగా
యితవై శ్రీ వేంకటేశ యిచ్చితివి సొమ్ము లెల్లా
కతగా నాపెసొమ్మందు గలసెఁగా వోయి ॥కాని॥ 148

పాడి

ఎవ్వరు చెప్పిరే నీకు నేఁటివోజె
జవ్వనపువారి కింతచలములు చెల్లునా ॥పల్లవి॥

మోము చూచినదానవు మోన మేఁటికే నీకు
వేమరు మాటాడితేను వేడుక గాదా
కామిం చింతకపటము గలదాన వై తేను
నాములఁ గూటమి గొంత నడపఁగఁ జెల్లునా ॥ఎవ్వ॥

తగిలి వచ్చిననీవు తల వంచుకో నేల
సొగిసి యిట్టె తప్పక చూతువు గాక
జగడాల నంతపగ సాదించవలసితేను
జిగిఁ జుట్టరికములు చెప్ప నిందు చెల్లునా ॥ఎవ్వ॥

కలసితివి కాఁగిట గర్వము లిఁక నేల
చెలఁగి యేమైనా సేవ సేతువు గాక
అలరి శ్రీ వేంకటేశు అలవైతి విఁక నైతే
బలుము లింతటిమీఁద పచరించఁ జెల్లునా ॥ఎవ్వ॥ 149

కొండమలహరి

ఆడనే తెలుసుకొనే వాపెగుణము
యీడ న న్నేలడిగేవు యింతేసి నీవు ॥పల్లవి॥

తలఁపు నీ కప్పగించి తరుణి పానుపుమీఁద -
నలసి పవ్వళించిన దదే లోనను
అలిగి రానట్టున్నది అందరికిఁ జూడ నిది
చెలువుఁడ దగ్గరి విచ్చేయవయ్యా నీవు ॥ఆడ॥

తుమ్మిదమోఁతకుఁగాను తొయ్యలి ముసుఁగు దీసి
యిమ్ములఁ బలుక దదే యెవ్వరితోడ
కమ్మి యెదిరికిఁ జూడ గర్వమువలె నున్నది
చిమ్ములనీరాక యిట్టె చెప్పవయ్యా నీవు ॥ఆడ॥

నీమొగము చూచుదాఁకా నెలఁత కన్నులు మూసి
వోముచుఁ గైకొని యెట్టు వున్నది నేఁడు
కామించి శ్రీవేంకటేశ కలసితి వింతలోన
నాములుగా నాపెతోడ నవ్వవయ్యా నీవు ॥ఆడ॥ 150

రేకు 727. మాళవిగౌళ

మేలు మేలు దొరవౌదు మెస్త్రిరా నిన్ను
తాలి మింత లేకున్న తగుదువా మాకును ॥పల్లవి॥

చేరి నే దూరితే నీవు సెలవినే నవ్వుదువు
వేరెవెంగె మాడితేను వేఁడుకొందువు
వోరు పింత లేకున్న నూరఁగల గొల్లెతలు
వారికివారే వలచి వత్తురా నీకును ॥మేలు॥

కన్నుల నే జంకించితే కడుఁ జేత మొక్కుదువు
పన్ని నేఁ దిట్టితే నన్నుఁ బాలార్చేవు
అన్నేసి నేరకున్న నసురకామినులెల్ల
చిన్ని నీమాటల కెల్లఁ జిక్కుదురా నాఁడు ॥ మేలు ॥

వొద్దని నే నలిగితే నొడివట్టి పెనఁగుదు
గద్దించితే నట్టె నన్నుఁ గాఁగిలింతువు
వుద్దండ మింత లేకున్న నొగి నిందిరయు భూమి
యిద్దరు శ్రీ వేంకటేశ యెనతురా నిన్నును ॥ మేలు ॥ 151

శుద్ధదేశి

ఏరా నన్నణఁకించే వింతే కాక
వేరులేనికూటములఁ విఱ్ఱవీఁగ వలదా ॥ పల్లవి ॥

పిలువఁగానే విచ్చేసి పెనఁగితి వింతే కాక
చెలువుఁడ నీయంత విచ్చేసితివా
వల పిటువంటిదా యెవ్వరికైనాఁ దమకము
తల కెక్కి యెగ్గు సిగ్గు తాము మానవలదా ॥ ఏరా ॥

మొక్కఁగానే నీవు నామోము చూచి తింతె కాక
తక్కక నన్నిందాఁకాఁ దడవితివా
యెక్కువఁ జుట్టరికము లివి దాఁ గన్న దాఁకా
నక్కరతో రెప్పలు మూయక వుండవలదా ॥ ఏరా ॥

కాఁగిలించుకోఁగానే కరఁగితి వింతె కాక
రాఁగినరతికి నీవు రమ్మంటివా
వీఁగక శ్రీ వేంకటేశ వేడుక లిట్టులనా
దాఁగక నావెంట నిట్టె తగులఁగ వలదా ॥ ఏరా ॥ 152

రామక్రియ

మీకు మీకు బుద్ధులెల్ల మేము చెప్పేమా
సాకిరి మారుబాణాలు చక్కనుండీనా ॥పల్లవి॥

అప్పటి కప్పటిమాట లాడితి రింతే కాక
యిప్పటిమారుమోములు యింక నేలా
కప్పుర ముండినచోట కడువాస నేల మాను
యెప్పటికీ మాటలాడ కిట్టె వుండేరా ॥మీకు॥

వగలేక నగి నగి వాడు వచ్చె నింతె కాక
యెగసక్కెములు మీ కింక నేఁటికి
చిగిరించి రాఁగా రాఁగా చేఁగ లెక్క కేల మాను
మొగ మొగా లిటు చూచి మొక్కకుండేరా ॥మీకు॥

పైపై రతివేళనే పంత మాడితిరి గాక
యేపున వట్టివొట్టులు యింక నేఁటికి
చేపట్టి కలసితివి శ్రీ వేంకటేశ యింతిని
కోపము దీరినమీఁద కొంకి వుండేరా ॥మీకు॥ 153

ముఖారి

కప్పురము దిన్ననోటఁ గార మేలే
యిప్పుడే కంటిమి వేసా లింక నేలే ॥పల్లవి॥

కాంతుఁడు వద్దికి వచ్చి కన్నులెదుట నున్నాఁడు
చింతలెల్లఁ దీరినాను సిగ్గు లేలే
ఇంతనాన మాటాడఁగా మరఁగులే పెట్టేవు
వంతువరుసలు వచ్చె వాసు లేలే ॥కప్పు॥

మక్కువ చల్లి యాతఁడు మనసెల్ల నిచ్చినాఁడు
మొక్కులము దీరినాను మోన మేలే
లక్కవలెఁ గరఁగి నీలాగులెల్లాఁ జూచి చూచి
చక్కనాయఁ బనులెల్లా జాగు లేలే ॥కప్పు॥

శ్రీ వేంకటేశ్వరుఁడు చేరి నిన్నుఁ గూడినాను
వావులు గలసె తలవంచ నేలే
వేవేలు వచ్చె నీకు విభుఁ డాతఁ డైనాఁడు
కైవశమైనమీఁద కత లేలే ॥కప్పు॥ 154

దేవగాంధారి

పచ్చిదేర నిట్టె నీవు బదుకవమ్మా
యిచ్చినబాసలు తుద కెక్కెఁగదవమ్మా ॥పల్లవి॥

చింత లెల్లఁ బాసె నీచేతికి విభుఁడు వచ్చె
పంతపుమామీఁదిదూరు పాసెఁగదమ్మా
చెంతల ముచ్చట దీరె నెలవినవ్వులు వచ్చె
యింతటినీకోరికలు యీడేరెఁగదమ్మా ॥పచ్చి॥

మచ్చికలు దైవారె మనసు మీ కొక్కటాయ
చెచ్చెర నీచలములు చెల్లెఁగదమ్మా
రచ్చకెక్కె నేఁ డిందరిరాజసపుఁజేఁత లెల్లా
మెచ్చులు మామీఁద మీకు మించెఁ గదవమ్మా ॥పచ్చి॥

మోమునఁ గళలు మీరె మోహము వెల్లవి రాయ
వాములై మామాట సరివచ్చెఁగదమ్మా
చేముంచి కూడితి రిదె శ్రీ వేంకటేశుఁడు నీవు
అముకొన్నసంతోసము లాగుఁగదవమ్మా ॥పచ్చి॥ 155

ఆహిరి

చెల్లఁబో యింతాఁ జెప్ప సిగ్గు గాదా
చెల్లె నీవు సేసినట్టిచేఁత లెల్లాఁ గంటిని ॥పల్లవి॥

చెక్కు నీవు నొక్కేవు చెయి వట్టి పెనఁగేవు
యెక్కడిమాటలు యిఁక నేలా నేఁడు
వక్కాణించఁ బనిలేదు వావి చెప్పఁ జోటు లేదు
మొక్కేము తొలఁగవయ్యా మోహ మెల్లాఁ గంటిమి ॥చెల్ల॥

సెలవుల నవ్వేవు చెరఁగు వట్టి తీసేవు
ఇలమీఁద వట్టిదూరు లివి గొన్నే
చలములు నీకు దక్కె సడి నామీఁద నిలిచీ
తెలిసితి నుండవయ్యా తేజ మెల్లాఁ గంటిమి ॥చెల్ల॥

కన్నులనే కొసరేవు కాఁగిట బిగించేవు
యెన్ని లేవు నీసుద్దు లెరఁగనివా
నన్ను నిట్టె కూడితివి నమ్మించి శ్రీవేంకటేశ
మన్నించి వూరకుండు నీమతకాలు గంటిమి ॥చెల్ల॥ 156

రేకు 728. దేసాళం

ఏమి దప్పిపోయ నీకు నింతలోనను
కామిని మానాపతి కరుణించవయ్యా ॥పల్లవి॥

దేవర విచ్చేయఁగాను దిగ్గన గద్దియ ఒగ్గి
యీవల నిలుచున్నది యిదివో చెలి
పూవువలెఁ బట్టి నీవు పొదిగి కూచుండఁ బెట్టి
భావించి వెరపు దేర్చి పలికించవయ్యా ॥ఏమి

అల్లంతనే మిమ్ముఁ గని అట్టె పుద్దా లూడిచి
యిల్లిదే తలవంచుక యింతి వున్నది
చెల్లఁబో నీమెట్టినపసిడిపాదా లాపె కిచ్చి
యెల్లగా నీతొడమీఁద నిడుకొనవయ్యా ॥ ఏమి ॥

చేరి కాఁగిలించఁగానే సిగ్గుతోడఁ దలవంచి
మేరతో నీయిచ్చలోనే మెలఁగీఁ జెలి
ఆ రీతినే కడపరాయఁడవై శ్రీ వేంకటేశ
సారెఁ గూడితి విట్టె చన వియ్యవయ్యా ॥ ఏమి ॥ 157

ఆహిరి

మాపుదాఁకా రేపకాడ మానఁజాల మింతే కాక
పూపల నీమతకము పుట్టించరానిది ॥ పల్లవి ॥

చేతికి విడె మియ్యఁగ సేవలెల్లాఁ జేయఁగాను
ఆతల నున్నమనసు యీతల నాయ
యీతీరు నీరాతిగుణ మెందాఁకాఁ దిప్పఁగ వచ్చు
నీతితోడ నీవలపు నీయంత లేనిది ॥ మాపు ॥

కన్నులెదుట నుండఁగ కవకవన్వఁగాను
మన్నించి నీవాకున మాట వెళ్లెను
పన్నుకొని నీతో నెట్టు బయలు వాఁకఁగ వచ్చు
పిన్నసాఁడు లేనివోజ పెద్దైతే నుండునా ॥ మాపు ॥

కందువకుఁ దియ్యఁగాను కాఁగిట బిగించఁగాను
విందుల కూటమి వెల్లవిరు లాయను
అందపు శ్రీ వేంకటేశ అలయించ నెట్టు వచ్చు
నుందువెనకల నీఁక మూసి దాఁచఁదగునా ॥ మాపు ॥ 158

పాడి

ఇయ్యకోలైనమీఁద నెర వేల
కయ్యము దీరినమీఁద కపట మేల ॥పల్లవి॥

నిలుచున్నపతిఁ జూచి నెయ్యముతో నవ్వవమ్మ
పిలువ నంపినమీఁద బిగు వేల
తలఁపులు గలిగితేను తనువులు సోఁకవద్దా
అలరి తొలుత నన్నీ నమరుఁ గాక ॥ఇయ్య॥

చెనకి లోని కతని చెయివట్టి తియ్యవమ్మ
మనసు లెనసిన మరి మరఁ గేల
పెనఁగేయంత గలితే ప్రియములు చెప్పవద్దా
వినుకలిమీఁద మరి వింత లేల ॥ఇయ్య॥

చిక్కించుక ఆతనికి సేవలెల్లఁ జేయవమ్మ
గక్కనఁ గూడినమీఁద గర్వ మేల
యెక్కువ శ్రీవేంకటేశు నెనసితి వింతలోనె
దక్కినపనులు మరి తడవనేల ॥ఇయ్య॥ 159

గుండక్రియ

ఎందాఁకా మాటలు నీతో నేమి చెప్పేము
నింద వేసి నీమాట నీకు నొప్పగించెను ॥పల్లవి॥

ముందె నీకుఁ జెప్పి పంపి మోహము నీమీఁద వేసి
కందువ నిల్చి చెలి కాచుకున్నది
ఇందరితో నీ సుద్దులే యేపొద్దూ నుడుగుకొంటా
సందడిఁ గాల మిట్లా జరపఁ జొచ్చెను ॥ఎందా॥

నిద్దుర గంటఁ బెట్టుక నీకె నెలవుగాను
పొద్దు వొద్దు జాగరాలఁ బొంచి వున్నది
కొద్దిమీరినట్టిమీగుణాలే తలఁచుకొంటా
గద్దరినివ్వెరగులఁ గరఁగఁగఁ జొచ్చెను ॥ఎందా॥

మనసు నీకు మీఁదెత్తి మంతనములే మరిఁగి
చనవు సేసుక నీతో జంట నున్నది
యెనసితి వీచెలిని ఇంతలో శ్రీ వేంకటేశ
ననుపున నీతోడి నవ్వులకుఁ జొచ్చెను ॥ఎందా॥ 160

సామంతం

వద్దు వద్దు నీకింత వట్టిబింకము
యిద్దరిసందడివలపు లెరఁగమా నేము ॥పల్లవి॥

యింతి నీవద్దికి రాఁగా నెక్కడ పరాకైతివి
దొంతి గొన్న దిది యేఁటిదొరతనము
అంత గుండెగలవాఁడ వాపె నిన్నుఁ బాసి వుంటే
యెంతైనా నాపెవద్ది కేఁగక మానేవా ॥వద్దు॥

నిక్కి నిన్నుఁ జూడఁగాను నెలఁతతో నవ్వవద్దా
యెక్కువ నీయెడ్డతన మది యేఁటిది
తక్కరీఁడ వింతైతే తమకించితే నాపెకు
గక్కనఁ జేతికి లోనుగాక మానేవా ॥వద్దు॥

నెట్టనఁ గాఁగిలించఁగా నీవు గుట్టుతో నుందురా
యిట్టి వెట్టితనమైతే నేమందురు
అట్టై శ్రీ వేంకటేశ మెఱయ నింతిఁ గూడితివి
జట్టిగొనఁగా రతులు చాలు నన(ఁగలవా ॥వద్దు॥ 161

శ్రీరాగం

పటికి నానలు వెట్టే విట్టే నీవాఁడ ననుచు
పోఁటిగా నీమేన నున్నపులకలే గురుతు ॥పల్లవి॥

తిరిగి తిరిగి నన్ను దిష్టించి చూచితి గాన
అరిది నాపై మోహాన కది గురుతు
తరుణులు చూడఁగానే దగ్గరి వుంటివి గాన
మరిగినందుకు నన్ను మరి యిది గురుతు ॥పటి॥

అందరిలో నెంతై నా నంపఁజాల వటు గాన
అంది మన్నించేయందు కది గురుతు
మందెమేళముగ నాతో మాటలాడే వటు గాన
యెందు నీ నాతగులుకు నిదొక్కటే గురుతు ॥పటి॥

వేసరక నాతోడ వెస నవ్వితివి గాన
ఆస నాపైఁ జేసుటకు నది గురుతు
శ్రీ సతితో నేలితివి శ్రీ వేంకటేశ్వర నన్ను
సేస నాపైఁ బెట్టుటకు చెనకులే గురుతు ॥పటి॥ 162

రేకు 729. ధన్నాశి

ఇంక నిన్నియును మేలె యెటువలె నుండినాను
సుంకుల నా దిక్కు దయఁ జూచితివి నీవు ॥పల్లవి॥

కన్నులఁ జూచితిఁగా కమ్మటి నీమోము నేను
యిన్నాళ్లుఁ బాసి వుండినయాసు దీరను
చన్నుల నొత్తితిఁగా సారెకు నీవుర మిట్టె
కన్నులై మీఁదెత్తుకున్న కాఁక దీరను ॥ఇంక॥

సంగడిఁ గూచుంటిఁగా జంకైతె తొల్లిటివలె
కొఁగువట్టి నా కోరికె కొనసాగను
అంగము లంటితిఁగా అంకెకు వచ్చినట్టెల్లా
ముంగిటి నావలపుల ముచ్చటెల్లఁ దీరను ॥ఇంక॥

కాఁగిట నించితిఁగా కమ్మి పానుపున నిన్ను
ఆఁగి రతులఁ జొక్కించి ఆనందాననను
వీఁగక నిలిచితిఁగా వేడుక శ్రీ వేంకటేశ
తోఁగి చూచి సురతపు దొమ్ములలో నిపుడు ॥నింక॥ 163

నాట

అంగడి వేసేవు వల పదేరా వోరి
వుంగిటి పెద్దతనాన నుండ వేఁటికయ్యా ॥పల్లవి॥

ఇట్టె మరచినమాట లెచ్చరించే విది యేరా
గుట్టునఁ దలఁచుకొంటే కోప మయ్యీని
యెట్టకేలకు నీపొందు ఇతవుగఁ జేసుకొంటే
మట్టు మీరి నీవోజలు మాన వేఁటికయ్యా ॥అంగ॥

ఆరితేరినపనులు అణఁగ నియ్య వదేర
సారెఁ గొనఁ బెట్టఁ బోతే చల మెక్కీని
తేరుచుక నీసుద్దులు తిద్దుకొని రాఁగాను
వూరకుండి మంచితన మొల్ల వేఁటికయ్యా ॥అంగ॥

ఇచ్చినకాఁగిటిలోన నీడువెట్టే విది యేర
కుచ్చి కుచ్చి యెత్తఁబోతే గుబ్బతిల్లీని
విచ్చనవిడి నన్ను శ్రీ వేంకటేశ కూడితివి
నచ్చుల నిఁక సెలవి నవ్వ వేఁటికయ్యా ॥అంగ॥ 164

భూపాళం

ఇట మీఁదఁ జవిగాదు యేమన్నాను
చిటుక వేసినంతలో చెప్పినట్లు సేయనా ॥ పల్లవి ॥

కోపగించుకొని నిన్ను గొణఁగినదానఁ గాన
పైపై సిగ్గువడి యేమీఁ బలుకఁ గాక
యేపునఁ దొల్లిటివలె నిట్టె నాయంత వుంటేను
మాపుదాఁకా నీతోను మాటలే యాడనా ॥ ఇట ॥

చలము నీతో నేను సాదించినదానఁ గాన
చెలఁగి నీకుఁ బ్రియాలు చెప్పఁగాక
పొలసి నీపాలికి నేఁ బొరుగుదాననై వుంటే
చెలిమి నెరపి నీకు సేవలెల్లాఁ జేయనా ॥ ఇట ॥

నంటు సేసి యేడనైనా నవ్వినట్టిదానఁ గాన
గొంటుఁజందమున నిన్నుఁ గూడితిఁ గాక
అంటి ముట్టి శ్రీవేంకటాధిప నన్నేలితివి
యింటికాడ నీకు నేను యిచ్చకమే యాడనా ॥ ఇట ॥ 165

దేసాళి

ఆతనిపట్టుకు మీరు ఆడినట్టే ఆడరే
పోతరించి మిమ్ము సారెఁ బొగడీఁ దాను ॥ పల్లవి ॥

తగవులు చెప్పరే తరుణులాల పతికి
అగపడి మిమ్ముఁ గోరి యడిగీని
మొగమోడి యుండరే ముందరి కాంతనితోడ
పగటున నే నెట్టైనా బగికేఁ గాని ॥ ఆత ॥

ముందుముందే మెచ్చరే మొగి నాతనిచేఁతలు
చెంది తనయెమ్మెలెల్లాఁ జెప్పీ మీకు
చందపుఁబూస సేయరే సాకి రిట్టె చెప్పేమంటా
కిందుపడి నే నెట్టైనా గెలిచేఁ గాని ॥ అత ॥

యిచ్చగించి నగరే యీతనిసుద్దులకెల్ల
చెచ్చెరఁ గడుఁ బ్రియాలు సేసీఁ దాను
అచ్చమై శ్రీ వేంకటేశుఁ డాతఁడె నన్నుఁ గలసె
పచ్చిగా నే నిఁకఁ దనపాల నుండేఁ గాని ॥ అత ॥ 166

నాదరామక్రియ

నీవల్ల నైనపని నీమీఁదనే మోచుఁగాక
యేవెరవు నెరఁగము యేమి సేతురా ॥ పల్లవి ॥

నిన్నుఁ జూచి లోనను నిద్దిరించఁబోతేను
వెన్నాడి నీరూపము నావెంట వచ్చెను (చ్చీని?)
కన్ను మూసినాఁ బోదు కాఁగిటికి లోనుగాదు
యిన్నిటా నిన్ను దూరక యేమి సేతురా ॥ నీవ ॥

చేరి నీతో మాటలాడి చెలితో మాటలాడితే
దూరి నీపేరే నానోరఁ దొరలీని
వూరకున్నఁ బోదు పొందు లోనరించఁ దా రాదు
యీరీతి నిన్నుఁ దగుల కేమి సేతురా ॥ నీవ ॥

యిట్టె నీవద్దఁ బండుండి యీవలి మోమైతేను
తట్టి నీమేను నన్నిం(న్నం?)టి తమి రేఁచీని
గట్టిగ శ్రీ వేంకటేశ కలసితి వింతలోనే
యిట్టె నీచేఁతలు మెచ్చ కేమి సేతురా ॥ నీవ ॥ 167

సామంతం

అయలేవే జవ్వనపుటంగనల కింత గద్దా
వోయమ్మ వొకటంటే నొకటనేవే ॥ పల్లవి ॥

చెంగట నీపతి వాఁడే చెక్కిటి చే యింక నేలే
ముంగిట రెండుచేతుల మొక్కరాదా
సంగడిఁ గూచుండఁగాను సతులిందరిలోనను
యింగితాన సిగ్గువడ కెట్టుండవచ్చునే ॥ అయ ॥

అట్టె యాతఁడు పిలిచీ నవ్వలిమో మిఁక నేలే
నట్టుకొట్ట కిఁకనైన నవ్వఁగరాదా
వెట్టికి నాతఁడు వచ్చి వేఁకముగ నూఁదఁగాను
ముట్టి పట్టి నేఁ గొంత ములుగఁగ రాదా ॥ అయ ॥

(శ్రీ) వేంకటేశుఁడు గూడె శిరసు వంచఁగ నేలే
యీవల నాతనిచన వియ్యరాదా
కావిరి నాతఁడు నన్నుఁ గరఁగించి మించఁగాను
సోవల నాలోనే నే చొక్కఁగ రాదా ॥ అయ ॥ 168

రేకు 730 గౌళ

నేనే దయదలఁచ నేరనైతి నింతెకాక
యీనటనే చూపవలె నిటువంటివానికి ॥ పల్లవి ॥

పంతపునీగుణము పట్టితే బిగుసుఁగాక
యెంతైనా నాయ నాకు యియ్యకోలౌనా
చెంతల నేఁ దరితీపు నేసి ముందే అలిగితే
యింతక నాచెప్పినట్టు యేమైనాఁ జేయవా ॥ నేనే ॥

చంచలపునీమది కొంచెములే వెదకుఁ గాక
వంచుకొంటే మాకు నీఁక వసమయ్యీనా
అంచల నే నవ్వుతానే అడియాసఁ దిప్పితేను
పంచలఁ గాచుక నీవు బంటువలె నుండవా ॥ నేనే ॥

కాతరపునీవలపు కక్కూరితి సేసుఁ గాక
మాతలఁపుకొలఁదిని మట్టుపడీనా
యేతుల శ్రీ వేంకటేశ ఇట్టె నన్నుఁ గూడితివి
యీతలఁపు నాఁడే యైతే యేలికవై వుండవా ॥ నేనే ॥ 169

## బౌళి

మోహాంధకారాన నీవు మంం దెరఁగ వింతె కాక
యీవేళ నీకొలువులో నెదుటనే వుండనా ॥ పల్లవి ॥

నవ్వు నవ్వి ఆపెదిక్కు నాఁటఁగఁ జూచేయప్పుడు
అవ్వల నీకుఁ జేయిచ్చి అండ నుండనా
చివ్వన రతికి నాపెచెరఁగు వట్టేయప్పుడు
నివ్వటిల్లఁ గుంచ వేసి నీవెంట రానా ॥ మోహాం ॥

ఆపెతోడఁ బచ్చిమాటలాడి చొక్కించేయప్పుడు
మాపుదాఁకా నీకు ఆకు మడి చియ్యనా
చేపట్టి యేఁటికో నీవు చేయెత్తి మొక్కేయప్పుడు
పైపై నాలవట్టము పసగా విసరనా ॥ మోహాం ॥

కందువ నాచెలి నీవు కాఁగిలించుకొన్నప్పుడు
పొంది నీవచ్చడము గప్పుక వుండనా
అంది శ్రీ వేంకటేశ నన్నంతలోఁ గని కూడితి
నింద లేక నీకు తోడునీడనై నే నుండనా ॥ మోహాం ॥ 170

### సామంతం

వట్టిజోలి యింక వద్దేలే
  నెట్టన రమణుఁడు నీపాలివాఁడు ॥పల్లవి॥

కన్నుల సొలయక కాఁకలు చల్లక
  సన్నలపిలుపులు చవి గావు
  చన్నుల నొరయక సంగడి నిలువక
  పన్నినవలపులు పస లేవు ॥వట్టి॥

ననుపు నటించక నవ్వులు నవ్వక
  కొనగొనప్రియములు గుఱి లేవు
  మనసులు గలయక మాఁటలఁ దనియక
  చెనకెటిచెనకుల సెలవే లేదు ॥వట్టి॥

చేతులు చాఁచక సిగ్గులు విడువక
  కాతరపడితేఁ గలదా రతి
  యీతరి శ్రీవేంకటేశ్వరుఁ గూడితి
  యేతలపోఁతల కెడ యేది ॥వట్టి॥ 171

### హిందోళవసంతం

ఎందాఁకా నిద్దిరించే వేమమ్మా
  దిందుపడి వాకి లిఁకఁ దెరవవోయమ్మా ॥పల్లవి॥

రాతిరి యేమిటికో రమ్మంటి వట నీవు
  ఆతఁడు వచ్చువాఁ డప్పటనుండి
  కాతరాన నీవు లోన గడె వెట్టుకుండఁ గాను
  యీతలఁ జెప్పమైతి మిందాఁకా నమ్మా ॥ఎందాఁ॥

యేమో కావలె నంటా యెంచుకొంటిరట వావి
అమాలే యుందాఁకాఁ జెప్పె నప్పటనుండి
నీమారుగ వాకిట నేము పచరించితిమి
ప్రేమతోఁ ద లోనికి పిలుచుకోవమ్మా ॥ ఎందాఁ ॥

వుంగర మిచ్చితివట నుంకువగా నాతనికి
అంగవించి మాకుఁ జూపి అప్పటినుండి
చెంగట చే గడె దీసి శ్రీ వేంకటేశుఁడు చొచ్చి
వుంగిటిగా నిన్నుఁ గూడె వొప్పు గొనవమ్మా ॥ ఎందాఁ ॥ 172

దేసాళం

వద్దనేమా నిన్నును వడి నెందు దిరిగిన
పెద్దరికానకు నాఁడే పెండ్లాడితి చాలును ॥ పల్లవి ॥

సేయవయ్య నీ వాపెచెప్పిన ట్లెల్లాను
యీయెడఁ జూడఁజాలక యేమి సేసే మిఁక నిన్ను
మాయింట నుండేము నేము మాకేమి
పాయపుమామగఁడవై బదికితేఁ జాలును ॥ వద్ద ॥

సరసము లాడవయ్య సతితోనే యేపొద్దు
మరుఁడే యెరుఁగుఁ గాక మాకేమి
వెరవులు చెప్పి చెప్పి వేరె కట్టుకొనే దేమి
వరుసనాఁడైన నిందు వచ్చితేనే చాలును ॥ వద్దు ॥

కాఁగిలించుకొనవయ్య కాంతపై బత్తి సేసుక
మాఁగ వలచి వుండేము మాకేమి
రేఁగి కూడితివి మమ్ము శ్రీ వేంకటేశుఁడ నీవు
లోఁగి యట్టె మాచేతికి లోనైతేఁ జాలును ॥ వద్ద ॥ 173

హిజ్జిజి

మాటలాడించకువయ్యా మగువఁ గొంతదడవు
మేటిమై యామీఁద నీతో మేలమాడీఁ గాని ॥పల్లవి॥

నీమీఁదిపదములు నెలఁతలు వాడఁగాను
కామినికి మేనెల్ల గరుపారెను
ఆ మీఁదఁ జన్నులపై హస్తము నీవు వేయఁగ
కామించి నిలువునఁ గళ దాఁకెను ॥మాట॥

నీవు గప్పేచంద్రకావి నెమ్మదిఁ బైవేసుకొని
భావించి పరవశానఁ బవళించెను
ఆవేళ నీవు విచ్చేసి అండనే పవ్వళించఁగ
చేవదేరి జలజలఁ జెమరించెను ॥మాట॥

పంతాన నీచేతిపూవుబంతి కన్నుల నద్దుక
పొంతనే మిక్కిలి నిట్టూర్పులు నించెను
యింతలో వేంకటేశ యీపెను నీవు గూడఁగ
చింత దీర నవ్వు నవ్వి సిగ్గునఁ దా నున్నది ॥మాట॥ 174

రేకు 731. సౌరాష్ట్రం

అన్నిటా నేర్పరివి నీ వౌదువయ్యా
యెన్ని ప్రియములు చెప్పే వేమి సేతువయ్యా ॥పల్లవి॥

మక్కువ చల్లనే పట్టె మాటలాడనే పట్టె
వెక్కసాన నీతో నవ్వ వేళ లేదు
యిక్కువలు గరఁగితి యింపులనే పెరిగితి
యెక్కడ నీవు దనియ వేమి సేతువయ్యా ॥అన్ని॥

మోము చూడనే పట్టె మోహము నించనే పట్టె
వేమరుఁ జేయెత్తి మొక్క వేళ లేదు
నామనసు నీ కిచ్చితి నాఁడె నిన్ను మెచ్చితి
యేమిటికిఁ (దడ?)వేవు యేమి సేతువయ్యా ॥ అన్ని ॥

కదిసి వుండనె పట్టె కాఁగిలించనె పట్టె
వెదకి దూరు వేయఁగ వేళ లేదు
యిదివో శ్రీ వేంకటేశ యెనసితి విటు నన్ను
యెదుటనె వున్నాఁడ వేమి సేతువయ్యా ॥ అన్ని ॥ 175

కురంజి

(వలెఁ?)గా యివి గొన్ని పట్టిమాయలు
వలవంత నేఁడు నేరపలనెఁగా నీకు ॥ పల్లవి ॥

ఆపెఇంటికిఁ బోతేను (అం?)తలోనే దోసమా
చేపట్టి పెనఁగితేనే సిగ్గు వచ్చెనా
యీపాటివాఁడవు తొల్లి యేల పొందు సేసితివి
యేపున నన్నుఁ గని నేఁ డేల వెరచేవు ॥ వలెఁ ॥

కొంగు వట్టి తియ్యఁగాను కూచుండితే దోసమా
ముంగిట నవ్వితే నాయనులు సోఁకెనా
యెంగిలికి రోసేవాఁడ వేల మొక్కించుకొంటివి
తొంగి చూచి నన్నుఁ గని తొలఁగఁగఁ దగునా ॥ వలెఁ ॥

(కోర?)యాన వెట్టఁగాను కూడితేనే దోసమా
యేరీతికిఁ జొచ్చినాను యెగ్గు లున్నవా
ఆరీతి శ్రీ వేంకటేశ అట్టె నన్నుఁ గూడితివి
వోరి నన్నుఁ గని యింతేళొడఁబా ట్లేలా ॥ వలెఁ ॥ 176

పాడి

ఎప్పుడు నీకే పోదు యిట్లు (నా?)భారము మోవ-
నప్పుడే నాసవతుల నణఁచఁగ వలదా ॥పల్లవి॥

చాయల నీవు ముట్టి సతిఁ దలఁచితి వీడ
పోయినపోరు లట్టె పోనీరాదా
ఆయాలు సోఁకేపనుల కస మిచ్చితివి నాకు
పాయక నా కిఁక వెనుబలమై రావలదా ॥ఎప్పు॥

కందువ మాటలాడి కలవరించితి వీడ
అందము మావినపను లవి యేల
నింద నే వొక టాడఁగ నీ వొకటి ఆడఁగాను
యిందువంక నేమి వచ్చె నేలుకొనవలదా ॥ఎప్పు॥

కపటము లెల్లఁ దీర కాఁగిలించుకొంటి వీడ
రపముగ నిట్టె నన్ను రక్షించరాదా
ఇపుడె శ్రీ వేంకటేశ యిద్దర మొక్కటైతిమి
వుపమించి యేకచిత్త(మొన?)రించవలదా ॥ఎప్పు॥ 177

సాళంగనాట

ఎట్టు నమ్మిరొకో నిన్ను ఇంతకతొల్లిటివారు
వొట్టి నే నైతే మెచ్చితి నొక్కవేలనే ॥పల్లవి॥

దాయలతలలు గొట్టి దనుజకాంతల గుబ్బ-
లాయము లంటితిగా ఆచేతనే
చేయారఁ బాముఁ బంపి చేరి గొల్లెతలయిండ్ల-
నాయడ వెన్నలు దింటి వాచేతనే ॥ఎట్టు॥

---

* పై మూడు కీర్తనల (175,176,177) లోని కుండలీకృతాక్షరములు అస్పష్టము-లైనందున మే మూహించినవి: ఈ భాగమున చిలు మెక్కువగ నున్నది.

పూతకిఁ బీరిచి నీపాలతులధరపానా -
లాతలఁ జేసితిగా ఆనోరనే
గాతల కౌరవుఁ దిట్టి కందువ సాందీపుఁతో
ఆతుమ వేదాలు నేర్చి తానోరనే ॥ఎట్టు॥

ఆట్టె కంసు వెరపించి అంగనల సన్న సేసి-
తట్టు నిట్టు కాఁక దేర నాకన్నులనే
గుట్టున శ్రీ వేంకటేశ కూడితివి నన్ను నిట్టె
అట్టలుగట్ట నవ్వితి వాకన్నులనే ॥ఎట్టు॥ 178

## బౌళిరామక్రియ

ఆపెకు నీకునే కాక అండవారి కేమి వోదు
కైపు సేసి మిమ్ము నేము కా దనేటివారమా ॥పల్లవి॥

పువ్వుబంతిఁ గొని చెలి పూఁచి నిన్ను వేయఁగాను
యెవ్వరి సాకిరి వెట్టి యేమి సేసేవు
జవ్వనికి నీవిచ్చినచన వింతేకాక అది
చివ్వన నూరివా రింత సేయ వచ్చేరా ॥ఆపె॥

చిమ్మి రేఁగి సతి నిన్నుఁ జిలుక చేఁ దిట్టించఁగ
యిమ్ముల మామొకములు నీ వేమి చూచేవు
సమ్మతించినమీలోనిసరసము లింతే కాక
కమ్మర మానుప మాకు కారణము గలదా ॥ఆపె॥

చేతు లెత్తి మొక్కి యింతి చెక్కిట జీర దియ్యఁగ
యీతల మాకేల చూపే వేడసుద్దులు
యేతుల శ్రీ వేంకటేశ యెనసె నాపె కాఁగిట
ఘాతగఁ గడవారు నిన్నాఁగాదనఁ గలరా ॥ఆపె॥ 179

శంకరాభరణం

ఎవ్వ రింత సేసిరమ్మ యీతఁడే కాక
రవ్వఁ జూడఁ బోయి వీనిరతికి లోనైతిమే ॥ పల్లవి ॥

కొట్టేటివుట్లును కోలఁసాములును
వెట్టినవ్వు లేడవే వీదివీదులా
తిట్టరాదు పట్టరాదు దిమ్మరీఁ డెశోదపట్టి
యిట్టిసలిగెలు తన కేల వచ్చెనే ॥ ఎవ్వ ॥

పారేటిపసువులు బాలులమూఁకలు
వేరేరొద లేడవే వీదివీదులా
వారము వజ్జము లేదు వంచుక పాలువెన్నలు
వారవట్టి యారగించీ వాఁడే వాఁడే కదవే ॥ ఎవ్వ ॥

లాసేటిలాగులును లంగించేయెగరులు
వేసేటిగంతు లెవ్వరే వీదివీదులా
ఆసల శ్రీ వేంకటేశుఁ డంతటా కలయఁ గొని
సేసీ నుట్లపండుగ చెల్లుబడిగాను ॥ ఎవ్వ ॥ 180

రేకు 782. ఆహిరి

ఆఁకలి గొంటివిగా అయ్యో నీమో మెల్ల వాడె
కాఁకల నిన్నుఁ దిప్పిరి కడనున్న చెలులు ॥ పల్లవి ॥

ఆపెసుద్దులే చెప్పి అట్టె నిన్నుఁ బొద్దు వుచ్చి
పాపజాతిచెలు లెల్లా భ్రమయించిరి
యేపున ని న్నింత సేసి యింటికి రానియ్యరైరి
పైపైఁ జలారె నిదె పట్టినట్టిబోనము ॥ ఆఁక ॥

చక్కఁదనాలు వొగడి సతిమీఁదఁ దమిరేఁచి
చిక్కించిరి కట్టడియాచెలులు నిన్ను
నెక్కొని నిన్నించుకంత నిద్దిరించ నియ్యరై రి
వెక్కసాన భోగించేటివేళ లెల్లఁ దప్పెను ॥ఆఁక॥

నవ్వుల వల పెక్కించి నలినాక్షి మోము చూపి
దవ్వులనే చెలులెల్ల దక్కించిరిగా
రవ్వగా శ్రీ వేంకటేశ రానన్నా నన్నుఁ గూడితి
వువ్విళ్లూరఁ గెమ్మోవి వొక్కటే మారతులా ॥ఆఁక॥ 181

లలిత

అండనున్న చెలులకే అన్నియునుఁ జెల్లును
దండియైనమొగమోటే తగు మాయిద్దరికి ॥పల్లవి॥

మెచ్చితిఁబో నిన్ను మెలఁతరో నీవాతని
మచ్చము మోవనాడినమాటలకును
తుచ్ఛము మాకాడ రాదు తుద సమ్మతించరాదు
పచ్చిగా నాతఁ డిందుకు పతి యాడరాదు ॥అండ॥

మేలు మేలె దిట్టవౌదు మిక్కిలి నాతనిమీఁద
వేళెరిఁగి నాఁటినింద వేసినందుకు
తాలిమి మాకుఁ దగదు తమకించను దగదు
వాలాయించి ఆతనికి వాదుకువఁ దగదు ॥అండ॥

నీవంటిజాణ యేదే నేఁ డతని సిగ్గుదేర
చేవదేరి రతికిఁ దెచ్చిన యందుకు
వోవల శ్రీ వేంకటేశుఁ డొక్కటాయ నాతో నాతఁ-
డే విధాననైన నీక నెదురాడఁ జెల్లదు ॥అండ॥ 182

రామక్రియ

ఆపె నన్ను నొక్కటిగా నప్పుడే సేసితివయ్యా-
వో పో పో నీకేరడాల కోపము గాని ॥పల్లవి॥

తక్కరిగాదు ఆపె తాటోటుఁ గాదు నీ-
వెక్కువ సేసి పొగడే యెం(వెం?)త గలదు
చక్కనిది యాను సరసురాలూ నౌను
వుక్కున సరిసేసుకో నోపము గాని ॥ఆపె॥

మంకుఁజల మెరఁగదు మందెమేళ మెరఁగదు
అంకెల నీవు మోహించ నరుహా మౌను
పొంకాలు నేరుచు నీతో పొందుసేయ నేరుచును
వుంకువ నాపింటికిఁ బో నోపఁ గాని ॥ఆపె॥

కలహమునకుఁ జొరదు కపటానకుఁ జొరదు
అలరి నీవూడిగాని కాపె వలెను
యెలమి శ్రీ వేంకటేశ యీాడ నన్నుఁ గూడితివి
వొలిసి యెరిఁగించుకో నోపము గాని ॥ఆపె॥ 183

సామంతం

ఇన్నిటా నీచెయే మీఁదు యిఁక నేలా నీ-
మన్నన నాకుఁ గద్దు నెన్నఁది నుండవయ్యా ॥పల్లవి॥

అండకు వచ్చితని ఆకు మడి చిచ్చితిసి
నిండిననా భాగ్యము నీ చిత్తము
పండెను నావలపు పంతము నీ కెక్కెను
కొండవంటిసంతసాన కొల్లున నవ్వవయ్యా ॥ఇన్ని॥

బడిఁ దగిలితిని బత్తులుఁ జేసితిని
 యెడయనియాస నాది యెట్టైనాఁ జేయి
 పెడరేఁచె నావేడుక పేరుఁ బెంపు నీకుఁ జెల్లె
 అడియాలముగ నీవు అట్టె మెరయవయ్యా ॥ఇన్ని॥

కాఁగిటఁ గూడితిని కందువ లంటితిని
 మాఁగెను నామోవి నీవు మరిగితివి
 దాఁగక శ్రీ వేంకటేశ తనిపితి విట్టె నన్ను
 పాఁగినేనాతోడుతను బతుకవయ్యా ॥ఇన్ని॥ 184

శంకరాభరణం

కంటివిగా వోయి మా కాంతలసుద్దులు నేఁడు
 అంటే ననరాదు నీనాయందు భేదమున్నదా ॥పల్లవి॥

నిన్నుఁ బాడి కాఁకరేఁగి నీవద్దికి రాఁగాను
 యెన్నెసిబుద్దులు చెప్పె నీపె నాతోను
 నన్ను నీవు తోసేవా నా మాటలు మీరేవా
 యిన్నిటా చెలి యనుచు నెట్టు నమ్మె నీపెను ॥కంటి॥

తాలిమితో నీమోము తప్పక నేఁ జూడఁగాను
 యేఁల సన్నలు సేసీని యీపె నాతోను
 కాలమందె మాట యీవా కడమ నీయందున్నదా
 యేలకో మావారి వెల్ల నిటువంటిసుద్దులు ॥కంటి॥

నిలుచుండే తమకాన నిన్ను నేఁ గాఁగిలించఁగా
 యెలమిఁ దా నేల నవ్వీ నీపె నాతోను
 కలయవా యిటు నన్ను గక్కన శ్రీ వేంకటేశ
 అలరి మాదూతికెలె అన్నియు నేరుతురు ॥కంటి॥ 185

ముఖారి

ఎందాఁకా సిగ్గువడే వింతవొద్దు వోయ నేఁడు
కందువ నాతఁ డన్నట్టె కానిమ్మనరాదా ॥పల్లవి॥

చన విచ్చి నీదిక్కు చక్కఁ జూచీ సారె సారె
మన సిచ్చి యాతనితో మాటలాడవే
పెనఁగీ నప్పటనుండి ప్రియపడి నీ తోను
యెనసే నని యింతట నియ్యకొనరాదా ॥ఎందాఁ॥

వన్నెల నీ కెదురై వాకిట నిలుచున్నాఁడు
వున్నతిఁ జేవట్టి లోని కొగిఁ దియ్యవే
తన్నుఁదానె యంతలోనె దగ్గరఁ గూచుండె నీకు
సన్నల నీ వాతనికే సమ్మతించరాదా ॥ఎందాఁ॥

చేయిఁ జేయి మోపి నీపై సేసవెట్టు కున్నవాఁడు
పాయక నీతలఁబాలు పైఁ జల్లరాదా
యీయెడ శ్రీ వేంకటేశుఁ డిదె నీకాఁగిటఁ గూడె
చే యెత్తి యలమేల్మంగ చేరి మొక్కరాదా ॥ఎందాఁ॥ 186

రేకు 733. మంగళకౌశిక

అప్పటనుంటి నుందాన నౌఁగాదనవు నీవు
చెప్పేవారిమాట లెల్ల చేకొంటిఁగదరా ॥పల్లవి॥

యెన్నికె నెదుటనుంటే యేమీ ననరు గాని
కన్నురెప్ప లడ్డమైతే కాఁతాళింతురు
నిన్నే యనఁగరాదు నీతలనే వేగదు
సన్నలదంపతులకు సాజ మిదే కదరా ॥అప్ప॥

తగులఁ బోతే వలపు తమిఁ జప్పనవుఁ గాని
మొగము వొడ్డపెట్టితే మొక్కవత్తురు
జిగిఁ దలవంచితివి చింతించకు నీవంత
జగములోపలి వారిసాజ మిదే కదరా ॥అప్ప॥

వెంటవెంటఁ దిరిగితే వేసారఁ బోదురు గాని
యింటికాడ నుండితేను యేదీ యందురు
గొంటవై శ్రీవేంకటేశ కూడితివి నన్ను నిట్టె
జంట నలమేల్మంగను సాజ మిదే కదరా ॥అప్ప॥ 187

లలిత

ఏమమ్మ నీ కెవ్వరీడు యిందిరాదేవి
నీమగనికి నీవు నిండునిధానమవు ॥పల్లవి॥

చూపులనే కురిసేవు సోరిది బంగారుపోడి
తీపుల నీపతి కది తీరనిసొమ్ము
గూపుననే కలికేవు రుచుల రాజస మెల్ల
మోపులై యాతని కవె ముంగిటిసంపదలు ॥ఏమ॥

మోముననే మెరిచేవు మోహానపు మెరుఁగులు
కావించు నీవిభునికి కానదివ్వెలు
తామెరచేతుల నెత్తి దైవారేవు మహిమలు
ప్రేమపుమీయాతనికి ప(పె?)ట్టెలధనములు ॥ఏమ॥

పలుకులఁ జిలికేవు పైపైనే అమృతాలు
అలరి శ్రీవేంకటేశు కవె మంత్రాలు
అలమేలుమంగవు నీ వాతనిఁ గూడితి విట్టె
చెలఁగి మీయిద్దరికి సేసిన భాగ్యములు ॥ఏమ॥ 188

నాదరామక్రియ

ఆతఁ డేమి సేసినాను అదె సమ్మతి నాకు
చేతికి లోనై నేను చిత్తములో దానను ॥పల్లవి॥

యేఁటికో చెలులతోడ నేకతమాడీ నతఁడు
మాటలాడకురే మీరు మగువలాల
వాఁటమై యెవ్వరైన వత్తురు సేతు రాడకు
బూటకాలు సేయ నిఁకఁ బోకురే మీరు ॥ఆతఁ॥

ఇప్పుడె అవ్వలిమోమై యెవ్వరిఁ జూచీనో తాను
తప్పక చూడకురే వోతరుణులాల
చెప్పి యెరిఁగించుకొంటే సిగ్గువడుఁ జేసుఁ బతి
ముప్పిరి మావారమని మొక్కకురే మీరు ॥ఆతఁ॥

ఇమ్ముల నిలుచున్నాఁడు యీడకే వచ్చీనో యేమో
రమ్మని పిలువకురే రమణులాల
నెమ్మి శ్రీ వేంకటేశుఁడు నే నలమేలుమంగను
నమ్మించి నన్నుఁ గూడెను నవ్వకురే మీరు ॥ఆతఁ॥ 189

ముఖారి

పల నవ్వే వప్పటిని యిట్టె నా మొగము చూచి
మేలుగలచెలులైతే మెరయక వుందురా ॥పల్లవి॥

వొక్కసతి వుర మెక్కె వొక్కసతి వీఁ పెక్కె
చిక్కించి వేరొకసతి శిర సెక్కెను
తక్కక యింతులజాడ దగ్గరఁ బిలిచితేను
మిక్కిలి లెక్కసేతురా మీరుదురు గాక ॥పల॥

వెదకించె నొకలేమ వెంటఁ దిప్పె నొకలేమ
వుదుటై రచ్చకుఁ దీసె నొకలేమ
యెదుటఁ గాంతలజాడ యేపాటిమన్నించినాను
తుద కెక్కకుండుదురా తూరి యెంతైనాను ॥పల॥

నీకంటెఁ బొడ వొకతె నీరిపు నేసె నొకతె
మేకొని పూవులనే భ్రమించె నొకతె
యీకడ శ్రీవేంకటేశ యిందులో నే నొకతెను
జోక నలమేల్మంగను చొక్కించి మెప్పించనా ॥పల॥ 190

## బౌళి

మీకే చెల్లునయ్యా మీలోనిసుద్దులు
వాకుచ్చ మీచేఁతలు మావసమా యిఁకను ॥పల్లవి॥

మగువ నీమోము చూచి మాట లేమీ నాడక
చిగురుఁగెమ్మోవిమీఁద చిలికీ సిగ్గు
యెగసక్కె లేక తాన నేమంటివో నీవు
తగవు దేరుచ మాతరమా యిఁకను ॥మీకే॥

ఆకు మడిచి నీకిచ్చి అండ నట్టె కూచుండక
కూకులువత్తులు గాఁగ గుప్పీ నవ్వు
పైకొని యాపెకు తొల్లి బాస లేమి యిచ్చితివో
మీకలఁకలు దేరుచ మేమా యిఁకను ॥మీకే॥

చేతు లెత్తి నీకు మొక్కి సేవ లేమీఁ జేయక
ఆతలఁ గాఁకలు నీకే అప్పగించీని
నీకునీవే కూడితివి నెమ్మది శ్రీవేంకటేశ
చేకొనె నలమేల్మంగ చెప్పేఁగా మాకిఁకను ॥మీకే॥ 191

దేసాళం

ఏమే పైఁడమ్ముఁలు పార నేల వేసేవు
ప్రేమతో నాతని నిఁక పిలువకుండేవా ॥ పల్లవి ॥

దూరి చెప్పి పంపితివి తొలుతనే విభునికి
యీరీతి మాటల నాతఁ డేమి సేసెను
గారవాన నీవతని కన్నులఁ గంటేను యీ -
నోరనే మంచిమాటలు నొడుగకుండేవా ॥ ఏమే ॥

తల వంచితి వాతఁడు తప్పక నిన్నుఁ జూడఁగ
యిలఁ బసలేనిపని కెంత పెంచేవే
చెలఁగి యాతఁడు నీచేయి వట్టి పెనఁగితే
నలిరేఁగి ఆమోమున నవ్వకుండేవా ॥ ఏమే ॥

కొంత గొంత గొణఁగేవు కోరి యాతఁ డంటఁగాను
యింతకు వచ్చెనా ఆతఁ డిది యేఁటిదే
యింతలో శ్రీవేంకటేశుఁ డిదివో నిన్నుఁ గలసె
పొంత నలమేల్మంగవు పొగడకుండేవా ॥ ఏమే ॥ 192

రేకు—734 శుద్ధవసంతం

అందు కేమి నిను నింక ననన య్యా
కిందటివలె నే కోపగించనయ్యా ॥ పల్లవి ॥

సన్నలు సేసితివి సమ్మతించి నవ్వితివి
కన్నులతుదలనే కదవయ్యా
నన్ను నేల మొరఁగేవు నా కేల వెరచేవు
పన్ని యాపె పిలిచీని పదవయ్యా ॥ అందు ॥

చెక్కులు నొక్కితివి చేతుల మొక్కితివి
యెక్కుడిసుద్దులు నింక నేఁటయ్యా
యిక్కడ నీయాన లేల యెవ్వరు వినేరు నేఁడు
అక్కడనే యేమన్నా ననవయ్యా ॥ అందు ॥

అందగాఁడ వైతివి ఆపెనే కూడితివి
చెందిన శ్రీవేంకటేశ చెల్లునయ్యా
అందరికంటె నెక్కుడు అలమేలుమంగ నేను
కందువ నన్నుఁగూడితి కానీవయ్యా ॥ అందు ॥ 193

నట్టనారాయణి

మాఁటలు నీ వాడినవి మరవమయ్యా
యేఁటికి వేగిరించక యిట్టె వుండవయ్యా ॥ పల్లవి ॥

మొక్కితిమి నాఁడె నీకు మొగము నోడితిమి
గుక్కుచు నల్లాడ నట్టే కూచుండేమయ్యా
యెక్కుడిసుద్దులు మమ్ము నేల కొంగు పట్టితివి
అక్కరతో నిం కొక్కమా టప్పటి వచ్చేమయ్యా ॥ మాఁట ॥

సేవ చేసితిమి నీకు చేరి పంత మిచ్చితిమి
తావుకుఁ బోయి నీమేలు తలఁచేమయ్యా
వేవేలు వచ్చెను మమ్ము వేఁడుకొనే వింత యేల
నీవద్ది కేపనికైనా నెలఁత నంపేమయ్యా ॥ మాఁట ॥

నీకొలువు సేసితిమి నిండాఁ దనిసితిమి
చేకొని నీవార మని చెప్పేమయ్యా
యీకడ శ్రీవేంకటేశ ఇట్టె నన్నుఁ గూడితివి
రాకపోకలకు నిన్ను రప్పించుకొనేమయ్యా ॥ మాఁట ॥ 194

## సామంతం

ఇంక నేతే యనుమాన మెన్నికలు తుద కెక్కె
సంకె దేరె నిదె మాకు చలివాసె మీకును ॥ పల్లవి ॥

సంగడి మీ రిద్దరును సరుసనే కూచుండి
కంగులేక బదుకరే కలకాలము
వుంగిటి నేనూ నుండే నొక్క మనసున నీఁక
వెంగె మాడితి నిన్నాళ్లు వెట్టిదాననై ॥ ఇంక ॥

రాకాఁ బోకాఁ గూడికూడి రాతిరీఁ బగలూ నిందే
యేకరాజ్య మేలరే యిద్దరూ మీరు
సాకిరిదొరనై వుండే సమ్మతించితిని నేను
కాకు సేసితి నిందాఁకాఁ గట్టిఁడనై మిమ్మును ॥ ఇంక ॥

ముంచినవేడుకతోడ మోహాపురతిఁ గలసి
మంచముపై నుండరే నెమ్మది నంటాను
అంచల శ్రీవేంకటేశుఁ డప్పటి నన్నుఁ గలసె
పొంచి నేరాలు వట్టితిఁ బొద్దువోక నిన్నును ॥ ఇంక ॥ 195

## కాంబోది

తా నెంత సేసెనో కాని తమకింతు నేనైతే
యీనేరుపే ఆపెకు మీ రెచ్చరించవలదా ॥ పల్లవి ॥

అంతచేసినచేఁతకు అంగన విభునిఁ జూచి
చింతించి యేమనెనే చెప్పరే మీరు
పంతమున నాబోఁటిపడఁతి నయితే నిందుకు
మంతనానఁ బట్టి సదమదముగఁ జేసును ॥ తానెం ॥

రాతిరి రానియందుకు రమణి యాతనిమీఁద
ఘాతల నెం తలిగెనే కాఁకతోడను
యేతుల నిట్లాఁగనక యిచ్చోటికి రాకున్న
కాతరాన నావంటిది కడమలు వాపును ॥ తానెం ॥

బలిమిఁ గూడినందుకు భామిని దా సిగ్గుపడి
యెలమి శ్రీవేంకటేశు నెంత నవ్వేనే
అలరుచు నింతలోన అతఁడె నన్నుఁ గూడె
యిల నాగుణముదైతే నిన్నిటా మెప్పించును ॥ తానెం ॥ 196

## భైరవి

ఏమివిన్నపాలు సేసే రెండాఁకా నాతనితోడ
తామన్నించినమన్నన తా నెరఁగఁడా ॥ పల్లవి ॥

వలె నని నన్ను నింతవలపించినట్టివాఁడు
తలఁచినప్పుడె రాఁ దా నెరఁగఁడా
చలి వాపి తనపొందుచవులు చూపినవాఁడు
తలఁగ కామీఁదిమాట తా నెరఁగడా ॥ ఏమి ॥

నగి నాతో నేకతాన నమ్మిక లిచ్చినవాఁడు
తగ నాకోప మోరువఁ దా నెరఁగఁడా
పగటుతో నన్నుఁ దొల్లి బలిమిసేసినవాఁడు
తగవు లన్నీ నడపఁ దా నెరఁగఁడా ॥ ఏమి ॥

చెనకి నాసిగ్గు వీడఁ జెయిచాఁచినట్టివాఁడు
తనివిఁ బొందించ నన్నుఁ దా నెరఁగఁడా
యెనసెను శ్రీవేంకటేశుఁడు తానైనవాఁడు
తననాసమేళములు తా నెరఁగడా ॥ ఏమి ॥ 197

ధన్నాశి

ఎంత మొగమాయపుమం దేమి దెచ్చుకొంటివో
అంతటినీసుద్దు లెల్ల అన్నియు మఱచెను ॥ పల్లవి ॥

ఆపసోపమున నీవు అందుండి వచ్చినవేళ
ఆపె నీతో నవ్వినది అరుదు గాదా
కోపముతోనే వుండె కోరి యిందాఁకా నైతే
యేపున నీమోము చూచి యింతలో మఱచెను ॥ ఎంత ॥

వింతచెమటలతోడ విసరించుకొనేవేళ
పంతాన నాపె చేకొనె భాగ్యము గాదా
చింతించె నీచేఁత లెల్ల చెలిచే విని యిందాఁకా
మంతనాన ని న్నాడేటిమాటలు మఱచెను ॥ ఎంత ॥

కందువఁ గరఁగి నీవు కన్నులు దేలించేవేళ
యిందుముఖి నిన్నుఁ గూడె నెన్నిక గాదా
చందపు(శ్రీ)వేంకటేశ చలాన నుండె నిందాఁకా
కుందులేనివేడుకతో కొసర మఱచెను ॥ ఎంత ॥ 198

రేకు—735 కేదారగౌళ

నేరుచుక తగిలేవు నే నీమాట లనఁగా నా -
పేరు కొని యింకా నేల పిలిచేవు నీవు ॥ పల్లవి ॥

నీలాగు నే నెరఁగనా నే నిన్నుఁ బైకొంటే
పేలరివై బిగిసేదిఁ బెనఁగేది
తాళలేక నీవలెఁ దగిలితి నింతేకాక
కేలు చాఁచింకేల పెనఁగేవు నాతో నీవు ॥ నేరు ॥

తొల్లియుఁ గలవెకాదా తొడికి నే యెక్కితేను
నెల్లవిరిగా నవ్వేది విట్టువిఁగేది
చెల్లుబడి చేసుకొని చెనకుదు నింతెకాక
వొల్లివొల్ల కిం కేల వొడివట్టేవు నీవు ॥ నేరు ॥

కారణము నేఁడు గంటిఁ గాఁగిట నే నినుఁ గూడి
యీరీతిఁ జవిసేసేది యిచ్చగించేది
గారవించి నన్ను శ్రీవేంకటేశుఁడ కూడితివి
మేర మీరి సారె నేల మెచ్చేవు నీవు ॥ నేరు ॥ 199

## సామంతం

తమకమే నీకు నాకుఁ దగుఁ గాక
జమళిసిగ్గులు నేఁడు సారెకు నేలే ॥ పల్లవి ॥

చక్క నే నాఁడేటి పెండ్లిసందడిలో నీచన్నులు
యిక్కువల నన్నుఁ దాఁకె నిఁక నేలే
పిక్కటిల్లఁ గోరి వేఁడి పేరటము వచ్చితివి
మక్కువ వెనకతియ్య మరి యేలే ॥ తమ ॥

పచ్చఁ గాఁగ నీవు నాకు పసపులు నలచఁగా
హెచ్చి నీగోరిదే తాఁకె నిఁక నేలే
అచ్చు మోవ నీవు నాఅంగము లంటుకొంటివి
తచ్చి నే నిన్నుఁ జూడఁగాఁ దలవంచ నేలే ॥ తమ ॥

అనువుగా నీవు నాకు నారతు లెత్తఁగా నే
యెనసె నీడలఁ గాఁగి లిఁక నేలే
చెనకి కూడితి నిన్ను శ్రీవేంకటేశుఁడను నేఁ
దనిసితి వీసుద్దులు దాఁచ నేలే ॥ తమ ॥ 200

## హిందోళవసంతం

పో పో యింకా నేఁటికి పొద్దువోదా
పైపై నీకు మొక్కేము పదివేలు వచ్చెను ॥ పల్లవి ॥

సారె నీవు మోహించినసతిమాటలే కాక
వీరివారివిన్న పాలు విందువా నీవు
కారణము లేక నీతోఁ గతలెల్లాఁ జెప్పి నేను
నేరనైతిఁ గాక అంత నీవు మోసపోదువా ॥ పోపో ॥

యిన్నిటా నిన్ను జంకించేయింతి వాకిలే కాక
కన్నవారివద్ద నెల్ల కాచుకుండేవా
పిన్నతనమున నేనే పెనఁగి వట్టిజోలిని
వున్నదానఁ గాక నీవు వొకరిఁ గైకొందువా ॥ పోపో ॥

వూడిగపుచెలితోనే వోరి నవ్వుదువు గాక
యేడోనారితో సరసా లిట్టే యాడేవా
వేడుక శ్రీవేంకటేశ వెస నన్నుఁ గూడితివి
యేడా నేనే కాక నీవు యెఱఁగనివాఁడవా ॥ పోపో ॥ 201

## లలిత

ఇంతటినీచేఁతలు నే మెరిఁగితే నేమాయ
వింతవారమా నీకు వెలు పేల నేఁడు ॥ పల్లవి ॥

యింతి నీకడకు వచ్చె నిట్టె నీచేఁతలు మెచ్చె
మంతనాన నీకు నిట్టె మన సిచ్చెను
యెంత లేదు నీసంతోస మేమని చెప్పుదు నిఁక
చెంతల నామోము చూడ సిగ్గేల నీకు ॥ ఇంత ॥

వనిత నీకు మొక్కె వలపులు దల కెక్కె
చెనకులకే నీచేతఁ జిక్కెను
ఘన మాయ నీవేడుక కళ లెట్టు పొగడుదు
ననుపుల నామాటకు నవ్వు లేల నీకు ॥ ఇంత ॥

అంగన మోహము నించె నాయములు గగిఁగించె
యింగితాన నీపంత మిచ్చగించెను
సంగతి శ్రీవేంకటేశ సరి నన్నుఁ గూడితివి
యెంగిలిమోవినే యెలయింపు లేల నీకు ॥ ఇంత ॥ 202

సింధురామక్రియ

ఆపె నిన్ను నిష్ఠూరము లాడఁజాలదు
యేపున నేమే నీకు నెచ్చరించవలసె ॥ పల్లవి ॥

తిలకించి చూడ నేల తెల్లవారినందాఁకా
మలకలమాట లేల మాపుదాఁకాను
నిలుచున్న దదివో నీయెదుటనే యింతి
వలసినట్లఁ జేయి వద్దనము నిన్నును ॥ ఆపె ॥

వట్టియాసలు రేఁచేపు వలసినోల్లములను
అట్టుగా నూరకుండే వాఅడితోడను
యెట్టూ ననలేక యాపె యింటిలోఁ గాచుకున్నది
కట్టుకో అందలిమేలు కాదనము నిన్నును ॥ ఆపె ॥

తిరనిసినవ్వులనే తెలియనీవు నీగుట్టు
నేరుపు నీప్రియములనెయ్యము బెట్టు(?)
కూరిమి శ్రీవేంకటేశ కూడితివి మాచెలిని
నీరపము లాయ నిఁక నేర మెంచ నిన్నును ॥ ఆపె ॥ 203

మాళవిగౌళ

నీ వేల వాదడిచేవు నే మెరఁగమా
లోవెలుతులు మాచేతిలోనివే కావా ॥ పల్లవి ॥

ఆగడీఁడ వని నే నిన్నపుడు దూరినందుకు
చేగిరపడేవు నీవు వింతవాఁడవా
చేగమీరినకోపము చెలులకుఁ జెల్లుఁగాక
భోగములో బిగువులు పురుషుల కేఁటికి ॥ నీవే ॥

అడియాలా లెల్లాఁ జూచి అట్టె నేఁ దిట్టినందుకు
కడునెగ్గులు వట్టేవు కడవాఁడవా
విడువక వెంగే లాడ వెలఁదుల కగుఁ గాక
వడితోఁ బంతాలు మగవారి కేఁటికి ॥ నీవే ॥

నయ మిచ్చి నే నీతో నవ్వులు నవ్వినందుకు
ప్రియాలు చెప్పే వదేమి పిన్నవాఁడవా
దయతో శ్రీవేంకటేశ తగ నన్నుఁ గూడితివి
నియమాలు మాకే కాక నీకేఁటికి ॥ నీవే ॥ 204

రేకు—786 ఆహిరి

ఇంతటికలికిగదే యీ లేమ
పంత మాడీఁ బై పై నే పతితోను ॥ పల్లవి ॥

చెక్కుమీఁదఁ జెయి వెట్టి సెలవుల నవ్వు నవ్వి
యెక్కడో సిగ్గులు వెంచీ నీలేమ
ముక్కుమీఁద వేలు మోఁపి ముంగురులు గోర దువ్వి
మిక్కుటమై లెక్కవెట్టీ మించినజవ్వనము ॥ ఇంత ॥

కన్ను లిట్టె యరమోడ్చి కందువనే కూచుండి
ఱయెన్నో చేఁతలు సేసీ నీలేమ
సన్నపుఁ బెలుఁగు లెత్తి సరసపుమాట లాడి
పన్ని దొంతరలు వెట్టీ భావపుమోహనము ॥ ఇంత ॥

కొనకుచములు చూపి కొంకుచుఁ బయ్యద గప్పి
ఱయెనలేక మెరసీని యీలేమ
ఘనుఁడు శ్రీవేంకటేశుఁ గలసి యింతటిలోనె
పెనచీఁ దనమేన పెక్కువసింగారము ॥ ఇంత ॥ 205

దేశాక్షి.

ఇందాఁకా నే నోరిచితి నింతేకాక
మందలించకుండితేను మట్టున నుండేవా ॥ పల్లవి ॥

పట్టినచలము నీతోఁ బడి తాళించినఁ గాక
యిట్టె వుండితే నీచిత్త మేల వచ్చును
చిట్టకపుబత్తు లెల్లాఁ జేసి వేసరితి నీవు
అట్టునట్టు నించుకంతా నైనా నెరిఁగితివా ॥ ఇందాఁ ॥

ఱయెగసక్కెలకు నిన్ను నింతేసి సేసినఁ గాక
జగతిలో నీ వేల చక్కనుందువు
మొగమిచ్చుమాట లాడి ముందే యన్నీఁ జూచితిని
తగ వించుకంతైనా తరి నడపితివా ॥ ఇందాఁ ॥

కలిమిఁ గాఁగిట నిన్నుఁ బట్టి కూడితేఁ గాక
కలసి నీవే యేల కైకొందువు
ఱయెలమి శ్రీవేంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
వలచి యిన్నాళ్లు నావద్దికి వచ్చితివా ॥ ఇందాఁ ॥ 206

వరాళి

విన్నపము సేయ మాకు వేసటయ్యీని
యిన్నిటా నీజాణతన మెన్నటికో కాని ॥ పల్లవి ॥

యెదుట నీమోము చూచి యిక్కువలు గరఁగఁగ
పొదిగొనఁ బులకించె పొలఁతికిని
చెదరెఁ గస్తురిబొట్టు శిరసుతురుము జారె
యిదివో నీదయ యింక నెన్నటికో కాని ॥ విన్న ॥

మంచినీమాఁటలు విని మనసు నీపైఁ బారఁగ
యించుకంత చెమరించె నింతిమే నెల్లా
మించెను నిట్టూర్పులు మెరసె తెగున లెల్ల
యెంచేటినీ వావు లిఁక నెన్నటికో కాని ॥ విన్న ॥

సంగడిఁ గూచుండి నీతో సరసము లాడఁగాను
రంగుఁదమకము లెక్కె రమణికిని
అంగవించి శ్రీ వేంకటాధిప కూడితి విదె
యింగితపునీప్రియము లెన్నటికో కాని ॥ విన్న ॥ 207

దేసాళం

అన్నియుఁ జక్కజాడల నడిగేఁ గాక
కన్నుల నన్నేల కడుగద్దించేరే చెలులు ॥ పల్లవి ॥

మేర మీర కాతనితో మెచ్చుగా మాటలాడేను
వూరకుండ రాదా మీ రొకరొక రే
యీరీతి నాతని నే నేమైనాఁ దిట్టితినా
వోరియంటినా కాక వొద్దైనాఁ బట్టితినా ॥ అన్ని ॥

సన్నల నా తనివాదు చాయలకు దిద్దేను
నన్నుఁ జూడరాదా కొంత నవ్వుతానే
చిన్ననై ఆతనిమీఁద చేతులు చాఁచితినా
వెన్నె లివేడ(?) వంటినా వేగిరపడితినా ॥ అన్ని ॥

కరఁగించి యాతని నే కాఁగిటనే కూడేను
తరవులఁ బెట్టకురే దగ్గర మీరు
అరుదై శ్రీ వేంకటేశుఁ డాతఁడె నన్నుఁ గలసె
వరుస లడిగితినా వావులు చెప్పితినా ॥ అన్ని ॥ 208

దేవగాంధారి

ని న్నేమని పొగడుదు నీ వింత సేసినందుకు
కన్నుల నే జంకించితే కరుణఁ జూచితివి ॥ పల్లవి ॥

అప్పటప్పటికి నేము ఆడేవెల్లా వెంగెములే
తప్పులెల్లా నోరుచుకో దండము నీకు
చెప్పేవారిమాట విని చేరి మే మలుగుదుము
యెప్పుడు నిండుదొరవు యెగ్గు లెంచవైతివి ॥ నిన్నే ॥

కావరించి కినుతుము కలఁతుము నీమనసు
వేవేలు నోరుచుకొమ్మి వేఁడుకొనేము
వావి మాకుఁ గద్దుగాన వడిగానే నవ్వుదుము
భావించ జాణవు గాన పంత మాడవైతివి ॥ నిన్నే ॥

చెంగట నుందుము గాన చెనకితి మెంతైన
అంగవించుకొమ్మి యిచ్చనైనఁ జేసేము
రంగుగా శ్రీ వేంకటేశ రతిఁ గూడితివి నన్ను
సంగతి మించితిగాన చనవు లిచ్చితివి ॥ నిన్నే ॥ 209

శ్రీరాగం

ఊడిగపుచెలులము వొద్దనుండేవార మింతే
పాడిపంతముల నీపనులు దిద్దేమా ॥పల్లవి॥

భావములోపలిచింత పడఁతివుండినబాగు
దేవరకే తెలుసు నంతేసి మాకేల
కావించి పెక్కుసతుల కాఁక (?) దేరినవాఁడవు
నీ వెరఁగవా నీకు నే విన్నవించేనా ॥ఊడి॥

యేచినవట్టివొట్లు యింతికాఁతాళములును
నీచిత్తమె యెరుఁగును నీతో మాకేల
చేచేత నన్నియుఁ జేసి చెల్లించుకొన్నవాఁడవు
యీచిక్కు వాపఁగ లేవా యేల మమ్మడిగేవు ॥ఊడి॥

అన్నిటాఁ దగ వెరిఁగి అతివఁ గాఁగిటఁ గూడి
మన్నించ నీవె నేర్తువు మాట మాకేల
యెన్నికై శ్రీవేంకటేశ యియ్యకోలైనవాఁడవు
సన్నల మెచ్చుఁగ లేవా చలమెల్లఁ దేరెను ॥ఊడి॥ 210

రేకు 737 కొండమలహరి

ఇంచుకంత గుట్టెరఁగ వేరా నీవు
చంచుల నీ విట్లైతే సరకు సేయురా ॥పల్లవి॥

కప్పుర మియ్యకతొల్లే కడు వేగిరము నీకు
అప్పుడె కాఁగిట నన్ను నప్పళించేవు
వుప్పటించి యిది చూచి వున్నబోఁటి ఆఁటదైతే
చిప్పిలఁగ సేయఁగలసేఁత లెల్లఁ జేయదా ॥ఇంచు॥

ఆకు మడి చియ్యఁగానే ఆయము లంటి నన్ను
చేకొని మైమఱపించి చిమ్మి రేఁచేవు
కాకరిఁతులు నీకతలెల్లాఁ జూచితేను
మేకులకు నీతో మందెమేళమున నుండరా ॥ఇంచు॥

పనివడి నే నిట్టే పానుపు వరచఁగానే
గొనకొని నన్నుఁ గూడి కొంగు వట్టేవు
యెనయుచు శ్రీ వేంకటేశ యితరులై తేను
చనవు మెరసి నిన్ను చలము సాదించరా ॥ఇంచు॥ 211

## గుజ్జరి

అన్ని పనులును తొల్లి అయినవి నీకు
సన్నలఁ దిరిగి నేమే సటలు సేసితిమి ॥పల్లవి॥

మోము చూచి నవ్వే నాపె ముచ్చట నీతో నాడె
భామిని యెవ్వరితోడిపొంగె మేల
చేముట్టి యితరు లిఁకఁ జెనకితే చవులౌనా
కామించి వచ్చిన మాదే కల్ల గాక ॥అన్ని॥

వొఱపు గలాపె నిన్ను నొరసెఁ జన్నుల నిట్టె
యెఱఁగనివారిపొందు లేల నీకు
గుఱిగా నిన్నుఁ బట్టితే కూళతన మిఁక రాదా
మఱచి నీతో నింతేసిమాటాడితిఁ గాక ॥అన్ని॥

పంతమే నెరపె నాపె పనులెల్లఁ జేసె నేఁడు
యింతకంటె నున్నదా యెవ్వరిమేలు
చెంతల శ్రీ వేంకటేశ చేకొని కూడితి నన్ను
అంతలో వేగిరించితి నవ్వు గాదు గాక ॥అన్ని॥ 212

దేశాక్షి

అంపరాదా గురుతులు అందాఁకాను
యింపులే చల్లి నిన్ను యెనయుదాఁకాను ॥పల్లవి॥

అంగన నీపాదుకలు అంపుమనె నిన్నాడకు
చెంగట నీవు విచ్చేసినదాఁకాను
వుంగరమే పూజించుక వుండే ననె నీమారు
కంగుదీర నీరూపము కన్నదాఁకాను ॥అంప॥

నీపదాలు వినిపించేనెలఁతల నంపుమనె
ఆపొద్దు నీతో మాటలాడుదాఁకాను
యేపున విందాయితము యిట్టె సేసుకుండే ననె
చేపట్టి నీవు దన్ను మెచ్చినదాఁకాను ॥అంప॥

తలఁపు లోఁ గలిగి నీసమ్మోలమె యంపుమనె
నిలిచి నీరతుల మన్నించుదాఁకాను
అలరి శ్రీ వేంకటేశ ఆపె నిట్టె కూడితివి
కలసి తా నుండే ననె కమ్మటి నిందాఁకాను ॥అంప॥ 213

రామక్రియ

ఏరా నీజాణతన మిటువంటిదా
కోరిక చేకొనకుండే కూళతన మనరా ॥పల్లవి॥

గందము పూసేచెలిఁ గన్నులనె జంకించేవు
అందులోనే కొనగోరు అంటించె నని
కందువలు సోఁకితేను కళ దాఁకు మేలుగాదా
అంది నీ కితవు సేసినది నేర మాయనా ॥ఏరా॥

కొప్పు వెట్టఁగా సతిని గొరబుమాట లాడేవు
చెప్పరానిసేఁత నేమో సేసె నని
చొప్పు లీపాటి గలితే చుట్టరికాలు మించవా
యిప్పుడు సేసినసేవ లింతదోస మాయనా ॥పరా॥

పవళించి వున్ననిన్నుఁ బ ట్టెత్తితే నవ్వేవు
రవళిఁ జేసినది సురత మని
యివల శ్రీ వేంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
జవళి సిద్ధగమైతే జయమే కాదా ॥పరా॥ 214

## శంకరాభరణం

కన్నాగము తనకత లెల్లా
పన్నినమాయలఁ బదిగో ట్లాయ ॥పల్లవి॥

కన్నులఁ జూచీఁ గడుఁ దలవంచీ
యెన్ని లేవు తనయెమ్మె లివి
సన్నల గిరిపీ సారెకు నవ్వీ
నిన్నట నేటనె నేరజాణాయ ॥కన్నా॥

చేతులు చాఁచీఁ జేఁతలు చెప్పీ
యీతలఁ దను నే నెరఁగనిదా
రీతులె వెదకీ రేసులె యణఁచీ
జాతులఁ దన కివి సహజము లాయ ॥కన్నా॥

బుద్ధులు చెప్పీఁ బొరుగులు మెట్టీఁ
గద్దులే తనకుఁ గలిగినవే
వొద్దనె శ్రీ వేంకటోత్తముఁడు నన్ను
ముద్దులఁ గూడఁగ మోహన మాయ ॥కన్నా॥ 215

నాదరామక్రియ

ఇటువి యెఱఁగమైతి మిందాఁకాను
ఘటన లిన్నియు మీకె కలిగెనో కాక ॥పల్లవి॥

పవ్వళించి యింటిలోన పానుపుపై నీవుండఁగా
యెవ్వతే లేపదాయ యిందాఁకాను
నివ్వటిల్ల నీకు నంత నిదు రున్నదా తొల్లి
వువ్విళ్ళూర నేదో కాచుకున్నాఁడవు గాక ॥ఇట॥

వోరగాఁ దలుపు మూసు కొక్కఁడవే వుండఁగాను
యేరమణి దగ్గరదు యిందాఁకాను
ఆరయ నీకు నెంతైనా నలుక వున్నదా తొల్లి
వూరకె యేటికో కాచుకున్నాఁడవు గాక ॥ఇట॥

కరఁగి కరఁగి నీవు కన్నులు మూసుకుండఁగా
యె(యి?)రవు చేకో దెవ్వతే నిందాఁకాను
యిరవై శ్రీ వేంకటేశ యింతలో నిన్నుఁ గూడితి -
వొరయ నేఁటికో కాచుకున్నాఁడవు గాక ॥ఇట॥ 216

రేకు 738 మధ్యమావతి

ఇచ్చకమె సేయవే యీచలము మానవే
ముచ్చటకు వచ్చు సరిమోహాము లై తేను ॥పల్లవి॥

ఆసలు రేఁచి యాతఁ డట్టె నిన్నుఁ జెనకఁగా
వాసులకే పెనఁగేవు వద్దే యింత
పూస గుచ్చినట్టు నీకు బుద్దులు చెప్పితిఁగా
రాసి కెక్కఁ గోమలము(లు?) రాజుల చిత్తములు ॥ఇచ్చ॥

చేయి వట్టి నీవిభుఁడు చెక్కులు నిన్ను నొక్కఁగా
రాయడించి మాటలాడేరాఁపు చెల్లదే
నీయితవు నేఁ గోరి నిండుకొని వున్నదాన
వోయమ్మ ఆతని నింత వొరయఁగ నేఁటికే ॥ఇచ్చ॥

శ్రీ వేంకటేశుఁడు నిన్నుఁ జేకొని కాఁగిలించఁగా
భావించుకో నిఁక నేల పైకొనరాదా
నీవునాతఁ డుఁగూడిననేమము నే నెరుఁగుదు
దైవ మొక్కటిగాఁ జేసె దయగలఁ డాతఁడు ॥ఇచ్చ॥ 217

ఆహిరి

వాఁడు నాపైఁగల్రపేమ వడి నందె తెలిసెను
పోఁడిమి నాతో నిట్టె బొంకకువే చెలియా ॥ పల్లవి ॥

విన్నవించినమాటకు వేడుకపడెనో లేదో
తిన్ననినవ్వుతో సమ్మతించెనో లేదో
వన్ని నీమీఁద నట్టె పరాకై వుండెనో లేదో
యిన్నిటా నాకే మేలు యెరిఁగించఁ గదవే ॥ వాఁడు ॥

దగ్గరి మీతో నేకతము లాడెనో లేదో
బెగ్గిల నీ వన్నయాన పెట్టెనో లేదో
యెగ్గులేక నిన్నుఁ గని యెదురు వచ్చెనో లేదో
సిగ్గు దీరఁగఁ జెప్పి నాలో చింత వాపఁగదవే ॥ వాఁడ ॥

కిమ్ముల నీవెంటనే వాకిటికి వచ్చెనో లేదో
చిమ్ముల నాపంత మీఁదేర్చెనో లేదో
అమ్మరో శ్రీ వేంకటేశుఁ డదె నన్ను నిట్టె కూడె
పమ్మి వానిగుట్టు నాతోఁ బచరించఁగదవే ॥ వాఁడు ॥ 218

ఆహిరినాట

ఇంత గయ్యాళితనము లేమి నేరుచుకొంటివి
చెంతలనే మీఁదచెత్తు చెప్పితిఁ జుమ్మీ ॥ పల్లవి ॥

నాతోనే సారె సారె నవ్వేయందు కనను
ఘాతల మొదల నీవు గబ్బివాఁడవు
యేతుల కెవ్వతెనైనా నిట్లానే నవ్వఁబోతే
బూతులఁ దిట్టఁగాను వోపుదువా వినను ॥ ఇంత ॥

చేనంటి నీవు నన్నుఁ జెనకేయందు కనను
పానిపట్టి యెప్పుడూను పల్లదీఁడవు
మానక నీ వూరివారిమానము దొడుకఁబోతే
పూని యేమి సేతురో నీబుద్ధి నీ వెరఁగవా ॥ ఇంత ॥

గక్కన బలిమి నన్నుఁ గాఁగిటఁ గూడితి విట్టె
చక్కఁదనముల మంచిజాణకాఁడవు
యెక్కువ శ్రీవేంకటేశ యిఁకఁ గడలు దొక్కితే
యిక్కువ లంటుచు నేనే యేమని నిన్నందునో ॥ ఇంత ॥ 219

నీలాంబరి

చిత్తము వచ్చినప్పుడు చేకొని మన్నించనీ
తత్తరము తనమీఁదఁ దరవు వెట్టితిని ॥ పల్లవి ॥

తనరూపమే మతిఁ దలఁచుక వున్నదాన
అనుచు నెవ్వరితోడ నాడుకోఁ గాని
యెనలేనితనచిత్త మెట్టైనా నుండనీ
తనువుఁ జైతన్యము తనకే యెక్కినది ॥ చిత్త॥

కిమ్ములఁ దా నన్నీ నెరిఁగీ నని వున్న దాన
యెమ్మె లితరులవలె నెచ్చరించను
సమ్మతించి తన కవి చవియైనప్పుడు గానీ
తమ్మిరేకులకన్నులు తనమీఁద నున్నవి ॥ చిత్త ॥

గక్కనఁ దాఁ గూడఁగాను కానిమ్మని వున్న దాన
వెక్కసమై యిఁక నేమి వెగ్గళించేనా
యిక్కువ శ్రీ వేంకటేశుఁ డితఁడె నావస మాయ
తక్కినపనులెల్లాను తనచేతిలోనివి ॥ చిత్త ॥ 220

సాళంగనాట

వేరె నే నేమి సేసినా వెంగె మయ్యీని
పోరచి పొరుగు మీరే బుద్ధి చెప్పరమ్మా ॥ పల్లవి ॥

దగ్గరి తనతో నేను తగుల నాడితి నని
సిగ్గువడి వున్న వాఁడు చెక్కుచేతితో
అగ్గలమై నే మొక్కితే నంతకంటెఁ దలవంచీ
వెగ్గళమై మీరైనా వేఁడుకోరే చెలులు ॥ వేరె ॥

ఆరసి యెందుంటి వని యడిగినమాత్రమున
మోర వంచు కున్నాఁడు మౌనముతోడ
సారె నే బుజ్జగించితే సరి నెంతైనా నమ్మఁడు
ఆరితేరి నామారు మీ రానవెట్టుకొనరే ॥ వేరె ॥

గక్కన నేఁ దనుఁ జూచి కాఁగిలించుకొన్నందుకు
మక్కువతో నన్ను మెచ్చీ మాటిమాటికి
యెక్కువ శ్రీ వేంకటేశుఁ డెందుకైనా నవ్వు నవ్వీ
నిక్కము నే నియ్యకొంటి నిజము తెలుపరే ॥ వేరె ॥ 221

సామంతం

ఎన్ని జాలు సేసేవు యేల నమ్మేను
అన్నియును నాయనాయ అప్పటి నామాటలు ॥ పల్లవి ॥

నన్నుఁ బిలువఁగ నంపి నాకంటె మునుప నొక్క -
కన్నియ వచ్చిన నాపెఁ గైకొనేవు
యెన్నరానిసటకాఁడ వేపాటిగలవాఁడవు
పన్ని యాచేతుల నీవు పట్టకుమీ నన్నును ॥ ఎన్ని ॥

నా కెదురు చూచిచూచి నడుమ నొక్కతె వచ్చి
పైకొంటే నాపెమీఁదనే పరాకైతివి
ఈకొలఁదివాఁడవా నీ వింతలాబగాఁడవా
కాకుగా నాపచ్చడమే కప్పకుమీ నాకును ॥ ఎన్ని ॥

చిత్తము నామీఁదఁ బెట్టి చెవిలో నొక్కతె వచ్చి
వొత్తి విన్నవించితేను వొడఁబడేవు
యిత్తల శ్రీవేంకటేశ యిటు నన్నుఁ గూడితివి
వొత్తులవలపు చల్లి పోకుమీ యిఁకను ॥ ఎన్ని ॥ 222

రేకు—739 ఛాయానాట

గరిమె నెరిఁగికొందు గాని నా విన్నపము
విరహానఁబొంది నిన్ను వేసరించఁ జుమ్మీ ॥ పల్లవి ॥

కావరించి పడ నోప కాంతల దూరా నొల్ల
నీవారమై నేము నిందుకుండేము
యేవేళ నీ కితవాయ నింటి కిట్టె విచ్చేయు
కావించి నాయంత నిన్నుఁ గస్తిఁ బెట్టఁ జుమ్మీ ॥ గరి ॥

వంతువాసు లడుగను వచ్చి వచ్చి యలుగను
వింతగా నీమేలెల్లా వినుచుండేము
అంత నాతో పొందు తగవై తేనే చేకొను
పంతాన వట్టిచనవు పచరించఁ జుమ్మీ ॥ ౨౨౨ ॥

మేర మీర నీయడకు మేనవావిఁ బెనఁగను
వోరిచి నీవలపుల నోఁలాడేము
యీ రీతి శ్రీవేంకటేశ యింతలో నన్నుఁగూడితి-
వారయ నిన్ను నిఁక నలయించఁ జుమ్మీ ॥ 223 ॥

## శుద్ధదేశి

చక్క సాగిలి మొక్కేము చాలించరాదా
మొక్కుకు మొక్కఁగఁ బోతే ముగియ దెంతైనా ॥ పల్లవి ॥

మాటకు మాటలాడ మరి యంతేసి నేరవు
యేఁటికి మాతో వాదు లేల పెంచేవు
చీటికిమాటికి నట్టె చీలకుఁ జీల వెట్టితే
కోటానఁగోటిఁ జాలవు కొండమాకు లెల్లాను ॥ చక్క ॥

చేఁతకుఁ జేఁత సేయఁ జేరి యంతేసి నేరవు
యీఁతవలపులు మాపై నేల పెంచేవు
పూఁతకుఁ బూఁత గోడ పుయ్యఁగఁ బుయ్యఁగఁ బోతే
ఛాఁతిపడి భూమెల్లాఁ బట్టు నెంతైనాను ॥ చక్క ॥

నవ్వుకు నవ్వులు నవ్వ నాలి యెంతేసి నేరవు
ఆవ్వల నవ్వల మమ్ము నేల రేఁచేవు
రవ్వగా శ్రీవేంకటేశ రతి నన్నుఁ గూడితివి
దివ్వెను దివ్వె ముట్టించితే దీపములే నిండును ॥ చక్క ॥ 224

ఆహిరి

కరుణించవయ్యా యీకడమ తేల
వర మిచ్చితివి తొల్లె వలెనా యీబాసలు ॥పల్లవి॥

యేమి గట్టుకొంటి వింతేసిచేతలు సేసి
కామిని నేచగా నెంతకండ వచ్చెను
తేమ రేగె జూపులు తెల్లవారె మాపులు
వాము లాయ నీపై నింకా వలెనా రారాపులు ॥కరు॥

పొద్దు వొద్దు నిందునంక పుణ్య మెంత చేరె నీకు
వద్దికి రాక యెంత వన్నె కెక్కేవు
తిద్దరాదు వలపులు తీగెసాగె మెలుపులు
పెద్దరికముతో నింత ప్రియమా పిలుపులు ॥కరు॥

యేతులకు నవ్వు నవ్వి యెంతజాణడ వైతివి
యీతలివా రెల్ల నిన్ను నెంత మెచ్చిరి
చేతికి లోనై కూడితి (శ్రీ) వేంకటేశ మాచెలిని
బూతులు ఘాతలు నీకె పొసగె నీనీతులు ॥కరు॥ 225

మంగళకౌశిక

ఎవ్వరు బుద్ధులు చెప్పే రీతని కిక
కవ్వకవ నవ్వీ లోకము మెచ్చునలదా ॥పల్లవి॥

వొక్క టొక్కటె గడించి వూరకె తా ముట్టుకొని
చక్కగానే మాటలాడీ జాణడే వీడు
తెక్కులతో నింటివారు తిరిగి రా నుండగానే
చెక్కు నొక్కి సన్న సేసీ సిగ్గువడ వలదా ॥ఎవ్వ॥

చేరి విడె మిచ్చిని చేతులు పై( జాఁచీని
సారెకు నానలువెట్టీ జాణఁడే వీఁడు
మోరతోపున నిందరు ముసగస లాడఁగానే
అరసి పైకొనీ కొంత ఆచారము వలదా ॥ ఎవ్వ ॥

యీపొద్దు నామంచ మెక్కి యెంతకాకు సేసీని
చాపలపుగుణములజాణఁడే వీఁడు
యేపున శ్రీవేంకటేశుఁ డితఁ డిట్టె నన్నుఁగూడె
యీపాటివాఁడు గుట్టు ఇంచుకైనా వలదా ॥ ఎవ్వ ॥ 226

## హిందోళం

వేగిరింతు నిన్నాళ్లు వెట్టిదాననై నిన్ను
నీగురుతుదాననై నిండుకుండేఁ జాలును ॥ పల్లవి ॥

మాపుదాఁకానే నెంత మతి నిన్నుఁ గోరినాను
రాఁపుల నీచిత్తము రావలెఁగా
యేపున నిన్ను దూరి యెందాఁకా వేసరించేను
కైపగు నీచెలులతోఁ గడనుండేఁ జాలును ॥ వేగి ॥

తల్లడించి నీకుఁగా నే తప మెంత సేసినాను
పొల్లులేనిదయ నీకుఁ బుట్టవలెఁగా
ఇల్లిదె బలిమి వల పెటువలె నీడేరు
వొల్లనాలనైనా నీవొద్ద నుండేఁ జాలును ॥ వేగి ॥

కమ్మటి నేనే నిన్ను కాఁగిట బిగించినాను
సమ్మతించి అప్పణియ్యఁ జాల వలెఁగా
యిమ్ముల శ్రీవేంకటేశ యింత సేసి కూడితివి
రమ్మనిపించుక నీతో రతికెక్కేఁ జాలును ॥ వేగి ॥ 227

భైరవి

నేనే నీవలలఁ బడి నేరనైతిఁ గాక యింత
మేనరికము చెప్పితే మెచ్చవా మమ్మును ॥పల్లవి॥

తలఁతువు గాక నీవు దవ్వుల నుండినవారి -
యలరి వద్ద నున్న నే మంత సరకా
అలిగినసతులకే అంతకూ మొక్కుదు గాక
కలసి యిచ్చ లాడితేఁ గైకొనేవా మమ్మును ॥నేనే॥

యెదురుచూతువు గాక యెరవులవారికే
వదలక యింటివారివంక చూచేవా
చెదరక తరితీపు సేసేవారే చవి గాక
పదరితే సులభానఁ బైకొనేవా మమ్మును ॥నేనే॥

పొగడుదు వింతే కాక పొరచివారిమాటలు
తగవైనా మామాఁటలు తగు ననేవా
నగుతా శ్రీ వేంకటేశ నన్ను నిట్టె కూడితివి
జిగి నింత సేయకున్నఁ జెనకేవా మమ్మును ॥నేనే॥ 228

రేకు-740 వరాళి

నీ విందు విచ్చేయుదాఁకా నిలిచితిమి
యేవివరమున రతి కెక్కేనో కాని ॥పల్లవి॥

నిండిననామతిలోన నీరూపే తలపోసి
కొండవంటికోరికెలే కోరుచుందును
దండిసంతసములనే తగ దొబ్బితిఁ బొద్దులు
పండి యిటమీఁద నెట్టు బలికేనో కాని ॥నీవిం॥

కందువసుద్దులు కొన్ని కల్పించుకొని నీతో
అందాన నాలోనే మాటలాడుచుందును
అంది యీమనోరథాల నాఁపితి విరహ మెల్ల
కిందు మీఁదు నిఁక నెట్టు గెలిచేనో కాని ॥ నీవిం ॥

అట్టె యేకతమునేటిఅమృతలహరిలోన
గట్టిగా నీకాఁగిట నేఁ గలశుంటిని
నెట్టన శ్రీవేంకటేశ నేఁడు నన్నుఁ గూడితివి
మట్టుతో నెట్లు నిన్ను మరపేనో కాని ॥ నీవిం ॥ 229

## కన్నడగౌళ

నే మింత విభునిఁ జేయనేరమమ్మా
వేమారు నీపెచేఁతలు వినరమ్మా ॥ పల్లవి ॥

అట్టె వూడిగపుసతి నండఁ బెట్టుకొని వచ్చి
గట్టిగాఁ జీఁకటిలోనఁ గాఁగిలింపించు
అట్టు నేసి కవ్మటి నాఅడికిఁ దానే కలయు
వట్టిపొందు కాపె నే వద్దఁ బండఁబెట్టును ॥ నేమిం ॥

అలుగు నాతని మొక్కు కాపెపాదాలు చాఁపించు
పలుకుఁ దా నాసతిచే బాగా లిప్పించు
అలయించి తొలుత నే ఆతనిఁ దా నొత్తి కూడి
వలపు లాకెచే మఱి వడి రేఁచఁ జేసును ॥ నేమిం ॥

అతనివేలివుంగరా లట్టె తాఁ బెట్టుకొని
పతిగా నాపెమట్టెలు పతి కందించు
యితవై శ్రీవేంకటేశు నిటువలెఁ దాఁ గూడి
మతకాన కాపెచేత మాటలాడింపించును ॥ నేమిం ॥ 230

## మంగళకౌశిక

సిగ్గునడ కప్పటిని చెయివట్టే వాతని
అగ్గలమై కాలుదొక్కే వౌనే లెస్సాయనే ॥ పల్లవి ॥

నీకొలఁదివారలా నెయ్యపుఁజనవరులు
చేకొ నాతనిఁ జేఁతలు సేసిరి తొల్లి
సాకిరియై నే నుండఁగా సంగడిఁ గూచుండవచ్చే-
వీకడ నీతనికి నీ వేనాఁటిదానవే ॥ సిగ్గు

యీపాటిదొరతనమా యిన్నాళ్లు నాతనివద్ద
నాపతి యనుచుఁ బైపై నవ్వినవారు
యేపున నే మిద్దరమూ నేకతాన నుండఁగాను
పైపైఁ బిలిచేవు నీబలు వేఁటిబలువే ॥ సిగ్గు ॥

యింత నేరకుండిరా యిన్నాళ్ల వా రితని
పంతాన చేతులు చాఁచి భ్రమయించను
అంతటా శ్రీవేంకటేశుఁ డాదరించి నన్నుఁ గూడె
వంతుకు లాసేవు యింక నద్దు వద్దు రాకువే ॥ సిగ్గు ॥ 231

## సౌరాష్ట్రం

చూడవో (వే?) వట్టివలపు సూటిఁ బడినా
వేడుకల కెంతైనా వెల వున్నదా ॥ పల్లవి ॥

సేయవే నీ వాతనికి సేవలెల్లాను
చాయకు నేఁ జేయఁ బోతేఁ జవిగాదు
నీయంతచన వున్నదా నేఁడు మాకు
కాయకము లెల్లాను కరఁచీనా మనసు ॥ చూడ ॥

నగవే నీ వాతనితో నయముగాను
తగులులేనిచోటఁ దమి పుట్టీనా
పగటున నీయంతబలు వున్నదా
పొగరులమాఁట లెల్లాఁ బొందు సేసీనా ॥ చూడ ॥

కలయవే నీ వాతనికాఁగిట నిట్టే
పిలువని ఫే(పే?) రటాలు ప్రియము లౌనా
వలె నని శ్రీ వేంకటవల్లభుఁడు తానె కూడె
నిలుకడై నమీఁద నిజమే కాదా ॥ చూడ ॥ 232

నాదరామక్రియ

ఆఁటది గొసరితేను ఆదరించవలెఁ గాక
యేఁటిమగవాఁడ వైతి వింత నీకమరునా ॥ పల్లవి ॥

నగకుండితే నగవు ననుచనికోపాన
మొగ మియ్యకుండితేను మోము వంచేవు
జిగి నే నలిగి యేమి సేసినాఁ జెల్లుఁ గాక
యెగసక్కెపువలపు లివి నీకుఁ జెల్లునా ॥ ఆఁట ॥

ములుగుతా నే నుండితే ముంగిటనే వున్నాఁడవు
అలరి పిలువకున్న నండకు రావు
చెలిమిబలిమిదాన సాదించ నాకుఁ దగితే
అలవోక సరిపంతా లవి నీకుఁ దగునా ॥ ఆఁట ॥

కందువ నే నంటితేను కాఁగిట నీవు నించేవు
యిందునె శ్రీవేంకటేశ యేఁలితి నన్ను
మందెమేళమైననామనసే మెత్తువు గాక
నిందల నీగుణములు నీకు నీవే మెత్తువా ॥ ఆఁట ॥ 233

సాళంగనాట

ఏఁటికి ననుమానము యింకాఁ గొంత దనకు
గాఁటమై తెగినవాఁడు కడ మేలా ॥ పల్లవి ॥

మనసురానివాఁడు మాయింటికి రా నేల
కినియుంచి కోపము రేఁగించ నేలా
పనితోఁ జుట్టముఁ గాఁడు పగవాఁడూఁ గాఁడు తాను
వునికిఁ దొల్లి వున్నట్టే వుండరాదా ॥ ఏఁటి ॥

విచ్చనవిడైనవాఁడు వేఁడుకో మమ్మిఁక నేల
చెచ్చెర నన్నింతరాఁగఁ జేయ నేలా
చొచ్చి బతిమి (?) చెల్లదు సుకమూ దక్కుట లేదు
మెచ్చుగా తనసాజాన మెరయరాదా ॥ ఏఁటి ॥

మొగమోటలేనివాఁడు మోహము మామీఁద నేల
నిగిడి మమ్ముఁ గలసె నేఁడింత యేలా
తగు శ్రీవేంకటేశుఁడు తప్పుదారులెల్లాఁ దేరె
మగువను నన్ను నిట్టే మన్నించరాదా ॥ ఏఁటి ॥ 284

రేకు—741 ముఖారి

ఎంతేసియానలు యెటువంటికోపాలు
యింతలో సరస మాడే రిదివో మీరు ॥ పల్లవి ॥

అద్దమరేతిరికాడి అలుకలు దేరెనా
యిద్దరు మీలో నేఁడు యేకమైతిరి
బుద్ధులు నేము చెప్పితే పూఁచి వినరైతిరి
అద్దివో నవ్వులు నవ్వే రపుడే మీరు ॥ ఎంతే ॥

మచ్చరాన రాయివంటిమనసులు గరఁగెనా
గచ్చుల మీమేనులకాఁక దేరెనా
కుచ్చి నే నెంత మొక్కినా గొబ్బునఁ గైకోరైతిరి
మెచ్చుకొనే రిప్పుడైతే మీలోనే మీరు ॥ ఎంతే ॥

ముందువెనకలు నేఁచేమచ్చు లెల్లఁ బాసెనా
సందడి మీవలపులు చవి వుట్టెనా
అందపు శ్రీవేంకటేశ ఆపె నీవూఁ గూడితిరి
కందువ నిప్పుడైతే [illegible]కై వశ మైతిరి ॥ ఎంతే ॥ 235

ఆహిరి

నిమ్మలాన వెరవక నీ వాపెతో మాటలాడు
కమ్మి నన్నేమి చూచేవు కపటము నేర్తునా ॥ పల్లవి ॥

నీకు వలచి వచ్చినవెరజాణసతులతో
వాకు దెరచి నే నింకా వాదడిచేనా
యీకడ నిచ్చక మాడి యేల నన్నుఁ లోదిగేవు
యీ కొలఁది నే నంత యెరఁగనికూళనా ॥ నిమ్మ ॥

సరసము నీతో నాడే చనవరిసతులతో
కొరకొర వెట్టుకొని కోపగించేనా
యిరవైనసొమ్ము లిచ్చి యెంత నన్ను మన్నించేవు
ధరలోన నే తగవు దప్పేటిదాననా ॥ నిమ్మ ॥

యిక్కువ నీకాఁగిటిలో నిటువంటివనితల
పక్కన నాచేతఁ బట్టి పాయ దీసేనా
మొక్కుచు శ్రీవేంకటేశ ముంచి నన్నుఁ గూడితివి
తొక్కుమెట్టు కోరువని దోసకారిదాననా ॥ నిమ్మ ॥ 236

## కేదారగౌళ

ఏమి చెప్పేరమ్మలాల యీతని నే నెరఁగనా
వేమతోడఁ దా వచ్చితేఁ బిలిచేఁ గాని ॥ పల్లవి ॥

వొలసీనొల్లనిపతి నొగి కాఁగిలించుకంటే
సొలసి మాను గాఁగిలించుటే మేలు
చలపట్టినవానితో సరస మాడుటకంటే
కెలసి రాయి గిలిగించుటే మేలు ॥ ఏమి ॥

వసముగానివిభునివంక చూచుటకంటె
సుసరాన మునిగోడ చూచుటే మేలు
పిసలేనివారిఁ బేరఁ బిలువఁబోవుటకంటె
కొసరి కొండసెలకు కుయ్యుటే మేలు ॥ ఏమి ॥

పంతపురమణు మోవి పంటి చవ (వి+అ)డుగుకంటె
పొంతఁ జెఱకుఁబిప్పితీపులే మేలు
ఇంతలో శ్రీవేంకటేశుఁ డితఁ డిట్టె నన్నుఁ గూడె
వంతుకు నెంతైనా నీవలపే మేలు ॥ ఏమి ॥ 237

## శ్రీరాగం

లోక మేలఁ బొద్దు లేదో లోన నుండఁ బొద్దులేదో
చేకొందువు యింటికి విచ్చేయరాదా ఇఁకను ॥ పల్లవి ॥

మచ్చికె మనసులోన మాటలలోఁ గొసరులు
ముచ్చట చెలులతోడ మొక్కులు చేత
నిచ్చనిచ్చ నిట్లానే నెలఁతకుఁ బను లాయ
రచ్చ కెక్కె వలపులు రారాదా ఇఁకను ॥ లోక ॥

కన్నులనే తమకము కాయములోఁ గరఁగులు
చన్నులపై నూరుపులు జారులఁగొప్పు
ఆకన్నెకు నీరీతు లాయ కాఁపురము వేగి లేచి
పన్నుగడ లాయ మేలు పదరాదా ఇఁకను ॥ లోక ॥

చెక్కులనే చెమటలు చెవుల నీయాలకింపు
అక్కర నీపాటలపై నాస రతుల
గక్కన శ్రీవేంకటేశ కలసితి వింతి నిట్టె
యిక్కువపానుపుమీఁది కేఁగరాదా యిఁకను ॥ లోక ॥ 238

అమరసింధు

నిండుఁదమకముతోడ నీరమణి
అండ నిన్నుఁ బచ్చిదోఁచ నాడునో యేమో ॥ పల్లవి ॥

ఆసల నెదురు చూచి యంగనలఁ బెట్టి పంపె
నీసముకాన కిదివో నీరమణి
మోసపోక నీమాఁట ముదులకించి రమ్మనె
వాసితో తానే యీడకు వచ్చునో యేమో ॥ నిండుఁ ॥

చిత్తములోఁ జింతించి చేత నున్న యీగురుతు
వొత్తి నీ కిమ్మనె నీమోహపుదేవి
మొత్తమునఁ జేయెత్తి మొక్కి నీకు రమ్మనె
వొత్తి మామూఁకలో వచ్చి వున్నదో యేమో ॥ నిండుఁ ॥

కమ్మి తననీరూపులకాకతపుసుర టిదే
పమ్మి నీకుఁ బుత్తెంచె నీప్రాణేశ్వరి
చిమ్మేవు పెంజెమటలు శ్రీవేంకటేశుఁడ నీవు
దొమ్మి నీవుర మెక్కినతొయ్యలే ఆపేమో ॥ నిండుఁ ॥ 229

శంకరాభరణం

మానక నాతో నవ్వేవు మంచిదే కాదా
మేను ముట్టి నిమిరేవు మెచ్చే కాదా ॥పల్లవి॥

వెంటవెంటఁ దిరిగాడేవెలదు లెల్లా నుండఁగ
నంటు నాతో మాటాడేవు నయమే కాదా
అంటి ముట్టి సరసములాడేవార లుండఁగాను
యింటికి విచ్చేసితివి యిది మేలు గాదా ॥మాన॥

పంత మాడి పొందుసేసేపడఁతు లెల్లా నుండఁగ
యింత నాదిక్కే చూచేవు యెక్కుడే కాదా
చెంతల మొక్కేటివారు సేనాసేన లుండఁగాను
దొంతిగాఁ బై నొరగేవు దొడ్డతనము గాదా ॥మాన॥

ఇచ్చకములాడేవారు యెదుటనే వుండఁగాను
వచ్చి కాఁగిలించేవు నావన్నె కాదా
చెచ్చెర నిందరిలోన శ్రీవేంకటేశుఁడ నన్నుఁ
గుచ్చి కూడితివి యిదే గురుతు కాదా ॥మాన॥ 240

రేకు - 742. మధ్యమావతి

చెల్లఁబో యింకా నేల సిగ్గు గాదా
యెల్లవారు నెరిఁగిరి యిఁక నేడ సుద్దులు ॥పల్లవి॥

ధరఁ జెలఁగుమాసినదానిఁ జేర రాకువయ్యా
సొరిది నల్లంత నుండి చూతువు గాని
వరుస దప్పితే నాడవారిమీఁదియాన సుమ్మీ
యెరవుల వారమైతి మిఁక నేడ సుద్దులు ॥చెల్లఁ॥

మాటున నున్న దానితో మాటాడకువయ్యా నీవు
ఆఁటదాని చేతఁ జెప్పి యంపుదు గాని
కూటమికిఁ బెనఁగితే కుచ్చి రట్టుసేతుఁ జుమ్మీ
యేఁటికి నవ్వులు నవ్వే విఁక నేడ సుద్దులు ॥చెల్లఁ॥

చిందువందయినదానిఁ జెనకకువయ్యా నీవు
కందువ చెప్పింపే మీఁదఁ గలతు గాని
పొందితి వింతలో నన్నుఁ బోనీక శ్రీ వేంకటేశ
ఇందులో నన్నియుఁ గంటి మిఁక నేడ సుద్దులు ॥చెల్లఁ॥ 241

గౌళ

ఇందరిముందర నిట్టె యేరా నీవు
విందువలె నీకునీవే వేసాలు సేసేవు ॥పల్లవి॥

చెంత నీకెమ్మోవిమీఁద సిగ్గుదేర నవ్వేవు
యింతలో నామోము చూచి యేరా నీవు
వింతలుగ నిను నేమీ వెంగ మాడలేదు నేము
పంతపునీగుట్టు నీవే బయిట వేసేవు ॥ఇంద॥

అడుగనిమాట లెల్లా నప్పటి నాడ వచ్చేవు
యెడసిన చంచలాన నేరా నీవు
తడవము తాఁకము తమకించి యలుగము
వెడ నీసుద్దులు వెల్లవిరి గావించేవు ॥ఇంద॥

నెక్కొని వూరకే నీవు నిజములు నెరపేవు
యెక్కువ నాకాఁగిటిలో నేలా నీవు
గక్కన శ్రీ వేంకటేశ కలసితి విటు నన్ను
వుక్కుమీరి నన్ను నేల వొడఁబరచేవు ॥ఇంద॥ 242

సామవరాళి

నిలుచున్నాఁ డదివో నీరమణుఁడు
తలవంచుకొని యింత తడవు సేయుదురా ॥పల్లవి॥

నీలోనే మురిగేవు నెలఁతలఁ గసరేవు
వేళతో తఁ డీడకు విచ్చేయఁ డని
లేలే యెక్కడిసుద్ది లేళమంతపనికిఁ గా
మూల నుండే తలుపులు మూసుకొందురా ॥నిలు॥

వూరకే యట్టె వుండే వో కమూఁ టానవెట్టేవు
ఆరీతిఁ గొంచేవు వల పాతఁ డనుచు (?)
తేర నిఁక నేలే నేనే తిద్దే నీయలుకలు
మూరుకొని నీనాసంది మఱఁగులు చెల్లునా ॥నిలు॥

వాకిలి గొంత దెఱచి వడిఁ దొంగి చూచేవు
జోక నాతనిమనసు చూచే నని
యీకడ (శ్రీ) వేంకటేశుఁ డింతలో నిన్నుఁ గలసె
యేకడా మీమేలు గోరు కిట్లానే వుండుదు మా(ము?)
॥నిలు॥ 243

ముఖారి

మేలుమీఁదా మేలే కాక మెరమెర లిఁక నేలే
యేలినవానితోడి దిది యేఁటిదే ॥పల్లవి॥

కారుకమ్మెనీనవ్వులు కన్నులకొలుకులకు-
నీరితి నెట్టుఁదనము లేల తెచ్చెనే
మోరకించి నీవిభుఁడు మోవితేనె లానీ నదే
నేర మాయనా యింతలో నీ విదేఁటిదే ॥మేలు॥

పలుకులు తేనియలు పైపై నాలికకొన-
నెలమిఁ గారవుమాఁట లేల వూరినే
పెలుచనీరమణుఁడు ప్రియములు నీకుఁ జెప్పుట
కొలఁదిఁ బడదాయనా గుణ మేఁటిదే ॥ మేలు ॥

మెత్తనిచిగురుఁజేయి మించినకొనగోళ్లకు
యెత్తి వాండ్లు మొనలు నేల చూపినే
యిత్తల శ్రీవేంకటేశుఁ డిదివో నిన్నుఁ గూడె
వొత్తులే వొగ రాయనా వొర పేఁటిదే ॥ మేలు ॥ 244

ద్రావిళభైరవి

ఇట్టె వూడిగపువారు యెందరు లేరు
అట్టు సేయఁబోతే నాఖడి యవును ॥ పల్లవి ॥

మోము చూచి యాసపడి మోహాము నీపైఁ జల్లేటి-
కామిను లెందరు లేరు కన్నచోటను
నీమన సెఱఁగనా నీ వేల సిగ్గువడేవు
యీమెలుఁతవద్ద నుంటే యేల వచ్చీ నిందలు ॥ ఇట్టె ॥

సరసమాడి నవ్వుతా చనవులు మెరసేటి-
తరుణు లెందరు లేరు దగ్గ రుండను
యిర వెల్ల నెరఁగనా యేల చిన్నఁ బోయేవు
పెరపేరటాం డ్లెల్లా పెండ్లికూఁతు లౌదురా ॥ ఇట్టె ॥

వీడె మిచ్చి మాటాడుతా విందులు చెప్ప వచ్చిన-
చేడె లెందరు లేరు నీసేవలు సేయను
యీడనె శ్రీవేంకటేశ యిటు నన్నుఁ గూడితివి
వాడలోనిసతులపై వావిమోపఁ దగునా ॥ ఇట్టె ॥ 245

గౌళ

తనిసితి మిన్నిటాను దవ్వుల నీమేలుచేత
వెనకటివలెనే కా విడవయ్యా చాలును ॥ పల్లవి ॥

చెక్కులలో నొక్కులూ చేతులపై మొక్కులూ
మక్కువ నీవు సేసేటిమంచితనాలు
యెక్కడ నుంటి నిందాఁకా నేమి సేసి వచ్చితివి
లెక్కలేవు నీప్రియాలు లేవయ్యా చాలును ॥ తని ॥

కప్పురపువీడేలు గబ్బిచూపుమేడేలు
యెప్పుడూఁ గలవే నీయింటికాఁడను
కొప్పు నీ కేల జారెను కొంగు యెవ్వరు వట్టిరి
వొప్పు గొంటి నీమాటలు వుండవయ్యా చాలును ॥ తని ॥

కాఁగిటిలో సాములూ కడునవ్వులవాములు
చేఁగదేర నీవు నేరిచినవే తొల్లి
యేఁగి వచ్చి శ్రీవేంకటేశ నన్నుఁ గూడితివి
ఆఁగితి నీ వన్నట్టే అవునయ్యా చాలును ॥ తని ॥ 246

రేకు-743. దేసాళం

ఏఁటికిఁ గన్నులు మూసే వెరఁగనివానివలె
నాటకపుమిమ్ముఁ జూచి నాకిది తెలిసెను ॥ పల్లవి ॥

కుంచ నీకు వేయఁగాను కొప్పుపువ్వులెల్ల రాలె
నించినతమకమున నీమీఁదను
చుంచులదానివుపరిసురతవేళ రాలిన -
చంచువలె నుండె నని సతి లోలో నవ్వెను ॥ ఏఁటి ॥

పల్లకి యెక్కించఁగాను పడఁతి వెనక నుండై
జల్లనఁ బులకించె నీసరసానకు
పల్లదాన నలిగితే బలిమి నీవు గూడేటి -
వల్లడిరతి దేఁచి నడి లోలో నవ్వెను ॥ పఁటి ॥

సంగడి నిలుచుండఁగ చనుమొన నిన్నుఁ దాఁకె
ముంగిట శ్రీవేంకటేశ మోహము తోడ
అంగవించి కూడితివి ఆపె నట్టె కాఁగిటను
అంగపునానావిధాల కటు లోలో నవ్వెను ॥ పఁటి ॥ 247

ఆహిరి

ఇప్పుడు చేకొనేవాఁడ వింతాఁకా నెందుంటి వని
చిప్పిలు నాకోపము చెలరేఁగీఁ గాక ॥ పల్లవి ॥

యిల నీ వేమి సేసినా నియ్యకొనక నీతో నే -
నలిగితిఁగా నిన్ను నన నోరేది
బలిమి నీ వప్పటిని పైకొని మన్నించఁగాను
నిలుపరాక కన్నుల నీరు గారీఁ గాక ॥ ఇప్పు ॥

యిచ్చగించి యుండక నే నివ్వలిమోమై యిల్లు
చొచ్చితి నింకా నీమోము చూడఁ జోటేది
గచ్చుల నీ వప్పటిని కాఁగిలించుకొనఁగాను
చెచ్చెర నానిట్టూర్పులు చిమ్మిరేఁగీఁ గాక ॥ ఇప్పు ॥

గారవానఁ దొలుత నే కందువఁ గొసరక
వూరకుండి యిఁక నిన్ను నొద్దన నేది
యీరీతి శ్రీవేంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
కారుకమ్మి నివ్వెరఁగు కడు నిండీఁ గాక ॥ ఇప్పు ॥ 248

వరాళి

పంటికి నన్నుఁ బొగడే విందరిలోనా
నాఁటుకొని నీతో నిట్టె నవ్వేయంతదానా ॥పల్లవి॥

మన్నించి నీవు నాతో మాటలాడితివి గాక
యెన్నిక నీసతులలో నేమి జాతి
మున్ను నేఁ జేసినట్టినోముఁఫల మింతే కాక
పిన్నను నిన్ను రతి మెప్పించేపాటిదాననా ॥పంటి॥

చేరి నామీఁదికరుణఁ జెక్కు నొక్కి వింతే కాక
యీరీతి నావంటివారు యెంత లేదు
వేరే నిన్నుఁ బొడగన్న వేళ గుణ మింతే కాక
బీరాన మాయింటికి రప్పించుకొనేదాననా ॥పంటి॥

కొంకక నన్ను దిప్పించి కూడితి వింతే కాక
పొంకపునీసతులతో పురుఁడా నాకు
అంకెల శ్రీ వేంకటేశ అంతా నీమహిమే కాక
వంక లొత్తి నే నిన్ను వలపించేదాననా ॥పంటి॥ 249

మాళవిగౌళ

మాపై నింత కరుణైతే మంచి దాయను
చూపుల నీపాటి నన్నుఁ జూచితివి గా ॥పల్లవి॥

నీవు గలిగి వుండఁగా నివ్వెర గేల
చేవదేరి వుండఁగాను చిన్నఁబో నేల
కావిరి నన్నేల యింత గరిసించేవు
యీవిధి బుజ్జగించ నీకే మొదు నేను ॥మాపై॥

చేరి నీవు వేఁడుకోఁగా చెక్కుచే యేల
గారవించఁగాను నాకుఁ గన్నీ రేల
వూరకే నన్నేల యింకా నొడి వట్టేవు
నారుకొన్న సతులు కేరలు గారా ॥మాపై॥

కాఁగిట నీవు గూడఁగా కాఁతాళ మేల
మాఁగినమో వియ్యఁగాను మారాడ నేల
దాఁగినాఁ బోనీక నన్ను దక్కఁ గొంటివి
పాఁగిన శ్రీ వేంకటేశ పంత మింత వలెనా ॥మాపై॥ 250

తెలుఁగుఁగాంబోది

అంగడి కెక్కె వలపు లారడిఁ బడె వయసు-
తెంగిలిమోవు లివిగో యింక నేల సిగ్గులు ॥పల్లవి॥

వూరకే నామతిలోన నొకటొకటే తలఁచి
కూరిమి నీకు మరులుగొంటి నేను
చేరి నీ వంతలో నాపైఁ జేతులు చాఁచి చాఁచి
మేరలు మీరఁగఁ బోయి మేను మఱచితివి ॥అంగ॥

నీయింటికి నెడతాఁకి నిచ్చ నిచ్చ పొందు సేసి
మాయల నీతో మాటలే మరిగితిని
బాయట నవ్వులు నవ్వి పచ్చి యేకటాలు చెప్పి
నీయంతనే కిందువడి నెట్టన లోనైతివి ॥అంగ॥

చుట్టమనై వచ్చి నీతో జూజములే యాడి ఆడి
గట్టిగా నిన్ను కాఁగిటఁ గలసితిని
యిట్టె శ్రీ వేంకటేశ యెదుట నామోము చూచి
జట్టిఁ గరఁగి కరఁగి చవులెల్లాఁ గంటివి ॥అంగ॥ 251

రామక్రియ

ఏంటికి నవ్వులు నవ్వే విదేమోయి
దాంటరానిమాట లాడీఁ దా నెవ్వరోయీ ॥ పల్లవి ॥

అచ్చలాన నే నిట్టే యండ నిలుచుండఁగాను
హెచ్చి వెంగేలాడీ నాపె యిదేమోయి
చెచ్చెర నేఁ బెండ్లాడినసేసపాలదాన నీకు
తచ్చనపంతాలు చూపీఁ దా నెవ్వరోయీ ॥ ఏంటి ॥

చిట్టంటునీనెరులు నే చిక్కుదియ్యఁగా నే నన్ను
యిట్టె తప్పక చూచీ నిదేమోయి
పట్టపుదేవుల నైనబలవంతురాల నేను
దట్టముగాఁ గాఁతాళించీ తా నెవ్వరోయీ ॥ ఏంటి ॥

మంచముపై నేను నీ మన్ననలు సేకొనఁగాను
యించుకంత తొంగి చూచీ నిదేమోయి
ముంచి శ్రీవేంకటేశ మోహానఁ గూడినదాన
దంచీ వట్టిసణఁగు తా నెవ్వరోయీ ॥ ఏంటి ॥ 252 ॥

రేకు—744 శుద్ధదేశి

వేసాలకు మమ్ము నేల వేఁడుకొనేవు
నీసొమ్మై యెవ్వరున్నా నీకు మేలుగాదా ॥ పల్లవి ॥

అంగన నొడఁబరచి అందలానఁ బెట్టుకొని
సంగతిగాఁ దెచ్చుకొంటి జాణవనాన
జంగిలిసతు లెంతవేసరించకుండినా నీకు
అంగవించి సుకితువు అదిమేలు గాదా ॥ వేసా ॥

మేల మాడుతా నావెను మేడమీఁదఁ బెట్టుకొని
తాలిమి నిల్లు వెళ్లవు దంటతనాన
ఆలరి నీసతు లెంత అలిగి రాకుండినాను
యీలీల నీయిచ్చ(చ్చ+అ)నం(ి+అం)దు విదె మేలు
గాదా ॥ వేసా ॥

వచ్చిగా నావెఁ గూడి పానుపుపై నవ్వుకొంటా
చెచ్చెర నప్పటి నాచేయి వట్టేవు
యిచ్చకానకు శ్రీవేంకటేశ నన్నుఁ గూడితివి
మచ్చికసతులమూఁక మరి మేలు గాదా ॥ వేసా ॥ 253

లలిత

తమకుఁదమకే యింపు తమలోనిసుద్దులు
అమరనట్ల నుండ నౌఁగా దనరాదు ॥ పల్లవి ॥

మేడిపండువంటిది మెరసేనీమోహము
వేడుకతో మాకు నంత విచ్చ నేఁటికి
వీడెపురుచివంటిది వింత నీతో సరసము
ఆడఁబోతే నెవ్వరికి నౌఁగా దనరాదు ॥ తమ ॥

వుబ్బుఁగవణమువంటి దున్నతపునీనవ్వు
గొబ్బున నప్పటి నిన్నుఁ గొసర నేల
మబ్బులో సన్నవంటివి మచ్చిక నీబాసలు
అబ్బురపడుటే కాని ఔఁగా దనరాదు ॥ తమ ॥

రొంపికంబమువంటిది రొక్కమైననీనిజము
ముంపున నింకాఁ జూపి మోప నేల
తెంపున శ్రీవేంకటేశ తెలిసి కూడితి నన్ను
అంపిననీవుడుగర కౌఁగా దనరాదు ॥ తమ ॥ 254

మాళవి

ఎటువంటివలదాని కెగ్గు గాదా
తలవాతిపనులకు దగ్గరేనూ నిన్నును ॥ పల్లవి ॥

కందువమాటలు మీలో కలసి ఆడినమీఁద
యొందరేమాట లాడినా యెంగిలే కాదా
ముందే నీవు నాపెఁ గూడి మోవు లందుకొన్నమీఁద
చెంది తక్కినవారికి సేషమే కాదా ॥ ఎటు ॥

యిరవై చేతిరి మీలో నిద్దరు నవ్వినమీఁద
పరుల వేగినవ్వులు పాఁచివే కావా
సొరిది నగుల మీరు చూపు చూచుకొన్నమీఁద
గరిమ నందరిచూపు కట్టఁగడే కాదా ॥ ఎటు ॥

గక్కన మీలో మీరు కాఁగిలించుకొన్నమీఁద
దిక్కులవారికాఁగిలి దగ్గుడే కాదా
వొక్కట శ్రీవేంకటేశ వున్నసుద్ది లేదని
చిక్కి నన్నుఁ గూడితివి సిగ్గాపెదే కాదా ॥ ఎటు ॥ 255

సామంతం

ఎంతకు నంతేకాక యెక్కుడేల
వింతలు నేఁ జేయఁబోతే విసుగకుండేవా ॥ పల్లవి ॥

నీటికొలఁదే తామెర నీ వేల మమ్ముఁ దిట్టేవు
మాట నీ వాడినంతే మామారుమాట
గాఁటమై నే నూరఁ గలకతలు నీతో నాడితే
యేఁటికి మాతో నిది యేల వేలి నవా ॥ ఎంత ॥

బలువుగొద్దే పంతము పదర నేఁటికి నీవు
చలి వాపినంతే నీతో సరసము
యెలమి నింతకంటె నెక్కుడు నవ్వఁగఁబోతే
తిలకించి పట్టరాదు దీనిగర్వ మనవా ॥ఎంత॥

లోఁతుకోలఁదే పాఁతు లోన నేల జంకించేవు
చేఁత నీవు సేసినంతే చేరి మాపొందు
ఈఁతగాఁ గూడితి నన్ను నిట్టె శ్రీవేంకటేశ
మోఁతతో నేఁ గొసరితే ముందే అలయవా ॥ఎంత॥ 256

కాంబోది

గుట్టున నూరకుండుటే గుణము గాక
పట్టి పెనఁగేటివారిపస లేఁటివే ॥పల్లవి॥

కన్నులనే మెచ్చెఁ గాని కగఁగఁ డాయన మనసు
యిన్నిటా విన్నపము లిఁక నేఁటివే
సన్నలనే నవ్వెఁ గాని సంగడికి రాఁడాయ
పన్నిన నా మొక్కులకుఁ బాటి యేడదే ॥గుట్టు॥

చనవులే యిచ్చెఁ గానీ చవు లేమీఁ జూడఁ డాయ
ననిచినతనవొద్ద నానట నేఁటిదే
తనియఁగఁ జూచెఁ గాని తమకించఁడాయఁ దాను
చెనకి మోతసేసినా నెల వేమి గలదే ॥గుట్టు॥

కాఁగిటనే నించెఁ గాని కత లేమీఁ జెప్పఁడాయ
చేఁగనాచన్నుల నిఁకఁ జిమ్మ నేఁటికే
ఆఁగి శ్రీవేంకటపతి అప్పటి నన్నుఁ గలసె
వీఁగనిరతుల కింక వెల యాడదే ॥గుట్టు॥ 257

సౌరాష్ట్రం

ముందరివారికి నిదే మొదలు గాదా
అందరిఁ దారుకాణించి అండవారే నగరా ॥ పల్లవి ॥

అవ్వల నెగ్గులువట్టేఆపెతో నేమి చెప్పెనే
నవ్వుతా నాడినమాఁట నాఁటిమాటా
రవ్వగా నాపొక వేళ రాజసముతో నలిగి
యెవ్వరిముందరనైనా యిట్టె పంగించదా ॥ ముంద ॥

పక్కన నేరము లెంచేపడఁతి కేల చూపెనే
మొక్కుచుఁ జేసినచేఁత మొన్నటిచేఁత
యెక్కువైననాయకుఁడు యింతకు వచ్చె ననుచు
చొక్కుచు నాసతి యిట్టె చులుకఁగాఁ జూడదా ॥ ముంద ॥

యింతితో శ్రీ వేంకటేశుఁ డేల బయట వేసెనే
మంతనానఁ దనకీలు మానముకీలు
యెంతయినా నీరమణి యేతులకు యీపనులు
చెంతఁ దాఁ గూడేటివేళ సిగ్గు విడిపించదా ॥ ముంద ॥ 258

రేకు-745 దేసాళం

పూవులు ముడువఁ బట్టె పూఁచి సింగారించఁ బట్టె
యీవేళ గాచుక నీ వెట్టుండితివో కాని ॥ పల్లవి ॥

నీవు విచ్చే శుండఁగాను నే లోన జలక మాడి
తావళించి వచ్చుదాఁకాఁ దడ వాయఁగా
భావములోఁ దలఁచుక పాయకుండితిఁ జుమ్మీ నీ-
వోవరిలో నెటువలె నుండితివో కాని ॥ పూవు ॥

వొక్కడవే వుండఁగాను వొప్పుగ సొమ్ములు వెట్టి
తక్కక నే వచ్చుదాఁకాఁ దడ వాయఁగా
చొక్కుచు నీవుంగరమే చూచుకొంటా నుంటిఁ జుమ్మీ
చిక్కిన నీవిక్కడ నేమి సేసితివో కాని ॥ పూవు ॥

కగ్గి నీ వెదురుచూడఁగా వొడ లోముకొంటా
దగ్గరి నే వచ్చుదాఁకాఁ దడ వాయఁగా
సిగ్గుల శ్రీవేంకటేశ నీయిచ్చఁ గూడితిఁ జుమ్మీ
యెగ్గులెల్లా నిందుఁ దీరె నేమనేవో కాని ॥ పూవు ॥ 259

కాంబోది

ఏమి గట్టుకొనెనే తా నిందువంకను
దోమటికోరికె లెల్లా దొడ్డిఁ బెట్టెఁ గదవే ॥ పల్లవి ॥

యెదురు చూచితిఁ దాను ఇందాఁకా విచ్చేసీ నని
ఇదివో తాఁ జెలి నంపె నెడమాఁటకు
గుదిగొన్న అడియాస గుండె పట్టుకున్న నన్ను
చెదరనివలపులఁ జిమ్మిరేఁచెఁ గదవే ॥ ఏమి ॥

తత్తరించి వుండితి నేఁ దనతో మాటాడే నని
పొత్తులలేక లంపెఁ దాఁ బొద్దువోకకు
మొత్తమైనవేడుకతో ముంగిట వుండిననన్ను
చిత్తపుఁగాఁకలలోనఁ జిక్కించెఁ గదవే ॥ ఏమి ॥

తలపోసు కుండితిని తానె పైకొనీ నని
నిలుచుండే నవ్వు నవ్వి నీటుతోఁ దాను
అలమె శ్రీవేంకటేశుఁ డాతఁడే నన్ను బలిమి
పులకఁ బెట్టి యట్టె మన్నించెఁ గదవే ॥ ఏమి ॥ 260

బౌళి

పొద్దు గూకుఁ దెల్లవారు పురుషునిచిత్త మింతె
వొద్దివారే యుల్లైతే వోరువ నేఁ గలనా ॥పల్లవి॥

తగులుగలుగువాఁడు తానే యింక మానీనా
అగడు సేసి పిలువ నంత యేఁటికే
మొగము చూచితేఁ జాలు మొక్కక నే మానేనా
యెగసక్కె లిఁక నాతో నేమీ నాడకురే ॥పొద్దు॥

తప్పక చూచినవాఁడు దయనెట్ట కుండీనా
చెప్పరానివిన్నపాలు సేయ నేఁటికే
ముప్పిరి నవ్వితేఁజాలు ముచ్చటాడక మానేనా
ఇప్పు డేమికోపము నాయెదుటఁ జూపకురే ॥పొద్దు॥

మంచ మెక్కినవాఁడు మరి కూడక మానీనా
కొంచక శ్రీవేంకటేశుఁ గొసర నేలే
ముంచి యాతఁడే కలసె మొరఁగి నేఁ గాదనేనా
అంచలఁ దొల్లిటిసుద్దు లవి దడవకురే ॥పొద్దు॥ 261

కన్నడగౌళ

చెలివంటా నుండితిమి చెల్లుఁబో యిన్నాళ్లు నిన్ను
చలిమి బలి మాఁడేవు సవతివలే ॥పల్లవి॥

ఆతనితో మొకమోట మంతే నీకుఁ గలిగితే
నీతితో నెడమాటలు నేనే యాడేనే
పోతరించి యెందుకై నాఁ బూనుక వచ్చేవు నీవు
ఆతలను నీ వొకఆలవటవే ॥చెలి॥

నిచ్చఁ బిలుచుక రాను నీవు సిగ్గువడితేను
నెచ్చెలిరో పతిఁ జూడ నేనే వచ్చేనే
అచ్చమైనదొరసానివై నాకు బుద్ధి చెప్పేవు
పెచ్చు పెరిగేవు నీవూఁ బెండ్లాడితివటవే ॥ చెలి ॥

మక్కువ నీ కతనికి మతకములు గలితే
వొక్కటై యాతనిఁ బాయ కొద్ద నుండేనే
యిక్కువ శ్రీవేంకటేశుఁ డిట్టె నన్నుఁ గూడె
మిక్కిలి నవ్వే వతని మేనదానవటవే ॥ చెలి ॥ 262

తెలుఁగుఁగాంబోది

మొకము చూచులే చాలు మొక్కులే చాలు
యెకసక్కె మాయఁ బని యేలరా యీదోసము ॥ పల్లవి ॥

పట్టిపను లెల్లఁ జెప్పి వద్దివారి నెల్ల నంపి
వొట్టుక నన్నుఁ జెనకే వోరి నీవు
గట్టిగా నావూళిగపుకాంతల నంటితివట
యిట్టె నన్నుఁ బైకొనేవు యిఁక వొద్దు దోసము ॥ మొక ॥

యేకతాలు గడియించి ఇంటిలోనికిఁ బిలిచి
యీకడ నన్ను బోదించే వేరా నీవు
ఆకుమడి చిచ్చేటిఅంగన నంటితివట
నీకు నాకు నింతచాలు నిలు నిలు దోసము ॥ మొక ॥

అలసితి నని వచ్చి అంగము పై వేసేవు
చెలఁగి కాఁగిలించేవు చెల్లురా నీవు
బలిమి నన్నుఁ గూడితివి పంతపు శ్రీవేంకటేశ
తొలఁగి కిమ్ముల పొందు తొడుకకు దోసము ॥ మొక ॥ 263

సాళంగనాట

ఇద్దరు నిద్దరే యింక నేమి సేతమే
అద్దుకొని మన మిచ్చలాడకుండ వచ్చునా ॥ పల్లవి ॥

పంతపువిభునితోడ పకపకనవ్వు నవ్వె
యెంతకోపము రేచెనే యీలేమ
అంతలో నాయకి తను నంటకు మని యంటేను
యింతేసివొట్టు వెట్టె నీవిభుఁడు ॥ ఇద్ద ॥

అందుండి వచ్చినపతి నలపు దేరిచెనంటా
చెంది యెంత వుడికించీ చెలి నేఁడు
సందడిఁ దప్పక ఆపె సారెఁ దనుఁ జూచెనని
యెందరసాకిరివెట్టె నీవిభుఁడు ॥ ఇద్ద॥

వాడుదేర రమణుని వట్టిమెచ్చు లెల్లా మెచ్చి
యేడ సందేహాలు రేచె నీసతి దాను
ఆడనె శ్రీవేంకటేశు నాపె యట్టె కూడితేను
యీడనే నమ్మిక లిచ్చీ నీవిభుఁడు ॥ ఇద్ద ॥ 264

రేకు—746 శుద్ధవసంతం

దగ్గరితే వలపులు తలకెక్కును
సిగ్గవడ కింక నేమి చెప్పేమయ్యా నీకును ॥ పల్లవి ॥

మరునిపాపమె కాదు మాఁకులపై ననలకు
వరుస విరహులంటే వాండ్లెక్కును
గరిమ నంతటిలోనఁ గలసితే నిద్దరికి
తొరలి పువ్వులవంక తుంగ దలకెక్కును ॥ దగ్గ ॥

చందురు నేరమె కాదు సరసాన నలిగిన
విందువంటివెన్నెలకు వేండ్లెక్కును
చందమై అంతటిలోనే సంతమైతే వెన్నెలతో-
నంది సేమంతిపై మంచు అంగముల కెక్కును ॥ దగ్గ ॥

చల్లగాలితప్పు గాదు జంట వాసి వుండితేను
పెల్లుఁజిలుకలకైనా బీర మెక్కును
యెల్లగా శ్రీవేంకటేశ యిద్దరముఁ గూడితిమి
మొల్లపుమనమాటలు ముద్దులకు నెక్కును ॥ దగ్గ ॥ 265

శంకరాభరణం

జాగు లేమిటికె సతులాలా
తీగెలు సాగెను తీరనివలపు ॥ పల్లవి ॥

రంతుల నీడకు రమణుఁడు విచ్చేసె
యింత వొద్దు వోయినవెనక
బంతికిఁ బిలువరె పట్టరె జలకము
దొంతుల నున్నది తొల్లిటివలపు ॥ జాగు ॥

తలఁచుకొనె నదివో తననిజబాసలు
చెలఁగి యిల్లు చొచ్చినవెనక
పిలువరె యీడకు పీఁట వెట్టరే
పులియ దెప్పుడును పూఁచినవలపు ॥ జాగు ॥

ఆరగించి నను నట్టె కూడెను
చేరి వరుస గలసినవెనక
యీ రీతి శ్రీవేంకటేశుకు మొక్కరె
పేరెను పైపై ప్రియములవలపు ॥ జాగు ॥ 266

## సాళంగం

ఏమి సేయవచ్చు నందు కేమాయను
నీమనసు నొప్పించనేర నిఁక నేను ॥పల్లవి॥

ఆడఁగలమాటలు నిన్నాడితి నే నల్లనాఁడె
యెడ నీ వేమి సేసినా యెదురాడేనా
కూడా రాను పాయలేదు గుట్టుతోడ నీపాటి-
వీడె మిచ్చే నింతేసుమ్మీ వెగవకు నాకును ॥ఏమి॥

సేయఁగలసేఁత లెల్లాఁ జేసితి నే నల్లనాఁడె
నీయందుఁ దప్పు లుండినా నిను మీరేనా
చాయ సేసుకోరాను చలము నిన్ను సాదించ
దాయిదండనై వుండే నింతే తలవంచ కిఁకను ॥ఏమి॥

మెచ్చఁగలట్టెల్లా నిన్ను మెచ్చితి నే నల్లనాఁడె
విచ్చనవిడి నీ వున్నా వేగిరించేనా
యిచ్చకుఁడ శ్రీవేంకటేశ నిన్నుఁ గూడి నేను
పచ్చడము గప్పే నింతే బడలకు మిఁకను ॥ఏమి॥ 267

## ముఖారి

చేతులు చాఁచితిమి చేయెత్తి మొక్కితిమి
బూతుల తిట్లు వచ్చీ పోవయ్యా యిఁకను ॥పల్లవి॥

మరిగి నాతో నీవు మాటలాడుతా నంతలో
పొరుగువారిమాటలు పోర[1] చాయనా
పరగ నే నేమనినా పాపముఁ గోపముఁ బొత్తు-
దొరలతో మాట లేల తొలవయ్యా ఇఁకను ॥చేతు॥

---

1. పోరచి + అయినా

యీడ నాతో నవ్వు నవ్వి యిప్పుడె యాడకుఁ బోయి
వాడికనవ్వు నవ్వఁగ వడదేరెనా
జాడతోడ నుండకున్న సరసాలే విరసాలు
వేడుకకాఁడ వైతివి విడవయ్యా ఇఁకను ॥ చేతు ॥

ననుపు నాతోఁ జేసి నంటు సేసితి వాపెతో
తనివి నీ కందువంక తలకూడెనా
ననుఁ గూడితి వప్పటి నమ్మించి శ్రీవేంకటేశ
అనుఁగుజాణఁడవు నిన్ననమయ్యా ఇఁకను ॥ చెతు ॥ 268

వరాళి

అడుగు వెట్టితే నీ కాపెమీఁదాన
తొడికి కొంగు వట్టితే తోసి పోవఁ జెల్లునా ॥ పల్లవి ॥

నిద్దిరించేవేళ వచ్చి నీవు లేపఁగాఁ జెలి
గద్దించి తిట్లు తిట్టి కసరెఁ గాక
కొద్దెరిఁగి నీ వుండితే కోపగించునా యాపె
అద్దో నీ వింతలోనె నూరలుగఁగఁ జెల్లునా ॥ అడు ॥

చదురంగ మాడేవేళ జాణతనా లాడఁగాను
తుది నిన్నుఁ జేతఁ బట్టి తోసెఁ గాక
యెదుటనె వోరిచితే నింత సేసునా యాపె
కదిసి నీ పిందుకుఁగాఁ గాంతాళించఁ జెల్లునా ॥ అడు ॥

పాటలు వాడేటివేళ పైకొని కాఁగిలించఁగ
తాటించి తా కొనగోరు దాఁకించెఁ గాక
యీటున శ్రీవేంకటేశ యిందు కిట్టె కూడితివి
చీటికిమాటికి నీకు సిగ్గువడఁ జెల్లునా ॥ అడు ॥ 269

పాడి

ఎంత కెంత సేసీనే యేఁటికే నాతో
పంతములు నెరపీనో పైకొనీనో కాని ॥పల్లవి॥

కనురెప్ప వేసీఁగదె కాంత దను నేఁ జూచితే
చెనకీని కోపమో సిగ్గో కాని
చనుఁగొంగు మూసీఁగదే సరస నేఁ గూచుండితే
వెనక నానేరాలకో వేసాలకో కాని ॥ఎంత॥

తల వంచుకొనీఁగదే తనతో నే మాటాడితే
బలిమి రాజసమో పరాకో కాని
కిలకిల నవ్వీఁగదే కేలు నేఁ బట్టి తీసితే
కెలనివారు మెచ్చనో కేరడమో కాని ॥ఎంత॥

సవళించీ నదేకదే పక్కన నే నంటితేను
యివలఁ గళ దాఁకెనో హితవో కాని
తివిరి శ్రీవేంకటాద్రిదేవుఁడ నేఁ గూడితి
చవిగొనీ మోవిపొందో చనవో కాని ॥ఎంత॥ 270

రేకు 747. సాళంగనాట

ఎందు వోయే వీఁకను యిన్నియుఁ గనేము గాక
కందువలు మాపటికిఁ గానవచ్చీఁ గాక ॥పల్లవి॥

నవ్వు నవ్వ నేఁటికి నాతో నంతే కలితేను
చివ్వన మాయింటికి విచ్చేతువు గాక
పువ్వుల వేయ నేఁటికి పూఁపు నీకుఁ గలిగితే
సువ్వి యని రతులలోఁ జూపుదువు గాక ॥ఎందు॥

ఆన వెట్టి నేఁటికి ఆయములు సోఁకితేను
సోనల మాచేఁతలలోఁ జూచేవు గాక
కానిమ్మన నేఁటికి గర్వములే చెల్లితేను
మేను మేను నోరసితే మెచ్చేవు గాక ॥ఎందు॥

పంత మాడ నేఁటికి బలిమి గలిగితేను
పొంత నాకాఁగిటిలోనఁ బొందుదు గాక
యింతలో శ్రీవేంకటేశ యెనసితి విటు నన్ను
మంతనాన సంతసించి మన్నింతువు గాక ॥ఎందు॥ 271

ముఖారి

నాఁటి వలపులు నేఁడు నానఁ బెట్టేవా
వాఁటమాయ నీసుద్దులు వంక లొత్తవలెనా ॥పల్లవి॥

నిన్ను నేమీ ననము నీతో సరస మాడము
యెన్నటిపొందులు మాతో నేల నవ్వేవు
సన్నలనే మొక్కితిమి చాయల దీవించితివి
కిన్నెరమీట్ల నింకా గిలిగించవలెనా ॥నాఁటి॥

ననుపువారము గాము నవ్వింపించుకో రాదు
పనిలేనిపని యేల పట్టి తీసేవు
తనిసితిమి మాలోనే తారుకాణ వచ్చె నీకు
ఘనముగాఁ బాట వాడి కాఁక రేఁచవలెనా ॥నాఁటి॥

సమ్మతించ లేదు నేము చవులు వుట్టించ రాము
కమ్మరఁ గమ్మర నేల కాఁగిలించేవు
యిమ్ముల శ్రీవేంకటేశ యీడ నన్నుఁ గూడితివి
చిమ్ముచు నేకతా లాడి సిగ్గు రేఁచవలెనా ॥నాఁటి॥ 272

## దేసాళం

ఇక్కువచాఁటినమీఁద నేమి సేసేము
చక్కనివిభునిమీఁద చలముకోఁగలమా ॥ పల్లవి ॥

వాడికెగా రమ్మంటి వచ్చినో రాఁడో కాని
యీడ వుంగరము నాకు నిచ్చి పోయను
వేడుకకానిమనసు వేవేలచందాలఁ బారు
తోడితేరే వద్దనుండి తొయ్యలులాల ॥ ఇక్కు ॥

తగిలి యాన వెట్టి (తి?) తలఁచీనో లేదో కాని
నగుతా నిమ్మపం డిచ్చె నాచేతికి
మగవానివలపులు మ ట్టెరఁగఁగ రాదు
తగిలి పిలువరే తరుణులాల ॥ ఇక్కు ॥

పదివేలుగా మొక్కితి పరాకాయ నేమో కాని
యెదుటనే సన్న సేసె యిప్పుడు నాతో
కదిసి కూడెను శ్రీవేంకటపతి యిదె నన్ను
పొదిగి సేవ సేయరే పొలఁతులాలా ॥ ఇక్కు ॥ 273

## శ్రీరాగం

వెల్లవిరి సేతురటే వెక్కసపుమగవాని
తెల్లమిగాఁ గోపించితే తెగుసలు మీరవా ॥ పల్లవి ॥

మదనాతురుఁ డొకరిమాటలు వినేనా
పొదలి యాచింతలనే పొరలుఁగాక
పదరి ననుఁబోంట్లు బలిమి సేసి పట్టితే
విదలించి సిగ్గులెల్లా విడువక మానునా ॥ వెల్ల ॥

ననుపువేడుక కాఁడు నవ్వేవారి నెరుఁగునా
మునుకొన్నవలపుల మునుగుఁగాక
కొనఁ బెట్టి మన మెంతకొద్ది నిలుపఁ బోయినా
తన (ను?) యించుకంత మొకదాకిరియు మానఁడా ॥ వెల్ల ॥

ఆసలఁ జిక్కినవాఁడు అవుఁగాము లెరుఁగునా
వేసరక అదేపనై వెదకుఁ గాక
వేసాల శ్రీవేంకటేశు వెలయ నేఁ గూడితి
యీసు దీరె నన్నే కాక యితరులఁ బొందునా ॥ వెల్ల ॥ 274

పాడి

ఉన్నతిసుఖాన నీ వుండిఁతే జాలు నట్టి-
యెన్నికల కెక్కించేది యేల మాకు దోసము ॥ పల్లవి ॥

ఇక్కడికి రాఁగాను యేమని తిట్టునో చెలి
అక్కడ నుండే మాటలాడవయ్యా
పక్కన నా పెలిగితే పాసి నీ వుండఁగ లేవు
యెక్కువ నిన్నింత సేసే దేల మా కీదోసము ॥ ఉన్న ॥

యిట్టె నామోము చూడఁగ నెంత సాదించునో నిన్ను
వట్టిసిగ్గుతోఁ దలవంచుకోవయ్యా
యెట్టైనా నాపెతో నీవు యెదురు మాటాడ లేవు
యెట్టకేల కొకమాఁటు యేల మా కీదోసము ॥ ఉన్న ॥

కాఁగిట నన్నుఁ గూడేవు కనునో యేమో ఆపె
పీఁగక గొబ్బనఁ దెర వేయవయ్యా
లోఁగక శ్రీవేంకటేశ లోలుఁడ వై తివి నాకు
యేఁగక యిట్టే వుండు యేల మా కీదోసము ॥ ఉన్న ॥ 275

మంగళకౌశిక

ఇద్దరము నిద్దరమె యెట్టుంటి మేమి
వుద్దండాన నీ వేల వొలవేసేవే ॥పల్లవి॥

వట్టికిఁట నీ కేలే వాదులు నే మడిచితే
చిట్టకాన సాకిరులు చెప్ప వచ్చేవు
వొట్టు వెట్టుకొంటి నేను వొడఁబరచె నాతఁడు
యిట్టె నీ వింతలో నేల యెత్తి పెట్టేవే ॥ఇద్ద॥

వలవనిచల మేలే వాసికి నే మలిగితే
పొలసి నడుమ నీవు పొందు సేసేవు
పిలువకుండితి నేను ప్రియము చెప్పె నాతఁడు
పలుమారు నీ వేల పంగించేవే ॥ఇద్ద॥

లేనితగులు నీ కేలే లీల నేము వేగించితే
ఆనుక నీవును నట్టె అండ నుండేవు
పూని నేఁ దెర వేసితి పొందె శ్రీవేంకటేశుఁడు
కానీలే నీ విందు కేల కడు నవ్వేవే ॥ఇద్ద॥ 278

రేకు—748 రీతిగౌళ

పల వూరకున్న దాపె యేఁటికి యిఁక వెరపు
తూలనాడితే నేనుఁ దోడై రాగా ॥పల్లవి॥

ఆపెఁ బోలునా యీపె ఆతనిభ్రమత గాక
యీ పెరుఁగునా వలపు రుచులే కాక
యేపని సేయదో ఆపె యేమి సేసెనో యీపె
యీపని కింత సేసినా యిందరును మెచ్చరా ॥పల॥

వెగ్గళమా ఆపె కీపె విభునినేరమి గాక
సిగ్గెరుఁగునా వయసు చిక్కించుఁ గాక
యెగ్గు లాపె యేమెంచెనో యీపె యే మెంచదో కాని
కగ్గి యీపె మీరితేను కాంతుఁడే లోఁబడఁడా ॥ఏల॥

యేలదా యీపెను నాపె ఇద్దరిఁ దాఁ గూడెఁ గాక
వేళెరుఁగునా తమి వేదించుఁ గాక
నాలిఁ దగ దంటేఁ గూడె నన్ను శ్రీవేంకటేశుఁడు
వోలి నిందుకే నవ్వితే నూరెల్ల ననదా ॥ఏల॥ 277

పాడి

మరుఁ డేడ నున్న వాఁడె మనసులోపలఁ గాన
తొరల నే విన్నవించి దూరే నంటేను ॥పల్లవి॥

వలపు చెప్పఁగరాదు వయసు పైఁ బూయరాదు
యేమి నాతనికైతే నెఱుకలేదు
చెలు లాడనే వున్నారు చింతతో నుందాన నీడ
బలువిరహాపుటేరు పారీ నడుమను ॥మరుఁ॥

నను పైఁ జల్లరాదు నవ్వు వెదవెట్టరాదు
తనిసి యీవిచార మాతనికి లేదు
వినుకలి పతి కందు వెరగుట నా కిందు
పనిలేనిమాటలేరు పారీ నడుమను ॥మరుఁ॥

కూటమి మీఁదెత్తరాదు కోరికలు చుట్టరాదు
నేఁటితో నాతని కిన్నీ నేరుపరాదు
కూటువఁ దా విచ్చేసి కూడె శ్రీవేంకటేశుఁడు
పాటించి చెమటలేరు పారీ నడుమను ॥మరుఁ॥ 278

బౌళి

ఆతఁ డదె నే నిదె అమ్మలాలా
నీతితోడ నడుగరే నేరుపరిచెలులు ॥పల్లవి॥

బిగువుఁజన్నులు నావి ప్రియములెల్లఁ దనవి
పగటుతో నిటమీఁదిపంతము లేవి
నగవులు చెక్కులవి నాటకాలు మొక్కులవి
తగవు లింకటిమీఁద తనకో నాకో ॥ఆతఁ॥

చెనకేచేతులు నావి జిగిమర్మాలు దనవి
కనుఁగొనే యిటమీఁదికత లేవి
వినయాలు మాటలవి వేసాలు నీటులవి
తనివోనిధైర్యములు తనకో నాకో ॥ఆతఁ॥

కూడినకూటమి నాది కోరికె చెల్లెఁ దనది
ఆడుకోలు మాట లిఁక నవి యేవి
పాడితో శ్రీవేంకటాద్రిపతి నన్నుఁ గలసెను
తాడుపడ్డసిగ్గు లిఁకఁ దనకో నాకో ॥ఆతఁ॥ 270

బలహంస

నీపని నీ వెరుఁగుదు నేనూఁ గొంత యెరుఁగుదు
పైపై నిన్ను గరిసించేపజలే పో జాణలు ॥పల్లవి॥

ఆవేళ నాపెచెవిలో నాడితివి యేకతాలు
నావంక చూచి నీవు నవ్వితివి
వేవేలుగా నీకు నేను వేలనే మొక్కు మొక్కితి
భావించుకో నేరచినపజలే పో జాణలు ॥నీప॥

సంగడిఁ గూచుండితిరి సన్నలు సేసుకొంటిరి
రంగుగా నాడకు యిట్టె రమ్మంటిరి
యింగిత మెరిఁగి నీకు నిచ్చితి కానుక పెక్కు -
బంగులఁ దలఁచుకొనేపజలే పో జాణలు ॥నీప॥

మోములో మీలోఁ జూచుక మోనముననే వుండి
నామీఁదఁ జెయివేసి నమ్మించితివి
అముక శ్రీవేంకటేశ అందుకే నిన్నుఁ గూడితి
జాముతో విచ్చిచెప్పినపజలే పో జాణలు ॥నీప॥ 280

శ్రీరాగం

ఎట్టు మఱతు నీభాగ మెవ్వతెకుఁ గల దిఁక
యిట్టె యేకతాన నుండి ఇవె తలఁతురా ॥పల్లవి॥

వుక్కుమీర జగడించి వొట్టు వెట్టుకొని తేచి
గక్కన మంచము దిగఁగా నన్నుఁ జూచి
పక్కన నీవంటఁబట్టి పాపట్టపై గోరు మోపి
చొక్కించి మోవి యానితి సొంపు లివి చాలవా ॥ఎట్టు॥

పెనఁగి చేతులు విడిపించుక నిన్నాన వెట్టి
కనలి గడె దెరవఁగా నీవు చూచి
చనుఁగొంగు జారదీసి సరిచెక్కు చేత నొక్కి
యెనయఁ దమ్ముల మిడి తిది యింత చాలదా ॥ఎట్టు॥

బొమ్మలనే జంకించి బూతుల మాటలాడి
కమ్మర నాయితపడఁగా నన్నుఁ జూచి
చిమ్ముల శ్రీవేంకటేశ చెక్కుచెక్కుఁ గదియించి
నెమ్మిఁ గూడి పానుపుపై నిలిపితి చాలదా ॥ఎట్టు॥ 281

బౌళి

పట్టపుదేవులవు ప్రాణబంధువులాలవు
అట్టె ఇయ్యకొనవద్దా అంగన ఇదేమే ॥పల్లవి॥

చేతులు వట్టుక నిన్ను చెక్కు నొక్కి రమ్మంటాను
ఘాతల నింతటనైనాఁ గలయవద్దా
ఆతఁడు బాగా లిచ్చి ఆకు మడ చియ్యఁ జూచి
ఆతిమనసా రమణి అట్టు నీ కిదేమే ॥పట్ట॥

విందుగా మోవి చూపి వేఁడుకొనీ సారెసారె
ముందుముందే యతనికి మొక్కవద్దా
కుందక చనవుసేసి కొంగు వట్టుకున్న వాఁడు
మందెమేళమా నీకు మగువ ఇదేమే ॥పట్ట॥

కన్నుల నవ్వులు నవ్వి కాఁగిలించుకున్న వాఁడు
మిన్నక రతుల నిట్టె మెప్పించవద్దా
యిన్నిటా శ్రీవేంకటేశుఁ డెనసె నిన్నింతలోనె
కన్నెపడుచవా నీవు కలికి విదేమే ॥పట్ట॥ 282

రేకు—749 భైరవి

వేసరక తగిలేటివెట్టిదానను
ఆసతో నీ (నే?) మన్న నిఁక నందుఁ గాని ॥పల్లవి॥

చలివేఁడిమాటలూ సరసపుతేటలూ
కలకాలము నీయందుఁ గన్నవే కావా
పిలువనిపేరటాలు పెనగొన్న మోహాలు
నలువంక నేనే నీపై నడపేఁ గాని ॥వేస॥

బచ్చెనచూపులూ పైపైఁ దరితీపులూ
గచ్చులనీయంద దెపుడుఁ గలవే కావా
ముచ్చటలవిన్నపాలు మొక్కేటివినయములు
పెచ్చురేఁగి నే నీతోఁ బెనఁగేఁ గాక ॥ వేస ॥

నాలితోడిసంతనాలు ననుపు పొంతనాలు
చాలినంతా నీకుఁ గలసాజమే కాదా
కోలుముందై నేనే నిన్నుఁ గూడితి శ్రీవేంకటేశ
మేలు మేలనుచు నిట్టే మెచ్చేఁ గాని ॥ వేస ॥ 283

మధ్యమావతి

దయగలవాఁడవు వుత్తమనాయకుఁడవు
ప్రియములు నీకుఁ జెప్పి పిలువ వచ్చితిమి ॥ పల్లవి ॥

చిత్తములోపలిరూపు చిత్తరుపటాన వ్రాసి
హత్తి కాఁగిలించుకొను నంగన నిన్ను
ఱత్తిగా నిన్నుఁ దలఁచి బయలుతో నాటలాడు
ఇత్తల నీపై వలపు లేమని చెప్పేమయ్యా ॥ దయ ॥

పాటమైననీపేరు పదములలోనఁ బెట్టి
కూటువ నిన్ను నంకించు కోమలి నిన్నుఁ (?)
నీటునఁ బానుపుమీఁద నీ వున్నాఁడవని పొందు
యేఁట వెట్టి నీపై తమి ఇఁక నెంతో అయ్యా ॥ దయ ॥

కాఁగిటిలోనిరతులు కలవరింతలఁ బెట్టి
మాఁగినమోవి యందిచ్చు మగువ నీకు
తోఁగి చూచింతలో నీవే తుదముట్టఁ గూడితివి
యేఁగక శ్రీవేంకటేశ ఇట్టె వుండవయ్యా ॥ దయ ॥ 284

ఆహిరి

వేగిర మేలే కొసరు వేరే వుండఁగా నిం -
    తీగెకళలమోమైనాఁ దెలిపించీఁ గాక ॥ పల్లవి ॥

దాఁపగునామనసే తల కెక్క వలపించె
    పాపము తన్ననవేలే బతుకుఁ గాక
యేపున నిపు డేమూఁయ హృదయములోను చొచ్చి
    చూపులు నావైనాఁ దను సూదువట్టీఁ గాక ॥ వేగి ॥

వెక్కసపువయసే విరహము పెరరేఁచె
    పక్కనవాడు లిం కేలే బతుకుఁ గాక
కక్కసము వలెనా ఘనమర్మములు దాఁగి
    చక్కఁదనము నాదైనా సాదించీఁ గాక ॥ వేగి ॥

వింతగునావావులే వీఁడుదోడు లాడించె
    పంతము దనతో నేలే బతుకుఁ గాక
అంతటి శ్రీవేంకటేశుఁ డన్నిటా నన్నుఁ గూడె
    యెంతకైనా నాచలమే యియ్యకొనీఁ గాక ॥ వేగి ॥ 285

కాంబోది

అంగనలము గనక ఆసపడక మానము
    సంగ తెరిఁగి మన్నించ జాణఁడవు గావా ॥ పల్లవి ॥

నిండుఁగొలువులో నాతో నీవు నవ్వినది నాకు
    కొండంత పెద్దరికము కోటికొండలు
అండనే బాగా లిచ్చి ఆదరించితేఁ గనక
    వెండియు నందుపై మరి వేలు వున్నదా ॥ అంగ ॥

సవతులలో నాతో సరసమాడితే నది
జవళిఁజిగపట్టము సామ్రాజ్యము
తివిరి యందుమీఁదట తేజము చేసితేఁ గన
యివల నాపదవికి యింతంతన నున్నదా ॥ అంగ ॥

యింతేసివారిలో నాతో నొనసి వుండినలాగు
సంతతసౌభాగ్యము జయసంపద
కాంతుఁడ శ్రీవేంకటేశ కరుణించితి గనక
యింతు లెవ్వరైనా నాతో నీడు వెట్టఁ గలరా ॥ అంగ ॥ 286

ముఖారి

వాకిట నీ వుండనేల వనిత లోన నుండఁగ
సాకిరివారము నేము సాదించ వచ్చేమా ॥ పల్లవి ॥

పంతము నీతో నాడి పలుకకున్నది చెలి
యెంత సేసితివో నీవే యెరుఁగుదువు
మంతుకు మాతోఁ జెప్పేంపేమాటలు పనికి రావు
అంతే కలితే విచ్చేసి ఆదరించు నీవే ॥ వాకి ॥

వొడఁబాటు వొప్పగించి వొంటినే వున్నది చెలి
అడరి నీవే నేరుతు వంతటికిని
చిడుముడి నే మొక్కటి సేసేటితతి దప్పె
వెడఁగాపెచిత్తము రా వేడుఁకొమ్మి నీవే ॥ వాకి ॥

భారము నీమీఁదఁ బెట్టి పవ్వళించున్నది చెలి
చేరువాయఁ బనులు నీచేతిదే యిఁక
యీరీతి నాపెనుఁ గూడి యిట్టె ముంగిటఁ గూచుంటి
పేర శ్రీవేంకటేశుఁడ పిలుచుకో నీవే ॥ వాకి ॥ 287

వరాళి

నిక్కి చూడ నేరుతుమా నీవే కాక
తక్కక నీవారము తాలిమి నుండుదుము ॥ పల్లవి ॥

వాములనవ్వులు నవ్వ వన్నెలమాట లాడ
నే మంతేసి నేరుతుమా నీవే కాక
నేమపునీసతు లెల్ల నేరిపిరి నీ కింతేసి
చేముంచక యుల్లాండ్లము సిగ్గున నుండుదుము ॥ నిక్కి ॥

ఆతల నేమైనాఁ జేసి యందాలు చేసుకొనను
నీతులు నేరుతుమా నీవే కాక
జాతులనీసతు లెల్లా జాణఁ జేసి రింతేసి
యీతల నీవారమని యిందుక వుండుదుము ॥ నిక్కి ॥

వాఁటముగా వలపించ వాసులకుఁ బెనఁగఁగ
నీ టింత నేరుతుమా నీవే కాక
గాఁటమై (శ్రీ) వేంకటేశ గక్కనఁ గూడితి నన్ను
మేఁటిపట్టపువారము మెచ్చుక వుండుదుము ॥ నిక్కి ॥ 288

రేకు - 750. భూపాళం

మొక్కేము నీకు నీమోహము గల్ల లంటినా
యెక్కడిసాకిరులు నే నెఱఁగనా నిన్ను ॥ పల్లవి ॥

మాటలు నీ వెన్నాడినా మచ్చి కెంత సేసినాను
నీటునఁ దొల్లిటిదే కా నీ గుణము
వాఁట నూయ వలపులు వావులూనుఁ దుద కెక్కె
యేఁటికిఁ బెట్టే వానలు యెఱఁగనా నేను ॥ మొక్కే ॥

చెక్కు లిట్టె నొక్కినాను చేరి యంత నవ్వినాను
నిక్క నేఁ జూచినవే కా నీచేఁతలు
దిక్కులవా రెరిఁగిరి దీవెనలు సరివచ్చె
యిక్కువ తేలంచేవు యెఱఁగనా నేను ॥ మొక్కే ॥

కన్నుల నెంత చూచినా కాఁగి లెంత యిచ్చినాను
నిన్నటి మొన్నటివే కా నీవినయాలు
నన్ను శ్రీవేంకటేశుఁడ నటనఁ గూడితివి
యెన్నేసిమన్నన లిచ్చే వెఱఁగనా నేను ॥ మొక్కే ॥ 289

మలహరి

నీ విట్లుండుట నే నెఱఁగా
అవల నీయింటి కంపితి నేను ॥ పల్లవి ॥

పిలుచుక రమ్మని ప్రియము చెప్పుమని
నెలఁతల నంపితి నీకడకు
యెలమి నీకు వా రెదురు గారయిరి
వెలి నీ వెందుండి విచ్చేసితివో ॥ నీవి ॥

కానుక లిమ్మని కదిసి మొక్కుమని
పూని యంపితిని పొలఁతులను
నీనెల వెఱఁగక నెమకిరో తాము
తోనే చీఁకటిపొద్దున వచ్చితివి ॥ నీవి ॥

వసన లడుగుమని వలపు దెలుపుమని
తరుణుల నంపితి తమకమున
పరగ శ్రీవేంకటాద్రిపతి ననుఁ గూడితి
తిరిగిరి వారే తిరమైతి నీవు ॥ నీవి ॥ 290

## నారాయణి

నీలోనిమతకాల నే నెఱఁగనా
పోలించి సరివచ్చితే బొంకఁ జోల్లేవి ॥పల్లవి॥

సొలవక మగవాఁడు చూచినయంతటిలోనె
తలఁపు దెలియనిది తరుణా యది
పలికినంతటిలోనె భావము దెలియకున్న
నెలకొన్నయాఁటదానినేరు పెల్లా నేది ॥నీలో॥

యెదుట నిలిచితేనే యింగితాకారము లెల్ల
తుర నేర్పరచనిది తొయ్యలా యది
కదిసేయాసందిలోనే కలయిం చెఱఁగకున్న
దరాన మానినులజాణతన మేది ॥నీలో॥

చేముట్టి నంతటిలోనే శ్రీవేంకటేశ్వరుఁడ
నీమనసు గనకున్న నెలఁతా యది
కామించి కూడితివి యీకందు విట్టి దనకున్న
వేమరు మావంటివారివివేక మేది ॥నీలో॥ 291

## కన్నడగౌళ

పేరుఁ గీర్తి నీ చేతిదే పెనఁగ నేల
నూరలుకలును నొక్కనూలునఁ దీర్చితిని ॥పల్లవి॥

పాయపువారిమాటలు పట్టరాదు ముట్టరాదు
చాయకుఁ దొలఁగి వుండు నటలూఁ గావు
నీయంత నీవు రాజవు నేనే యాఁటదానను
వేయిటి కొక్కవలపు వెల కట్టిచ్చితిని ॥పేరుఁ॥

సిరిగలవానిచేఁత చెప్పరాదు చూపరాదు
విరసాలవలె నుండు విడువరాదు
దొరవు నీవు నేను దోసిటిపాలదానను
సరి లత్తుకు నామొక్కు సంచకా రిచ్చితిని ॥ పేరుఁ ॥

ఆలిమగనిపొందులు అడరాదు చూడరాదు
తాలిమివలెనే వుండు తనివి లేదు
యేలి కూడితివి నన్ను యిట్టె శ్రీవేంకటేశ
పాలించు మెచ్చు కోటికిఁ బడిగె యెత్తితిని ॥ పేరుఁ ॥ 292

బౌళిరామక్రియ

అందు కేమి దోసమా ఆతఁ డదె నే నిదె
ముందు వెనకలైతే మొక్కేఁ గాని ॥ పల్లవి ॥

అప్పుడే ఆతఁడు నవ్వె అయము నాకుఁ గరఁగె
చెప్పరాదా మీమాఁట సేసేఁ గాని
దప్పికి యెండమావులు తనివి దీరుచలేవు
వుప్పుఁ గప్పురము లైతే వొడఁబడేఁ గాని ॥ అందు ॥

కన్నుల నాతఁడు చూచె కాయమెల్లాఁ జల్లనాయ
పన్నరాదా మీనేరుపు పలికేఁ గాని
వెన్నెల గాదెఁ బోసితే వెచ్చాన కడవు (?) గాదు
సున్నమే వెన్నయైతే సూటిపడేఁ గాని ॥ అందు ॥

శ్రీవేంకటేశుఁడు గూడె చేతికి లోనైతి నేను
వావి చెప్పరాదా మీరు వచ్చేఁ గాని
పూవు గట్టినజవ్వాది పూసితే వాసన వోదు
దీవిసంకు ముత్యమైతే తెలిసేఁ గాని ॥ అందు ॥ 293

సాళంగనాట

నిన్నా మొన్నా లేనితమి నేఁడే వచ్చెనా
పమ్మి (న్ని?) మ మ్మేఁటికి నింత పరచేవో కాని ॥ పల్లవి ॥

సంగడిఁ గూచుండి నన్ను సారె సారెఁ జెక్కు నొక్కి
యెంగిలి మో వడిగేవు యేరా నీవు
అంగనలు లేక కాదు అంతేసిమోహము గాన
చెంగట మ మ్మేల కాకు సేసేవో కాని ॥ నిన్నా ॥

చక్కఁ దనాలు వొగడి సరసపు మాటలాడి
యిక్కువకుఁ జేయి చాఁచే వేరా నీవు
అక్క రౌతాఁ దెలియదు అణకించే దెరఁగము
వొక్కమాటే మ మ్మింతేల వొరసేవో కాని ॥ నిన్నా ॥

నమ్మికలు నాకు నిచ్చి నయగారా లెల్లాఁ జేసి
యిమ్ములఁ గాఁగిటఁ గూడి తేరా నీవు
నెమ్మది శ్రీవేంకటేశ నీ వెంత నే నెంత
ముమ్మాటికి నింకా నేల మొక్కేవో కాని ॥ నిన్నా ॥ 294

రేకు—751 సాళంగనాట

ఈపెకు నితఁడు దగు నితని కీపె దగు
చూపులకు పండుగాయ శోభనము నేఁడు ॥ పల్లవి ॥

పిలువరె పెండ్లికూఁతుఁ బెండ్లిపీఁటమీఁదికి
చెలఁగి తా నెదురుచూచీ దేవుఁడు
బలువుగా నిద్దరికి బాసికములు గట్టరె
కలిమెల్ల మెరసి సింగారించరే ॥ ఈపె ॥

ఆతఁడె దెచ్చిపెట్టరె ఆపెండ్లికూఁతురును
యీతఁడే జంట శోభన మిద్దరికిని
కాతరాన బువ్వానకు గక్కనఁ బెట్టరె మీరు
రేతిటనుండియు వేగిరించేరు వీరు ॥ ఈపె ॥

పానుపు వరచరె బలునాగవల్లి నేఁడు
పూని తెరవేయరె పొలఁతులాల
అనుక శ్రీవేంకటేశుఁడల మేలు మంగయును
లోననె భూకాంతయును లోలులైరి తాము ॥ ఈపె ॥ 295

రామక్రియ

ఎలమి బలిమి సేసితి రిందు కాతనిఁ దెచ్చితి-
రాలరిసలఁపులెల్లా నాడనే వున్నవి ॥ పల్లవి ॥

బంటువలె నాచేతిబాద కున్నాఁడు గాని వా-
రింటికిఁ బోయ్యేటిఆస ఇంకా నున్నది
నంటున నీడ నుండేది నాటకము గాని యాపె -
వెంటవెంటఁ దిరిగాడేవేడుకే వున్నది ॥ ఎల ॥

పొగరై యీతఁడు మాతోఁ బొందు సేసీఁ గాని యాపె-
మొగము చూచేవలపు ముంచి వున్నది
జగము మెచ్చ నాపైఁ జెయి చాఁచె నింతే కాని యాపెఁ
దగిలి కాఁగిలించేటితమకమే వున్నది ॥ ఎల ॥

పాదుగా నాతొడమీఁదఁ బవళించెఁ గాని యాపె-
పాదాలకు మొక్కేయట్టిభ్రమ వున్నది
ఆదరిం చెలమేల్మంగ నని శ్రీవేంకటేశుఁడు
నాదెసై నిలిచి కూడె నవ్వు మోపిమీఁద నున్నది ॥ ఎల ॥ 296

పాడి

తొల్లిటి నే నుండఁగాను దొరకీనా తనకు
మల్లాడఁ బోతే వలపు మరి గొంటు పడదా ॥పల్లవి॥

రచ్చ కెక్కి తా నెంత రాజసము చూపినా నీ-
విచ్చినంతచనవే కా యిత వయ్యేది
ఇచ్చకాన వలచి నాయింట నిట్టె వున్నాఁడవు
పచ్చి సేయ తన కంతబలు వున్నదా ॥తొల్లి॥

దిమ్ము రేఁగి తా నెంత తిట్టులాడినా నీవు
సమ్మతించినంతే కా చవి పుట్టేది
కమ్మిక నాతో నీవు కాఁపురము సేసే విదె
రమ్మని తాఁ బిలువ కారణ మున్నదా ॥తొల్లి॥

జగము మెచ్చ తా నెంత సరసమాడినా నీవు
నగినయంతే కా నను పయ్యేది
తగిలి శ్రీవేంకటేశ దక్క నన్నుఁ గూడితివి
తగ నలమేల్మంగను తనపంత మున్నదా ॥తొల్లి॥ 297

సామంతం

మొక్కేమయ్యా నీకు ముమ్మాటికి
యెక్కువతక్కువల నిన్నేమి సేసితిమో ॥పల్లవి॥

విరహతాపముచేత విసిగినవేళ నిన్ను
యెరవుగాఁ జూచి చూచి యేమాడితినో
తరలక నీవు నన్ను దగ్గరి కాఁగిలించితే
కరఁగినవేళ యెట్టు కాలు చేయి దాఁకునో ॥మొక్కే॥

జవ్వనమదముచేత జడిసినవేళ నిన్ను
యివ్వల నే నెంత రచ్చ కెక్కించితినో
నవ్వుతా నీవంత నాకు నీమో వియ్యఁగాను
యెవ్వల నీ కేడేడ నాయెంగి లాయనో ॥ మొక్కే ॥

పానుపుపై నిద్దరము పవ్వళించేవేళ నిన్ను
పూని యంత యలయించి భోగించితినో
ఆనుక శ్రీవేంకటేశ అలమేలుమంగను న -
న్నీనెపానఁ గూడితివి యెట్లా మీరితినో ॥ మొక్కే ॥ 298

సింధురామక్రియ

ఉన్నసుద్దులకు నీవు వోనఁగూడేవా
కన్నులజంకెనలకే కాఁతాళించేవు ॥ పల్లవి ॥

వెనఁగేటివాఁడ వేల పిలువ నంపితి నన్ను
వొనరినచేఁత కెల్లా నోరువవద్దా
మనసు రాదో కాక మాతోడిపొందు నీకు
కొనగోరితాఁకులకె కోపగించేవు ॥ ఉన్న ॥

సిగ్గువడేవాఁడ వేల చెనకితి విటు నన్ను
యెగ్గులేక నామాటల కియ్యకోవద్దా
వెగ్గళించి నానవ్వు వేసటాయనో కాక
దగ్గరి మాటిట్లకే తలవంచేవు ॥ ఉన్న ॥

కడునలసేవాఁడవు కాఁగిట నేల కూడితి
జడియనినారతికి సరి గావద్దా
అడరి శ్రీవేంకటేశ అలమేలుమంగ నేను
వొడలు సోఁకినందుకే వూరకే చొక్కేవు ॥ ఉన్న ॥ 299

నారాయణిదేసాళి

ఇక్కడ నక్కడ సరె యెందాయ నేమి
మిక్కిలిచెలియపొందు మేలు నీకు రావయ్యా ॥పల్లవి॥

తమితోడఁ బాలసముద్రముమీఁదఁ బవళించి
విమలుఁడవై యుండేటివేడుక కాఁడ
చెమటలసముద్రము చెలిమేన నున్న దిదె
ప్రమదాన నీవు నేఁడు పవళింతు రావయ్యా ॥ఇక్క॥

చెలఁగి యాకసమెల్లా శ్రీపాదమున నే
కొలచుకొంటా నుండేటికోడె కాఁడ
నలువున నీయింతినడిమియాకస మిదె
కొలఁదిమిగుల నిట్టె కొలతు రావయ్యా ॥ఇక్క॥

శ్రీవేంకటేఁడవై చిత్తగించి కొమ్మతో
యీవలఁ గొండపై నుండేటియెమ్మెకాఁడ
తావి నలమేల్మంగ తగుఁగుచగిరు లివి
వోవరిఁ గూడితి వించే వుండు విట్టే రావయ్యా ॥ఇక్క॥ 300

రేకు-752 భైరవి

కాంతలకుఁ బతులకు కలసహజమే యిది
వింతలు సేయక యిఁక విచ్చేయు మాయింటికి ॥పల్లవి॥

ఘనుఁడవై ననిన్నుఁ గన్న వారమీఁదఁ బెట్టి
పనివడి నవ్వితిని పలుమారును
చనవు సేసుక నిన్ను సటలెల్లా నాడితిని
వెనక నేరాలు దీర విచ్చేయు మాయింటికి ॥కాంత॥

మన్నించి నీవు నాపై మచ్చికలు చూపఁగానే
కన్నుల జంకించితిని కడుఁగడును
వున్నతుఁడవై ననీతో నూరక నేఁ బెనఁగితి
విన్నపా లంతేసి నేర విచ్చేయు మాయింటికి ॥ కాంత ॥

శ్రీవేంకటేశ నీచిత్తము నే నెఱఁగక
వావి నలమేల్మంగనై వచ్చి కూడితి
దేవుఁడ విన్నిటా నీవు తెలిసి నే మొక్కితిని
వేవేలు వచ్చెను నేఁడు విచ్చేయు మాయింటికి ॥ కాంత ॥ 301

దేసాళం

ఎవ్వ రెక్కైనా ననని యియ్యకోలు నీకు నాకు
రవ్వలుగా నిన్ను నింత రతి కెక్కించితిని ॥ పల్లవి ॥

సారె సారె నాతో నవ్వేచనవున నే నిన్ను
వోరి యని యంటిని నొడి వట్టితి
మారు లేక నీవు నన్ను మన్నించి మందువు గాన
గోరుకొన దాఁకించితి కూరిమి చల్లితిని ॥ ఎవ్వ ॥

మాటలు నీ వాడేటిమందెమేళమునసే
కూటమికిఁ బెనఁగితి కొసరితిని
నాటఁ జూచిననీచూపు ననిచినందువల్లనే
యీటు వెట్టుక నీమోవి యెంగిలి సేసితిని ॥ ఎవ్వ ॥

కాయము నా కొప్పగించి కాఁగిలించుకొనఁగానే
చాయల నిన్నుఁ దిట్టితి జంకించితిని
ఆయపుశ్రీవేంకటేశ అలమేల్మంగను నేను
పాయకుండఁగానే నిన్ను సంతాన మించితిని ॥ ఎవ్వ ॥ 302

లలిత

తనచిత్త మిఁక నెట్టో తా నెరుఁగును
   యెనసితే నెనసితి నిదివో నేను ॥ పల్లవి ॥

వేమారు సాదించలేదు వెంగెము లేమియు నాడ
   నా మోము చూచితేనే నవ్వితి నేను
   చేముట్టి సరసమాడఁ జెనకుచు వాఁడి చూప-
   నేమి యంటే నేమి యంటి నిదివో నేను ॥ తన ॥

కక్కసించి జంకించఁ గన్నచోటనెల్లా దూర
   మిక్కిలాన వెట్టుకోఁగా మెచ్చితి నేను
   వెక్కసపుమాట లాడ వింతచేఁత వచరించ
   ఇక్కు వంటితే నంటితి నిదివో నేను ॥ తన ॥

బలిమి నేఁ దనుఁ జేయ పంతము లేమియుఁ జూప
   సోఁకి తాఁ గూడితేనే చొక్కితి నేను
   అలమేలుమంగ నేను అట్టె తా శ్రీవేంకటేశుఁ-
   డిలఁ దా మొక్కితే మొక్కితిదివో నేను ॥ తన ॥ 308

వసంతవరాళి

వలపు గొట్టానఁ బెట్టి వనిత లుండఁగాఁ గడ
   నిలుచున్న మామీఁద నీకుఁ బరాకు ॥ పల్లవి ॥

పక్కనఁ గాఁకలు చల్లి పాయము లుట్టిపడఁగా
   చెక్కు నొక్కి వేఁడుకొనీఁ జెలి నిన్ను
   మొక్కుచు దవ్వులనుండి మొలకనవ్వులు నవ్వి
   నిక్కి చూచె మాదిక్కె నీవు చూచే విదివో ॥ వల ॥

మాటల మచ్చులు వేసి మానము నీకొప్పగించి
కూటమికిఁ జెయి వట్టీఁ గొమ్మ నిన్ను
మేఁటిజాణతనా లాడి మేడ లెక్కి తమ్మిమొగ్గ
వాటు వేసినంతలో నావస మైతివి ॥ వల ॥

బలిమిఁ గాఁగిలించి పయ్యద కొంగు జారి
కలసి లోలో మెచ్చీఁ గలికి నిన్ను
వెలినుండి నీవద్దికి వేళ చూడ వచ్చితేనే
వెలయఁ గూడితివి శ్రీవేంకటేశ నన్నును ॥ వల ॥ 304

## సామంతం

అంగడిఁ బెట్టేవు మమ్ము నౌనోయి బావ నీ-
ఇంగితము తెల్లాఁ గంటి మింకానా బావా ॥ పల్లవి ॥

సారె నీరాఁటి రేవులజాణతనాలా బావ
గోరికొనకు లోఁగాని గొంటరిబావ
కోర సోఁకి వలపులు గుద్దలించేవా బావ
రారాదా మానికింద రచ్చసేసేబావా ॥ అంగ ॥

కందువ నెందుకునైనాఁ గాలు చాఁచే విట్టె బావ
చెంది సూడుకుఁ బాడుకుఁ జిమ్మేటిబావ
విందువలె నాఁటదాని వెదకి వచ్చేటిబావ
నిందలు నీపై మోఁచేనీవారమో బావా ॥ అంగ ॥

యెగ్గు సిగ్గు లెరఁగవు ఇది యేఁటి దోయి బావ
వెగ్గళించేవు కలికివిద్యల బావ
అగ్గమై శ్రీవేంకటేశ అట్లానే నన్నుఁ గూడి
నిగ్గుదేర మన్నించితి నీవే నే నోబావా ॥ అంగ ॥ 305

పాడి

అందరిపాలిటివాఁడు నాతఁడే కాఁడా
అందము లప్పుడే సేసీ నాతఁడే కాఁడా ॥ పల్లవి ॥

యీడ నిన్నుఁ బెట్టుకొని యెదురుమాటలు నాతో-
నాడించేటిసూత్రధారి యతఁడే కాఁడా
పాడి దప్పి నిన్ను నంత పచ్చిసేయ నిఁక నేల
ఆడకు వచ్చేటివాఁడు నాతఁడే కాఁడా ॥ అంద ॥

మంతు కెక్కించి నిన్నింత మానిసిఁ జేసినవాఁడు
అంతటికి గురి యిఁక నాతఁడే కాఁడా
పంతాలు నీతో నేల పనిగలయప్పటికి
అంతరంగమయ్యేవాఁడు నాతఁడే కాఁడా ॥ అంద ॥

సరి నిన్ను నన్ను నొక్కజంట సేసి కాఁగిలించే-
అరుదైనజాణకాఁడు ఆతఁడే కాఁడా
యిరవై శ్రీవేంకటేశుఁ డిట్టె నన్నుఁ గూడెను
హరిమాయ లొనరించీ నాతఁడే కాఁడా ॥ అంద ॥ 306

రేకు—753 సాళంగనాట

నేఁడు చెలులచేతిదే నేరు పెల్లాను
పోఁడిమికి నెక్కినవే భోగపుమీచేఁతలు ॥ పల్లవి ॥

పేరుకొని నీ వాపెఁబిలువ సిగ్గువడేవు
వూరకే తనంత నీవొద్దికి రాదు
ఆరితి మీలోనిఆసలైతే గంపెఁడేసి
పేరడాయ మీరుమీరే పెట్టుకొన్నవొట్లు ॥ నేఁడు ॥

మట్టు మీరి నీకు నీవే మాటలాడఁ గొంకేవు
అట్టె ఆపెయు నిన్ను నదేమనదు
వొట్టుకొన్న వలపులు వొడినే వున్నవి మీకు
కట్టుకొన్న తాళాయ కడుమీపంతములు ॥ నేఁడు ॥

తలయెత్తి లోఁగేవు తఱవాతిపనులకు
తెలిసీయుఁ జెనకదు తెక్కువ నాపె
కలయించె మిమ్మును యేకతమె శ్రీవేంకటేశ
తలఁపులే తగులాయ తనుఁదానె మీకు ॥ నేఁడు ॥ 307

కురంజి

మాటకు మునుపనే మాకు లేఁటికి
కాటుకకన్నులఁ జూచి ఘాతసేయరాదా ॥పల్లవి॥

వినరాదా అమాట విభుని మోము చూచి
అనకతొలుతే వోప ననవలెనా
తనువు లంటినమీఁదఁ దలఁపునఁ గలవెల్ల
చసుమొన లటు చూపి సాదించరాదా ॥ మాట ॥

గుట్టుతో నుండఁగరాదా గురిగా నిన్నాతఁడు
పట్టకముందే పెనఁగఁ బాడి యవునా
నెట్టుకొన్న మీఁదటను నేరము లేమి గల్లాను
మెట్టి పట్టి రతులలో మెరయఁగ రాదా ॥ మాట ॥

చక్కనుండరాదా సారె శ్రీవేంకటేశుఁడు
మొక్కకతొలుతే నీకు మొక్కనేఁటికి
యిక్కువ లంటి యాతఁడు ఇట్టె నిన్నుఁ గలసె
మక్కువ చల్లినంతనే మన్నించరాదా ॥ మాట ॥ 308

భవుళి

ఊరకే మ మ్మేల యింత వొరసీఁ దాను
కారణము గలిగితే కై కొనీఁ గాక ॥ పల్లవి ॥

సొలయ నే వచ్చితేను చూచుఁగాక నాదిక్కు
యెలమి నే మొక్కితే తలెత్తుఁగాక
కెలసి నేఁ గదిమితే గిరుపుఁగాక మూఁతులు
నలి నేఁ దొక్కితేనే నవ్వుఁగాక ॥ ఊర ॥

పొసఁగకున్న నెఁ (నెం?)దైనా పొడవులు చూచుఁగాక
కొసరినవారితోనే గునియుఁగాక
వెస నేను లోన నుండే వెదకి తా వచ్చుఁగాక
వసమైతే బలువుఁడై వచ్చి పెండ్లాడుఁగాక ॥ ఊర ॥

చిత్తజకేలివేళ నే సిగ్గులు విడుచుఁగాక
వొత్తితే రాయివలె నుండుఁగాక
యిత్తల శ్రీవేంకటేశుఁ డింతలో నన్నుఁ గూడె
పొత్తులఁ దా నాతో నిఁక పొదలుఁగాక ॥ ఊర ॥ 309

దేవగాంధారి

అవసరము గాదు అండకుఁ జనకురె
యివలఁ జనవరు లెంతయినాను ॥ పల్లవి ॥

పలుకులఁ గొసరఁగ పంతము విసరఁగ
చెలితోఁ జెలువుఁడు చెనకీని
వలపులు వంచఁగ వాసులు ముంచఁగ
నలుగడ నాపెతో నవ్వీని ॥ అవ ॥

చిత్తము గరఁగఁగ సిగ్గులు మొరఁగఁగ
హత్తి యతఁడు సతి నలమీని
పొత్తులు గలయఁగ భోగము వెలయఁగ
వొత్తి యాపైపై నొరగీని ॥ అవ ॥

భావము చొక్కఁగ పలుకులు చక్కఁగ
దేవుఁడు దేవులఁ దెలిపీని
తావులు చల్లఁగ తతి నొల్లఁగే (గ?) యాపె
శ్రీవేంకటేశుఁడు జిగిఁ గూడీని ॥ అవ ॥ 310

శంకరాభరణం

ఇంతనుండి యీమాఁటే యెదలోఁ బెట్టుకోవయ్య
చెంతలఁ జేరి నే నీసేవ సేసేదానను ॥ పల్లవి ॥

వాసులకు వంతులకు వనితలు వెనఁగఁగ
యీసుతోడ నిన్నుఁ దిట్ట నేఁటికి నాకు
వేసరకు నీ వేల వెరచేవు నాకుఁగాను
నీసుద్దు లేమిగల్లా నీలోనిదాననే ॥ ఇంత ॥

అంకెలకు లంకెలకు నందరూను రాఁగాను
మంకుతో నిన్ను సాదించ మరి నాకేల
సంకె మాను నే నీతో జగడముదానఁ గాను
యింకా నీ కందుకెల్లా నిచ్చకురాలనే ॥ ఇంత ॥

చనవులమనవులసతు లెల్లాఁ జూడఁగాను
పనిలేనిపాట నాకుఁ బగలేల
యెనసితి శ్రీవేంకటేశ యిదివో నిన్ను
వెనక ముందర నీకు వీడుబోడుదాననే ॥ ఇంత ॥ 311

హిందోళవసంతం

అన్నిటా నిన్ను మెచ్చేయంత వారమా
మన్నించు మంటిమి మమ్ము మఱవకు మీఁకను ॥ పల్లవి ॥

నీవే నేరుతువు నిజాలు నిలువఁబెట్ట
మావంటివారు నీతో మాటలాడేరా
కావలసినపనులు కలిగినట్టె అయ్యీని
దేవుఁడవు నీకు మొక్కేఁ దెలుసుకో నీవే ॥ అన్ని ॥

అలవాటు గద్దు నీకు నందరిని భ్రమయించ
చలపట్టి (ట్ట?) నీతోను సరివారమా
వలపుగలవారికి వాసు లెంచ నున్నదా
కొలువు సేసేము మాకోరికె నీచేతిది ॥ అన్ని ॥

అంతవాఁడ వౌదువు ఆయములు గరఁగించ
పంతముల నిన్ను మీరేపను లున్నవా
చెంతల శ్రీవేంకటేశ చేకొని కూడితి నన్ను
యింతయు నీ మహిమలే యిరవాయఁ బనులు ॥ అన్ని ॥ 312

రేకు - 754. ధన్నాసి

ఏమున్న దిందులోన యెరిఁగినపనులె
కామించి వలెనంటే కరఁగీనా మనసు ॥ పల్లవి ॥

గుట్టుతో నే నుండఁగానే కోరి తరితీపు గాక
పట్టి పెనఁగఁగఁ బోతే బయలే కాదా
వొట్టుక తెరమరఁగై వుండఁగానే చవి గాక
ముట్టి యెదుట నుండితే మొగచాటు గాదా ॥ ఏము ॥

దవ్వుల నే నుండఁగానే దగ్గరి వచ్చేవు గాక
యివ్వల నేఁ బై కొంటే నెరవే కాదా
రవ్వగా నవ్వకుండఁగా రాజస మింతే కాక
నివ్వటిల్లే సరసాలు నేరములే కావా ॥ఏము॥

కడు సిగ్గువడఁగానే కాఁగిటఁ గూడేవు గాక
వెడగై నేఁ బదరితే వేసటే కాదా
నడుమ శ్రీవేంకటేశ నన్ను నీవే యేలితివి
బడిబడిఁ దిరిగితే బలుములే కావా ॥ఏము॥ 313

శంకరాభరణం

నన్ను నేల చెనకేవు నరసింహా
చిన్నవాఁడే నీవారము శ్రీనరసింహా ॥పల్లవి॥

తొడపై నెక్కిన దాపె దోమటి దొడికె నాపె
కొడిమె వట్టివారెల్లా కొమరాఁకలే
వొడలు నిమిరె నాపె వొద్ద నున్నది యాపె
అడుగవయ్యా నీవు ఆపెనే నీసుద్దులు ॥నన్ను॥

చిమ్ముచుఁ జూచిన దాపె సేస వెట్టినది యాపె
కమ్మి యెదుటివారెల్లా కన్నులకసే
సమ్మతించినది యాపె చనవుగలది యాపె
యెమ్మెలకే నవ్వవయ్యా యీపెతో నీనవ్వులు ॥నన్ను॥

లక్కిమమ్మ నీ కాపె లలి భూదేవిని నేను
చిక్కినవారెల్లా వట్టిచెల్లాటాలే
వొక్కటైతిమి శ్రీవేంకటోత్తమ అహోబలేశ
అక్కచెల్లెండ్లము నాకు నాపెకు నీతగులూ ॥నన్ను॥ 314

అమరసింధు

లోకమెల్లా మెచ్చ నీకు లోనైతిని
కైకోనే నీమన్ననలు కనుఁగొనే నిఁకను ॥పల్లవి॥

చేతులెత్తి మొక్కితిని చేరి కొలువూఁ జేసితి
యీతల నిఁకమీఁద నీయింట నుండేను
రాతిటనుండియు నిన్ను రమ్మని నేఁ బిలిచితి
నీతలఁ పెట్టున్నదో నే నెరఁగ నిఁకను ॥లోక॥

మాటలు నే నాడితిని మనసెల్లాఁ గంటిని
కోటి సేయ నిన్ను నాడఁ గొనియాడేను
పాటించి నీ కన్నివిన్నపములు నేఁ జేసితి
నీటున నెన్నటికిని నీవార మిఁకను ॥లోక॥

కన్నుల నవ్వితి నిన్నుఁ గాఁగిటఁ గూడితిని
మిన్నక నీరతి నాలో మెచ్చుకొనేను
వన్నెతో శ్రీవేంకటేశ వద్దనుండి పాయవు
యిన్నిటా నీసుద్దులెల్లా నియ్యకొంటి నిఁకను ॥లోక॥ 315

తెలుఁగుఁ గాంబోది

ఓవరిలోనిది వొకమనసు
భావము దెలిపిఁ బదఁ[1] గదవయ్యా ॥పల్లవి॥

కందువ నీతో గక్కునఁ జెప్పిన-
చందము దెలిపీ జవరాలు
చిందిననవ్వుల సిగ్గులతోనే
విందులు చెప్పి విచ్చేయవయ్యా ॥ఓవ॥

---

1. ఈ యరసున్న చింత్యము.

మచ్చిక నీపై మలయుచుఁ జల్లిన-
మచ్చులు దెలిపీ మదిరాక్షి
రచ్చల కెక్కిన రాజసముననే
విచ్చి వలపులు విచ్చేయవయ్యా ॥ఓవ॥

తనువులు సోఁకఁగ తలఁపులు గరఁగిన-
అనువులు దెలిపీ నలివేణి
యెనసితి శ్రీవేంకటేశ యీసతిని
వెనుకొని పొత్తుకు విచ్చేయవయ్యా ॥ఓవ॥ 316

నాదరామక్రియ

ఎవ్వరిసుద్దులు నీకు నేమిటికి
నవ్వులు నీలోలోనే నారుకొన్నవి ॥పల్లవి॥

అట్టె యాపె విన్నవించినవి యెల్ల నీచెవులఁ
బట్టి నీమనసులోనఁ బాయకున్నవి
నెట్టన యేకతవేళ నేరిపిననేరుపులు
వొట్టుక నీ కన్నియును నుపదేశ మైనవి ॥ఎవ్వ॥

సోఁకి యాపెచూచినచూపులు నీమర్మముల
నిలిచి సందుసందుల నిండుకున్నవి
చెలఁగి యావేళ నిన్ను చెనకినచెనకులు
మొలకకస్తురి ప్రాఁతముద్రలై వున్నవి ॥ఎవ్వ॥

కోరి వేఁడి యాపె నిన్నుఁ గూడినకూటములు
సారె సారె వలపులచవు లైనవి
యీరీతి శ్రీవేంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
తేరి ఆరతులే యిందు దృష్టమైనవి ॥ఎవ్వ॥ 317

బౌళిరామక్రియ

ఎగ్గు లేల పట్టేవు యిందుకు నీవు
వెగ్గళించేనా నీతో వేడు కింతే కాక ॥ పల్లవి ॥

కలయు మనుచు నిన్ను కాఁకల నానలు వెట్టి
వలపు చల్లితిఁ గాక వాదడిచేనా
బలువుఁడవైన నీతో, పడఁతి నింతే నేను
చలము సాదించేనా చన వింతే కాక ॥ ఎగ్గు ॥

యింటికి రమ్మని నిన్ను యిటు నటు కొంగు వట్టి
నంటు చూపితిఁ గాక నాయమాడేనా
దంటవు నీ విన్నిటాను తగుముద్దరాల నేను
వెంటవెంట వచ్చేఁ గాక వేసరించేనా ॥ ఎగ్గు ॥

మచ్చిక సరసమాడి మరి నీపైఁ జెయి వేసి
పచ్చి సేసే నింతేకాక పాడి దప్పేనా
యిచ్చకుఁడ శ్రీవేంకటేశ నన్నుఁ గూడితివి
మెచ్చఁగలదానఁ గాక మేరలు మీరేనా ॥ ఎగ్గు ॥ 318

రేకు—755 శుద్ధవసంతం

ఏమీ ననకున్న వారి నేల రేఁచేవు
నేమాన వంచినతల నిక్కి చూడరాదా ॥ పల్లవి ॥

యేకతాన నే నిన్ను యేమన్నా నమరుఁ గాక
ఆకెముందర నే నంటే నందమయ్యీనా
కాకు సేయ నిప్పుడేల కాని కాని అందుకేమి
చేకొని మొక్కినచేత సేవ సేయరాదా ॥ ఏమీ ॥

సగసమాడేటివేళ చనవులు చెల్లుఁ గాక
ఔరపరికపునీతో నింతదగునా
దొరవై వుండఁగ నిన్ను తుదముట్టించఁగ నేల
తిరుగఁ దిట్టిననోర దీవించరాదా ॥ ఏమీ ॥

నీవు నేను నిట్లైతే నిర్మలమై వుండుఁగాక
వేవేలు తెరఁగులైతే వేడుకయ్యీనా
శ్రీవేంకటేశ కూడితి చేకొని కడపలోన
వావి గలసినచోట వన్నె చూఁరాదా ॥ ఏమి ॥ 319

## కాంబోది

చెల్లుబడిగలవారు సేసినదే చెల్లుఁ గాక
వొల్లఁ గలసాజాలకు నొద్దనేవా రెవ్వరు ॥ పల్లవి ॥

కక్కసించి నీపై కాఁకలు చల్లఁగ నీకు
చిక్కనిసెలవినవ్వు చేఁగ లెక్కని
యిక్కువ నీ నా సంది యెంఁగలు వెన్నెలూను
వొక్కమాటే కాయఁజొచ్చె నొద్దనేవా రెవ్వరు ॥ చెల్లు ॥

ఆరీతి నే నింత వుస్సురస్సు రనఁగా నీకు
చేరువ జాణతనాలు చిమ్మిరేఁగీని
నేరుపున నీ నా సంది నిజములుఁ గల్లలూను
వూరటగా వియ్యమందె నొద్దనేవా రెవ్వరు ॥ చెల్లు ॥

వేడుక నేఁ గాఁగిలించేవేళ నే పైపై నీకు
తోడనే పరవశాలు టొమ్మిరేఁచీని
కూడిన శ్రీవేంకటేశ గురిఁ గలవయుఁ దామె-
రోడ కొక్కపరె ఘాచె నొద్దనేవా రెవ్వరు ॥ చెల్లు ॥ 320

గౌళ

మామీఁదితప్పు లన్నీ మన్నించితివి
దోమటి నిన్నిటా నీవే దొడ్డవాఁడవయ్యా ॥పల్లవి॥

మచ్చరించి నీతోడ మాటలాడినందుకెల్ల
చెచ్చెర నీకు మొక్కేము చేకొనవయ్యా
వచ్చి వచ్చి నీమీఁద వలపు చల్లినందుకు
యిచ్చేము పంతము మమ్ము నిఁకఁ గావవయ్యా ॥మామీఁ॥

మందెమేళమున నిన్ను మాటలాడినందుకెల్ల
అందరిలో నీతొత్తుల మయ్యేమయ్యా
చెంది నీపై సరసాల చేతులు చాఁచినందుకు
అంది నీపాదాలు మాపై నట్టె చాఁపవయ్యా ॥మామీఁ॥

కక్కసించి నిన్ను నిట్టె కాఁగిటఁ గూడినందుకు
వొక్కటై నీతమ్మకుఁ జెయ్యొగ్గేమయ్యా
యిక్కువ వెరిఁగి శ్రీవేంకటేశ నన్నుఁ గూడితివి
తక్కినపనులు మాని దయఁ జూడవయ్యా ॥మామీఁ॥ 321

భైరవి

తొయ్యలులఁ గాకుసేయ దోసము గాదా
చయ్యాట మింతేశైతే చనవిత్తురా ॥పల్లవి॥

ఆసపడి నిన్ను నాపె అంగ వంటినంతలోనె
వేసాలకే నవ్వేవు వేగినంతాను
గాసిలి నీ వింతేసి యగడుసేసేవాఁడ వైతే
బేసబెల్లితనమునఁ బిలిపింతురా ॥తొయ్య॥

యిచ్చల నీయింటి కాపె యిట్టె వచ్చినంతలోనె
మచ్చాలు మేన నించేవు మాపుదాఁకాను
కెచ్చురేఁగి నీ కింత కేరడము లై తేను
పొచ్చముగఁ దొలుతనె పొందు సేతురా ॥ తొయ్య ॥

కెరలి యాపె నిన్నుఁ గాఁగిటఁ గూడినంతలోనె
సరసమాడేవు కొప్పు జారుదాఁకాను
యిరవై శ్రీవేంకటేశ యింతలో నీపెఁ గూడితి
మరిగితే నాసుద్దులు మందలింతురా ॥ తొయ్య ॥ 322

ముఖారి

ఎన్నటి కెన్నటిసుద్దు లిఁక నేఁటికి తమ
కన్నె నాఁటిపడపులు కంటివిగా కొత్తలు ॥ పల్లవి ॥

యేతులకు నీసతులు యెవ్వ రేమాడుకొన్నా నేఁ
గాతరించ నేల నీవు గలవు నాకు
ఘాతలఁ దమకునట కడు వలచితివట
యీతలను వింటివిగా యివి గొన్ని కొత్తలూ ॥ ఎన్న ॥

పోదితో నాసల నిన్నుఁ బొదిగి యెవ్వ రుండినా
వాదడువ నేల నావాఁడవు నీవు
సేదదేర తమ్మునట చేసన్న సేసితివట
సోదించి తెలిసితిగా చూడఁజూడఁ గొత్తలూ ॥ ఎన్న ॥

వట్టియాసల నెవ్వరు వడిఁ జేతులు చాఁచినా
నెట్టనఁ గూడున్నాఁడవు నిచ్చలు నన్ను
ముట్టితివట తొల్లెట మొరఁగి శ్రీవేంకటేశ
మట్టుమీరఁ దమకేల మానెఁగా ఆకొత్తలూ ॥ ఎన్న ॥ 323

ధన్నాశి

ఇందరికి నొక్కఁడవె యేలికవు
ముందరి చేఁతలు నిన్ను మోచి రాదా(వా?)యిఁకను ॥పల్లవి॥

అపెతోడ మాటలు నీవాడఁగానే పొద్దువోయ
పైపై యీపె లోనఁ బవ్వళించెను
వైపు గాఁగా వుడిగాలవారివొద్ద నున్న వారు
యేపను లెట్టవునో యెరఁగవా యిఁకను ॥ఇంద॥

గక్కున నీపెను లేపఁగానే తెల్లవారె
మిక్కుటాన నాపె(పె+అ)లిగి మేడ యెక్కెను
నిక్కి యిద్దరిచెలులు నీ వెంటఁ దిరిగేరు
యెక్కడిసుద్దు లెట్టవునో యెంచుకో నీ విఁకను ॥ఇందు॥

వేడుక నాపెఁ గూడఁగా వేగు చూడ వచ్చె నీపె
వోడక యిద్దరిఁ గూడి తొక్కచోటనె
యీడనే శ్రీవేంకటేశ యియ్యకొంటి మిందరము
ఆడుకోలు పంతాలు అనువాయ నిఁకను ॥ఇంద॥ 324

రేకు—756 భూపాళం

[1]కొండ వేలనెత్తినట్టి గోవిందా నిన్నుఁ
గొండించేరు యశోదకు గోవిందా ॥పల్లవి॥

గొల్లెతలు మొక్కేరు గోవిందా నీ—
కొల్లలచీర లిమ్మని గోవిందా
గొల్లు వెన్న దొంగిలఁగ గోవిందా నిన్ను
కొల్లున నవ్వేరు వీరె గోవిందా ॥కొండ॥

---

1. అధ్యాత్మ కీర్తనం చాయలో నున్నది.

గోవుఁ గాచేవేళ గోవిందా పిల్లఁ-
గోవిని వలచిరి గోవిందా
గోవాళులై యమునలో గోవిందా నీకు
కోవర మున్నారురా గోవిందా ॥ కొండ ॥

కొట్టెటిపుట్లకింద గోవిందా నీతో-
గొట్టెవాళ్లై పెనఁగేరు గోవిందా
గుట్టుతో శ్రీవేంకటాద్రిగోవిందా కూడి
గొట్టానఁ బెట్టేరు బత్తి గోవిందా ॥ కొండ ॥ 325

కన్నడబంగాళం

నీకంటె నాపె మేలు నీ వాపెకంటె మేలు
యీకడ నాకేల బొంకే విఁక నేఁటిమాఁటలు ॥ పల్లవి ॥

కాయముపై మెత్తినట్టిగందపుబేంట్లు గాలె
యేయెడఁ బెనఁగితివో యెవ్వతె తోఁడ
ఆయెడఁ గస్తూరిపూఁత అట్టె నీమే నంటి వచ్చె
నీయందు ఇదొక మేలు నిలిచెఁగా యెక్కుడు ॥ నీకం ॥

కప్పినట్టిచంద్రగావి కడు నెరి విరిగెను
వొప్పుగ నెవ్వతెమీఁద నొర గుంటివో
అప్పటి పెంజెమటలు అందులోనే తొప్పఁ దోగె
తప్పక యీ లాభమును తగిలెఁగా యెక్కుడు ॥ నీకం ॥

ముడిచినకురుమెల్ల మూఁపుమీఁది కిదె జారె
వడిగా నెవ్వతెఁ గూడి వచ్చితివో
నడుమ శ్రీవేంకటేశ నన్ను నిట్టె కూడితివి
కడు నీకు నిందులోనే కలిగెఁగా యెక్కుడు ॥ నీకం ॥ 326

లలిత

అమ్మేటి దొకటియు నసిమలోని దొకటి
యిమ్ముల నీయందే కంటి మిదివో దిష్టాంతము ॥పల్లవి॥

మతిలో నొకటి వెట్టి మాట వేరొక టాడేటి-
మతకారి నిన్ను దూర మావసములా
తతి సగము సింహాము తగునరుఁడా సగ -
మితవుగఁ గైకొంటి విదివో దిష్టాంతము ॥ అమ్మే ॥

సెలవులనే నవ్వులు సేసేసేఁతలు వేరె
బలువుఁడ నీతోడి పంతము గద్దా
యిల దేవకికిఁ బుట్టి యశోదకొడుక వైతి -
వెలమి నీసుద్దులకు నిదివో దిష్టాంతము ॥ అమ్మే ॥

నేరుపు నీ కొకచోట నిజము నేఁ డొకచోట
కోరి శ్రీవేంకటేశుఁడ కూడితి నన్ను
గోరపాతాళాన నుండి కొండ మీఁద నిక్కితివి
యీరీతి నీగుణముల కిదివో దిష్టాంతము ॥ అమ్మే ॥ 327

దేసాక్షి

ఆయలేవే చెక్కు నొక్కే వంత యేఁటికి
చాయల నీకు నేను చవైతిఁగా నేఁడు ॥పల్లవి॥

మేలు మేలు నీవు నన్ను మెచ్చితి విన్నాళ్లకు నేఁ
దాలిమి వలపు నీపైఁ దలఁచఁగాను
వాలి నీకుఁ గన్నవారివలపెల్లఁ దలకెక్కి
కాలమం దెరఁగవైతి కంటివిగా నేఁడు ॥ ఆయ ॥

భళి భళి నీచూపు పారెఁగా యిన్నాళ్లకుఁ
బిలిపించి తరవులు వెట్టఁగాను
కలసేటికామాంధకారము కన్నులఁ గప్పి
తలఁచవైతివి నీకుఁ దలివచ్చె నేఁడు ॥ అయ ॥

అవు నవు కాఁగిట నన్నలమితి విన్నాళ్లకు
వివరించి నీపై మేను వేయఁగాను
జవళి శ్రీవేంకటేశ చలము నీలోన నుండి
తివిరితి విన్నాళ్లకు తిరమైతి నేఁడు ॥ అయ ॥ 328

రామక్రియ

ఏల నీకత లిందరు నెఱఁగనివా
నాలికకొన నీనయము చూపేవా ॥ పల్లవి ॥

వో వహో నిలువవయ్యా వొద్దు మమ్ముఁ బట్టకు నీ -
దేహమందె నీగుణాలు తెలుపుదునా
యీహాల నీవేగిరము యీడ నేఁటికి నీ -
మోహములు యీచెలులముందరఁ జూపేవా ॥ ఏల ॥

కాని నీ వంతమాయ గప్పకు మాపయి
నీనిజములోనే కల్ల నిలుపింతునా
నానఁబెట్టి సెలవుల నవ్వ నేఁటికి
పూనిన నీశాంత మీదఁ బోగు సేయవలెనా ॥ ఏల ॥

తో తో వొరగకుమా తొడ మీఁదను
ఆతలిసుద్ది నీచేఁ గద్దనిపింతునా
యేతుల నన్ను శ్రీవేంకటేశ కూడితి
నీతలఁపులోనిదయ నేఁడె చూపవలెనా ॥ ఏల ॥ 329

కన్నడగౌళ

నీకంటెఁ గోమలము నెలఁతచిత్త మిదివో
వాకున నీవే యిటువలె నానతిత్తురా ॥పల్లవి॥

పలికినమాఁటకు పక్కన నుత్తర మిచ్చె –
నలివేణి నేల నిష్ఠూరనేవు నీవు
తలవంచుకొనుండితే తగ నాలికత్తె (త్తె+అ) నేవు
యెలమి నీతోడిపొందు యెందునుఁ బోరాదు ॥నీకం॥

దగ్గరి నీవు రాఁగాను తప్పక చూచె నీసతి
బగ్గన కోపమనేల భావించేవు
సిగ్గున నూరకుండితే చేరి గర్వి యిదె (దె+అ) నేవు
యెగ్గుల నీ తోడిపొందు యెందునుఁ బోరాదు ॥నీకం॥

చెక్కు నీవు నొక్కఁగాను చేయిమీఁద వేసె నీపె
తక్కక యింతలోనేల తమకె (కె+అ) నేవు
అక్కరతో (శ్రీ) వేంకటాధిప నీవు కూడితి –
వెక్కువ నీతోడిపొందు యెందునుఁ బోరాదు ॥నీకం॥ 330

రేకు-757 సామంతం

సేసేటిపూడిగములు సేఁతలు వేరై వున్నవి
ఆసల నాసల నివ్వెర గందితి విది యేమే ॥పల్లవి॥

చిత్తములోపల తమకము సిగ్గులు సెలవులఁ గారఁగ
వొత్తుక బాగా లొసఁగే వాతనికే నీవు
యిత్తల నదియునుఁగాకే యెగదిగ నాతనిఁ జూచుచు
చిత్తిణిగుణముల చెక్కులు చెమరించే వేమే ॥సేసే॥

ముక్కున నిట్టూరుపులును ముద్దులు పెదవులఁ దొలకఁగ
వెక్కసమగువింజామర వేసే విటు నీవు
గక్కున నంతటిలోనే కందువ లటు దాఁకింపుచు
పుక్కట సంతోసంబులఁ బులకించే వేమే ॥ సేసే ॥

చన్నులకొన లటు సోఁకఁగ సందులు గొందులు దాఁకఁగ
వున్నతి నీతనిపాదము లొత్తే విటు నీవు
ఇన్నిట శ్రీవేంకటపతి యీతఁడె నను నిటు గూడెను
మున్నిటిచేఁతల కిప్పుడు మొక్కే విది యేమే ॥ సేసే ॥ 331

## శౌళి

నవ్వుతానే జోలిసేసే నాలికాఁడు
ఇవ్వల నేపొద్దూ నిట్టె యెచ్చరించవమ్మా ॥ పల్లవి ॥

అంటిఁగా ఆతని కెందరైనాఁ గల రనుచు
వింటివా అప్పుడు నావిన్నపాలు
ఇంటికి నీవు విచ్చేసి ఇంకనైనా నాతని
గంటు వెట్టు కిందు దెచ్చి గడెవెట్టవమ్మా ॥ నవ్వు ॥

మొక్కితిఁగా ఆతని మొరఁగు లెరుఁగు మని
చిక్కితి వాతనిపాలఁ జేరి నీవు
గక్కనఁ గాఁగిటఁ బట్టి కరగించి యాతని
చెక్కు నొక్కి నీవే లోనుసేసుకొనవమ్మా ॥ నవ్వు ॥

సేసితిఁగా సన్న నీకు చేకొంటేఁ బోనియ్యఁ డని
బేసబెల్లితనమునఁ బెనఁగు మని
బాసతో శ్రీవేంకటపతి నీవు గూడితివి
మోసపోక యిన్నిటానే ముచ్చటాడవమ్మా ॥ నవ్వు ॥ 332

శ్రీరాగం

వెడవిన్నప మిఁక నేఁటికి వెస మాచెలియనుఁ గావుము
తొడిఁబడ నీతో విరహము దొమ్ములు సేసీని ॥పల్లవి॥

చెలిపై నొరగినలాగును చెక్కిట చేయున్న బాగును
నెలఁతకు నీపై వలపులు(ల?) నిక్కము దెలిపీని
పలుకుఁలోపలికొసరులు పైపై సురటులవిసరులు
చిలుకులపాయము నీకే సెలవులు సేసీని ॥వెడ॥

ఆయము గరఁగినకరఁగులు ఆ (అ?) రమర మరచినమరఁగులు
వోయని నీకాఁకలకును వొప్పన సేసీని
పాయనిమదములఅలపులు పనివడి నీతో పిలుపులు
చాయల సన్నల నిదివో చనవులు నెరపీని ॥వెడ॥

రెప్పలు వేయనిచూపులు రేసులతో తరితీపులు
ముప్పిరి నీముందరనే ముచ్చట లాడీని
యిప్పుడె శ్రీవేంకటేశ్వర యీసతి కవుఁగిటఁ గలసితి
వొప్పగుతనసమరతులే వుంకువ లిచ్చీని ॥వెడ॥ 333

ఆహిరి

నీకుఁ బోదు నాకుఁ బోదు నిన్న మొన్నటి వారమా
పైకొని నీ వడిగినపంతము లిచ్చేను ॥పల్లవి॥

నీవు నాకు మోహింతువు నేను నది యెరుఁగుదు
కావిరి నావిరహానఁ గసరితిని
వావిగలమేనవారు వలసిన ట్టందురు
నీ విచ్చినచనవే నే నిందుకు మొక్కేను ॥నీకుఁ॥

నామాట మీరవు నమ్మితి నే నంతయును
కామించినదానఁ గాన కైమీరితిని
చేముట్టి తమపతుల చెలువేమైనాఁ జేతురు
నీమన్ననఁ గూడ నిట్టె నేఁ జెక్కు నొక్కేను ॥నీకుఁ॥

తనువు లిద్దరివిని తతి నెపుడు నొకచే
కొనపరిదానఁ గాన కూడితి నిన్ను
ననుపు శ్రీవేంకటేశ నాకు దక్కెఁ గాఁపురము
పెనఁగి నీదయఁ గూడ ప్రియము చెప్పితిని ॥నీకు॥ 334

## శ్రీరాగం

కంటి మన్నీ నిపుడుగా కన్నులపండుగ గాను
గొంటరి వెన్నెలతీగె కొనవలె నుండెను ॥పల్లవి॥

చిత్తరుపతిమవంటిచెలికిఁ బ్రాణము వచ్చె
హత్తి నీవు చేచేత నంటఁగాను
బత్తి నే మెంతకైత్యోపచారాలు సేసినాను
మత్తిలి లోలోనే తాను మాసువలె నుండెను ॥కంటి॥

బంగారుబొమ్మవంటిపడఁతి మాటలాడె
సంగడి నీవు గూచుండి చన వియ్యఁగా
ముంగిట నే మిందాఁకా ముచ్చట లెంతాడినాను
రంగుమీరినటువంటి రాయివలె నుండెను ॥కంటి॥

వడి కప్పురకరుగువంటిచెలి నిన్ను మెచ్చె
తొడిఁబడ నీవు గూడి తుద కెక్కఁగా
అడరి శ్రీవేంకటేశ అండ నుండి నే మెంతన్నా
బడినే వూరకే నిమ్మపండువలె నుండెను ॥కంటి॥ 335

కన్నడగౌళ

కతలు సేయక నన్నుఁ గావరాదా
గతి నీవే నన్ను నీవు కావరాదా ॥పల్లవి॥

అమ్మఁ[1]గారి విన్నపము లయినాను విని నీవు
కమ్మక నన్ను నిట్టె కావరాదా
యెమ్మెల నీకరుణ యెంచుక నేఁడయినాను
కమ్మరఁ గమ్మర నిట్టె కావరాదా ॥కత॥

అంతరియామివైనఆమొగదాకిరికైనా
కంతుగురుఁడ నన్నుఁ గావరాదా
వంతులకు నన్ను నీవు వలపించు కొంటివి
కాంత నని యిందుకైనాఁ గావరాదా ॥కత॥

లోకము లిన్నియు నేలి లోకుల రక్షింతువు
కైకొని యీమాఁటకైనాఁ గావరాదా
శ్రీకాంతుఁడవు నీవు శ్రీవేంకటేశ్వరుఁడవు
కాకు సేయ కిఁకనయినాఁ గావరాదా ॥కత॥ 386

రేకు - 758 శుద్ధవసంతం

ఆతఁడదె మీరదె అప్పగించితిమి నేము
మీతలఁపుదాన నేను మీకేలే చింత ॥పల్లవి॥

నన్ను నేల అడిగేరే నాఁటినేఁటిసుద్దులు
అన్నియును నడుగరే ఆతనిని
పన్నినవారిద్దరికి పైపై మీరే కారా
వెన్న చేతఁ బట్టుకొని వేఁడనేలే నెయ్యి ॥ఆతఁ॥

1. ఈ యరసున్న చింత్యము.

యేల కొడఁబరచేరే యింతలోనే నన్నును
చాలు[1] నొడఁబరచరే చాలు[2] నాతని
పోలిమితో నింతేసిబుద్ధి మీ రెరఁగనిదా
తాలము చేతఁ బట్టుకొని దాఁటనేలే వాకిలి ॥అతఁ॥

అన లేల పెట్టేరే ఆతనితోఁ గూడుమని
వేని యాన లతనికే పెట్టరాదా
అనుక శ్రీవేంకటేశుఁ డాతఁడే నన్నుఁ గూడె
తేనెలువంటిచెలులు తీపులు మీకేలే ॥అతఁ॥ 337

శంకరాభరణం

నిలువుటద్దములోన నీడ నల్లదివో కంటి
చలి వాసెఁ దనకేలే నటకాఁడు కృష్ణుఁడు ॥పల్లవి॥

యెఱఁగనట్టె పిచ్చేసి యిదె నామలఁగుమీఁద-
నొఱిగి వెనకవంక నున్నవాఁడు
మఱి చెలులు నవ్వితే మానుమని నన్నుసేసీ
మఱఁగు లింకా నేలే మాయకాఁడు కృష్ణుఁడు ॥నిలు॥

మాటలాడక నావద్ద మంచము నాకోటిమీఁద
యేట వెట్టుకొని మమ్ము నెలయించీని
పాటించి లంచము లిచ్చి పంజరముచిలుకకు
తూఁటరి యీవిద్దెలే దొమ్మికాఁడు కృష్ణుడు ॥నిలు॥

కందువ పానుపుమీఁద కప్పిననాపచ్చడము
సందు చొచ్చుకొని నన్ను సరిఁ గూడీని
ఇందరిలో నవ్వఁబోతే నింతలో నాచెక్కు నొక్కె
అందపుశ్రీవేంకటాద్రి నాగడీఁడు కృష్ణుఁడు ॥నిలు॥ 338

---

1–2 వ్యావహారికమున నీ పునరుక్తులు సహజములే.

పాడి

తలిగాదు ఇఁక నవె తడవరాదు
సతమాయఁ బనులెల్ల చక్కనాయ నిప్పుడు ॥పల్లవి॥

అప్పటికోపాన నఁటి ఆతఁ డీడకు విచ్చేసె
చెప్పకురే ఆసుద్దులు చెలులాల
కొప్పు నాకు నిదె జారె కోపము నంతటఁ బోయ
కప్పి యాతఁ డిట్టె నన్ను గక్కన మన్నించెను ॥తలి॥

మొక్కలానఁ బొమ్మంటి మొగమోడె నా కాతఁడు
దక్కి నావద్ద నుండరే తరుణులాల
చెక్కులెల్లాఁ జెమరించె చింతలూ నంతటఁ దీరె
తక్కక యాతఁడే నాకు తానె బాస యిచ్చెను ॥తలి॥

ఆసలఁ గన్ను గీఁటితి నంతలో నాతఁడు గూడె
వాసితో నూరకుండరే వనితలాలా
సేసలు కొప్పున నిండె చేసినసేఁతలు చెల్లె
యీసుదీర (శ్రీ) వేంకటేశుఁడు లోనాయను ॥తలి॥ 389

దేసాళి

ఏఁటికి నింత సేసేవు యియ్యకోవయ్యా
చాటువ నన్నియు మీఁదఁ జక్కనయ్యీఁ గాని ॥పల్లవి॥

చిడుముడి నాపె నిన్నుఁ జేయి వట్టి కొసరఁగ
పడఁతితోఁ బెనఁగేది పంతమా నీకు
తొడిఁబడ నిన్నాపె తొరల నాడినమాట
వడిగా నేఁడె నీకు వాఁడే (డి+అ) యనా ॥ఏఁటి॥

కమ్మరఁ గమ్మర నాపె కన్నులనే నవ్వఁగాను
తమ్మిమోము వంచేది తగవా నీకు
ముమ్మాటికిని నాపె ముదులకించినమాట
చిమ్మిరేఁచి యింత నీకు చేఁ దాయనా ॥ పంటి ॥

గక్కన నాపె నిన్నుఁ గాఁగిలించుకొనఁగాను
యిక్కువలు గరఁగితి వెన్నిక నీకు (వు?)
తక్కక శ్రీవేంకటేశ తమిరేఁచినాపెమాట
చక్కనై నేఁడె నీకు సఫలాయనా ॥ పంటి ॥ 340

## సింధురామక్రియ

ఉన్నవారిలోన నీవూ నొకతె వింతే
మన్ననలు గలిగితే మాఁటలు నీ కేఁటికే ॥ పల్లవి ॥

చేరి తమరమణుఁడు చెప్పినట్టు సేసేవారు
ఆరసి వెంగేలు వేరే ఆడవచ్చేరా
ఆరీతి నాతఁడే తమలంకెలకు రాకుండితే
దూరుదురు సీరుదురు తుచ్చము నీ కేఁటికే ॥ ఉన్న ॥

తక్కక తమపతుల దక్కఁ గొని నట్టివారు
తెక్కులను నమ్మక సాదించ వచ్చేరా
వొక్కటై వారె తమ వొడఁబాటుకు రాకున్న
చిక్కింతురు చొక్కింతురు చెనక నీ కేఁటికే ॥ ఉన్న ॥

మచ్చిక తమవిభుని మరిగించినట్టివారు
నిచ్చలు సెన్నఁడైనా నేర వెంచేరా
యిచ్చల శ్రీవేంకటేశుఁ డెనసి నన్నిదె మీరె
మెచ్చింతురు హెచ్చింతురు మేకు లిఁక నేఁటికే ॥ ఉన్న ॥ 341

సౌరాష్ట్రం

పోయినది పొల్లు మీఁదఁ బూఁచి నీ నేరు పులను(?)
చాయల నీపంత మెల్లా సాదించుకోవయ్యా ॥పల్లవి॥

చలమేల బలిమేల సాకిరేల తెలిపేవు
కలవు నీమాట లన్నీఁ గల్లలాడేవా
వొలిసి నాచేఁతలకు వోరిచితి విన్నాళ్లు
పొల సిఁకనైనా మోసపోక బదుకవయ్యా ॥పోయి॥

ఆనలేల సత్యాలేల అట్టె దైవముఁ జూపేవు
కానీవే నిన్నెవ్వరైనాఁ గాదనేరా
పూని వెనకటి వేల బుద్దెరఁగవైతివి
పేని పట్టి యిఁకఁ జెల్లఁబెట్టుకొనవయ్యా ॥పోయి॥

నవ్వులేల రవ్వలేల నయమెంత చూపేవు
జవ్వనపునీ వంతజాణవు గావా
యివ్వల శ్రీవేంకటేశ యిట్టి నన్నుఁ గూడితివి
పువ్వువలె నీయిచ్చల భోగించరాదా ॥పోయి॥ 342

రేకు-759 వరాళి

వట్టి నేరాలే యెంతురు వలపులు చాలకున్న
యెట్టివారి కిదె నీవు యేమి సేతువయ్యా ॥పల్లవి॥

మందలించి నీమాటకు మారు మాటాడ కుండితే
కందువది నీ కెంత గర్వమనేవు
అంది నీకతలకు నే నౌఁగాదని యంటేను
యిందులోనే యిది చూడ నెంతదం టనేవు ॥వట్టి॥

నీవు దప్పక చూచితే నేనుఁ జూడకుండితే
కేవలమై నీతో నలిగితి ననేవు
భావించి నీరూపమెల్ల పైపై నేఁ జూచితేను
సోవలుగా నిన్నింత సోదించే ననేవు ॥ వట్టి ॥

గక్కనఁ గూడితివి నేఁ గాఁగిలించకుండితేను
వెక్కసపునెరజాణ వీఁగె ననేవు
నిక్కి శ్రీవేంకటేశుఁడ నేనే నిన్నుఁ బైకొంటె
గుక్కక యింకా రతులఁ గొసరఁ జూచేవు ॥ వట్టి ॥ 343

కాంబోది

తప్పులెల్ల వొప్పులాయ తతి వచ్చెను
చప్పనివలపులకు చవి వుట్టెఁ గదవే ॥ పల్లవి ॥

మచ్చిక నీ కటు చూపి మాటలు నీతో నాడి
పచ్చికస్తూరి యతఁడు పైఁ బూనెను
యిచ్చకుఁడు గాఁడంటా నింటికిని రాఁడంటా
యెచ్చి యిన్నాళ్లు దూరితి విఁక బాసెఁగదవే ॥ తప్పు ॥

కందువ మర్మము లంటి కప్పురము నోటి కిచ్చి
గందము వూసి యాతఁడు కరఁగించెను
పొందులు మరపఁడంటా పూఁచి నీతో నవ్వఁడంటా
నింద లాడుదు వందుకె నీకు మొక్కెఁగదవే ॥ తప్పు ॥

చెక్కులు నీకు నొక్కి సేద లన్నియునుఁ దేర్చి
యిక్కువ శ్రీవేంకటేశుఁ డిటు గూడెను
యెక్కుడాయ రతులంటా నింత యెలయించెనంటా
మిక్కిలి ఇఁక నిందుకే మెచ్చవలెఁ గదవే ॥ తప్పు ॥ 344 ॥

బౌళి

సేసినట్టు సేయవయ్యా చిత్తము నాభాగ్యము
బాస దప్పకుండఁగా నే పైకొంటిఁగాక ॥పల్లవి॥

వాసిపట్టుమాటలకే వాదు లడిచితిఁగాక
యీసులనే నే నీతో నెదురాడేనా
నీసరివారమా నేము నీయంతవారమా
ఆసల మన్నించఁగా నే నీయాలనైతిఁగాక ॥సేసి॥

చేకొలఁదిదానఁ గాన సిగ్గులు వడితిఁగా
కైకొని నీ వంటఁగా నేఁ గాదనేనా
మేకులు సేసినా నీతో మేరలు నే మీరేనా
జోకతో నీవు నవ్వఁగ సొలసితిఁగాక ॥సేసి॥

చనవు సేసుక నీతో సన్నలు సేసితిఁగాక
మనసియ్యక నే నీతో మతకములా
ననిచి శ్రీవేంకటేశ నన్ను నీవె కూడితివి
తనిసి రతుల నిన్ను దక్కఁగొంటిఁగాక ॥సేసి॥ 345

నాగవరాళి

నీవే మన్నించితేను నిర్మలాన నుందుఁ గాక
వేవేలకు నిన్ను దూరి విసుగఁ జోటున్నదా ॥పల్లవి॥

చెలులేమి సేసేరు చేరి నీవు రాకుండితే
కొలనిఅమేలు గట్టుకొందువు గాక
నెలవై నవ్వులతో నీకు నే నెదురుచూచి
పలము గొనుటే కాక బలిమి నాకున్నదో ॥నీవే॥

మరుఁ డేమి సేసీని మనసు నీకు రాకున్న
యిరవై నీ వేకరాజ్య మేలుదు గాక
పగగ నీకు వలచి పానుపుపైఁ బొరలుతా
వెర వెంచుకొందు గాక వేగిరించఁ గలనా ॥నీవే॥

చక్కఁదనా లేమి సేసీ చనవు నీ వియ్యకున్న
గుక్కక నీ విట్టె బదుకుదువు గాక
నిక్కి శ్రీవేంకటేశుఁడ నేఁడు నన్నుఁ గూడితివి
వొక్కమనసైతిఁ గాక వున్నసుద్దు లేఁటికి ॥నీవే॥ 346

రామక్రియ

ముల్లు ముంటనే కాక ముసలానఁ దీరీనా
చెల్లఁబెట్టేఁ గాని విచ్చేయవయ్య యీడకు ॥పల్లవి॥

మామాటలకే నీవు మారు మాటాడేవు గాని
అవుగువ మాఁటకు నడ్డమాడేవా
గామిడి నీచేఁత లాడఁ గద్దనపించేఁ గాని
యేమనినా నీడ నీవు ఇటు మెత్తనయ్యేవా ॥ముల్లు॥

వొంటినే చేయి చాఁచితే నొడ్డించుకొనేవుగాని
అంటఁ బట్టితే నాపె నొఁ గాదనేవా
దంటతనా లిద్దరికిఁ దారుకాణ సేసేఁ గాని
జంటలైన మాచేతఁ జాయకు వచ్చేవా ॥ముల్లు॥

చేరి మాచేత సేవలు సేయించుకొనేవు గాని
యీరీతి నాపెచేతఁ జేయించుకొనేవా
ఆరయ నిట్టె శ్రీవేంకటాధిప నన్నుఁ గూడితి
తేరె నన్నిపను లిఁక దిద్దించుకొనేవా ॥ముల్లు॥ 347

గుండక్రియ

అప్పటి మాటలు నీతో నాడేఁ గాక
కప్పిన నీమేను చూచి కాఁక రేఁగకుండునా ॥పల్లవి॥

వినయపుఁ జేఁతలను వేసాలమొక్కులను
ననుపు సేసుక కొంత నవ్వేఁ గాక
చెనకి నీవు కిమ్ముల్మఁ జేసిన చేఁతలు వింటే
కొనకన్నులనే నాకు కోపము రాకుండునా ॥అప్ప॥

వట్టిసరసములను వాడికెచుట్టరికేల
బెట్టుగ నీకొంగు వట్టి పెనఁగేఁ గాక
వుట్టిపడ నీ వుండేటివునికిఁ దలఁచుకొంటే
తిట్టు లేవైనా నోటికిఁ దిరము గాకుండునా ॥అప్ప॥

వింతవింతరతులను వెలలేనిమోహాముల
పొంతనాల నిన్నుఁ గూడి పొదిగేఁ గాక
యింతట శ్రీవేంకటేశ యిప్పటి నిన్నొరసితే
పొంతనే నిలువు నాకుఁ బులకించకుండునా ॥అప్ప॥ 348

రేకు – 760. శంకరాభరణం

నాయెడ నీవిటు నడపి నన్నలై
చాయకుఁ దెచ్చుకో సరసపువిభుఁడా ॥పల్లవి॥

మట్టుమీరినట్టిమాసటీలకును
పట్టినవెల్లాఁ బంతములే
చుట్టరికంబున నోఁకోర్చువారికి
తిట్టినతిట్టులు దీవనలే ॥నాయె॥

కొనలకు నెక్కిన కోపపువారికి
పెనఁగినవెల్లా బీరములే
చనవులు మిగిలిన శాంతపువారికి
గునిసిన వన్నియుఁ గూరుములే ॥ నాయె ॥

మలకల మలకల మంకుల వారికి
అలిగినవెల్లా నాయములే
చెలఁగిదె మనకును శ్రీవేంకటేశ్వర
మలసినకూటమి మర్మములే ॥ నాయె ॥ 349

నాదరామక్రియ

తెలిపించుకో నీవె దిక్కులనూఁటా
పలుకకు మాతో నీవు పైపై మాఁటా ॥ పల్లవి ॥

చెంగలిచూపులవొకచెలి నిన్నుఁ జూచెనట
అంగడివీది రాఁగా నీ కదొకమాఁటా
ముంగిటినుండి యొకతె ముంచి నీతో నవ్వెనట
యింతాగిన మోఁచె నీపై నిదొకమాఁటా ॥ తెలి ॥

మగువ యొకతె నిన్ను మాఁట మోవ నాడె నట
అగడు సేసేరు నిన్ను నదొకమాఁటా
తగిలి యొకతె నీకుఁ దమ్ములె మొసఁగె నట
యెగసక్కెము లాయ నిదొకమాఁటా ॥ తెలి ॥

గక్కన నొకతె నిన్నుఁ గాఁగిలించుకొనెనట
అక్కడనే మెచ్చేరు నిన్నదొకమాఁటా
యిక్కడ శ్రీవేంకటేశ యిటు నన్నుఁ గూడితివి
యెక్కువల కెక్కుడాయ నిదొకమాఁటా ॥ తెలి ॥ 350

సామంతం

అన్నిటికి నీవె నేర్తు వంతవాఁడవు
యెన్నిక బుద్ది నా కానతియ్యవయ్య యిఁకను ॥పల్లవి॥

వాదులు వెట్టుకోఁబోతే వలపులకు వెలితి
సోదించఁబోతే లేదు చుట్టరికము
కాదని వూరకుండితే కడు గర్వమై తోఁచు
యేది నాకు బుద్ది అనతియ్యవయ్య యిఁకను ॥ అన్ని ॥

మొక్క ళా (లా?)నఁ దిట్టితేను మొగమోటానకు లేఁత
కక్కసించితేఁ జవిగాదు కూటమి
వెక్కుమాట లాడఁబోతే పెద్దరికము చాలదు
యెక్కువబుద్ది నాకానతియ్యవయ్య ఇఁకను ॥ అన్ని ॥

యిట్లై నే నవ్వకుండితే యిచ్చకానకు కడమ
మట్టున నే నుండితేను మానదు తమి
గట్టిగా శ్రీవేంకటేశ కలసితివిదె నన్ను
యెట్లైనా బుద్ది నా కానతియ్యవయ్య యిఁకను ॥ అన్ని ॥ 351

ఛాయానాట

చూతముగా అందుకేమి సోద్యాలెల్లాము
చేతికి లోనైనప్పుడు చెప్పేను మీఁదను ॥పల్లవి॥

పంతము దప్పదు మాతోఁ బలికితే నీ కిట్టె
యింతేసిగర్వాలు నేఁడే యేఁటికోయీ
మంతుకు నే నెరిఁగినమనసువాఁడవే నీవు
యింత నింత వొకటికి నినుమిక్కి లయ్యేది ॥ చూత ॥

దొరతన మేమి వోదు తోఁగి[1] చూచితే మమ్ము
యెరవుల వట్టిబిగు వేఁటికోయీ
తెర దీసితే నన్నియు తేట తెల్లమయ్యీని
పెరుగఁ బెరుగఁ దానే పెంటలయ్యీ వలపు ॥ చూత ॥

దగ్గరి వద్దనుండితే తరగదు నీమేను
యెగ్గులు సిగ్గులుఁ దేర నేఁటికోయీ
అగ్గమై శ్రీవేంకటేశ అట్టె నన్నుఁ గూడితివి
తగ్గుముగ్గులెల్లఁ బాసె తలఁపు లీడేరెను ॥ చూత ॥ 302

దేసాళి

అయము తనకు నాకు నాతఁడే కాక
ఆయనాయ దూరువాఁడు ఆతఁడే కాక ॥ పల్లవి ॥

యెందుకైనఁ దానే వచ్చి నేరైనాఁ జెల్లఁబెట్టీ
అందుకేమి చెలి తానా ఆతఁడే కాక
అందాలు సేసుకొనీని ఆడినవెల్లా నాడీ
అందరిలోనిబలువు ఆతఁడే కాక ॥ అయ ॥

జంకెనలు నెరపీని సళుపుఁ జూపులఁ జూచీ
అంకగతై (త్తె?) యుఁకఁ దానా ఆతఁడే కాక
మంకులు పై వేసుకొనీ మాఁట చెవి చొరనీదు
అంకెకుఁ దెచ్చేటివాఁడు ఆతఁడే కాక ॥ అయ ॥

చూపి మోపి సొలసీని చొక్కులఁబెట్టఁగ వచ్చి
ఆపనికి గురి దానా ఆతఁడే కాక
యేపున శ్రీవేంకటేశుఁ డిప్పు డిట్టె నన్నుఁ గూడె
ఆఁపరానిచుట్ట మెల్ల నాతఁడేకాక ॥ అయ ॥ 353

1 'తొంగు' ధాతువు 'తోఁగు'గా పలుచోట్ల గలదు.

తెలుఁగుఁగాంబోది

ఎక్కడి కెక్కడ యివిగో వలపులు
యిక్కడఁ జూచిన యెన్నిక లాయా ॥ పల్లవి ॥

భావములోపల పతిఁ దలఁచఁగా
చేవల నామేను చెమరించె
కావిరి నతని నే కన్నులఁ జూచిన
పూవులవలెనే పులకించె ॥ ఎక్క ॥

మరిగి మఱఁగునసె మాఁటలాడఁగా
గరిమల నూర్పులు గనమాయ
వెరసి నే సుద్దులు వీనుల వినఁగా
పురిగొని వెరగులు పొగై నిలిచె ॥ ఎక్క ॥

కదియఁగ శ్రీవేంకటపతి రాఁగా
పెదవులఁ దేనెలపెర లూరె
పొదిగొని యీతఁడు భోగించఁగ నను
చెదరక నవ్వులు సెలవుల నిలిచె ॥ ఎక్క ॥ 354

రేకు—761 సాళంగనాట

ఇంకా మానఁడు తనయెమ్మె లిడను
వుంకువతో నంతయు నే నోరిచితిఁ జాలదా ॥ పల్లవి ॥

ఇచ్చగించి తనమాట లిన్నియు నే నియ్యకొని
వచ్చినదే చాలదా వాకిటికిని
రచ్చల కెక్కిన తనరాతిటిసుద్దులు వింటే
మచ్చర మెవ్వరికైనా మతిలోన రేఁగదా ॥ ఇంకా ॥

మొగము చూచి తనతో ముచ్చటలు దీరఁగ
నగినదే చాలదా ననుపుగాను
జిగిమీరఁ దనమేనిచిన్నెల్లాఁ గనుఁగొంటే
యెగసక్కె లెవ్వరికై నానుఁ బుట్టదా ॥ ఇంకా ॥

వాడుదేరి కాఁగిటను వలపులు చల్లి చల్లి
కూడినదే చాలదా కొంకుదేరను
యీడనె శ్రీవేంకటేశుఁ డిచ్చినమన్ననలకు
వోడక మావంటివారి కోడఁబాటు గాదా ॥ ఇంకా ॥ 355

శుద్ధదేశి

ఇంచుకంత జాణతన మేఁగవేమో కాక
మంచముపై నెక్కితేను మారుమోము సేతురా ॥ పల్లవి ॥

కప్పుర మిమ్మని యంటే కన్నులపైఁ జల్లితివి
చెప్పినంతకంటె మరీఁ జేయనా నేను
రెప్పలెత్తి చూచేవు రేసులు నీకేల పుట్టె
తిప్పి నిమ్మపంట వేసితే రాత వేతురా ॥ ఇంచు ॥

యిక్కడికి రమ్మనంటే యిల్లెల్లా నేఁ జేకొంటి
యెక్కుడు నీమాటకంటె నింత సేయనా
వెక్కసాలే లాడేవు వేగిర మేఁటికి వచ్చె
మొక్కేటి వారితోనే మోన (నా?)లు చూపుదురా ॥ ఇంచు ॥

కోరి కూడుమని యంటే గురుతులు నించితిని
సారె నీకంటె నెక్కుడు చన వియ్యనా
యీ రీతి శ్రీవేంకటేశ యిన్నిమారులు గూడితి
పోరచి వెట్టినవారిఁ జూఁచి కొసరుదురా ॥ ఇంచు ॥ 356

పాడి

మెచ్చవద్దా నిన్నిందుకు మిక్కిలిజాణఁడ వని
పచ్చిదేరె నీపనులు బాపు బాపు విభుఁడా ॥ పల్లవి ॥

సెలవులఁ గొంత నవ్వి చెక్కునఁ జేయి మోపి
మొలపించె వలపులు మోహానాంగి
జలజలఁ జెమరించి చన్నులపైఁ జెయివేసి
అలమి పండఁ జేసితి వప్పుడేకా విభుఁడా ॥ మెచ్చ ॥

కన్నులఁ దప్పక చూచి కమ్మటి సిగ్గులు వెంచి
వన్నెలమాటల నాపె వల వేసెను
సన్నలనే మొక్కి పంచసాయకునివేఁటఁకు
అన్నిటాఁ దెర లొడ్డితి వప్పుడేకా విభుఁడా ॥ మెచ్చ ॥

కప్పుర విడె మిచ్చి కాఁగిటికిఁ జేయి చాఁచి
కప్పినసింగారాల నంగడి వెట్టెను
కుప్పగా బేహారమాడి కూడితివి చెలి నిట్టె
విప్పనికూరిముల శ్రీవేంకటాద్రి విభుఁడా ॥ మెచ్చ ॥ 357

రామక్రియ

ఏడ లేనిమంకులు నీకేల వచ్చెనే
నీడనుండే చెమరించి నివ్వెరగు లేఁటికే ॥ పల్లవి ॥

అప్పటనుండియు నాతఁ డండ నట్టె వుండఁగాను
నెప్పు గాఁగ నీవేల నిందలాడేవే
చొప్పు గాఁగ నీకు నిట్టె చుట్టరికమే చెప్పఁగా—
నుప్పతించి వీడె మేల వొల్లననేవే ॥ ఏడ ॥

అంగవించి విభుఁడు నీయంగములు ముట్టఁగాను
ముంగిట నీచన్ను లేల మూసుకొనేవే
పంగెనగాఁ బ్రియములు పదివేలు చెప్పఁగాను
యెంగిలి నీమోవి యేల యియ్య ననేవే ॥ పద ॥

యేమి శ్రీవేంకటేశుఁ డిట్టె నన్నుఁ గూడఁగాను
తలవంచుకొని యేల దప్పి గొనేవే
మలసి నీకడ లేనిమన్ననలు యియ్యఁగాను
వెలలేని సంతసాన విఱ్ఱవీఁగేవే ॥ పద ॥ 358

## నట్టనారాయణి

మించుసన్నలుఁ జాయలు మీకే కాక
పంచల నేమెల్లా నేరుపరచఁగ వచ్చునా ॥ పల్లవి ॥

బెట్టాతఁడు పిలువఁగఁ బెదవినే నవ్వేవు
యెట్టివో మీమందెమేళా లెవ్వఁ డెరుఁగు
పట్టె నదివో కొంగు పరాకయ్యే వంతలో
మట్టులేనిమతకాలు మాకు దిద్దవసమా ॥ మించు ॥

చెక్కు లాతఁడు నొక్కఁగ సిగ్గులు వడేవు నీవు
యిక్కువ మీమర్మములు యెవ్వఁ డెరుఁగు
కక్కసించి కొసరఁగ ఘాతల జంకించేవు
పిక్కటిల్లుమీసుద్దులు పేరుకొనఁగలమా ॥ మించు ॥

శ్రీవేంకటేశుఁ డాతఁడు శ్రీసతి విన్నిటా నీవు
యీవల మీమహిమలు యెవ్వఁ డెరుఁగు
కావిరిఁ గూడె నతఁడు కైకొని చెలఁగితివి
వేవేలు నేమెరిఁగినవి వివరించఁ దగునా ॥ మించు ॥ 359

శంకరాభరణం

ఆతఁ డదె నే నిదె ఆసలు మిగిలెను
మతకము నూన్పరే మన్ననచెలులూ ॥పల్లవి॥

తిరమగునామాఁట తేనెలు గురియఁగ
తరితీపు లితఁడు తాఁ గురిసె
సరి మాలో మొగచాటులాయ నిదె
వెరవులు చెప్పరే వేడుకచెలులూ ॥ఆతఁ॥

కొనచూపుల నే కుంకుమ చల్లఁగ
వొనరఁ దా నవ్వుపువ్వులు చల్లె
యినుమడించి మా కివె చలువలాయ
పొనుగక చెప్పరే బుద్ధులు చెలులూ ॥ఆతఁ॥

వావిరి నా కిదె వలపులు గూడఁగ
(శ్రీ)వేంకటేశుఁడు జిగిఁ గూడె
భావము లిందు నే బడిఁ దగులాయను
యీవల మెచ్చరే యిదివో చెలులూ ॥ఆతఁ॥ 360

రేకు - 762 ముఖారి

నవ్వేవారి నెఱఁగవు నలుదిక్కుల
తవ్వించేవు జోలి నీవు తగునా యీలాగులు ॥పల్లవి॥

యెంత చెప్పినా మాన వెగసక్కేలకు నీవు
అంతలోనే మొక్కించేవు ఆపెను నాకు
రంతుల నీకు విడువరానిచుట్ట మైతేను
వంతగత్తెలము మాకు పాడి యౌనా పనులు ॥నవ్వే॥

వొల్లనన్న విడువవు వొద్దఁ దెచ్చి పెట్టి యాపె
యెల్లగా సేవ సేయుంచే విప్పుడే మాకు
పెల్లుగా నీ కిట్టె యింటఁ బెట్టుకుండవలసితే
చెల్లునా సవతిపోరు చెప్పుచూ యేఁదై (యెంచై?)నను ॥ నవ్వే ॥

ఆయనన్న తతిగొనే వాపెచే విడె మిప్పించి
చేయిఁ జేయిఁ బట్టి నీవే చెక్కు నొక్కేవు
యీయెడ శ్రీవేంకటేశ యిద్దరి మమ్ముఁ గూడితి
పాయరానివాం సింత పచ్చిసేయ వలెనా ॥ నవ్వే ॥ 361

## శ్రీరాగం

ఇన్నేసిమాటలు నీతో నిఁక నేలా
కన్నుల నీవు చూచేటికడ మింతేకాక ॥ పల్లవి ॥

మరుఁడు వ్రాసినవ్రాఁత మానిని నొసల నదె
కరఁగి చెదరినట్టికస్తూరిబొట్టు
సరసపుఁబతివి నీజాడ లిట్టివయ్యా
పరగఁ జూచేచెలుల భాగ్య మింతేకాక ॥ ఇన్నే ॥

ముదిత నోచిననోము ముక్కునఁబంటాయ నదె
వుదుటు మించినవి నిట్టూరుపులు
వదలనినీలోనివల పేమి సేయునయ్యా
కదిసి మనసులోనఁ గలయంతేకాక ॥ ఇన్నే ॥

చెప్పేటివారిచేత దిష్టమాయ నదె
నెప్పున నింతికాఁగిట నీ వుండఁగా
చిప్పిల శ్రీవేంకటేశ చేఁత లేమి సేయునయ్యా
తప్పరానిమీఁదిమీఁదితమక మో కాక ॥ ఇన్నే ॥ 362

వరాళి

పాయపు మోహములకుఁ బాటి లేదు
కాయపుమర్మము లంటఁ గాలము లేదా ॥పల్లవి॥

ముంచిననీనాసంది మొగమోటా లుండఁగాను
కంచువంటిచూపు లేల కాఁడిపాకిని
యించుకంతదడవే యెడసితి వింతెకాక
నించి నీవొళ్ల నేమైనా నేర మున్నదా ॥పాయ॥

చనవుల నీనాసందిసందిపాట లుండఁగాను
నవ్వులనవ్వు లేల నాము లెక్కని
మనసున నేమిటికో మరచితి వింతెకాక
వెనకటిపొందులకు వెలితున్నదా ॥పాయ॥

కలసేటిమనలోని కాఁగిలింత లుండఁగాను
పులకమొలక లేల పోది సేసీని
యెలమి శ్రీవేంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
బెళక నీనాసంది భేదమున్నదా ॥పాయ॥ 363

హిందోళవసంతం

ఏల నన్నొడఁబరచేరే మీరే మీరు
వేళ గాకున్నదాన వెనకతీసేనా ॥పల్లవి॥

వశమై యాతనికి నే వలచినదానను
కొసరి యేమైనా నిఁకఁ గోపగించేనా
ముసిముసినవ్వులతో మొక్కినట్టిదానను
మసగాన మనసెల్లఁ దొక్కించకుండేనా ॥ఏల॥

చెచ్చెర నే మొదలనే సేసపాలదానను
మచ్చరము వెడరేఁచి మానఁబొయ్యేనా
తచ్చి వేసి మంచానకు దాసి వున్నదానను
మెచ్చుగఁ గాఁగిట నించి మెప్పించకుండేనా ॥ ఏల ॥

పంత మిచ్చి తనచేత బాసగొన్నదానను
యింతలోఁ దా నేమనినా నెగ్గు వట్టేనా
చింత దీర నన్నుఁ గూడె శ్రీవేంకటేశుఁడు దానె
మంతనాన నాపొందు మరుపకుండేనా ॥ ఏల ॥ 364

## దేసాళం

పట్టినచలముతోడఁ బైకొనీని
దిట్టగదే పేరువళి తిరువెంగళప్పఁడు ॥ పల్లవి ॥

విరహపుకాఁకచేత వేసరి నేఁ గసరితే
గరిమ నవ్వులు నవ్వి కాఁగిలించీని
సరసము లాడీని సాదనలు సేసీని
తెరలోనే పేరువళి తిరువెంగళప్పఁడు ॥ పట్టి ॥

వెలిఁ దనచేఁత విని వెసఁ దలవంచుకొంటే
బలిమిఁ జెక్కులు నొక్కి పచ్చిసేసీని
తొలుతే వేడుకకాఁడు దోస మెరఁగఁడనేది
తెలిపెఁగా పేరువళి తిరువెంగళప్పఁడు ॥ పట్టి ॥

కావిరి నే మొకమోడి కదిసి నే నిలుచుంటే
కోవరపు వలపుఁ గొంగు వట్టీని
చేవదేర నన్నుఁ గూడె శ్రీవేంకటాద్రి మీఁది-
దేవుఁడే పో పేరువళి తిరువెంగళప్పఁడు ॥ పట్టి ॥ 365

నాదరామక్రియ

పంతగాఁడ వవుదువు బలుదొరవు నవుదువు
యెంత సేసే వాపెయాస యీడేర్చరాదా ॥పల్లవి॥

చక్కువలు చల్లి చల్లి మాటలు నీతో నాడి
చక్కనివాఁడ వనుచు సంతసించీని
యెక్కడ పంకు నీకు నింతితో నేల జాగులు
యిక్కువతో నాపెయాస యీడేర్చరాదా ॥పంత॥

నెలవి నవ్వులు నవ్వి చేతులు నీపై వేసి
అలరిననేరుపరి వని మెచ్చీని
కలయ వచ్చినవేళఁ గాఁకలకుఁ బనిలేదు
యేలమి నీచెలియాస యీడేర్చరాదా ॥పంత॥

కందువ మర్మము లంటి కాఁగిటనే బిగియించి
చెందమ్మిరేకులచూపు సేస వెట్టీని
విందువలె నింతలో శ్రీవేంకటేశ కూడితివి
యిందరిలో నాపెయాస యీడేర్చరాదా ॥పంత॥ 366

రేకు-763 హిందోళం

ఎక్కడి తారుకాణలు యేల రట్టు సేసేవు
వొక్కమన సాయ నిఁక నూరకుండవయ్యా ॥పల్లవి॥

ముందు నీ వాపెతో నేల ముచ్చట లాడితివంటే
అందుకుఁ దగ్గట్టే వుపాయాలు చెప్పేవు
చెంది నే నమ్మనంటే ఆచెలినే తోడితెచ్చేవు
యెందుకు వేగిరకాఁడ వేమి సేతునయ్యా ॥ఎక్క॥

అట్టె వద్ద నుండఁగాను ఆపె నడుగఁగఁ బోతే
నెట్టన నడ్డా లందుకు నీవే వచ్చేవు
గుట్టు వెళ్లవేసితే గొబ్బునఁ జెక్కు నొక్కేవు
యెట్టునుఁ బోరాదు నీతో నేమి సేతునయ్యా ॥ ఎక్క ॥

సోలసి నీమేన నున్నచొప్పు లరయఁ జూచితే
కేలయఁ దలఁచి నన్నుఁ గాఁగిలించేవు
కలట్టాన వెట్టుమంటే కళలంటి చొక్కించితి-
వెలమి శ్రీవేంకటేశ యేమి సేతునయ్యా ॥ ఎక్క ॥ 367

శంకరాభరణం

తానదె నేనిదె తతి వచ్చె
నానిననెలవులనగవులు వలెనా ॥ పల్లవి ॥

చెప్పినమాఁటకు చేసినచేఁతకు
చప్పనివలపులె సరి దాఁకె
ముప్పిరిఁ దనకే మొక్కే నే నిదె
అప్పటి నాతో నానలు వలెనా ॥ తాన ॥

యేచి వెనకటికి నిప్పటివునికికి
మాచినప్పుడే సూటే (టి + అ) య
చేచేతులఁ దనసేవలు నాకిదె
నాచోటికి నీనటనలు వలెనా ॥ తాన ॥

వేడుక పడుటకు వేఁడుకొనుటకును
కూడినప్పుడే గుఱుతాయ
యీడనె శ్రీవేంకటేశుఁడు తానేలె
ఆడికగా నిఁక ననుకొనవలెనా ॥ తాన ॥ 368

సాళంగనాట

మాయదారిచేఁత లింకా మానవయ్యా
 ఆయము మోచిరదే అనతియ్యవయ్యా ॥ పల్లవి ॥

సిగ్గులు నీమీఁద వేసి చింతఁ బొరలీ చెలి
 యెగ్గుదీర మాఁటుమందు యేదయ్యా
 నిగ్గుదేరి విరహము నీకుఁగానే యింతసేసె
 దగ్గరి యింతిఁ గావఁగ తతి యేదయ్యా ॥ మాయ ॥

సాయము నీ కొప్పగించి పవ్వళించినది చెలి
 చాయల మేలుకొలుప సందేదయ్యా
 మోయఁగలనింద లెల్లా మోఁచెను నీమీఁదనె
 యీయింతిమీఁదికరుణ కిఁక వేళేదయ్యా ॥ మాయ ॥

గక్కన నిన్నుఁ జూచి కాఁగిలించుకొనెఁ జెలి
 మక్కువ నీ కిఁక మీఁదిమాట యేదయ్యా
 తక్కక (శ్రీ)వేంకటేశ తతి నింతిఁ గూడితివి
 మొక్కనమీలోలోనిముచ్చట లేవయ్యా ॥ మాయ ॥ 369

దేవగాంధారి

నీ వెరుఁగుదు విది నెలఁతకడకు నిటు
 వేవేగఁ దెలుపుదు విచ్చేయవయ్యా ॥ పల్లవి ॥

పూచినవెన్నెల పున్నమ కప్పుర -
 మేచి సతికిఁ బగ లేలాయా
 వాచవి శేషునివాతివిందు తరి
 వేచి యీపెకును వెగటా (చే?) లాయా ॥ నీవె ॥

1. వియోగమున ప్రతికూలములు, సంయోగమున అనుకూలములు.
 ఇది ప్రధానభావము. సమన్వయము విచార్యము,

దిమ్మువసంతపు తేనెలపుట్టలు
యిమ్ముగువకు దిగు లేలాయా
కమ్మనివాసనగాలి వాడికెలు
కమ్మి యీపెమతి కస లేలాయా ॥ నీవె ॥

ఆకుగొరుకులగు యంగజుమర్మము
యీకడఁ జెలి కెర వేలాయా
కైకొని శ్రీవేంకటేశ కూడితి -
వీకెకుఁ జుట్టము లిన్నియు నాయా ॥ నీవె ॥ 370

నాదరామక్రియ

పాయపుమదము వేళఁ బట్టవసగూ నిన్ను
ఆయము నే నెరుఁగుదు నవులేరా వేగిరమా ॥ పల్లవి ॥

వలసినప్పుడు నీతో వాసి రేఁచుకొనేఁ గాని
చెలఁగి యేమి సేసినాఁ జేయరా నీవు
చలము సాదించేవేళ సాదించేఁ గాని నీతో
అలిగి నిన్నేమి సేసే నయ్యో నే నిప్పుడు ॥ పాయ ॥

చేతికి లోనైనప్పుడు సిగ్గు విడిపించేఁ గాని
యీతల నిందరిలో నీయిచ్చరా నేఁడు
నీతలఁపు గని మీఁద నిన్నుఁ జక్కఁబెట్టేఁ గాని
కాతరించి నెలవేమి కటకటా యుఁకను ॥ పాయ ॥

నవ్వు వచ్చినయప్పుడు నవ్వేఁగాని నీతోను
నివ్వటిల్లఁ గఁయరా నీవే నన్ను
యివ్వల శ్రీవేంకటేశ యిదివో నేఁ గూడితి-
నెవ్వరు నేమి చెప్పేరు యేడకేడ మాటలు ॥ పాయ ॥ 371

తెలుఁగుఁగాంబోది

ఇందర మున్నార మిక్కడనూ నీ-
కఁదెదికి నేకత మదివో లోనా ॥ పల్లవి ॥

మలయుచు రమణుఁడు మాఁటలాడితే
చెలియరో నీకేలే సిగ్గులు
మెలఁగుమర్మములు మీలో నేఁటివో
తెలియదు మోహామె తెలిసీఁ గాని ॥ ఇంద ॥

నెలవుగ నాతఁడు నీమోము చూచితే
తలి నేలే యిఁకఁ దలవంపులు
తలఁగులు మొలఁగులు తలి మీకేఁటివో
యొలఁగము పొందొక యెలుఁగుదుము ॥ ఇంద ॥

రమ్మని యాతఁడు రతికిఁ బిలిచితే
సమ్మతి నింకేలే జంకెనలు
యిమ్ముల శ్రీవేంకటేశుఁడే కూడెను
నమ్మ మితవు లిఁక నమ్మేము నేఁడు ॥ ఇంద ॥ 372

రేకు - 764. ఆహిరినాట

ఏరా నీతో పతివాదు లెవ్వ రాడుకొనే రింక
నేరుపు నీవొళ్ళకల్ల నీవే యెరఁగవా ॥ పల్లవి ॥

కల్లలాడి యాన వెట్టి కాదని వాదుకు నచ్చే-
వెల్లవారు చూడఁగానే యేరా నీవు
తొల్లి నీవు వెన్నలెల్ల దొంగిలినదొంగవు నీ-
వెల్లగా మాటలాడిన యిది నిజమా ॥ ఏరా ॥

పంతమూడి పగ చాటి బలిమి నోరు సేసేవు
యింతలోనే నేఁడు నీకు నివి గొత్తలా
చింతదీర నల్లనాఁడు చీరఁదొంగవు నీవు
యెంత నేరవు నీతోడి దిఁక నేఁటిమాఁటలు ॥ప॥

కన్నులఁ దప్పక చూచి కాఁతాళించి పెనఁగేవు
యెన్నిటికని నే నీతో నీసడించేనా (రా?)
మన్నించి శ్రీవేంకటేశ మరి నన్నుఁ గూడితివి
యెన్న రుక్మిణికి దొంగ విఁక నేఁటిపనులు ॥ప॥ 373

పాడి

కల్లలాడేదానఁ గాను కలది కల్లటే కాని
మెల్లనే యిందుకుఁగా నామీఁదఁ గోపగించేవా ॥పల్లవి॥

చిన్నఁబోయి వున్నాఁడవు చేరి నే మాటాడఁగ
నిన్ను నాపె మీరెనట నిజమా యిది
యెన్ని నాతో యలుకని యెగఁగనివా రాడేరు
నిన్నటినామాటలకు నీ వెగ్గు వట్టేవా ॥కల్ల॥

తలపోసి చింతించేవు దైవార నే నవ్వఁగాను
అలమా(మి+అ)పె గోర నొత్తి నందుకా యిది
చల మిది నాతోనని సంగడివా రెంచేరు
కలగని నేఁ జెప్పినకత కింత సేసేవా ॥కల్ల॥

సిగ్గువడి వున్నాఁడవు చేరి నిన్నుఁ గూడఁగ
తగ్గి యాపె వరుసలు తప్పెనఁటా నా-
నిగ్గుల శ్రీవేంకటేశ నిన్ను నేనే కూడితిని
కగ్గక నావిన్నపాలు కాదుగూడ దనేవా ॥కల్ల॥ 374

ముఖారి

ఎవ్వరు నెఱఁగనివా యిటువంటినీసుద్దులు
నవ్వుల కేమో కాక ననుపయ్యేవాఁడవా ॥ పల్లవి ॥

యేతులకు నామీఁద నిటు చే వేసితి గాక
కాతరాన నీ వొకరిఁ గైకొందువా
రాతిట[1]ఁబంటి యెవ్వతె రాకుండఁగాఁ గాక
యీతల మాతోడిపొందు వితవయ్యీనా ॥ ఎవ్వ ॥

అలవోకగా మాయింటి కటు విచ్చేసితి గాక
తలఁపున నీ కంతతమి వున్నదా
పిలిచి యెవ్వతె నీతోఁ బెనఁగకుండఁగాఁ గాక
వెలుచునీమతి కింత ప్రియమయ్యీమా ॥ ఎవ్వ ॥

గక్కన దయఁదలఁచి కాఁగిటఁ గూడితి గాక
వెక్కసాన నీ కొకరు విన్నవించేరా
యెక్కువ శ్రీవేంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
పిక్కటిల్ల నీకు నాకు భేదమున్నదా ॥ ఎవ్వ ॥ 375

దేవగాంధారి

విడు విడు యీసుద్ది విననోపా
యెడపులఆస లివేఁటి కయ్యా ॥ పల్లవి ॥

మగువమాట లివి మంత్రరాజములు
తగిలి నీవెట్ల దాఁటేవు
నగి నగి మాతో ననుపులు సేసేవు
యెగసక్కెము లివి యేఁటికయ్యా ॥ విడు ॥

1. నుండి అని యర్థమా?

పొలిఁతియి ల్లదియె పుణ్యక్షేత్రము
వెలుపలి కెటువలె వెదలేవు
చలమున మాతో సరసములాడేవు
యెలయింపులు మరి యేఁటికయ్యా ॥విడు॥

కాంతకాఁగిలే కామనిధానము
వింతపాం దెట్ల వెదకేవు
యింతట శ్రీవేంకటేశ ననుఁ గూడితి-
వింతేసివినయము లేఁటికయ్యా ॥విడు॥ 376

## బౌళిరామక్రియ

వద్దు వద్దు యిఁకనేల వట్టిమాయలూ నీ-
సుద్దులు నేమెఱఁగమా చొక్కులఁ బెట్టేవూ ॥పల్లవి॥

అంగన వచ్చినరాక లడిగేవు నీవు తొల్లె
యింగితాకారములు నీ వెఱఁగినివా
ముంగిట మావంటివారిముందరను గోలవలె
వెంగలివిద్యలే సేసి వేసాలఁ బొయ్యేవూ ॥వద్దు॥

మగువ నీతో నవ్వితే మ మ్మేమి విచారించేవు
తెగడి యాకిలు నీవు తెలియనిదా
నిగిడి నీసతులతో నిన్నుఁ గానివానివలె
జగములో నివి గొన్ని సటలు సేసేవూ ॥వద్దు॥

సతి నిన్ను దగ్గరితే సన్నలు మాతోఁ జేసేవు
కతలు నీయందు తొల్లి కలవే కా
మతకాన వేరె వేరె మ మ్మిద్దరిఁ గూడి మా-
రతులు శ్రీవేంకటేశ రంచు మెచ్చేవూ ॥వద్దు॥ 377

లలిత

వేరె యింక నంతేసి విచ్చి చెప్పవలెనా
సారెకు నవ్వినదే పచారించుటే కాదా ॥పల్లవి॥

అంచెల నెదుటనున్న ఆఁటదానితో మాఁటలు
పొంచి యాడకుండితేను పొమ్మంట గాదా
కంచముపొత్తున నుండే కలికిఁ బిలువక తా
ముంచి కడెత్తితే నన్నియు ముగించుటగాదా ॥వేరె॥

మేర మీరి చనవరి మెలుఁతఁ దప్పక చూచి
ధీరత నెదురాడితేఁ దిట్టుట గాదా
చేరువనుండి అట్టె చెనకఁగ గుట్టుతోడ
వూరక వుండినదెల్ల వొల్లనంట గాదా ॥వేరె॥

తక్కక కానుక లిచ్చి తరుణిఁ జూడక వుంటే
చిక్కం చాపె వెల్లవిరి సేయుటే కాదా
యెక్కువ శ్రీవేంకటేశ యిట్టె మాచెలిఁ గూడితి-
వొక్కమనసైనందుకు వుంకువిదే కాదా ॥వేరె॥ 378

రేకు - 765 రీతిగౌళ

చాలునమ్మ యింకనేమి సంగతిగాదు
యేలినవాఁ డిదె వచ్చి యింటనున్న మీఁదను ॥పల్లవి॥

పంతపునీమాటలకు పనిలేదు ఆతనితో
చింతదీర కడువలచినమీఁద
కొంత గొంత కన్నులనే కోపగించఁ బనిలేదు
ఇంతేసిచనవు నీ విచ్చినందుమీఁదను ॥చాలు॥

కన్నులఁ దప్పక చూచి కాఁతాళించఁ బనిలేదు
అన్నిటా నాతనికి లోనైనమీఁద
సన్నల జంకించ నాతని సాదించఁ బనిలేదు
యిన్నేసినోములు నోమి ఇయ్యకొన్నమీఁదను ॥ చాలు ॥

వుడుకునిట్టూరుపుల నుస్సురనఁ బనిలేదు
బడి బడి నాతనితోఁ బైకొన్నమీఁద
యెడయక శ్రీవేంకటేశుఁ డితఁడే కూడె
జడియఁగఁ బనిలేదు సతమైనమీఁదను ॥ చాలు ॥ 379

సామంతం

భళి భళి మాకిది పరిణాము
పెలుచగు వలపులు పెరిగీఁ గా ॥ పల్లవి ॥

ఆకెకు నీకును నంగన వొక్కతె
సాకిరి గలిగెఁగా సంగడిని
చేకొని మీకును సెలవుల నవ్వుచు
సైకపురసము జరగీఁగా ॥ భళి ॥

మదనరహస్యపుమర్మము చిలుకలు
అదనుగ నేర్చెఁగా అన్నియును
కదిసినసిగ్గులు గరఁగుచు మీలో-
నుదుటుసంతసము లొనరీఁగా ॥ భళి ॥

శ్రీవేంకటేశ్వర చెలి నీ కూటమి
భావపుకళలై పయికొనెఁగా
యీవల నీవే యిటు నను గూడితి
కైవశము నాకుఁ గలిగీఁగా ॥ భళి ॥ 380

కుంతల వరాళి

ఇంతవాఁడవు నన్నేలి యీవెలితి నీకేల
వింతలు సేయక నావెలుపు దెలుపుమీ ॥ పల్లవి ॥

నీవు నన్ను మన్నించఁగా నెలఁతలు గుద్దిరాన
వేవేలు నాడుకొంటే విననోపను
భావించి నిన్నుఁ దలఁచి పరిణామించుకొంటాను
చేవలుదేరె మనసు చిల్లులు గానీకుమీ ॥ ఇంత ॥

చనవు నీ విచ్చితేను సవతులు వెనఁగేటి-
పనిలేనివాదులాటఁ బడనోపను
ననుపుగా నిన్నుఁ బొంది నవ్వుచు సంతసమున
ఘనమైన యీమేను కాఁక రేఁగించకుమీ ॥ ఇంత ॥

జిగి నన్నుఁ గూడితివి (శ్రీ)వేంకటేశ్వర అట్టి-
మగువల మాను మలమట కోపను
అగపడి రతులఆనందమునఁ దేలెది
తగువైనదినములు దగ్గరనే వుండుమీ ॥ ఇంత ॥ 381

ముఖారి

నెమ్మది నోడబేరము నీతోడి మాట
పమ్మి కాచుకున్నవారి భాగ్యములకొలఁది ॥ పల్లవి ॥

కడునిజ మనరాదు కల్లలని ఆడరాదు
నిడుపు గుఱుచలను నీతోడిమాఁట
చిడుముడిఁ గసరక నెలవుల నగక నీ-
బడిబడి నున్నవారి భాగ్యములకొలఁది ॥ నెమ్మ ॥

చేతులఁ బట్టఁగరాదు చెంగట విడువరాదు
నీతితోడి గొల్లమంకు నీతోడిమాట
కాతరానఁ బైకొనక కడకుఁ దొలఁగక నీ-
పై తరవులున్నవారి భాగ్యములకొలఁది ॥ నెమ్మ ॥

బట్టబయలు గారాదు పయ్యదాఁ గప్పఁగరాదు
నెట్టన సమరతులు నీతోడిమాట
గుట్టుతో శ్రీవేంకటేశ కూడితివి నన్ను నిట్టె
పట్టి పెనఁగేటివారి భాగ్యములకొలఁది ॥ నెమ్మ ॥ 382

దేసాళం

ఏమి సేసినా నీతో నెదురాడేమా
ప్రేమపువారము నీతోఁ బెనఁగితే నేమో ॥ పల్లవి ॥

సంగతాయఁ బనులు నీచనవు గలుగఁగాను
కంగదేరి సవతులు కైవసమైరి
కొంగువట్టి తీసి మము గొరబు సేయకు మీఁక
యెంగిలివారము నీకు నేడనున్నా నేమూ ॥ ఏమి ॥

వేడుక లన్నియుఁ దేరె విచ్చేసి నీవుండఁగాను
కూడేటికోరిక లెల్లఁ గొనసాగెను
వీడె మిచ్చి మాసిగ్గు విడిపించ కంతలోనే
వూడిగమువారము నీ కొరసితే నేము ॥ ఏమి ॥

మనసెల్ల నొక్కటాయ మన్నించి నన్నుఁ గూడఁగ
కొనమొదలికి నిది గురుతాయను
ఘనుఁడ శ్రీవేంకటేశ గక్కన నవ్వేవు నేఁడె
ననుపువారము నీకు నానాఁడే నేమూ ॥ ఏమి ॥ 383

లలిత

అతఁడే యీడకు వచ్చి నన్నిటికిని
యీతల మాపుదాఁకా నీ కేమి చెప్పె మిఁకనూ ॥పల్లవి॥

పవ్వళించీ నాయకుఁడు పైపై నీ కెదురుచూచి
యివ్వల సింగారించే వింకా నీవు
యెప్ప రెంతగాఁ జెప్పిరో యేమని తలపోసేవు
రవ్వగా వచ్చేయదైతే రావా నీ వప్పుడే ॥అతఁ॥

సరి నీ కెదురుచూచి జాగరా లున్నాఁ డతఁడు
యిరవై అద్దము చూచే విఁకా నీవు
సరసానకో నీవు చలమెంత పట్టితివో
యెరవు లేకున్నఁ జన వియ్యవా నీ వింతకా (కు?) ॥అతఁ॥

వేగిరాన నేతెంచి శ్రీవేంకటేశుఁ డీడఁ గూడె
యీగతి సిగ్గులువడే వింకా నీవు
బాగుగా నీతనింటికి బడినే నీవు వచ్చితి
నీగుణాలకుఁ దగ్గట్టు నేరవా నీ విఁకనూ ॥అతఁ॥ 884

రేకు - 766. వరాళి

చేతులు పైఁ జాఁచవయ్య చెక్కు లట్టె నొక్కవయ్య
యీతల మీవంటిగుట్టు లిఁక నేఁటికి ॥పల్లవి॥

బొమ్మముడిజంకెనల పొలఁతి నీమోము చూచి
కుమ్మరించీ వలపులు కూడఁగూడను
రమ్మని పిలువలేక రాజసము మానలేక
వుమ్మగిలీఁ జెమటలే వూరవూరను ॥చేతు॥

జాఱినపయ్యెదతోడ సళుపుటూసలు నీపై
తూఱఁజేసె నవ్వుతానె తోడఁదోడను
మీఱినసిగ్గులఁ గొంత మించి నిట్టూర్పులఁ గొంత
ఆఱడాయఁ దమకాన నంతనంతను ॥ చేతు ॥

సరసపుమాటలతో చాయల సన్నలతోడ
సరుస మోవి నీకిచ్చె సారె సారెకు
యిరవై శ్రీవేంకటేశ యింతి నిట్టై కూడితివి
కరఁగీ మెచ్చులు మెచ్చి కాలఁగాలమునను ॥ చేతు ॥ 385

## ధన్నాశి

బుద్ధి చెప్పేదానఁ గాక పోరుదాననా
కద్దు లేద నొరసితే కడదాననా ॥ పల్లవి ॥

వట్టినిందలెల్ల నీపై వారు వీరు నాడుకోఁగా
పట్టి నిన్నడిగితే నే పగదాననా
వొట్టుక యిందరు మెచ్చ వొద్దఁ గాచుకుండితేను
అట్టె నీచేఁతలకెల్ల నడ్డమైనదాననా ॥ బుద్ధి ॥

చేరి నీసతులు నిన్ను సేన మాటలాడఁ గాను
కేరి నవ్వితే నెకసక్కెముదాననా
సారె నీనిజము మించ సాకిరివారలఁ దెచ్చి
తారుకాణించితే నే పంతపుదాననా ॥ బుద్ధి ॥

తనియ నీవు గూడఁగ దగ్గరి సమరతుల
చన విచ్చి కూడితే నే సరిదాననా
ఘనుఁడ శ్రీవేంకటేశ కందువ యీవేళ నీకు
చనుమొనలు చూపితే సాదించేదాననా ॥ బుద్ధి ॥ 386

నీలాంబరి

ఇందాఁకా నేరదాయ నిదివో ఆపె
సందడించీ నీవిచ్చినసలిగెల నాపె ॥పల్లవి॥

మక్కువతో నీవు నేను మాటలాడేవేళనే
యెక్కువ నేక తా లాడీ నిదివో ఆపె
మక్కళించి నీవు నేను మరి నవ్వేవేళనే
అక్కరతో సరసము లాడీ నాపె ॥ఇందాఁ॥

యిచ్చల మొక మొకాలు యిద్దరముఁ జూచేవేళ
పచ్చిగా సన్నలు సేసీ పైపై నాపె
ముచ్చటకు నే దగ్గరి మోహము చల్లేటివేళ
చెచ్చెర నీపై నొరగీ సిగ్గుదేర నాపె ॥ఇందాఁ॥

పట్టెమందాన నీవు నేఁ బవ్వళించి వున్నవేళ
గుట్టుతో సద్దిరించీ నీకొంగుపై నాపె
యిట్టె శ్రీవేంకటేశ యెమరించి కూడితివి
గట్టిగా నిన్నలమి తాఁ గరఁగీ నాపె ॥ఇందాఁ॥ 387

రీతిగౌళ

రచ్చలు సేయక రావయ్యా
యిచ్చ యెఱఁగ నిది యేలయ్యా ॥పల్లవి॥

జంకెనచూపులు సరసపుమాఁటలు
లంకెలఁ బెట్టీ లలితాంగి
మంకులవోట్లు మాయలఅలుకలు
యింకా నీపెతో నేలయ్యా ॥రచ్చ॥

దొంతులయాసలు దోమటిబాసలు
సంతము సేసీ జవరాలు
పంతపులిగువులు పాయపుమదములు
యెంతకెంత మరి యేలయ్యా ॥ రచ్చ ॥

చనవుఁ సవిగెలు చాయలసన్నలు
వెనపులఁ బెట్టీ ప్రియురాలు
యెనసితి శ్రీవేంకటేశ యీపై నిదె
యినుమడిపరవశ మేలయ్యా ॥ రచ్చ ॥ 388

శంకరాభరణం

సేసినచేఁతలు చెల్లె నిఁక
యీసుల నంతేసి యెఱుఁగుదుమా ॥ పల్లవి ॥

గేలిసేయ నినుఁ గేరడమాడను
నాలో నూరక నగితి నిదే
ఆలరి నీవేల ఆనలు వెట్టేవు
తాలిమితో మిముఁ దడవితిమా ॥ సేసి ॥

తలఁ పెద నడుగ తగవులఁ బెట్టను
చెలితో సుద్దులు చెప్పితిని
కలదిదె నీతారుకాణ లేల యిఁక
వలవనిసణఁగులు వంచితిమా ॥ సేసి ॥

కరములు చాఁచను కాఁకలు చల్లను
మురిపెముతోనే మొక్కితిని
యిరవుగ శ్రీవేంకటేశ కూడితివి
గరిమల నిందుకుఁ గాదంటిమా ॥ సేసి ॥ 389

సాళంగనాట

ఇన్నాళ్లవంటివాఁడవా యిప్పుడు నీవూ
మన్నన గలిగితేఁ జాలు మరి నిన్నే మననూ ॥ పల్లవి ॥

యేకతాన నాపె నిన్ను నేమని సాదించెనో
యీకడ మాతో మాటాడ నింత లోఁగేవూ
ఆకె నీవూఁ గూడి వుండినదే మాకుఁ బదివేలు
రాకువయ్యా మాయింటికి రచ్చలయ్యీఁ బనులూ ॥ ఇన్నా ॥

కడల నిన్నాపె యెంత కట్టు మట్టు సేసెనో
జడిసి నేఁ దడవితే సన్న సేసేవు
నిడివితో యీవలపు నిజమైతేఁ జాలుఁగాక
తడవకు మమ్ము నీవు తరి వచ్చుదాఁకానూ ॥ ఇన్నా ॥

అంతలో నేఁ డాపె యెంత అప్పణ నీకిచ్చెనో
సంతసానఁ గాఁగిలించి సరిఁ గూడితి
వంతున శ్రీవేంకటేశ వద్దనుంటేఁ జాలుఁగాక
చెంత మాలో(తో?) నింటికి విచ్చేయవయ్యా యిఁకను ॥ ఇన్నా ॥

రేకు - 767 మలహరి

పొత్తులమగఁడవు పొరుగున నుండఁగ
తత్తర మింతేసి తమ కేలయ్యా ॥ పల్లవి ॥

యేపున నీమోము యిటు నేఁ జూచిన
చూపు లాపెమై చురుకనెను
ఆపొద్దు నీతో నాడినమాఁటల
తీపులు దనకటు తినఁ జేఁదాయ ॥ పొత్తు ॥

నడుమ నే నీతో నవ్విననెన్నెల-
కడ నాపెకుఁ జీఁకటులాయ
చిడుముడి నే నినుఁ జెనకినసరసము
వెడవెడఁ దన కవి విరసములాయ ॥ పొత్తు ॥

వెస నామోవులవిందు నీ కిడిన
పసిగొనినాపెకుఁ బగలాయ
యెసఁగిన శ్రీవేంకటేశ మ మ్మిద్దరిఁ
గొసరి కూడితివి గురి దనకాయ ॥ పొత్తు ॥ 391

## శుద్ధవసంతం

వట్టితగవులఁ బెట్టీ వద్దన్నా మానఁడు
నెట్టన మీ రెఱఁగరు నిజమంటా నుండురు ॥ పల్లవి ॥

తనకుఁ జేసినమేలు తానే యెఱుఁగుఁగాక
నను నేఁ బొగడుకొన నాయమా నాకు
అనరాదు వినరాదు అయాలు సోఁకినసుద్ది
మనసులో మర్మములు మరునికే తెలుసు ॥ వట్టి ॥

తతి నాచేఁతలు తానే తలఁచుకొనుట గాక
చతురతఁ బచరించ సంగతా నాకు
మితిలేదు మేరలేదు మెలఁగినసరసాలు
కతకఱచినతనకాయమే యెఱుఁగును ॥ వట్టి ॥

కూడిననాకూటములు గుఱుతా తానేకాక
యేడనైనా విన్నవించ నెమ్మొలా నాకు
యీడుగ శ్రీవేంకటేశుఁ డెనసె నన్నింతలోనె
ఆడుకోలు తనమాఁట లంతట నిలుచునా ॥ వట్టి ॥ 392

గుజ్జరి

పలుమరు నిన్నాడ బలిమేది
అలరి నేఁడు నీ వాడినదాటా ॥ పల్లవి ॥

తేటతెల్లమిగఁ దెలువఁగఁ బోయిన
పాటి నీగుణము పసలేదు
కూటమిఁ దొల్లే గురియైతి నీకు
నాటఁగ నీ కిఁక నవ్వులు గావా ॥ పలు ॥

వెల్లవిరిగ నిను వెంగెము లాడిన
పల్లదంబు నీపాలిటిది
చెల్లు నీకు నే సేసలు వెట్టితి
యెల్లచోట నీయిచ్చలు గావా ॥ పలు ॥

తెరచిరాజనుచు దిష్టము చూపిన
వురముమీఁద సతి వున్నదిదే
యిరవుగ (శ్రీ)వేంకటేశ కూడితివి
సిరుల నీ చేసినచేఁతలు గావా ॥ పలు ॥ 398

మధ్యమావతి

చెలు లిఁక నాయము చెప్పకురే మీరు
చలములు నడుమనె సాదించేటివి ॥ పల్లవి ॥

నేరము లెంచిన నెపములు వేసిన
వూరక లోలో నొల్లనిది
కూరిమి గొసరిన గుట్టున నుండిన
సారె వలపు లవి చప్పనివి ॥ చెలు ॥

పంతము లాడిన పరాకు సేసిన
సంతతమగుతమి చాలనిది
వంతులు వట్టిన వళుకు లాడినను
అంత చుట్టరిక మూపాటిది ॥ చెలు ॥

వొక్కట నవ్విన వొడఁబఱపించిన
యిక్కువ కాఁగిలి యెగవులది
గక్కన శ్రీవేంకటపతి గలసెను
తక్కులు తొలుతే దాఁటినవి ॥ చెలు ॥ 394

రామక్రియ

ఇంతేసిపొత్తులమాఁట లెందాఁకానే
కాంతుఁడవు నీమేలు గలదాఁకానే ॥ పల్లవి ॥

పోపోసి గొల్లెత యీడ నుండుదునటే
పోసరించి వచ్చి మరి పోనేలరా
అసగద్దా అని నిన్ను నడిగితిని, వోరి
దోసము లొకరియాస తుంచి వేయవచ్చునా ॥ ఇంతే ॥

వింటివటె నాకు నీవు విందు వెట్టేవా
వెంట నాఁకటికొద్ది నీవే యెఱఁగవా
జంటలనామాఁట నీకు సమ్మతౌనటే
నొంటుల నామతి నీవు సోదించఁగలవా ॥ ఇంతే ॥

కొంకుదేర నిన్ను నిట్టె కూడుదునటే
అంకెకాఁడ నీకు నేను అప్పణిచ్చేనా
యింకానా శ్రీవేంకటేశుఁడఁ గదే
పొంకముగఁ గూడితివి పొనుగఁగ వచ్చునా ॥ ఇంతే ॥ 395

మాళవిగౌళ

ఇంత గద్దాయపుపొందు లేల మాకు
యెంతేసివారలు నీకు నెదురుచూచేరో ॥ పల్లవి ॥

కడుఁ బొద్దువోయ నని కదియఁ దమకించేవు
యెడయ కిక్కడనుండె నే మాయను
తొడుసు దీరుచుకొని తుద నెక్కడికైనాను
వెడలిపోఁ బని గద్దో వేగిరించేవయ్యా ॥ ఇంత ॥

ఆత్తి గలవారివలెఁ బానుపునకుఁ దీసేవు
హత్తి యీడఁ గొలువుండే నంకెకు రాదా
వొత్తుకోలు మావరుస వుత్తరువు సేసుకొని
కొత్తగా నెవ్వతెనైనాఁ గూడేవో అయ్యా ॥ ఇంత ॥

యిల్లు చొచ్చినంతలోనే యిటు నన్నుఁ జొక్కించితి
వొల్లనే ముచ్చటలాడ నొనగూడదా
కొల్లగా శ్రీవేంకటేశ కూడి ఖేమో పేపేనని
మల్లాడి నాపసఁ జిక్కి మరచితి వయ్యా ॥ ఇంత ॥ 396

రేకు—768 సామంతం

వట్టియిచ్చకము మాతో వలెనా యింత
అట్టు నిట్టు నుందు గాక అప్పటేల యికను ॥ పల్లవి ॥

ఆయము సోఁకను చెలి యాడినట్టిమాటలకు
కాయము సోఁకితేనే కాఁక దీరెను
నాయములు వచరించి నాతో నేమి చెప్పేవు
చాయ సేసుకొందు గాక సటలేల యికను ॥ వట్టి ॥

చేతులార ఆపె నిన్నుఁ జేసినట్టిచేఁతలకు
యీతలఁ బొత్తుకుఁ బోతే యీసు వాసును
పోతరించి మమ్ము నేల పొందులకుఁ దీసేవు
యేఁగులఁ గైకొందు గాక ఇంత యేల యిఁకను ॥వట్టి॥

ఆడ నాపె నీతోను అలిగినయలుకకు
వీడె మిచ్చి నంతలోనే వెత వాసెను
యీడకు శ్రీవేంకటేశ యిటు నన్నుఁ గూడితివి
వేడుకతో నుందు గాక వేసాలేల యిఁకను ॥వట్టి॥ 397

మాళవిగౌళ

ఏల సిగ్గువడె నీతఁ డిదె
కూళతనంబునఁ గొసరితినా ॥పల్లవి॥

మొక్కితి నూరకే మోనాన నుంటిని
తక్కినసుద్దులు దడవితినా
నిక్కి చూచితిని నేఁ దల వంచితి
పక్కనఁ దనతోఁ బదరితినా ॥ఏల॥

కొలువు సేసితిని గుట్టున నుంటిని
పెలుచుఁదనంబులఁ బెనఁగితినా
మెలఁకువ వింటిని మిక్కిలి నవ్వితి
బలిమి సేసి మరి పదరితినా ॥ఏల॥

కందువ నిలిచితిఁ గాఁగిటఁ గూడితి
నిందలు దనపై నిలిపితినా
యిందునే శ్రీవేంకటేశుఁడు దాఁ గూడె
ముందువెనకలకు మొఱఁగితినా ॥ఏల॥ 398

దేసాళి

నీకేల తలవంచ నిన్ను దూరేనా నేను
లోకములో సుద్దులకు లోనయ్యేవాఁడవా ॥ పల్లవి ॥

కైవశమై నీవు నాకుఁ గలిగి మోహించఁగాను
ఆవలీవలిసతులు ఆసపడేరు
నీ వేళ కైకొందు వట నేరమి తమదే కాక
వేవేలకు నీపై నింద వేయఁగలరా ॥ నీకే ॥

మిక్కిలిమాయింటిలోనిమేడపై నీ వుండఁగాను
యెక్కడో చెలులు నిన్ను నెలయించేరు
అక్కర తమకె కాక అది వరాకా నీకు
తెక్కులు నీవోజ తాము తిప్పఁగలరా ॥ నీకే ॥

గట్టిగా నాకాఁగిటనే కలసి నీ వుండఁ గాను
వొట్టుక కొలువుకాంత లోలవేసేరు
నెట్టన శ్రీవేంకటేశ నీవు దమ్ముఁ జెనకేవా
మెట్టుకొని నిన్నంతేసి మెప్పించఁ గలరా ॥ నీకే ॥ 399

సాళంగనాట

ఎగసక్కెపువల పెండాఁకా
మొగమోటములే మోపా నాకు ॥ పల్లవి ॥

చనవున నే నిటు సారెకుఁ జెనఁగఁగ
ననుపు చేసుకొని నవ్వితివి
మనసురానిపని మర్మము నాఁటదు
చెనకకు మిది యొక సెలవా నాకు ॥ ఎగ ॥

చుట్టరికంబుల సొలసి పిలువఁగా
పొట్టఁబొరుగు కటు పొలసితివి
పెట్టుతమకములు ప్రేమల కెక్కవు
పట్టకు మిది యొకభ్రమతా నాకు ॥ ఎగ ॥

కందువ నే నటు కాఁగిలించఁగా
అందము చేసుక యలమితివి
యిందునె శ్రీవేంకటేశ్వర తీరదు
కిందు పడకు మిది గెలుపా నాకు ॥ ఎగ ॥ 400

## కేదారగౌళ

ఇన్నేసిపనుల కెల్లా నియ్యకొన నోపుదుమా
చెన్నుమీర మాభాగ్యము చిత్తము నీదిగాక ॥ పల్లవి ॥

నీ వెఱఁగనిబుద్ధులు నే విన్నవించేనా
దేవులనీమంకులు నేఁ దిప్పఁగలనా
నావంక నేమి చూచేవు నవ్వు లేమినవ్వేవు
కావలసినపను లిక్కడ నయ్యీఁగాక ॥ ఇన్నే ॥

ఘనుఁడ వింతటినిన్నుఁ గడుబలిమి సేసేమా
వనితనీసందిమాఁట వంక లొత్తేమా
తను వేమినిమిరేవు తగవు లే మడిగేవు
అనువులు వచ్చి నప్పుడందమయ్యీఁగాక ॥ ఇన్నే ॥

శ్రీవేంకటేశుఁడ నీచేఁతలకు మెచ్చేమా
భావించి యాపెఁ గూడితి భాసడిగేమా
వేవేలు నేమి చెప్పేవు వెల్లవి రేమిసేసేవు
చేవదేరినవిధాలు చెప్పిచూ వేఁగాక ॥ ఇన్నే ॥ 401

వరాళి

ఇద్దరికి సరిపంతా లిఁక తేరాదా
    తిద్దుకొని మీలో మీరే తెలుసుకోరాదా ॥ పల్లవి ॥

కోపించి చూచినచూపు గురిసేసి యంతలోనే
    పైపై నవ్వి చూచితే పంత మిచ్చుటా
రావుగాఁ దిట్టిననోర రమ్మని పిలిచి తానె
    యేపున ముచ్చటలాడు టిది పంత మిచ్చుటా ॥ ఇద్ద ॥

పలుమారు కేసులను పగ చాటినచేతుల
    బలిమిఁ గొంగువట్టుటే పంత మిచ్చుటా
అలిగి లోననుండి అనలు వెట్టి కమ్మటి
    తలుపు దెరచితేనే తానే పంత మిచ్చుటా ॥ ఇద్ద ॥

మానిని మనుచు వేరె మారుమంచా లెక్కి చొక్క-
    పానుపుపై చేరితేనే పంత మిచ్చుటా
అనుక శ్రీవేంకటేశ ఆపె నీవూఁ గూడితిరి
    యీనెపాన చన విచ్చు టిది పంత మిచ్చుటా ॥ ఇద్ద ॥ 402

రేకు—769 ఆహిరి

నమ్మితి నీచిత్త మిఁక నాభాగ్యము
    వుమ్మడి నూరకుండిన వొచ్చమే కాదా ॥ పల్లవి ॥

కేరడాలు చూచి నీవు కేరి కేరి నవ్వఁగాను
    చేరి నావిన్నపా లింక పిగ్గు గాదా
వీరివారివాదుతెల్ల విచారించకుండఁగాను
    కూరిమి గొసరఁబోతే కూళతనము గాదా ॥ నమ్మి ॥

చయ్యాటపుసవతుల సరిఁ బెట్టుకుండఁగాను
నెయ్యాన నీవద్ద నుంటే నేరము గాదా
యియ్యెడ నంతేసిచన విచ్చి నీ వుండఁగాను
అయ్యో నీవొడఁబాట్లారడే కాదా ॥నమ్మి॥

కందువ కాఁగిట నీవు కలసి నా కుండఁగాను
ఇందు నిన్ను బాసడుగు టెరవే కాదా
పొందితి శ్రీవేంకటేశ భోగము నే నెరుఁగుదు
మందలించి పొగడిన మాయలే కాదా ॥నమ్మి॥ 403

పాడి

చేతికి లోనై యుండఁగాఁ జెప్పించుకొనేనా నేను
ఆతలి వేడుకలెల్ల నంగమే యెరుఁగును ॥పల్లవి॥

పాటించి నీవు పెక్కుపనులు గలవాఁడవు
మాటలైనా నాడితిగా మంచిదాయను
ఆఁటదాని కీపాటియాస గలిగినఁ జాలు
తాటించి యామీఁదిపని తానే నేరుచును ॥చేతి॥

సరుస గుట్టుతో రాజసమున నున్నవాఁడవు
సరస మాడితివిగా సమ్మతాయను
తరుణుల కీపాటిదాయిద (దం?)మైనఁ జాలు
గరిమె లన్నియుఁ దొల్లె కైవశ మైనవి ॥చేతి॥

యేఁగి వచ్చి పెక్కురతు లెరిఁగినట్టివాఁడవు
కాఁగిటఁ గూడితివిగా గట్టి యాయను
మాఁగిన శ్రీవేంకటేశ మావంటివారికెల్ల
పాఁగినయీమన్ననలు పదివేలు కెక్కును ॥చేతి॥ 404

బౌళి

ఆతని నేల దూరేవే అప్పటి నీవు
నీతులు చెప్పఁబోయిన నెరుసులే యెంతురు ॥పల్లవి॥

వొరులఁ దడవకున్న వొచ్చము లేక వుండిన
సరుసఁ బలుకుదురు సవతివారు
పురుషుఁ డందుకుఁగాను పూనుక తా వచ్చినాను
వెరవు దెలియుదాఁకా వెంగేలే యాడుదురు ॥ఆత॥

తమయిఁటనే వుండిన తగవుతో నడచిన
జమళినే సాదింతురు సంగడివారు
రమణుఁ డందుకుఁగాను రావుగా నడ్డమాడిన
అమరనికాఁకతోడ నగ్గల మాడుదురు ॥ఆత॥

ఇచ్చకమే సేసినాను యెరవు లేకుండినాను
వచ్చివచ్చి మీరుదురు వంతులవారు
నిచ్చ శ్రీవేంకటేశుఁడు నిన్నుఁ బాయ కిట్టుండె
విచ్చనవిడి నాతని వేవేలు నాడుదురు ॥ఆత॥ 405

సామంతం

వేవేలు గొసరి వేసరితి
యీవల నాడే యిచ్చక మిఁకనూ ॥పల్లవి॥

యెచ్చుకుందు లటు యెవ్వరు సేసిన
తుచ్చంబున నిను దూరుదును
నచ్చుల నెన్నాళ్ళు పాచేతిసణఁగులు
మెచ్చే విఁక నిను మేలని పొగడి(?) ॥వేవే॥

పలువిరహములను బడలినయప్పుడు
అలుగుదు నీతో నంకెకును
తొలి తొలి నాచేతిదోసము నీకేలా
వెలయఁగ నిను దీవించెద నిఁకనూ ॥ వేవే ॥

కనుఁగొని నీవే కలసేటియపుడు
తనిసినదాఁకాఁ దమకింతూ
యెనసితి శ్రీవేంకటేశ్వర నన్నిదె
మునుపు వెనకలకు ముంచెద నిఁకనూ ॥ వేవే ॥ 406

వరాళి

అప్పటప్పటివేడుక ౘవె చూతురుగాక
తప్పని వివేకములఁ దలపోసేరా ॥ పల్లవి ॥

వింతగా నాపెను నీవెంటఁబెట్టుక వచ్చితి-
వింతకంటె మరి నీవు యేమి సేతువూ
చెంతల సిగ్గులు విడిచినవారు లోకులెల్లా
యింతటా నవ్వేరని యెంచఁబొయ్యేరా ॥ అప్ప ॥

పొదిగి యాపెకుఁగాను పూనుక మాఁటలాడేవు
యిది నీసాజమే యింక నేమిసేతువూ
వదలి వెరపులేనివారు తమయిచ్చనుండి
కదిసి నిచ్చలపుతగవు లెంచేరా ॥ అప్ప ॥

గక్కన నాపెఁ గూడి కాఁగిట నన్నుఁ గూడితి-
వెక్కడా నీకుఁ గలది యేమిసేతువూ
చక్కని శ్రీవేంకటేశ సారె మోహించినవారు
వొక్కటయ్యేదే కాక వొల్లమనేరా ॥ అప్ప ॥ 407

నాదరామక్రియ

ఇంతలో నీవేల యెమ్మెకు నవ్వేవు
చెంతల నూఁకొనఁ జెల్లదా నాకూ ॥ పల్లవి ॥

అంగపుఁగాఁకలు అయము సోఁకఁగ
ముంగిట నినుఁ గని మురిగితిని
చెంగటివలపులు చెక్కుల నుండఁగ
పొంగి మూతి గిరుపుట యిది గగదా ॥ ఇంత ॥

మనసునఁ దోఁచినమాఁటలు మెరమఁగ
చొనిపి తప్ప కటు చూచితిని
వెనకటిబాసలు వేగిరపడఁగా
పొనిఁగి కేకరింపులు చూపితిని ॥ ఇంత ॥

గక్కన నాసలు కాఁగిట నుండఁగ
ముక్కున వేలిడి మొరఁగితిని
యిక్కడ శ్రీవేంకటేశ కూడితివి
మిక్కిలి నిన్నే మెచ్చితిని ॥ ఇంత ॥ 408

రేకు-770 దేవగాంధారి

చేసిన చేఁతలేచెల్లుబడి
వాసికి వలపులు వంచఁగదే ॥ పల్లవి ॥

నగినయందులో నయములు దోఁచెను
అగడుగ పతి నీఁక నాడకువే
జగడపుటొట్లు సతములు గావవి
మొగము చూచి యిఁక మొక్కఁగదే ॥ చేసి ॥

నిలిచినందులో నెయ్యము దొలఁకెను
చలము లతనిపైఁ జల్లకువే
తొలుతటిసిగ్గులు దొంతుల నున్నవి
పిలిచి వినయములఁ బెనఁగకువే ॥ చేసి ॥

చెనకినందులో సేవలు దోఁచెను
కొనగొన నచటనె కొసరకువే
యెనసెను శ్రీవేంకటేశ్వరుఁ డిటు నిను
మనసుమర్మములు మఱవకువే ॥ చేసి ॥ 409

## నారాయణి

తగినంతె పొందు చాలు దండము నీకు
వొగి నిన్ను నేమన్నా నొట్లు వెట్టుదువా ॥ పల్లవి ॥

కందువ లన్నియుఁ జేసి కడపటనుండి వచ్చి
అందగారిమాటాడుదు వప్పటి నీవు
మందెమేళమున నీతో మచ్చరించక మానము
గొందినుండి నీ కంతలోఁ గోపమెల్లా వచ్చును ॥ తగి ॥

ధీరత నీయిచ్చ నుండి తేరకాండ్లనుఁ దెచ్చి
తారుకాణించఁ జూతువు దంటతనాన
నేరములు నిన్ను నెంచి నిజమాడక మానము
బీర మెక్కు నీకప్పుడు ప్రియసతులొద్దను ॥ తగి ॥

చేయఁగలవెల్లాఁ జేసి చేసూటికి రాకున్న
యీయెడ నన్నుఁ గూడుదు విటువలెనే
ఆయమై శ్రీవేంకటేశ అంతలో నేఁ గైకొందు
పాయపుమదము నీకుఁ బైకొని విడువదు ॥ తగి ॥ 410

పాడి

ఇందాఁకా బుద్ధిచెప్పితి మించుకంతా వినదాయ
ముందర నిన్నుఁ గంటానే మోహించె నిదివో ॥పల్లవి॥

చలము సాదించ వచ్చి సరసమునకుఁ జొచ్చె
అలిగే ననుచుఁ జూచి యాసపడెను
చెలియ నీయెడ కింత చిత్తిణిగుణముదాయ
మలసి నీ వెంత మొకమాయకాఁడవో ॥ఇందాఁ॥

కమ్మటిఁ గొసర వచ్చి కన్నులనే నిన్ను నవ్వె
పమ్మి వాడడిచేనని పంత మిచ్చెను
కొమ్మ నీయడకు నింత కోరి మొకదాకిలాయ
నెమ్మది నీవల్ల నిఁక నేరు పేమిగలదో ॥ఇందాఁ॥

కరఁగించేనని వచ్చి కాఁగిటనే నీకుఁ జొక్కె
వోరయఁ జూచి తానె వొక్కటాయను
తరుణి నీయడ కింత తగులమి గలదాయ
యిరవై శ్రీవేంకటేశ యెటువంటిమహిమో ॥ఇందాఁ॥ 411

శంకరాభరణం

ఇంచుకైన నయ మియ్యవు
యెంచఁగఁ బతి నిను నేమనునే ॥పల్లవి॥

పంతముమీఁదటిపలుకులే కడకును
వంతులతోడివే వాసులు
కాంతరో నీ విటు నెరపఁగా
యింతటిపతి యిఁక నేమనునే ॥ఇంచు॥

చెక్కులమీఁదివె చేతులు గడకును
ముక్కుమీఁదిదే మొనవేలు
గుక్కక నీ విటు గుట్టున నుండఁగ
యిక్కడ నితఁ డిక నేమనునే ॥ ఇంచు ॥

శిరసువంపులే సిగ్గులు గడకును
సరుసఁ గూటములు సమరతులు
పరగ శ్రీవేంకటపతి నిటు గూడితి-
విరవాయ నితఁడు యేమనునే ॥ ఇంచు ॥ 412

సింధురామక్రియ

గుట్టుతోడ నుండఁగానే గుణముగాక
నెట్టుకొనఁబోతేను నీకుఁ జవులౌనా ॥ పల్లవి ॥

బలిమి నీతోఁ బెనఁగఁ బంతమా నాకింత
చెలఁగి నీచెప్పినట్టే సేసేఁగాక
వలపు దెలిపి నిన్ను వంచుకొనఁ జూచితేను
పలచనే కాని మరి పట్టుఁబస వున్నదా ॥ గుట్టు ॥

సారెకు తప్పు లెంచఁగ చలమా నిన్నింత
వోరుచుక యెట్టయినా నుండేఁగాక
వూరకే వావులు చెప్పి వొడివట్టి తియ్యఁబోతే
దారదప్పి వుండుఁగాక తగులఁ జోటున్నదా ॥ గుట్టు ॥

కైకొనగఁ దమకించఁ గడమా నేఁ డింత
నీకొలఁది మెలఁగేటినేరుపుగాక
యేకమైతివి శ్రీవేంకటేశుఁడ నాతో నీవు
వాకున మెచ్చుటే కాక వాసులు చూపేనా ॥ గుట్టు ॥ 413

ము:ఖారి

కైకొనననంటా నన్నుఁ గడుదూరేవు
నీకు లేనిబత్తి నేఁడు నేఁ దెచ్చేనా ॥ పల్లవి ॥

వాడిక మాయింటికే వచ్చితేనే కందుఁగాక
వేడుకకాఁడవు నిన్ను నెదకేదెట్టు
ఆడుకోలుమాటలు నీ వాడితే నాడుదుఁగాక
పాడితోదొరవు నిన్ను బలిమిసేసేనా ॥ కైకొ ॥

చేయివట్టి పెనఁగితే చెప్పినట్టు సేతుఁగాక
చాయకాఁడవు నీతోను సారెఁ బోరేనా
కాయము నీవంటితేను కాఁగిలించుకొందుఁ గాక
వేయిపనులవాఁడవు వేసరించేనా ॥ కైకొ ॥

గక్కున నవ్వితే నీతోఁ గమ్మటి నవ్వుదుఁ గాక
యెక్కడో పరాకుల నిన్నెత్తువెట్టేనా
యిక్కువతో శ్రీవేంకటేశ నన్నుఁ గూడితివి
మిక్కిలిమేలువాఁడవు మెచ్చకుండేనా ॥ కైకొ ॥ 414

రేకు – 771. వసంతవరాళి

పూవక పూచెఁ గొన్ని పొదలి కావక కాచె
రావలసినప్పుడు తా రమ్మనవే ॥ పల్లవి ॥

మనసురానివారు మాటలు చెప్పఁగఁబోతే
వినఁ జవిగా వవి విడుమనవే
చనవులేనివారు సలిగెలఁ బొరలితే
యెనసీనా వట్టిపొందు లిఁక నేఁటికే ॥ పూవ ॥

పొంతనాలు లేనివారు పొంచి యెంత వద్దనున్నా
వింతతో నెరవేరవే విడుమనవే
చెంత పొందువోనివారు జిగి నెంత పిలిచినా
సంతమౌనా యిఁక వట్టి సట లేఁటికే ॥ పూవ ॥

ఆసలుచాలనివారు అంగము లెంత ముట్టినా
వేసటలై తోఁచు నవి విడుమనవే
యీసుదీర శ్రీవేంకటేశుఁ డిదె నన్నుఁ గూడె
నేసపాలనాఁటిమాఁట చెల్లు (ల్లె?) ననవే ॥ పూవ ॥ 415

శంకరాభరణం

మంకుఁదనంబులు మానఁగదే
సంకె దీరె నీకఁ జలమేలే ॥ పల్లవి ॥

కంటక మాడక కాఁకలు చల్లక
నంటునఁ బతితో నవ్వఁగదే
జంటనుం డాతఁడు చనవులు నెరపఁగ
దంటతనంబులు తగునటవే ॥ మంకు ॥

మనసులు చూడక మచ్చరించ కిటు
ననుపునఁ గవకవ నవ్వఁగదే
యెనయుచుఁ బాయక యెదుటనె వున్నాఁడు
చెనకుల కసరులు చెల్లునటే ॥ మంకు ॥

కుటిలము చూపక గుట్టున నుండక
నటనల నెలవుల నవ్వఁ గదే
యిటునటు శ్రీవేంకటేశుఁడు గూడెను
అటమటములు మఱి యమరునటే ॥ మంకు ॥ 416

ముఖారి

ఎప్పటివలెనేయంటా నిటు నే వచ్చితిఁ గాక
ముప్పిరి నీ విన్నాణ మున్నెఱుఁగుదునా ॥ పల్లవి ॥

వొకమాట నేనంటే వేరొకమాట లాడేవు
యొకసక్కెలింతేకాత యెఱుఁగ నేను
మొకము నేఁ జూచితేను మోవుల నీవు నవ్వేవు
వికటాలు నేరిచినవిధ మెఱుఁగుదునా ॥ ఎప్ప ॥

దవ్వులఁ బిలిచితేను దగ్గర నిలుచుండేవు
యివ్వల నీయాగడాలు యెఱుఁగ నేను
పవ్వళించు మంటేను పాటలెల్లాఁ బాడేవు
రవ్వలింత నేసే విచారము లెఱుఁగుదునా ॥ ఎప్ప ॥

గక్కన నే లేచితేను కాఁగిట నించేవు నీవు
యెక్కువ నీతరితీపు లెఱుఁగ నేను
నెక్కొని శ్రీవేంకటేశ నీవె నన్నుఁ గూడితివి
నిక్కపునీజాడలాత నేనే యెఱుఁగుదును ॥ ఎప్ప ॥ 417

సాళంగనాట

అన్నియు మీలోనమరు నిఁక
యిన్నియు మీరే యెఱుఁగుదు రిఁకనూ ॥ పల్లవి ॥

కగ్గక మీలోఁ గలిగిన మాఁటకు
యెగ్గుపట్ట మరి యిఁకనేలా
సిగ్గుతోడఁ దనశిరసు వంచితే
వెగ్గళించి అనవెరతుము గానీ ॥ అన్ని ॥

యెప్పటివలెనే యెరిఁగినపనులకు
తప్పు లెంచ మరి తగ దిఁకనూ
ముప్పిరి నేఁయుచు మోనాన నుండితే
యిప్పు డింపులకు నెఱఁగము గానీ ॥ అన్ని ॥

అలవాటై మీ రాడుసరసముల
తొలుత నెచ్చుకుందులు లేవు
యెలమిని శ్రీవేంకటేశ కూడితివి
అలివేణిని నిన్నాడము గానీ ॥ అని ॥ 418

లలిత

[1]సుముఖ మంగళము శుభమంగళము
శమదమగత తే జయమంగళం ॥ పల్లవి ॥

గంభీరగుణ కమలారమణా
శంభురాణి నుత సకళ (ల?) లోకయుత
మాం భజ- తే జయమంగళం
అంభోధిశయన హరినయనా ॥ సుము ॥

కనకాంబర నిజఘనచరణాంబర
దనుజశరణ హతదైత్యగణా
అనుపమచరిత అనంత నిగత
సనకప్రియ తే జయమంగళం ॥ సుము ॥

చతుర్భుజాంగా స్స (స?)దయా పాంగ
గతనక్రాంబుజకర చక్ర
శ్రితశరణాగత శ్రీవేంకటపతి
చతుర నమో తే జయమంగళం ॥ సుము ॥ 419

1. ఇందలి సంస్కృతము కొంత వింతగొల్పును. ఇది అధ్యాత్మకీర్తనలలో నుండఁదగును.

తెలుఁగుఁగాంబోది

ఎట్టు నిద్దిరించెనో యీ రేతి రెల్లాను
పట్టి చుట్టుక పయ్యెద పడఁదీసీ క్రిష్ణుఁడూ ॥పల్లవి॥

కడువేఁకువను లేచి కన్నులు పులుముకొంటా
కడు పక్కలించి యాఁకలయ్యీనని
కుడు కొ(పొ?)కచేఁ బట్టి నా కొం గొకచేతఁ బట్టి
అడిగీ నన్నము కృష్ణుఁ డప్పుడే చూడరే ॥ఎట్టు॥

పెరుగు దరువ నన్నుఁ దిరిగి రాఁ జుట్టి చుట్టి
కురుచమాటల ముద్దుగునియుచును
తిరిగి కవ్వపుఁగోల దిక్కుఁ గాఁగిలించి పట్టి
తరివెన్న వెట్టుమనీ తగునే యీకృష్ణుఁడు ॥ఎట్టు॥

తనకుఁ బెట్టినది యాతలి పడుచుల కిచ్చి
కినిసి ముచ్చిలి యారగేంచీఁ దాను
అనయము (శ్రీ) వేంగటాది కృష్ణుఁడు వేఁడు
తనిసి తనయెంగిలి తగ నాకు నిచ్చెనే ॥ఎట్టు॥ 420

రేకు—772 ముఖారి

అందరు విన్నా విననీ యాడేఁ గాని
సందండిపు మేకులకుఁ జాలఁబో నేనూ ॥పల్లవి॥

సేయరా నీపనులెల్లాఁ జేసేఁ గాని
వోయయ్య నీవినయాల కోపఁబో నేను
పాయరాని రాజసానం బడేఁ గాని
వేయైనా నీయానలు వినలేఁబో నేను ॥అంద॥

నగవు రాకుండినా నవ్వేఁ గాని
వొగరుమోహాలు చల్లనోపఁబో నేను
మొగమోటఁ గొండెత్తినా మోచేఁ గాని
తెగువతో నీగుణాలు దిద్దలేఁబో నేను ॥ అంద ॥

వొదిగి పానుపుమీఁద నుండేఁ గాని
చెదర నిన్నింత పచ్చి సేయలేఁబో నేను
పొదిగి శ్రీవేంకటేశ భోగించితి నన్ను
వెదకి నీ వెందుండినా విడువలేఁబో నేను ॥ అంద ॥ 421

కేదారగౌళ

అందువంక నేమి గద్దో అదియుఁ జూచేనంటా
సందడి నడియాసలఁ జాలాఁ బొరలేవు ॥ పల్లవి ॥

సరసములాడేయాపె సంగడినే వుండఁగాను
పొరుగాపెతో నేల పొందు సేసేవు
సరవితో నీవాళ్లిజాణతన మెట్టిదో
నిరతి వెన్న వట్టుక నేయి వెదకేవు ॥ అందు ॥

కానుకిచ్చేయాపెచేతి కమ్మపూవుబంతి దీసి
పూని కొలువు సేసేయాపెఁ బొంచి వేసేవు
నీనటనయైనట్టినేరు పెటువంటిదో
చే నద్దము వట్టి పీటఁ జేరి నీడఁ జూచేవు ॥ అందు ॥

నీవురముమీఁదనే నెలఁత వుండఁగాను
కావరించి వేరొకతెఁ గాఁగిలించేవు
శ్రీవేంకటేశ నీచేఁత లెటువంటివో
కైవశమై యేకుండఁగాఁ గాలువఁ బొగడేవు ॥ అందు ॥ 422

### మధ్యమావతి

ఆపె నీకట్టపుదేవు లాపెపై బత్తి గలవు
యేపున మీయిద్దరికి నింపులే యౌను ॥పల్లవి॥

వెనుకొని పతితోను వెంగేలు సతులాడి రాఁ
జనవు గలిగితేను సంతోస మౌను
పెనఁగి వేఁడుకొనఁగాఁ బ్రియునితో బిగిసినా
మనసు లెనసితేను మంచిదే యౌను ॥ఆపె॥

పొట్టఁబొరుగువారలు బొమ్మల జంకించి రాను
చుట్టరికాలు గలితే నొంపులే యౌను
వట్టిసణఁగులతో వాసిపంతాలు చూపినా
నెట్టుకొన్న వావియైతే నెయ్యములే యౌను ॥ఆపె॥

కొలువున నున్నవారు గుంపించి నవ్వినాను
చెలిమి గలిగితే మచ్చిక యౌను
యెలమి శ్రీవేంకటేశ యింతెలమేల్మంగ యాకె
కలసితి రిద్దరును కడువేడు కౌను ॥ఆపె॥ 423

### దేశి

ఎంతవడి మేలములు యింతితోడఁ జూపేవు
చెంతనే కాఁగిట నిట్టె చేకొనవయ్యా ॥పల్లవి॥

పెనఁగి పెనఁగి నీకు ప్రియములు చెప్పఁగాను
విని యియ్యకొనవయ్యా వెలఁదిమాఁట
తనివోవ కప్పటిని తప్పక చూచీ నిన్ను
నినుపుగా ముందరను నిలుచుండవయ్యా ॥ఎంత॥

చెలరేఁగి నవ్వినవ్వి చెక్కునొక్కి వేఁడుకోఁగా
అలమి కాఁగిట నించవయ్యా నీవును
వలగొని నీకు మొక్కి వలపులు చల్లీని
లలి నీ వన్నిటా నేఁడు లాలించవయ్యా ॥ ఎంత ॥

మెచ్చిమెచ్చి నీగుణాలు మిక్కిలినిఁ బొగడఁగ
కొచ్చి యలమేలుమంగఁ గూడితివయ్యా
యిచ్చట శ్రీవేంకటేశ యీకె నిన్నుఁ గొసరీని
పచ్చిదేరి (ర?) వేడుకలు భావించవయ్యా ॥ ఎంత ॥ 424

## సౌరాష్ట్రం

ఏమి చెప్పేరే బుద్ధు లెంచాఁకఁ జెలులాల
దోమటి కింతే కలితే తోడితేరే పతిని ॥ పల్లవి ॥

నెలకొని పారేపాము నిలుపఁగవచ్చుఁగాక
వల పెంచైనా నిలుపఁగ వచ్చునటవె
అలరి సూర్యునిఁ జేత నణఁచఁగ వచ్చుఁగాక
నలువంక విరహా మణఁచ వచ్చునటవె ॥ ఏమి ॥

కడలేనియేరైనాఁ గట్టివేయవచ్చుఁగాక
వడి నాస మూట గట్టవచ్చునటవె
సుడివడఁ బౌజు లచ్చుగ నాఁపవచ్చుఁగాక
అడరినతమకము లాఁపవచ్చునటవె ॥ ఏమి ॥

అలసముద్రము దాఁటనైనాను వచ్చుఁగాక
వలరాజునాజ్ఞ దాఁటవచ్చునటవె
యెలమి శ్రీవేంకటేశుఁ డే నలమేలుమంగను
కలశ (సె?) నితనిఁ బాయఁగా వచ్చునటవె ॥ ఏమి ॥ 425

పాడి

ఎంతని పొగడవచ్చు నిద్దరి మీభావములు
సంతోసాలు పలుమారు జడిసీ మాకు ॥ పల్లవి ॥

కలికితనము నీపై కాంత వెదచల్లఁగాను
సేవుల చిరునవ్వు చిందీ నీకు
బలిమిఁ జన్నులమీఁది పయ్య దాపె జారించఁగా
మెలుపుఁగోరికలెల్లా మించీ నీకు ॥ ఎంత ॥

సరసపుసన్నలు సతి నీకుఁ జేయఁగాను
గరుపారీఁ జెక్కులఁ గమ్మటి నీకు
తిరమై యాకెమోవిఁ దేనెలు గారఁగాను
సురతపుఁగాంతులు చుట్టుకొనీ నీకు ॥ ఎంత ॥

కన్నులచూపువెన్నెల కాంత నీపైఁ బోయఁగాను
చిన్నిచెమటలు మేనఁ జెలఁగీ నీకు
యిన్నిటా శ్రీవేంకటేశ యీకె నిన్నుఁగూడఁ గాను
వున్నతి జవ్వనమద ముబ్బీ నీకు ॥ ఎంత ॥ 426

రేకు-773 శ్రీరాగం

ఈతనికి నీకె దగు నీతఁడే యీకెకుఁ దగు
ఘాతలవి రండే తారుకాణ గానవచ్చెనే ॥ పల్లవి ॥

సమ్మతిఁ జేసినపొందు సంతోసమె యౌఁ గాక
నెమ్మది నందులో మరి నెర సేడదే
పమ్మినసరసములు భావమునఁ బట్టుఁ గా
యిమ్ముల నెంతైనాను యెర వేఁటి కానె ॥ ఈత ॥

ప్రేమతోఁ జూచినచూపు పెనగొని నాఁటుఁగాక
యేమైనా నందు వేసటేల కల్గునే
అను (ము?)కొన్న కూటములు యానందమే రేఁచుఁగాక
గామిడితనాల నలుగఁగ నేల యిచ్చునే ॥ ఈత ॥

యీడుజోడై నమనసు లేకములే సేసుఁగాక
ఆడనీడా నేల పాయఁగ నిచ్చునే
వేడుకతోడుత శ్రీవేంకటేశుఁ డీకెఁగూడె
వీడుదోడై యుండుఁగాక వింతలేల సేసునే ॥ ఈత ॥ 427

## పాడి

చెలులాల యీమేలు చెలువుఁడే చూచుఁగాని
యెలమితోడుత మొక్కి యెరిఁగించరే ॥ పల్లవి ॥

వనితజవ్వనపువసంతకాలములోనే
వెనుకొని విరహపువేసవి మించె
ననిచెఁ బెంజెమట వానకాలము నంతలోనె
వినయముతోఁ బతికి విన్నవించరే ॥ చెలు ॥

కాంతపులకల శరత్కాలము నదె తోఁచె
చింతలమంచులతో హేమంతము ముంచె
చెంతఁ గోర్కు లెన్నులెత్తి శిశిరవేళ యేతెంచె
యింతకు నీకెవిభుని నీడకుఁ దోడితేరె ॥ చెలు ॥

చెలియకుఁ గొప్పు వీడె చీఁకటికాలము నందె
నెలకొనె సిగ్గుల వెన్నెలకాలము
అలమె శ్రీవేంకటేశుఁ డంతలోనె తానె వచ్చి
పిలిచి సారెకు నిట్టె ప్రేమరేఁచరే ॥ చెలు ॥ 428

మంగళకౌశిక

సకియకు నీకును సరి పంతంబులు
ప్రకటం బాయ ప్రంవ్లో (ప్రవ్లో?) దవరద ॥ పల్లవి ॥

చిక్కనిచెమటల జీరులు వారఁగ
వుక్కుగుబ్బలను వొత్తీఁ జెలి
నిక్కి నీవురము నెలకొని వోర్చెను
చక్కని పెనువజ్రము గాఁబోలును ॥ సకి ॥

కనుఁగవతళుకులు గడువాఁడి మిగుల
కొనచూపులనే కొచ్చీఁ జెలి
గొనకొని నీమేను గురియై నిలిచెను
అనిశము పసిఁడిలోహము గాఁబోలు ॥ సకి ॥

తేనెలపెదవులతీపు నాముకొన
కానుకరతులనుఁ గప్పీఁ జెలి
ఆనుక శ్రీవేంకటాధిప నీగుండె
కోనల సంజీవికొండ గాఁబోలు ॥ సకి ॥ 429

కాంబోది

చూడరమ్మ చెలులాల సొబగు లిద్దరివిని
వీడనిమనోరథాలు మేడలై పెరిగె ॥ పల్లవి ॥

యెదురుగొండల నెక్కి యిందిరా నౌథశేకుఁడు
మదనతంత్రములైన మాఁటలాడేరు
పెదవితేనెరసాలు వింపిళ్లు గురియఁగా
యిదివో భవవాశి యేరు వారె నడుమ ॥ చూడ ॥

నిలువుగద్దెమీఁద నెలకొని పందేలతో
సొలపులచెనకుల జూజా లాడేరు
వెలయ సారెలుగాను వినోదాలు నడవఁగా
బలుభవనాళి నెత్తవలకాయ నడుమ ॥ చూడ ॥

యీరీతి శ్రీవేంకటాద్రి నిందు నందు నిద్దరూను
సారెకుఁ గూడుచు సరసము లాడేరు
తారుకాణ చూపుల తలఁబాలు వోయఁ గాను
తేరకొని భవనాళి తెరయాయ నడుమా ॥ చూడ ॥ 430

దేసాళం

వేడుక లెట్టివో మీకు విన వేడుకయ్యీ మాకు
ఆడిక కోడవు మాతో నానతియ్యవయ్యా ॥ పల్లవి ॥

చెంపలతురుముతోడ సెలవినవ్వులతోడ
యింపులు చల్లీ నీపై నెవ్వతెయ్యా
దింపరానియాసతోడ తీరనిముచ్చటతోడ-
నంపలేక మాటలాడే వాపె నీ వయ్యా ॥ వేడు ॥

పుక్కిటివిడెముతోడ పొలపుసిగ్గులతోడ
యిక్కువఁ గాచుకున్నది యెవ్వతెయ్యా
లక్కవంటిమనసుతో లలి నిట్టచూపుతోడ-
నక్కరలెల్లాఁ జల్లే వౌనయ్య నీవూ ॥ వేడు ॥

వాడిక మొక్కులతోడ వావులపొందులతోడ
యీడుజోడై పెనఁగీ నెవ్వతెయ్యా
కూడితి వింతలో నీవు గొబ్బున శ్రీవేంకటేశ
యీడ నన్ను నేలితివి యిదియు నౌనయ్యా ॥ వేడు ॥ 431

## దేవక్రియ

ఒక్కతొకతె నెరఁగకుండా నందె దాఁగిరి
మొక్కలానదాఁగిలి ముంత(మూఁత?)లాయ రతులు ॥పల్లవి॥

యిక్కువ జీఁకటింటిలో యిరవై నీవుండఁగాను
గక్కన మొక్కితే వచ్చి కాఁగిటఁ గూడె
అక్కరతో వేరొక్కతె అది యెరఁగక నీ-
వొక్కడ వున్నాఁడవంటా నొనరఁ దాఁ గూడెను ॥ఒక్క॥

పని సేసి వేరొకతె పానుపుపైఁ బండ వచ్చి
నినుఁ గని సంతోసాన నెప్పునఁ గూడె
తనర వేరొక్కగొల్లెత పాలు దాఁచఁగ వచ్చి
వొనర నీకాలు దొక్కి వొగి మెచ్చి కూడెను ॥ఒక్క॥

భూపతిచెరువుకాడఁ బొంచి శ్రీవేంకటేశ్వర
యేపున నిన్నుఁ గూడినయింతులెల్లాను
లోపలనుండి గవాతులు దెరచితమమోము-
లాపొద్దె చూచుకొని యందరును నవ్విరి ॥ఒక్క॥432

రేకు-774 మేఘరంజి

ఓయమ్మ చూడఁగదరె వుద్దగిరికృష్ణుఁడు
సేయుచేఁత లెల్లాను చెప్ప సిగ్గయ్యీనే ॥పల్లవి॥

చూడ బాలుఁడుగాని సుదతులగాఁగిళ్లఁ
గూడేవేళ పాయపుకొమారుఁడే
దూడలఁ గాచేవేళ వాడగొల్లఁడై యుండుఁగాని
యేడఁ బక్కఁ బెట్టుకొంటే యింటిమగఁడౌనే ॥ఓయ॥

చీటికిమాటికి చిన్నిచేఁతలెల్లాఁ జేసుఁగాని
పాటించి ముద్దాడఁబోతే పచ్చిసేఁతలే
చాటిచాటి నేరిపిన చక్కమాటాడఁడు, లోన
మాటలాడించి చూచితే మదనతంత్రాలే ॥ ఓయ ॥

పట్టి చెక్కులు మీఁటితేఁ బాలు దాగీఁ(గారీ?)గాని
వెట్టిమోపితేనెలకు వేడుకకాఁడే
మట్టులేనిమహిమల మానిసై వున్నాఁడుగాని
దిట్ట శ్రీవేంకటాద్రిపై దేవరై వున్నాఁడే ॥ ఓయ ॥ 433

కురంజి

మరఁగుల మాటలేల మాపుదాఁకాను
అరిమురివేడుకతో నానతి యిమ్మనవే ॥ పల్లవి ॥

చిత్తము వచ్చితేఁజాలుఁ జేసే నేపనియైనా
యిత్తల నాతో నాన తిమ్మనవే
బత్తి సేసేదాన నింతే పైపైఁ దనకేల కొంక
హత్తించే నెవ్వతెనైనా నానతి యిమ్మనవే ॥ మరఁ ॥

పంత మీడేరితేఁజాలు భామల నొడఁబరచే-
నింతయు నాతో నాన తిమ్మనవే
వింతదాననా నేను విచారము మరియాల
అంతరంగమైనపొందు లానతి యిమ్మనవే ॥ మరఁ ॥

సమ్మతియైతేఁజాలు చాయలోనే మెలఁగేను
ఇమ్ముల నింపే న దానతిమ్మనవే
వుమ్మడి శ్రీవేంకటేశుఁ డొనరెఁ దా నాకాఁగిట
అమ్మలాల తనసుద్దు లానతి యిమ్మనవే (రే?) ॥ మరఁ ॥ 434

చాయ

ఇటమీఁద నీచిత్త మింతేకాక
చిటుకున నంతవిచ్చి చెప్పనేల యిఁకను ॥ పల్లవి ॥

నీమాట మన్నించె నీమోము దప్పక చూచె
యేమిసేసు జవరాలు యింతకంటెను
ప్రేమమెల్లా నీపైఁ జల్లె పెనఁగక సమ్మతించె
కామినివల్ల మరి కడమేది యిఁకను ॥ ఇట ॥

చేతికిఁ గానుక యిచ్చె సిగ్గుతోడఁ దలవంచె
యీతల నేమిసేసు యింతకంటెను
నీతితో సేవలు సేసె నీకిచ్చకమే నెఱపె
నాతికి బుద్ధులు చెప్ప నాయమేది యిఁకను ॥ ఇట ॥

పాదములు నీకు నొత్తె బాగాలు చేతికిచ్చె
యీదెసఁ బంత మెట్టిచ్చు నింతకంటెను
ఆదుకొని శ్రీవేంకటాధిప నిన్నుఁ బెండ్లాడె
శ్రీదేవి నేరుపులు చెప్పేదేమి యిఁకను ॥ ఇట ॥ 135

బలహంస

ఇంత సేసినవాఁడవు యిన్నిటా నీవే
వింతలు నేఁడు చూపఁగా వెరగయ్యీని ॥ పల్లవి ॥

చాయల సన్నల నీవు సవతికి నాకును
నాయములు చెప్పఁగాను నవ్వు వచ్చీని
ఆయము లంటి యిద్దరి నప్పటి మోములు చూచి
చేయిఁ జేతఁ బెనఁగఁగా సిగ్గు నిండీని ॥ ఇంత ॥

చద్దికి వేఁడికి నీవు సారెకు నాపెకు నాకు
బుద్ధులెల్లఁ జెప్పఁగా నబ్బురమయ్యీని
వొద్దికతో నీకాఁగిట నొకరొకరు నించఁగా
పెద్దగాఁ జుట్టరికము పెడరేఁగీని ॥ ఇంత ॥

సరికి బేసికి నీవు సమ్మతి నొడఁబరచి
వెరవుతోఁ గూడఁగాను వేడుకయ్యీని
అరుదై శ్రీవేంకటేశ యక్కచెల్లెండ్లము మమ్ము-
నిరుమేలఁ బెట్టుకోఁగా నెన్నికయ్యీని ॥ ఇంత ॥ 436

ముఖారి

ఏమయ్య జవరాలి నెంత సేసేవు
గోమునఁ బెరిగినట్టికోమలి గాదా ॥ పల్లవి ॥

చెలికిఁ బయ్యద జారె చెక్కులెల్లాఁ జెమరించె
నలువంక నీ విందేసి నవ్వించఁగాను
వెలయఁ దురిమినట్టివిరులు జల్లనరాలె
నెలకొనఁ గడు నీవు నెత్త మాడించఁగను ॥ ఏమ ॥

కుచ్చల నెరి విరిగె గుదిగొనె నిట్టూర్పులు
ముచ్చటతో నాపెచేత మొక్కించుకోఁగా
కొచ్చి చెవిలో జవ్వాది కొణికెలవెంటఁ గారె
కచ్చు పెట్టి వలపులఁ గరఁగించఁగాను ॥ ఏమ ॥

కెరలెఁ బులకలెల్లా కెమ్మోవి వసివాడె
అరిముఱి నీవు మాటలాడించఁగా
నెరయ శ్రీవేంకటేశ నినుఁ గూడి వెరగందె
మరియు రతులనెల్లా మన్నించఁగాను ॥ ఏమ ॥ 437

హిజ్జిజి

పీడె మియ్యఁగదవె విభునికిని
జోడుగూడినవలపు సాదించ నేఁటికే ॥ పల్లవి ॥

చెప్పినట్టె సేసితేను చేతికి లోనౌఁ బతి
తప్పక కొలిచితేను దయదలఁచును
చిప్పిలఁగ నాతఁడు యేచెలులతో నవ్వినాను
వుప్పతించరాదు మరి వొడ్డారించరాదు ॥ పీడె ॥

వచ్చినట్టె వచ్చితేను వసమౌను నాయకుఁడు
యిచ్చలోనే మెలఁగితే నింపు వుట్టును
పచ్చిగా వేరొకతెపై పరాకై యాతఁ డుండితే
తచ్చి తచ్చి దూరరాదు తమకించరాదు ॥ పీడె ॥

గారవించి వేఁడుకొంటే కాఁగిలించు రమణుఁడు
సారె సేవలు సేసితేఁ జన విచ్చును
యీరీతి శ్రీవేంకటేశుఁ డిందులకే నిన్నుఁ గూడె
వేరు సాయరా దిఁక వేగిరించరాదు ॥ పీడె ॥ 438

రేకు - 775. ఆందోళి

ఇదె పెండ్లిలగ్నవేళ యింతికి నీకు
సుదతిమోవిచిగుళ్ళు సోబనపత్రికలు ॥ పల్లవి ॥

తొయ్యలి చూచినచూపు తుమ్మెదపేరటాండ్లు
నెయ్యమున నవె నీకు నివాళ్ళు
పయ్యదలో చన్నులు పరగ (ఁ?)బూజగుండలు
ని[1]య్యెడఁ గంత కవె నిమ్మపండ్లు ॥ ఇదె ॥

---

1. ప్రాససిద్ధికై 'నీయెడ' 'నియ్యెడ' గా వ్రాసినట్లున్నది.

చెలియ నవ్వినవవ్వు జిగి నీకుఁ దలఁబాలు
చెలఁగి బువ్వాన కవె చిలుఁపాలు
పలుకుఁసరసాలు బలుమంగళాష్టకాలు
మలసి యవె మదనమంత్రాలు ॥ ఇదె ॥

వనిత కాఁగిలి నీకు వాటపుఁబెండ్లిచవిక
దినము నదె దోమతెరమంచము
వినయపు రతులు శ్రీవేంకటేశ యిద్దరికి
కనుఁగొన నవె మీకు కంకణదారాలు ॥ ఇదె ॥ 439

## భల్లాటి

ఇంక నేలే మొకదాకి రింతకు మిక్కిలి గద్దా
సంకె లేక మోవితేనె చవిచూడు మనవే ॥ పల్లవి ॥

సొలసి చూచినసతి సుద్దులెల్లాఁ జెప్పఁ గాక
తలవంపులసిగ్గులు తన కేఁటికే
కలికితనాలు నేర్చి కడములు వెట్టనేల
బలిమిసేసి యితనిపైఁ జూపుమనవే ॥ ఇంక ॥

విచ్చనవిడై నయాపె వేడుకలు రేఁచుఁ గాక
తచ్చనతలుపుమూఁటు తన కేఁటికే
పచ్చిదేర నవ్వి మరి పదనులు చూడనేల
నిచ్చనిచ్చా నితనిపై నిండించు మనవె ॥ ఇంక ॥

తెర దీసినదంట తెలివితోఁ గూడుఁ గాక
తరితీపుజాగులు తన కేఁటికే
యిరవై శ్రీవేంకటేశుఁ డింతలోనె నన్నుఁ గూడె
తరవాతిపనులెల్లాఁ దాఁ జేయుమనవే ॥ ఇంక ॥ 440

ఆహిరి

ఎంతని చెప్పుదునే యిటువంటినావలపు
మంతు కెక్కించి నన్ను మన్నించు మనవే ॥ పల్లవి ॥

చెనకి నవ్వేపతితో సిగ్గులు వడఁగ రాదు
తనివోనికోరికలు దాఁచా రావు
మొనసి మాటాడించఁగ మోనమున నుండరాదు
మునుపటితమకము మూటగట్ట రాదు ॥ ఎంత ॥

తానె నన్నుఁ జూడఁగాను తల వంచుకొనరాదు
వూనిన నావేడుకల నొద్దన రాదు
పూని కొంగు వట్టఁగాను బొమ్మల జంకించరాదు
తానకపు టాసలచేఁ దప్పించుకొనరాదు ॥ ఎంత ॥

పలుమారు గూడఁగాను భావించి యలయరాదు
తిలకించి రతికిఁ బిరితియ్యరాదు
అలర (శ్రీ)వేంకటేశుఁ డన్నిటా నన్ను నేలె
నెలవుల నవ్వు రాఁగాఁ జేరి ముయ్యరాదు ॥ ఎంత ॥ 441

దేశి

నీ వెరఁగవటె వోనెలఁత యీతగవులు
కైవస మయ్యీ యాతనిఁ గరఁగించవలెను ॥ పల్లవి ॥

పంతములాడఁ దగదు పడఁతికిఁ బతితోను
చెంతనుండి వూడిగమె సేయుట గాని
చింతించ వలదు యేమిసేసినా నాతనివద్ద
సంతోసానఁ జెనకితే సమ్మతించవలెను ॥ నీవె ॥

వేసరుకొనవలదు విభుఁ డెలయించితేను
ఆసరేఁచి యిచ్చకము లాడుట గాని
వాసులు చూపఁగరాదు వనిత నీడువెట్టితే
చేసూటికెల్లా వచ్చి చెలఁగించవలెను ॥ సీవె ॥

సిగ్గున జంకించవద్దు శ్రీవేంకటేశుఁ డేలెను
అగ్గలపురతి నోలలార్చుట గాని
యెగ్గులు వట్టకు మర యెన్నఁడూ నితనితోను
వెగ్గళపువేడుకల వెలయఁగవలెను ॥ సీవె ॥ 442

## కన్నడగౌళ

ఏతపము సేసితివో యిందుకుఁగానె తొల్లి
రాతిరిఁ బగలు నింక రాజ్య మేలవయ్యా ॥ పల్లవి ॥

తేనెలవంటిమాటలు తెరవ నీతో నాడె
పూని తరితీపులై పొసఁగె నీకు
కానుక లిచ్చెఁ జన్నులకనకపుబిందెలు
తానకముగాఁ గాఁగిట దాఁచుకొనవయ్యా ॥ ఏత ॥

కలువలవంటిచూపు కాంత నీపై వెదవెట్టె
మొలచినవలపులు మోసు లెత్తెను
పెలుచుఁబయ్యదనె పెండ్లితెర మాఁటుసేసె
బలిమినవ్వుల తలఁబాలు వోయవయ్యా ॥ ఏత ॥

విందులవంటిరతుల వెలఁది నేస్తము సేసె
కందువచుట్టరికము గలసె నీకు
అందపుశ్రీవేంకటేశ ఆయాలు నిన్ను సోఁకించె
సందడి వేడుకలతో చన వియ్యవయ్యా ॥ ఏత ॥ 443

భంగాళం

అయ్యో నన్నూరకె నీ వాదడిఁ బెట్టేవు గాక
గయ్యాళించి యెన్నఁడైనాఁ గరఁగించితినా ॥ పల్లవి ॥

పెనఁగులాడుతా నీతో బిగిసేదాననా
ననుపుల సరసాల నవ్వితిఁ గాక
కొనచూపులనుఁ జూచి కొసరేటిదాననా
వినయపువేడుకలు వెదచల్లితిఁ గాక ॥ అయ్యో ॥

ఉప్పతించి నిన్ను మారి వోరసేసేదాననా
చెప్పరాని కతలెల్లాఁ జెప్పితిఁగాక
కప్పురాన వేసి నిన్నుఁ గాఁక రేఁచేదాననా
దప్పిదేర మోవి యిచ్చి తనుపుదుఁగాక ॥ అయ్యో ॥

ఆసలు చూపి నిన్ను నలయించేదాననా
సేసవెట్టి నీకోరిక చెల్లింతుఁగాక
వేసరేటిదాననా శ్రీవేంకటేశ కూడితివి
మూసిన ముత్తెమువలె మొక్కుదుఁగాక ॥ అయ్యో ॥ 444

రేకు-776 వరాళి

ఎటువంటి మోహములో యిద్దరికిని
కటకటా మిమ్ముఁ జూచి కరఁగె నామనసు ॥ పల్లవి ॥

చెక్కుమీఁదఁ జేయి వెట్టి సిగ్గులెల్లఁ బెడరేఁచి
మక్కువ నెవ్వతో నీతో మాటలాడెను
ముక్కుమీఁద వేలు మోపి ముసిముసినవ్వు నవ్వి
నిక్కి చూచె నేమిటికో నిన్ను నపుడు ॥ ఎటు ॥

జలజలఁ జెమరించి చక్కనిమోము వంచి
 సొలయుచు పైఁ జల్లె వలపు నీపై
తెలిగన్నుఁ లరమోడ్చి తెగనియాసలు చూపి
 కొలువులో సన్న సేసి కొసరె నిన్నతివ ॥ ఎటు ॥

సేసవెట్టి పెండ్లాడి చెలిమి నీతోఁ జేసి
 పూసెను గంధము నీమైఁ బొసఁగ నాపె
బాసిచ్చి నన్నేలితివి పక్కన శ్రీవేంకటేశ
 యీసుద్దులకె తాను యిచ్చకము సేసెను ॥ ఎటు ॥ 445

## కౌశి

ఏమని చెప్పఁగవచ్చు నిటువంటి నీమోహము
 భామ దలఁచి తలఁచి పైపైనె మెచ్చీని ॥ పల్లవి ॥

చెలియఁ జూచినచూపు చిత్తమురోఁ బెనగొని
 నిలువునఁ దతిగొనె నివ్వెరగులు
పిలిచినపిలుపులు పెదవిపై నాఁటుకొని
 తలకొనీ వలపులతరితీపులు ॥ ఏమ ॥

కాంతతో నవ్వినవ్వు కడు నిన్నుఁ బెనగొనె
 దొంతిపులకలై రేఁగి తోడఁదోడను
మంతనపుసరసాలు మర్మములెల్లా సోఁకి
 సంతోసాలు వుట్టించీ సరుగఁ గోరికలు ॥ ఏమ ॥

భామకుఁ జేసినసన్న పలుమారుఁ దలఁచాలై
 ఆముకొని రాలఁబొచ్చె నంగములను
చేముంచి కూడితి విట్టె శ్రీవేంకటేశ్వర
 వాములై నిలిచె నవె వదలనిరతులు ॥ ఏమ ॥ 446

పళవంజరం

వేడుక చూడవద్దటే వేగిరించే వింతలోనె
కోడెకాఁడై వలపులు గొల్లలాడఁగాను ॥పల్లవి॥

సన్నలేల సేసేవే సణఁగేల జాలిచేవే
మిన్నక కొలువులోన నున్నవానిపై
చన్నులనేల వూఁదేవే సారెనేల జంకించేవే
వున్నతి రాజసముతో నూరకుండఁగాను ॥వేడు॥

చేతు లేల చాఁచేవే చెరఁగేల పట్టేవే
తోతో కొండవంటిదొర యీతఁడు
నీతు లేల చదివేవే నేరమేల యెంచేవే
నాతులతో బాఁతిపడి నవ్వు నవ్వఁగాను ॥వేడు॥

సిగ్గులేల నెరపేవే శిరసేల వంచేవే
యెగ్గులేక కాఁగిట నే నెనయఁగాను
అగ్గమై శ్రీవేంకటేశుఁ డంతలోనె నిన్నుఁ గూడె
వొగ్గినరతుల నీతో నోలలాడఁగాను ॥వేడు॥ 447

నాట

నీ వెట్టుమగవాఁడవు నీ వేమిసేసినాఁ జెల్లు
నావంటివారు చూచి నన్ను నాడుకొనరా ॥పల్లవి॥

పాలుపడి గుట్టుతో నీపాదాలు విసుకఁగాను
గేలితోఁ బయ్యదకొంగు కేలఁ దీసేవు
మూలనున్నసిగ్గులివి ముంగిట వేయఁగాను
సోలినున్నసవతులు చులుకఁగా జూడరా ॥నీవె॥

పొసఁగ నీతురుమునఁ బూవులు నే ముడువఁగ
కసుగాటుగా మోవి గంటిసేసేవు
కొసరి వలపు లింత కూరాకు సేయఁగాను
దెసలఁ బెండ్లాడినదేవుళ్లెల్ల నగరా ॥ నీవె ॥

అక్కరతో బాగా లిచ్చి ఆకుమడి చియ్యఁగాను
గక్కనఁ జెక్కులు నొక్కి కాఁగిలించేవు
తక్కక శ్రీవేంకటేశ తమి యింత రేఁచఁగాను
మొక్కుమని సతులు మోములు చూచుకొనరా ॥ నీవె ॥ 448

మాళవశ్రీ

ఊరకుండఁగా నుపమలు చెప్పి
తారుకాణలకుఁ దడవితినా ॥ పల్లవి ॥

చెదరినయలకలు చెంపల నవిగో
తుదకన్నుల నిద్దుర దేరీ
వుదుటునఁ దానేల వొడఁబరచీ నను
అదనసుద్దులు దను నడిగితినా ॥ ఊర ॥

తొటతొట మేననుఁ దొరఁగెఁ జెమటలు
చిటిలీ గందము జిగి మేన
తటుకున నానలు తానేల పెట్టీసి
నటనలనేఁ దను నమ్మనంటినా ॥ ఊర ॥

మోవిపైఁ గెంపులు మునగస లాడీ
కావిరి మోమునఁ గళ దేరీ
శ్రీవేంకటేశుఁడు చేకొని నన్నేల
సోవలఁ దను నే సొలసితినా ॥ ఊర ॥ 449

హిందోళం

సంతోసమాయ మీసరితలు చూచి మాకు
యెంతకెంత మీవేడుక లేమి చెప్పేమయ్యా ॥ పల్లవి ॥

కన్నులనే సన్న సేసి కలువలఁ గొని వేసీ
కన్నెవలపులు నీకు గాదెఁ బోసీని
చన్నుల నీమేను రాసి సారెకు గందము వూసీ
యెన్నటిపొందులో కాని యేమి చెప్పేమయ్యా ॥ సంతో ॥

సొలపులనె చొక్కి చూచీనదె నిక్కినిక్కి
కలికి నీతో నవ్వీఁ గడుసొంపెక్కి
చెలరేఁగి నీకు మొక్కి చేతులఁ జెక్కులు నొక్కి
యెలమి మీసరసము లేమి చెప్పేమయ్యా ॥ సంతో ॥

పరగఁ గాఁగిటఁ బట్టి పరవశములఁ దొట్టి
తరుణి నీపాదము పాదాన మెట్టీని
యిరవై శ్రీవేంకటేశ యిట్టె నన్ను నేలితివి
యెరవుల మీలోచేఁత లేమి చెప్పేమయ్యా ॥ సంతో ॥ 450

రేకు-777 భైరవి

కాదు గూడ దనఁబోతే కాయౌనా పండు
పాదుకొని యలవాటై పరగె మామనసు ॥ పల్లవి ॥

ముచ్చట లాపె నీతో మునుకొని యాడఁగాను
నచ్చుకొట్టి కొంతగొంత నవ్వవా నీవు
పచ్చిదేరె మీవలపు బయటఁబడెఁ జేఁతలు
యిచ్చట నీవు మాతో నిఁకనేల దాఁచను ॥ కాదు ॥

చనవున నీ కప్పుడు సన్న లాపె సేయఁగాను
వొనరఁగ సమ్మతించి వుండవా నీవు
కనుపట్టె మీజాడలు కతలు వాపాట మాయ
తనిసితి విన్నిటాను తలపోఁత లేఁటికి ॥ కాదు ॥

చెలరేఁగి యాపె నీకు చేతులెత్తి మొక్కఁగాను
వెలినుండి యట్టె దీవించవా నీవు
యెలమి శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
కలసె వావులెల్లాను కందువాయ రతులు ॥ కాదు ॥ 451

వరాళి

నిన్నఁ గుప్ప నేఁ డాళ్లు నీచేఁతలు
యెన్నుకొంటె నాకంటె యెక్కుడా నీవు ॥ పల్లవి ॥

వేడుకతో సొలసేవు విభునితో (తోఁ?) బులిసేవు
యేడ నేరుచుకొంటివే యింతేసి నీవు
వాడికలు నెరపేవు వడిఁ బొందు జరపేవు
చూడఁ గొత్తలాయనే నీసొంపులనటనలు ॥ నిన్న ॥

కప్పురాన వేసేవు కందువకుఁ దీసేవు
చెప్పరానిదే నీయెమ్మెలు చెల్లఁబో నేఁడు
కొప్పు చక్కఁదురిమేవు కొనగోర మెరమేవు
అప్పుడే యింతటిదాన వైతివటే నీవు ॥ నిన్న ॥

చలములు సాదించేవు సన్నల బోదించేవు
తెలుసుకొంటిమే నీతెరఁగులెల్లా
యెలమి శ్రీవేంకటేశుఁడింతలోనె నన్నుఁ గూడె
తొలుతటినాతో నీవు తులఁదూఁగఁ గలవా ॥ నిన్న ॥ 452

ఆహిరి

ఇన్నాళ్లు నెరఁగము యిటువంటిమచ్చికలు
సన్న నేసి మరిఁగొంత చవులు వుట్టించెనో ॥ పల్లవి ॥

చెలరేఁగి యాపె నీకుఁ జెప్పెనో బుద్ధులెల్లా
మలసి యిప్పుడు నాతో మాఁటలాడేవు
తలపోసి నామీఁద దయ నీకుఁ బుట్టించెనో
వలచి కాచుకొని నావద్ద నుండుమనుచు ॥ ఇన్నా ॥

నెమ్మది నేకతమున నీకు నిట్టె నేరిపెనో
చిమ్ముచుఁ గాఁగిట నన్నుఁ జెనకు మని
నమ్మికగఁ దనపై నానలు వెట్టించుకొనెనో
సమ్మతించి నాతో సరసములాడు మనుచు ॥ ఇన్నా ॥

సారె సారెఁ దా నీకు సాగిలి మొక్కు మొక్కెనో
కూరిమి నన్నుఁ గాఁగిటఁ గూడు మనుచు
యీరీతి శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
తారుకాణించ వచ్చెనో తానే నే ననుచు ॥ ఇన్నా ॥453

శంకరాభరణం

చిత్తములో తలపోఁత చెప్పితే బయలీఁత
బత్తితోఁ బతికి విన్నపము సేయరే ॥ పల్లవి ॥

తలపుఁ నిలుపరాదు తనివి యేమిట లేదు
వలచినవలపులు వసము గాదు
కలువబాణాలు బెట్టు కడునైతి నింతరట్టు
పిలువరే చెలులాల ప్రియుని నీకడలను ॥ చిత్త ॥

ఆసలు లోలో నిండె అదివో రాయాయ గుండె
రాసికెక్క మోవిపండు రాఁపులఁ బండె
వేసరపుచూపులు వీడవు తరితీపులు
యీసుద్దులెల్లా మీతో నేమని చెప్పుదునే ॥చిత్త॥

సిగ్గులును వెడ జారె చేఁతలును తుదమీరె
వెగ్గళపువినుకలి వేడుక చేరె
అగ్గమై శ్రీవేంకటేశుఁ డన్నిటాను నన్ను నేలె
యెగ్గులుఁ దప్పులు లేవు యిందరికి ననరే ॥చిత్త॥ 454

### పాడి

ఇంద రెరిఁగిపని కిఁక నేలయ్యా
పొందులు మీలో మీకుఁ బొసఁగెనయ్యా ॥పల్లవి॥

మాటలనే మందు నూరి మగువ నీపై వలపు
నాటుకొలిపెను యేమి నవ్వేవయ్యా
చేటఁ డేసి పచ్చిదేరే సిగ్గులు నీపైఁ జల్లె
వాటముగా శిరసేల వంచేవయ్యా ॥ఇంద॥

సన్నలనే చలివాపి సరికి బేసికి నీపై
చన్నులు మోపె నాపె చన వీవయ్యా
కన్నులఁ దప్పక చూచె కరఁగించె నీమనసు
యెన్న రానితమకము లేల దాఁచేవయ్యా ॥ఇంద॥

కప్పురము మోవి నిచ్చి కాఁగిటిరతులఁ గూడె
చిప్పిలుఁ జెమట గోరఁ జిమ్మేవయ్యా
యిప్పుడే శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
దప్పిదేర నెన్నెసికతలు చెప్పేవయ్యా ॥ఇంద॥ 455

నాదరామక్రియ

మాటి చూడు[1] బోడెద్దెడు మగపోడిమా నేఁడు
 ఆలసితే వలపులు సంతలో సమ్మిని ॥ పల్లవి ॥

మొలక వెన్నెలలు మోసులెత్తె నేఁటికే
 కలికివి యీయాకసము చెప్పవే
 కలువబాణాలు గురి గాఁడిపారీ నేఁటికే
 తలపోసి చూచితేను కారుకాణ లౌను ॥ మటి ॥

మాఁటలాడితేను మెరిచీ మాణికా లివేదవే
 నీఁటునఁ దెలియ నారునెల్లగళు(డు?)వే
 పేటలై నపగడాలలోఁ బెరతేనె లున్న వే
 వాఁటముగాఁ జవిగొనేవారివారిభాగ్యము ॥ మటి ॥

మెఱుఁగును మేఘమును మేళవించీ నిదేమే
 యెఱిఁగితే మరపుల నెనయునట
 అఱిమురి (శ్రీ)వేంకటాధిపుఁడను నాకు
 తొలి బువ్వపుఁబొత్తు దొరకెఁగదే ॥ మటి ॥ 456

రేకు-778 మాళవిగౌళ

ఇటువంటినేరుపు మీయిద్దరందుఁ గంటిమే
 తటుకన నీకతఁడు తా మేలువాఁడే ॥ పల్లవి ॥

చనవు గలిగితేను సరసము లీడేరు
 మనవులు వించేను మాఁట లింపౌను
 పెనఁగు లాడితేను ప్రియములు చేకూరు
 ననుపు గలిగితేను నవ్వులు సమ్మతులు ॥ ఇటు ॥

---

1. పోడి+ఎద్దెఁడు అంటే, పోడిమి యెద్దెఁడు అనియా? దీనియర్థము విచార్యము.

ఆసపడి చూచితేను ఆయములు గరఁగును
వాసితోడ నుండేను వసమౌఁ బొందు
సేసలు పైఁ జల్లితేను చేకొనుఁ జుట్టరికము
వేసర కుండితేను వేడుకలౌ రతులు ॥ ఇటు ॥

సిగ్గుతోడ మెలఁగితేను చిమ్మిరేఁగుఁ దరితీపు
యెగ్గులేమీ నెంచుకున్న నితవౌఁ దమి
అగ్గమై శ్రీవేంకటేశుఁ డన్నిటాను నిన్నుఁ గూడె
నిగ్గుల నీతగవులు నెరపులే భాగ్యము ॥ ఇటు ॥ 457

## హిజ్జిజ్జి

కనుఁగొను మిటు నీకాంతను రమణుఁడ
తనివోనిరతికిఁ దమకించీని ॥ పల్లవి ॥

చెలపలచెమటలు చెక్కులఁ నూరఁగ
చిలుకుఁజూపులను చిమ్మీఁ జెలి
వలపులు నీపై వడిఁ బురికొనఁగా
కులుకుజంకెనలఁ గొసరీ నిదివో ॥ కను ॥

మనసున నాసలు మల్లడిఁగొనఁగా
చనవుల నవ్వులు చల్లీని
వినయము నీతో వెల్లవిరులుగా
పెనఁగి సరసములు బెరఇంచీని ॥ కను ॥

మాటలతేటలు మర్మము లంటఁగ
కూటపుముద్దులు గురిసీని
గాటపుశ్రీవేంకటేశ యనయఁగ
మేటిని నీవని మెచ్చీ నిపుడు ॥ కను ॥ 458

వరాళి

ఇద్దరూ జాణలే మీరు యేమని పొగడవచ్చు
కద్దు మీపొందులు వింటిఁ గడవలోపలను ॥ పల్లవి ॥

నిక్కి చూచి యాపె నిన్ను నివ్వెఱపంట వేయఁగాను
చొక్కిచొక్కి చేత నొడ్డించుకొనేవు
గక్కన నీ వంతలోను గద్దెపైకిఁ దీసుకొంటె
మొక్కీఁ జేతుల నీకు మొనగోరు మోవను ॥ ఇద్ద ॥

కూరిమితో నాపె నీకొప్పు వట్టితియ్యఁగాను
చీరకొంగు వట్టుకొని చిమ్మిరేఁచేవు
నేరుపుతోడఁ జన్నులు నీ వప్పటిఁ బిసికితే
కేరుచు నీమోవిమీఁదఁ గెంపులు నించీని ॥ ఇద్ద ॥

వున్నతి నాపె చన్నుల నుదుటున నిన్నొత్తితే
పన్నినరతులఁ గూడి పంతమిచ్చేవు
చెన్నుమీర నీ వందుకు సిగ్గులెల్లాఁ బాపితేను
నన్నల శ్రీవేంకటేశ సతి వేఁడుకొనీని ॥ ఇద్ద ॥ 459

ముఖారి

ఏమిచెప్పేమయ్య నీతో నింతిభావము
సోమరితనములేల మాతువు రావయ్యా ॥ పల్లవి ॥

చెక్కటఁ జెలికిఁ జేయి చిత్తములోఁ జింత నూయి
వెక్కతో నిన్నుఁ బాసినవిరహావేళ
నిక్కి మైఁ బులకలు చిక్కుదీర్చె యలకలు
అక్కజపునీసుద్దు లాలకించేవేళను ॥ ఏమి ॥

కన్నుల చూపుతేటలు కమ్మఁజెమటవూటలు
వెన్నుఁడ నీగుణములు వినేవేళ
చెన్నగునిట్టూరుపులు సిగ్గులతో వోరుపులు
తన్నుఁదానె పానుపుపై తప్పోసేవేళ ॥ ఏమి ॥

చేరి పెండ్లాడినచొక్కు చేతులపై నీకు మొక్కు
రారాఁపుగా నిన్నుఁ గూడేరతులవేళ
యీరీతి శ్రీవేంకటేశ యీకె యలమేలుమంగ
సారెకు నీవేలినయీసరసపువేళ ॥ ఏమి ॥ 460

కురంజి

వింటివా వోచెలియ నా విన్నపములు
కంటివిగదె తారుకాణ లన్నియును ॥ పల్లవి ॥

మెచ్చనేర్చినవానిపై మేలు సేసేదె తపము
అచ్చపుగుణముగ యాఁటదానికి
కచ్చుపెట్టి యందులోనె కలుగు నిహపరాలు
చెచ్చెరఁ గాఁపురము సేయనేర్చినను ॥ వింటి ॥

యితవెరిఁగినపతి యిన్నిటా మూలధనము
చతురత సేవసేసేజవరాలికి
తతివచ్చినప్పుడు తానే ఫలియించు
మితిలేనివినయాన మెలఁగనేర్చినను ॥ వింటి ॥

కలసేశ్రీవేంకటేశుకాఁగిలే రాజ్యపదవి
అలమేల్మంగవు నీయట్టిదానికి
వెలలేనివేడుకెల్లా విచారించితే నీదే
తలపోసుకొని పొందు దగులనేర్చినను ॥ వింటి ॥ 461

మేఘరంజి

తనతోడఁ బంతమాడేదాననా నేను
చెనకినచెనకులే చిమ్మిరేఁచుఁగాక ॥ పల్లవి ॥

నగవులు నోరిలోనే నానుతా నుండఁగాను
మగువల కలుకలు మరి యాడవే
చిగిరించేవలపులు చిత్తములో నుండఁగాను
తగుఁగాక తమకమే తాలి మేడదే ॥ తన ॥

తడఁబాటైనసిగ్గులు తనువుపై నుండఁగాను
యెడమాఁటల బి(బీ?)రాలు యిఁక నేడవే
సుడిగొన్న యాసలు మోపులలో నుండఁ గాను
పెడరేఁచుఁ గాక రతి పెనఁగులా టేడదే ॥ తన ॥

కరగించేవేడుకలు గాఁగిటిలో నుండఁ గాను
యెరవుల సరసము లిపు డేడవే
అరుదై శ్రీవేంకటేశుఁ డలమేల్మంగను నేను
సరి నన్ను తానె యేలె సాదింపు లేడవే ॥ తన ॥ 462

రేకు - 779. కన్నడగౌళ

ఇంతటఁ గాని నీయెమ్మె లెరఁగరా యిందరు
చెంతనుండి యెన్నేసిచేఁతలు సేసేవే ॥ పల్లవి ॥

మొగమెత్తి మాఁటలాడి ముచ్చటలు చెప్పి చెప్పి
నగుతానే వలపులు నాఁట వేసేవే
పగటునఁ జనుల్పైపై పయ్యెద జారఁదోసి
మగని నీ వెంతేసిమాయలఁ బెట్టేవే ॥ ఇంత ॥

పుక్కిటివిడెముతోడ పువ్వులు ముడుచుకొంటా
మొక్కు తానే వేసా లెంతమాఁట గట్టేవే
చెక్కులపై జవ్వాది చేతఁ దుడుచుకొంటాను
యిక్కడ నీపతి నెంత యలయించేవే ॥ ఇంత ॥

కప్పురము మోవి నిచ్చి కాఁగిటఁ జన్ను లూఁది
కొప్పు దువ్వు తానే చెక్కు కొనగోర నంటేవే
అప్పుఁడు శ్రీవేంకటేశుఁ డలమేల్మంగవు నీవు
యిప్పుడు నన్నేలె విభుని నెంత గొసరేవే ॥ ఇంత ॥ 463

## శోకవరాళి

ఏమంటివో కాని యింతితోడ నీవు
నీమాఁటలే నమ్మి నిక్కి చూచీని ॥ పల్లవి ॥

చెక్కునఁ బెట్టినచేతితోఁ జెలియ
వెక్కువిచారాల బెరసీని
తక్కక నీమాఁట తలఁచి తలఁచి
చిక్కనిచెమట చిందీని ॥ ఏమం ॥

వుసురసుల నుమ్మగిలుకొంటా
కొసరి నీరాక గోరీని
యెసఁగ నీచేఁత లెంచి యెంచి లోలో
పొసఁగఁగ మైనిండఁ బులకించీని ॥ ఏమం ॥

శిరసుమీఁదటిసేసపాలతోడ
సురతభావాలఁ జొక్కీని
సరి శ్రీవేంకటేశ యలమేల్మంగ
మరిగె నీపొందు మరిఁ గోరీని ॥ ఏమం ॥ 464

సాళంగనాట

నాపై బత్తిగలఁడు నామగఁడు
యేపొద్దూ నాకిట్టే చననిచ్చీఁ గాని ॥ పల్లవి ॥

పగాకు శాయకుమను భావించి నావిన్నపము
సరుగ నూఁకొనుమను చన విమ(మ్మ?) ను
మరిగితినను తనమాఁటలోనిదాననను
గరుణించి తానే నన్నుఁ గైకోనీఁ గాని ॥ నాపై ॥

దక్కితి నేనను మరి తానే నాకు గతియను
దిక్కు నాకై వుండుమను దేవులనను
మొక్కితినను చూచే ముంగిటికి రమ్మను
అక్కరతోడుతఁ దానే యాదరించీఁ గాని ॥ నాపై ॥

అట్టె మేనదాననను యులమేల్మంగ నేనను
గుట్టున నుందాననను కోమలినను
యిట్టె శ్రీవేంకటేశుఁ డింపు నచ్చి నన్నుఁ గూడె
చట్టరిక మింకా నిట్టె చూపీఁ గానీ ॥ నాపై ॥ 465

శంకరాభరణం

ఎటువంటిమచ్చికలో యెట్టితరితీపులో
చిటుకన నే వినేను చెవుల పండుగలు ॥ పల్లవి ॥

చెలరేఁగి యాపె నీకుఁ జెప్పె నిందాఁకా సుద్దులు
వెలలేనివేడుకతో వింటివి నీవు
తలఁపునఁ బట్టెనా తమి నీకుఁ బుట్టెనా
అలరి యాసంతోసము లానతియ్యవయ్యా ॥ ఎటు ॥

పలుమారు నీయెదుటఁ బాడె నాపె పాటలు
తలయూఁచి మెచ్చితివి దానికి నీవు
కలిగెనా నీకు మేలు కలఁగెనా నీకు గుండె
యెలుఁగెత్తి నాకుఁ గొంత యెరిఁగించవయ్యా ॥ ఎటు ॥

యేమి నీతో నామె యేకతములెల్లా నాడె
వలపులు చల్లితివి వద్దనుండి
నిలిచి శ్రీవేంకటేశ నే నలమేల్మంగను
కలసితి వెచ్చరించు కలవెల్లా నాకును ॥ ఎటు ॥ 466

మధ్యమావతి

ఎఱఁగమైతి మయ్యా యిన్నాళ్ళు నేను
నెఱజాణతనములు నేర్చుకొంటివా ॥ పల్లవి ॥

కన్నుల నాకె నిన్నుఁ గనుఁగొని మొక్కితేను
చన్నులమీఁదిపయ్యద జారఁదీసేవు
కన్నియవినయ మేడ కాఁతాళము నది యాడ
యెన్ని చూచితే వీగుణాలు యిటువంటివో ॥ ఎఱఁ ॥

గక్కన పూవులచెండు కానిక నీ కిచ్చితేను
చక్కెరవంటిమోవి చవిగొనేవు
యిక్కడ నాకెవినయ మెంత నీవుద్దండ మెంత
యెక్కడా నీతలఁపులు యిటువంటివా ॥ ఎఱఁ ॥

సందడి నలమేల్మంగ సరుస నిలుచుండేను
కందువ శ్రీవేంకటేశ కాఁగిలించేవు
యిందుముఖి సిగ్గులెట్టు యిట్టివి నీచేఁతలెట్టు
యిందరిలో నీసలపు లిటువంటివా ॥ ఎఱఁ ॥ 467

కేదారగౌళ

ఎందాఁకా వట్టిజోలి యిద్దరు మీరొక్కచో
అందుకోరయ్యా విడేలు ఆకె నీవు నిపుడు ॥ పల్లవి ॥

అలుకలఁ బొద్దుగూఁకె నాసలనే తెల్లవారె
చలముల పొట్లనే జామెక్కెను
చెలపలచెమటలు చెక్కులపైఁ గారఁజొచ్చె
అలసితిరి కాఁగిట నలముకోరయ్యా ॥ ఎందాఁ ॥

చింతల చీకటిపడె సిగ్గులనెల పొడ(డి?)చె
వింతవింతనవ్వులనే వెన్నెల గాసె
పంతాలు మీలోలోనే బయలువందిలి వాఁకె
యింత సేసుకొంటిరి మీ రిఁకఁ గూడరయ్యా ॥ ఎందాఁ ॥

విరహము లెండగాసె వేడుకలు మొయిలు గప్పె
సరసపుచేఁతల వసంతము వచ్చె
యిరవై శ్రీవేంకటేశ యీకె యలమేల్మంగ
మరిగితిరి మీరు నెమ్మది నుండరయ్యా ॥ ఎందాఁ ॥ 468

రేకు—780 నాగవరాళి

అన్నిటాను జాణకత్తెవైతివే నీవు
కిన్నెరమీఁటుల నెంత గిలిగించేవే ॥ పల్లవి ॥

చెలువము లోకవంక చిరునవ్వు లోకవంకఁ
జిలుకుతా వల పెంతచిమ్మిరేఁచేవే
తలుపుమాఁటున నుండి తరితీపులెల్లాఁ జేసి
చెలువునియెదుటను సిగ్గు లెంతచూపేవే ॥ అన్ని ॥

పొదలుఁజూపుఁ గొంత జొమ్మఁజంకెనలఁ గొంత
సదగానఁ బతి నెంతసాదించేవే
వదలుఁబయ్యెదచేత వన్నెలమోవిచేత
యెదురెదురనే యంత యెలయించేవే ॥ అన్ని ॥

చిప్పిలుఁజెమటతోడ శిరసువంపులతోడ
ముప్పిరిఁ దమక మెంతమూటగట్టేవే
యిప్పుడే శ్రీవేంకటేశుఁ డేలె నలమేల్మంగవు
కొప్పు జారె నింకా నెంత కొసరఁజూచేవే ॥ అన్ని ॥ 469

## కేదారగౌళ

తనుఁ జూసి వోరువలేఁ (ను?) దమకము నాకు బెట్టు
అనుమానించ వద్దు రమ్మనవే రమణుని ॥ పల్లవి ॥

పొలుపుగాఁ బెండ్లాడి పొంతనాలు చూడనేల
చెలరేఁగి తెరదీసి సిగ్గు మరేల
వలచి కాఁగిటఁ గూడి వాసులు వెదకనేల
అలుక లిఁకనేల రమ్మనవే రమణుని ॥ తనుఁ ॥

కోరి పొత్తునఁ గుడిచి కుచ మదుగఁగనేల
తారుకాణలై నమీఁద తగవులేల
పేరఁ బిల్చి పొందు సేసి బిగియ నప్పటి నేల
ఆరితేరెఁ బనులు రమ్మనవే రమణుని ॥ తనుఁ ॥

చెక్కుల నొక్కి వేఁడుక చిమ్మఁ జంకెనలేల
మొక్కినచేతులఁ జూప మోనాలేల
యిక్కడ శ్రీవేంకటేశుఁ డే నలమేల్మంగను
అక్కరతో న న్నేలె రమ్మనవే రమణుని ॥ తనుఁ ॥ 470

శ్రీ రాగం

మూసి మూసి దాఁచనేలే మోహమెల్లాను
  ఆస యింత గలిగితే నండనే కూచుండవే ॥పల్లవి॥

కలువల వేసి గక్కనఁ దల వంచనేలే
  చెలిమిసేసినచోట సిగ్గులేలే
  పలుకులానే పట్టి పరవశ మందనేలే
  వలపె[1]ంత గలిగితే వద్దనే కూచుండవే ॥మూసి॥

చేరి మాట లాడి యాడి చెమరించ నీఁక నేలే
  సారె నవ్వుతా నిట్టె జంకించనేలే
  పూరకే విడె మిచ్చి వుమ్మగిలే దిది యాలే
  కారణ మింతగలిగితే గద్దెపైఁ గూచుండవే ॥మూసి॥

గుబ్బలు సోఁకఁగఁ బెనఁగి కొంకుచు లోఁగఁగ నేలే
  నిబ్బరానఁ గూడి చింత నీకిఁక నేలే
  అబ్బురపలమేల్మంగ వాతఁడు శ్రీవేంకటేశుఁ-
  డుబ్బు నీకింతగలితే నురానఁ గూచుండవే ॥సిమూసి॥471

నాదరామక్రియ

ఒకటి కొకటి లంకె వొల్లనన్న విడువదు
  వెకలివలపు లిట్టె వెంటనే తగులునే ॥పల్లవి॥

మాటలాడి నప్పుడే మర్మములు రేఁగును
  కాటుకకన్నులచూపు కాంతు రేఁచును
  వాటపుసెలవినవ్వు వదలించు ధైర్యము
  యీటునఁ జేసే పొందు విటునంటివే ॥ఒక॥

---

1 వలపే + అంత

తల వంచుకొంటేను తరితీపు లుప్పతిలు
తలపోఁతసిగ్గులు తమి వుట్టించు
వెలలేనివినుకలి వేడుకలు పచరించు
యేఁమి నాకోరిక కేది గడగురుతే ॥ ఒక ॥

తనువులు సోఁకితేను తగిలించు వావులు
పెనఁగితే మీఁదమీఁదఁ బ్రియము వుట్టు
యెనసె శ్రీవేంకటేశుఁ డే నలమేల్మంగను
యినుమడించె భోగము యెంతైనఁ గలదే ॥ ఒక ॥ 472

భౌళిరామక్రియ

ఇంక నేమిసేసునయ్యా యింతి నీతోను
బింకము చూపక నీకుఁ బ్రియములే చెప్పెను ॥ పల్లవి ॥

గుట్టుతో నుండేచెలిని గోరఁ జెక్కు నొక్కితేను
తెట్టి చేత మూసుకొని తలవంచెను
కిట్టి తొల్లే నవ్వేదాని గిలిగించఁబోతేను
పట్టుకొన్న పయ్యెదతోఁ బాదాలకు మొక్కెను ॥ ఇంక ॥

వూడిగము సేసేదాని నొక్కటొక టాడితేను
వేడుకతో నుతియించి వేఁడుకొనెను
వీడె మిచ్చేదానికొప్పు వెసఁ బట్టి తీసితేను
వోడక నీతమ్ములాన కొగ్గెఁ దనదోసిలి ॥ ఇంక ॥

నీవద్ద నుండినదాని నిండురతిఁ జొక్కించితే
కైవశమై నిన్ను బిగ్గెఁ గాఁగిలించెను
గోవిందరాజవై నకోనేటిశ్రీవేంకటేశ
భావించి నీవు చూచితే పాలిండ్ల నొత్తెను ॥ ఇంక ॥ 473

మాళవి

ఎట్టున్నదో నీమనసు యెఱఁగ నేను
యిట్టె యీచేఁతలెల్ల యితవులేసుమ్మీ ॥ పల్లవి ॥

చనవున నీతోను చవులు వుట్టించెఁ గాని
పెనఁగులాడదు సుమ్మీ ప్రియురాలు
కనుఁగొనలను నిన్నుఁ గామించి చూచెఁ గాని
సునిసి నీపై మొనలు చూపదుసుమ్మీ ॥ ఎట్టు ॥

పలుమారు సిగ్గు నీపైఁ బచారించె నింతేకాని
సెలవి నవ్వదు సుమ్మీ చిగురుఁ బోణి
సొలపులనటనలు తెలిపె నింతేకాని
అలుకతో వెక్కసము లాడదు సుమ్మీ ॥ ఎట్టు ॥

ఘారపుగుబ్బల నొత్తి బత్తిసేసె నింతెకాని
తేరకొని చలము సాదించదు సుమ్మీ
యీరీతి శ్రీవేంకటేశ యీకె నిన్నుఁ గూడెఁ గాని
మేరమీరి నీతో మందెమేళము గాదు సుమ్మీ ॥ ఎట్టు ॥ 474

రేకు—781 హిందోళం

నమ్మితేను యీపెమాఁట నామాఁటే కాదా
కమ్ముకొని సారెసారె గరిసించ నేఁటికి ॥ పల్లవి ॥

కన్నెమనస్సులోపలఁ గలిగినమాఁట లెల్ల
నిన్ననే విన్నవించనా నీతోను
చిన్నది గనక నీతో సిగ్గువడి వున్నదిదె
యెన్నేసిమారులు నీవు యేల వేఁడుకొనేవు ॥ నమ్మి ॥

చేకొని యాపెకు నీవు సేయఁగలపను లెల్ల
ఆకు వా ([వా?)సి యియ్యనా నీహస్తానకు
వాకుచ్చఁ జాలక తలవంచుకొని వున్నదిదె
యీకడఁ జెప్పుమాంటా నీ వేల పెట్టే వానలు ॥ నమ్మి ॥

వున్నతి నిన్నాపె గోరుకున్న భావములెల్లాను
సన్నల నెచ్చరించనా సముకాననను
మన్నించి శ్రీవేంకటేశ మగువ నేలితి విట్టె
యెన్నరానివేడుకతో నేఁ వేగిరించేవు ॥ నమ్మి ॥ 475

## భైరవి

చిత్తగించి వినవయ్యా శిరసు వంచఁగనేల
బత్తితో నెచ్చరించితే భాగ్యముగాదా ॥పల్లవి॥

వెలయ నారితేరినవేడుకకాఁడవు నీవు
చెలియ మాఁటల కేల సిగ్గుపడేవు
చెలరేఁగి తొల్లి నీవు సేసినచేఁతలే యవి
తలఁపించితే నీకు తనివి గాదా ॥ చిత్త ॥

[ప్రేమతోఁ బదారువేలఁ బెండ్లాడినవాఁడవు
భామసుద్దుల నేల పరాకయ్యేవు
చేముంచి నీవు తొల్లి సేసినచేఁతలే యని
వేసూరుఁ దడవితే విన నింపుగాదా ॥ చిత్త ॥

వెర వెరిఁగిన శ్రీవేంకటేశుఁడవు నీవు
తరుణిరతుల కేల తడఁబడేవు
సిరుల నీవు తొల్లి సేసినచేఁతలే యవి
సరి నీ కొప్పగించితే సంతోసముగాదా ॥ చిత్త ॥ 476

పాడి

చెప్పకురే యీసుద్దులు చెలులాల
యెప్పుడుఁ గలవే కావా యీవినోదములు ॥పల్లవి॥

యెంచ దానివెంగెవులు యేసవతు లాడినాను
మంచిమాఁట లాడితేను మతి గరఁగు
వంచనతో విభుఁడు నావసమై వున్న వాఁడు
అంచెలఁ దా మేమాడినా నందు కేమాయనే ॥చెప్ప॥

కాతరించి వాదులకుఁ గదియ నుంకించినాను
చేతులెత్తి మొక్కితేనే చింత దీరును
ఆతుమై యాతఁడు నాయండ వాయకున్న వాఁడు
యేతులఁ దా మెట్టుండినాఁ నేపనికి వచ్చునే ॥చెప్ప॥

మచ్చరించి తమ్ముఁ దామె మతి నుడికిపడిన
యిచ్చగించి నవ్వితేనే యీసుదీరునే
యిచ్చట శ్రీవేంకటేశుఁ డిదివో నన్నుఁ గూడె
యిచ్చకము లా మాటాడితే నేమనఁగవచ్చునే ॥చెప్ప॥ 477

రామక్రియ

కొత్తపొందో పాఁతపొందో కొమ్మ నీకితనితోడ
బత్తితోడ నేపొద్దు పాయక వుండానవు ॥పల్లవి॥

వాలుకచూపులఁ జూచి వట్టువగుబ్బల నొత్తి
చాలా నాతనితో సరసములాడేవు
కాలువలై చెమటలు గారఁగా వేడుకతోడ
ఆలించి వినేవు మాఁట లాసలు రేఁగఁగను ॥కొత్త॥

సెలవులఁ గొంత నవ్వి చేతులు పైపై సారెఁ జాఁచి
వెలయ నిందరుఁ జూడ విడే లిచ్చేవు
పులకలు చెక్కులపైఁ బొడమఁగా నాసతోడ
కొలువులు సేసుకొంటాఁ గూరిమి చల్లేవు ॥కొత్త॥

కప్పురము మోవి నిచ్చి కాయముఁ గాయము మోవ
చిప్పిలఁ గాఁగిట నించి సేవసేసేవు
యిప్పుడే శ్రీవేంకటేశుఁ డిట్టె నన్ను నేలె
చప్పుడుగా మొక్కి వంచనతో నుండేవు ॥కొత్త॥ 478

ఆహిరి

కలికి నిన్నిటు చూచీఁ గంటివా వోయి
తలపోసితే నీకు తరితీపువంటిది ॥పల్లవి॥

ఆసతోఁ జూచినచూపు యంటుబచ్చలివంటిది
పాసికూడినచూపు పండువంటిది
లాసి లాసి చూచేచూపు లాగవేగము వంటిది
సేసవెట్టి చూచేచూపు చిగిరింపువంటిది ॥కలి॥

అల్లార్చి చూచినచూపు అల్లె గాలమువంటిది
చల్లుఁజూపు కప్పపువాసనవంటిది
చిల్లరనాఁటుఁజూపులు చిమ్ముఁదేనెలువంటివి
వెల్లవిరిఁ జూచేచూపు విడుగూళ్ళవంటివి ॥కలి॥

మునుకొని చూచేచూపు మోహపుమెుక్కువంటిది
వినయపుఁజూపు మోవివిందువంటిది
యెనసె శ్రీవేంకటేశ యిన్నిటాను నిన్ను నీకె
తనిసిన నాచూపు తారుకాణవంటిది ॥కలి॥ 479

ముఖారి

ఎప్పుడూను నీకుఁబోదు యెడయరాదు
కప్పనేల తమకము కరుణించవయ్యా ॥ పల్లవి ॥

వలపు నిలుపలేక వనిత పాడీఁ బాట
వెలలేనివేడుకతో వినవయ్యా
కలది తెరమరఁగు కందువఁ బొట్టఁబొరుగు
చెలిమి యన్నాళ్లనుండో చిత్తగించవయ్యా ॥ ఎప్పు ॥

మూసి మంతనాలు మాని ముచ్చటఁ బూవుల వేసి
ఆసల దిష్టించి చూచీ నలరవయ్యా
సేసలు చేతిలోనివి చింతలు పనిలేనివి
పోసరించి మీవావులు పొందు చూపరయ్యా ॥ ఎప్పు ॥

ముందే సిగ్గు మూటగట్టి మోము చూచి నవ్వు నవ్వు
యిందునే రతుల నిట్టె యేలవయ్యా
చెందితి రిద్దరు నేఁడు శ్రీవేంకటేశుఁడ
చందమాయ మీచేఁతలు చన వియ్యవయ్యా ॥ ఎప్పు ॥ 480

రేకు - 782. బౌళి

ఇద్దరికిఁ జుట్టాలమై యిక్కడ నుందము గాక
వద్దనుండి తగవులు దిద్దఁ బనియేమే ॥ పల్లవి ॥

చనవుగలుగుకాంత సరసుని దూరఁగాను
పనివడి యడ్డాలు రాఁ బరులకేమే
వినీ యందుల కాతఁడు వేడుకతో నవ్వఁగాను
పెనఁగి పంతాలాడఁ బెరవారి కేలే ॥ ఇద్ద ॥

మందెమేళమైనకాంత మగనిఁ జెనకఁగాను
సందు చొచ్చి కాఁతాళించ సవతికేలే
యెందును గాతని కవి యింపులై వుండఁగాను
అందుకొని యాఁగాదన నండవారి కేలే ॥ ఇద్ద ॥

అలవాటైనకాంత యతనిఁ గాఁగిలించఁగా
మలసి సిగ్గులు వడ మనకేలే
యేఁమి శ్రీవేంకటేశుఁ డితఁడే మమ్మునుఁ గూడె
వెలినుండి చొప్పులెత్త వింతవారి కేలే ॥ ఇద్ద ॥ 481

దేసాళం

చదురంగ మాడుమని సాదించేవు నేఁడు నన్ను
కదియఁగఁగలఁ గాక కయ్యానకుఁ గలనా ॥ పల్లవి ॥

మలసి నీతో మంచిమాఁట లాడఁగలఁ గాక
కెలన బొమ్మలను జంకించఁగలనా
వలపులు చల్లుతా నీవద్ద నుండఁగలఁ గాక
వెలినుండఁగా దెరవేసుకొనఁగలనా ॥ చదు ॥

సన్నలను నీమోవి చవిగొనఁగలఁ గాక
చెన్నుమీర నది గంటిసేయఁగలనా
అన్నిటా నీకుఁ జుట్టమనై యుండఁగలఁ గాక
పన్నిక నీవు నేనని పందేలాడఁగలనా ॥ చదు ॥

మంతనపురతి నిన్ను మరిగించఁగలఁ గాక
వంతులరతుల గెలువఁగఁ గలనా
యింతలో శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
సంతోసించఁగలఁ గాక చలపట్టఁగలనా ॥ చదు ॥ 482

దేశి

వింటా నున్నాఁడు నీపతి వీనుల పండుగగాను
నంటున నీ విప్పుడే విన్నపము శాయఁగదే ॥ పల్లవి ॥

సొలపులమాటల సొంపులెల్ల నుప్పతిలు
కలపుకోలుమాటలఁ గాక దేరును
అలుకదేరినమాట లాపలెల్లాఁ బెడరేఁచు
పలుమాట లేఁటికిఁ బచారించేవే ॥ వింటా ॥

మచ్చికైనమాటల మనసెల్లాఁ గరఁగును
వచ్చిదేరేమాటలఁ బైకొనుఁ దమి
ముచ్చటమాటల మోహములు నిండుకొను
కొచ్చి వెడమాట లేల కుమ్మరించేవే ॥ వింటా ॥

కందువైనమాటలఁ గళలు రేఁగఁగఁజేయు
పొందైనమాటలఁ బోడము నింపు
విందువలె నిన్ను (శ్రీ)వేంకటేశుఁ డిదె కూడె
సందుసుడిమాట లేల చల్లఁ జూచేవే ॥ వింటా ॥ 488

లలిత

ఏమని పోలిచేరే యింతి సింగారము లివి
కామినులాల మీరు కాంతునియెదుటను ॥ పల్లవి ॥

చెక్కునఁ బెట్టినచేయి సిగ్గున కింతేకాక
తక్కక యెంచితే దొంతితామరొటకా
వుక్కున జారుఁదురుము వొయ్యారాన కింతేకాక
పక్కనఁ జీఁకటియేరై పారేయందుకా ॥ ఏమ ॥

గుబ్బలఁ గప్పినపయ్యెద గుట్టుకొరకింతేకాక
గబ్బిజవ్వనము మూటగట్టేయందుకా
వుబ్బుఁజెమటలు మన సొగిఁ గరఁగుటగాక
అబ్బురపుముత్తెములహారము లౌటకా ॥ఏమ॥

ముట్టినకాఁగిలి పతిమోహపుఁబందిలి గాక
అట్టెవలపులతీఁగె లల్లేకొరకా
గట్టిగ నీకెను శ్రీవేంకటేశుఁడు తానె కూడె
నెట్టనరతుల తమి నించేటికొరకా ॥ఏమ॥ 484

## తోండి

ఎంతసిగ్గులు వడేవే యిందరు నున్నారంటా
వింతదానవా నీవు విభునికిని ॥పల్లవి॥

ముసిముసినవ్వు లేలే ముక్కుమీఁది వే లేలే
కొసరి యాతఁడు నిన్నుఁ గొంగువట్టఁగా
కసిగాటుమాఁట లేలే కడునొడ్డించుకో నేలే
పొసఁగఁ జెక్కులు నొక్కి బుజ్జగించఁగాను ॥ఎంత॥

చిమ్ముఁజూపు లిపుడేలే శిరసు వంచఁగనేలే
సమ్మతించి పతి సరసములాడఁగా
కమ్మక పెనఁగనేలే కావరపువేసా లేలే
కమ్మరఁగమ్మర నిన్నుఁ గాఁగిలించఁగాను ॥ఎంత॥

వేవేలు మొక్కు లివేలే వేడుకలు దాఁచనేలే
శ్రీవేంకటేశుఁడు నిన్నుఁ జేరి కూడఁగా
చేవమీరి చొక్కనేలే చిమ్మిరేఁగ నింతయేలే
మోవితేనె లిచ్చి నీపై మోహము చల్లఁగను ॥ఎంత॥ 485

వేళావళి

మొగమాయలాడివే మొగని నింత నేసితి
చిగురే చాగమైతే జెప్ప నేటికి ॥ పల్లవి ॥

మంతనా లాడియాడి మరిగించుకొంటివి
చెంతఁ జుట్టమవైతివి సేవలు సేసి
వంతులకు మొక్కి మొక్కి వలపించుకొంటివి
యెంత సేయనుందానవో యిసుమంతదానవు ॥ మొగ ॥

నెలవుల నవ్వు నవ్వి చేతికి లోఁజేసుకొంటి
సలిగెదాన వైతివి చన్నుల నొత్తి
కలికిచూపులఁ జూచి కరఁగించితివి మతి-
బలిమి నీ కెంతగద్దో భావింత మిఁకను ॥ మొగ ॥

సారెకు నీమోవి చూపి చవులు రేఁచితివి
గోరు సోఁకఁ బాదా లొత్తి కూడితివి
యీకీతి శ్రీవేంకటేశుఁ డిన్నిటాను నను నేలె
మేరమీర కెట్టుంటివో మెచ్చేము నిన్నును ॥ మొగ ॥ 486

రేకు-783 సౌరాష్ట్రం

మన్నించీఁ బదారువేల మగఁడు తాను
నిన్న నేఁటిపడుచను నేనేమి బాఁతే ॥ పల్లవి ॥

చెక్కు నొక్కి బుజ్జగించి చేతిమీఁదఁ జేయివేసి
యిక్కువ లంటీ నేఁ దన కేమిబాఁతే
చక్కనిదాననంటా జవ్వనపుదాననంటా
నెక్కొని పొగడీ నిదే నే నేమిబాఁతే ॥ మన్నిం ॥

పచ్చిదేర మాఁటలాడి పాపట దువ్వి దువ్వి
యిచ్చె (చ్చీ?) వీడెము నాకు నే నేమిబాఁతే
యిచ్చకముదాననంటా నితవరిదాననంటా -
నిచ్చలు నన్నుఁ బాయఁడు నే నేమిబాఁతే ॥ మన్నిం ॥

చుట్టరికములు చెప్పి సొమ్ములెల్లా నాకుఁ బెట్టి
యిట్టె నన్నుఁ గూడీ నే నేమిబాఁతే
ముట్టి శ్రీవేంకటేశుఁ డిమ్ముల మేలుదాననంటా
నెట్టన నన్నుఁబెండ్లాడీ నే నేమిబాఁతే ॥ మన్ని ॥ 487

రామక్రియ

ఏమి చెప్పీనే తనయెమ్మెలు చెలులతోడ
నామగఁడే యెరుఁగును నాలాగూ ॥ పల్లవి ॥

మచ్చికమాఁటలు చల్లి మందులు నూరీఁ దాను
యిచ్చకపుదానను నాయీడా తాను
పచ్చిదేరేనవ్వులను పదనులు చూచీఁ దాను
అచ్చమైనయిల్లాల నాయంతటిదా తాను ॥ ఏమి ॥

తిలకించి సిగ్గులనే తెరలుగట్టీఁ దాను
తలఁపులోదాన నాయంతటిదా తాను
వెలినుండి వలపులవేడుకలు చల్లీఁ దాను
తొలుతటిదాన నాతోటిదా తాను ॥ ఏమి ॥

చెనకుల చేఁతలనే చిగిరించీఁ దాను
చనవరిదానను నాసాటి (సాటిదా?) తాను
యెనసి శ్రీవేంకటేశుఁ డిన్నిటా నన్ను మన్నించె
పనికి వచ్చితిని నాపాటిదా తానూ ॥ ఏమి ॥ 488

వరాళి

మెచ్చితిమి తమ కిఁక మేలుగానీవే
వచ్చినాఁడు రమణుఁడు వనితవద్దికిని ॥ పల్లవి ॥

జక్కవపులుగులకు చందురువెన్నెలకు
మిక్కిలి చిలుకలకు మేలుగానీవే
అక్కరఁ బొందుసేసిన యాలికిని మగనికి
యిక్కువఁ దమి రేఁచీ నిదేపసి యటరే ॥ మెచ్చి ॥

పంచబాణముఁకును పాటలకోవెలలకు
మించులమేఘములకు మేలుగానినే
యెంచరానిదంపతుల నేడనున్నాఁ బట్టి తెచ్చి
పొంచి కాఁగిట నాఁగెడు పొద్దులు వోవటరే ॥ మెచ్చి ॥

మదనుసికి శశికి మరి వసంతునికిని
మెదలే చల్లగాలికి మేలుగానీవే
యిదె శ్రీవేంకటేశ్వరుఁ డెనలేనిమగువను
యెదుటఁ దమపంతము లీడేరించుకోనీరే ॥ మెచ్చి ॥ 489

హిందోళం

ఇదియేమి చిత్రమో య(యె?)ఱఁగమయ్యా
సుదతి భావము నేఁడు చూతువు రావయ్యా ॥ పల్లవి ॥

వలపుల మొలకలు వనితచన్ను మొనలు
నెలకొన్న చెమటలు నినుపునీరు
వెలుచుజవ్వనమునఁ బెరుగఁగాఁ బెరుగఁగా
అలరి తామర మొగ్గలాయనయ్యా ॥ ఇది ॥

తలపోఁతతీగెలు తరుణికొప్పునెరులు
చెలఁగి కస్తురిబొట్టు సేసినపొడి
కలికిచక్కఁదఁనాల గడుముదిరి ముదిరి
మెలువున గండునుమ్మెద లాయనయ్యా ॥ఇది॥

రతియమృతఫలాలు రమణికెమ్మోవులు
తతిఁ దరితీపులు తమకములు
యితవై శ్రీవేంకటేశ యింతి నీవు గూడఁ గూడ
కతలుగాఁ బగడంపుగను లాయనయ్యా ॥ఇది॥ 490

## మాళవశ్రీ

ఎంతనేరుపరి యిది యెక్కడఁ గలిగె నీకు
వింతలివి యెల్లాఁ జూఁచి వెఱగయ్యా మాకు ॥పల్లవి॥

ముక్కర గదలఁగాను ముసిముసినవ్వులు నవ్వీ
చొక్కపునీదేవులనుఁ జూడవయ్యా
పుక్కిటివిడెముతోడ పూఁచిపూఁచి మాటలాడీ
చెక్కులచెమట గోరఁ జిమ్ముకొంటాను ॥ఎంత॥

తళుకుఁగన్నులు మించ తలయెత్తి నినుఁ జూచీ
నొలపులజవరాలిఁ జూడవయ్యా
వలిపెపయ్యెద గప్పి వరుసఁ గొలువుసేసీ
చెలఁగి జారుఁదురుము చెక్కుకొంటాను ॥ఎంత॥

కంకణాలు మొరయఁగ కప్పురవిడె మిచ్చీని
సుంకుఁదరితీపు లాఁడీఁ జూడవయ్యా
అంకెల శ్రీవేంకటేశ యన్నిటా నిన్నికె గూడె
పొంకమైననిన్ను నన్నుఁ బొగడుకొంటాను ॥ఎంత॥ 491

పాడి

ఎన్ని వేదాలు చదివి యెంత సోమయాజివైన
కన్నెలు వద్దనుండగా కాంతు లేల తీరును ॥ పల్లవి ॥

కోరకుండేవా నీవు గొల్లెతలఁ గనుఁగొంటే
పారదా మనసు వారిపాలిండ్లపై
ఊరదానినోరుతేనె లొలికేమోవిపండ్లకు
వేరదా నలపు వారి బెల్లించుమాటలను ॥ ఎన్ని ॥

చిక్కవా వారికి నీవు చేతులు పైఁ జాఁచితేను
చొక్కకుండేవా మేనులు సోఁకించితేను
చక్కనుండేవా వారు సరసము లాడితేను
పక్కన రేఁగదా తమి భావించి నవ్వితేను ॥ ఎన్ని ॥

పాయఁగలవా సతులు భ్రమయించి కూడితేను
ఆయనా తనివి నీకు నంతలోననే
యేయెడ శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
మాయలకు లోను గాదా మంతనమాడితేను ॥ ఎన్ని ॥ 492

రేకు—784 భైరవి

విన్నవించరే యీమాఁట విభుఁడు తానే యెఱుఁగు
మన్ననగలపగటు మచ్చిక తానే ॥ పల్లవి ॥

కలిమితోడిపొందులు కస్పురపునోటిమాఁట
సలిగెతోడికొలువు చక్కనుండునే
పిలుపుతోడిరాక ప్రియముతోడివిందు
చలి వేఁడి కూరలు చవిపుట్టునే ॥ విన్న ॥

సురతములోనితిట్టు చూపునాఁటించినగుట్టు
తరితీపుసన్నలు తమిరేఁచునే
అరుదుగానవ్విన నవ్వు లడియాసచెనకులు
సరసపువేడుకలు జట్టితో నలరునే ॥ విన్న ॥

పాయముతోడిపంతాలు పచ్చి వెచ్చి(చ్చ?)సిగ్గులు
నాయముతోడితగవు నమ్మిక లౌనే
యీయెడ శ్రీవేంకటేశుఁడిదె తానె నన్నుఁ గూడె
చేయిమీఁదైనపందేలు చేతికి లోనౌనే ॥ విన్న ॥ 493

శ్రీరాగం

తలదడిసితేనే చలి వాశ(నె?) నందురు
చెలఁగి యేమనినాను సిగ్గులు వడేరా ॥ పల్లవి ॥

ఏకత మాడినవారు యెనయక మానేరా
జోకతో వారిపొందులు సోదించ నేలే
మేకొని నవ్వినవారు మేలము లాడకుండేరా
ఆకొలఁది నాసుద్దులు య(అ?) డుగగవలెనా ॥ తల ॥

వీడె మందుకొన్నవారు వేడుక పడకుండేరా
ఆడనీడ వారికత లరయ నేలే
వాడికెచెంతలవారు వలవక మానేరా
జోడైనతారుకాణలు చూపఁగవలెనా ॥ తల ॥

పరపుపైన నున్నవారు పరాకులు సేసేరా
తిరుగ వారిగుణాలు తెలియ నేలే
యిరవై శ్రీవేంకటేశుఁ డింతలోనె నన్నుఁ గూడె
పరగ నీరెండూ నేరుపరచఁగవలెనా ॥ తల ॥ 494

ఆందోళి

ఎవ్వరికిఁ గలదయ్య యిటువంటివలపు
పువ్వువంటిపాయమున భోగించీఁ జెలియ ॥ పల్లవి ॥

విన్నపాలు నీకుఁ జేసి వెలఁది సిగ్గువడీని
చన్నులమీఁదిపయ్యద జారఁగాను
తన్నుఁ దానె చొక్కుకొంటా తలపోసీ లోలోనే
యెన్నిక లెటువంటివో యేమిభావమో ॥ ఎవ్వ ॥

చేరి నీపాదము లొత్తి చిరునవ్వు నవ్వీని
ఊరి చెక్కుల చెమట లొలుకఁ గాను
వేరులేనిసంతోసాల వెనకముం దెరఁగదు
కోరిక లెట్టున్నవో గుట్టూఁ దెలియదు ॥ ఎవ్వ ॥

గక్కన విడె మిచ్చి కళలు మోమున నించీ
పుక్కిటినిట్టూర్పులు పొదలఁగాను
యిక్కడ (శ్రీ)వేంకటేశ యేలితి విట్టె యీకెను
దక్కిన దిదెంతమేలో తలపోయఁగాదు ॥ ఎవ్వ ॥ 495

భల్లాటి

చిత్తగించి చూడవయ్య చెలియదిక్కు
కొత్తలై నీవేడుకలు గుబ్బతిలీని ॥ పల్లవి ॥

చెలులముందర నెల్లాఁ జెప్ప సిగ్గువడీఁ గానీ
తలఁపులో తమకము దైలువారీని
బలుచన్నులు వలిపెపయ్యదఁ గప్పీఁ గానీ
పెలుచవయోమదము పిక్కటిల్లీని ॥ చిత్త ॥

గుఱిలేనివలపులు గుట్టున దాఁచీఁ గానీ
కఱఁగి మేనఁ జెమట గడుఁ గారీని
చిఱునవ్వు లూరకే సెలవి నణఁచీఁ గానీ
తొఱలింపుఁగోరికలు తూరిపారీని ॥ చిత్త ॥

తెగరానిపంతముతోఁ దెరవేసుకొనీఁ గానీ
చిగిరింపురతులలోఁ జిమ్మిరేఁగీని
నిగిడి శ్రీవేంకటేశ నీ వింతలోఁ గూడితివి
పగటుమోముకళలఁ బచ్చిదేరీని ॥ చిత్త ॥ 496

ఆహిరి

నీయెదుటఁ దాను వచ్చి నిలుచున్నది
యేయెడా నిల్లాండ్లకు నిది వోజగాదా ॥ పల్లవి ॥

తలఁపులో నీరాక తరుణి తలఁచఁగానే
వెలయ నీడ కింతలో విచ్చేసితివి
అలపు వాయ మజ్జన మవధరిం చారగించు
చెలియ చెప్పసిగ్గువడి చెప్ప మనీ నన్నును ॥ నీయె ॥

నీ కెదురుచూడఁగానే నెలఁత భాగ్యవశాన
దాకొని నీయంతనే ప్రత్యక్షమైతివి
నీ కిదివో పుత్తెంచె నెమ్మది విడె మందుకో
యీకె సిగ్గువడి యిమ్మఁనీ నన్నును ॥ నీయె ॥

కాంత నిన్నుఁ బిలువఁ గానుక లంపఁగానే
అంతలో ముందర నిల్చి యందుకొంటివి
సంతసాన శ్రీవేంకటేశ్వర నిన్నుఁ గూడి తాను
కొంత సిగ్గువడి నన్నుఁ గోరి మెచ్చు మనీని ॥ నీయె ॥ 497

కాంబోది

చూతమయ్యా యింకా నీపెసుద్దులెల్లాను
కాతరపుటీకె యెంత కలికియో కాని ॥ పల్లవి ॥

చిమ్ముఁజూపులనుఁ జూచి సిగ్గులెల్లఁ బెడరేఁచి
నిమ్మపండు గానుకిచ్చీ నెలఁత నీకు
ఉమ్మగిలఁ జెయివట్టి వుబ్బుపొంటలాడించి
నెమ్మది నింకా నెంతేసి నేరుచునో కాని ॥ చూత ॥

యెలుఁగించి(చ్చి?)సన్న సేసి యెదుటనే నిలుచుండి
యెలయింపునవ్వు చల్లీ నింతి నీమీఁద
లలి సురటి విసరి కళలు మోమున రేఁచి
నిలువున మోహా మెంతనెరపీనో కాని ॥ చూత ॥

పోసరించి సింగారించి పూవులు నీకు ముడిచి
ఆసలే కడుఁజూపీ నతివ నీకు
సేసవెట్టి కూడితివి శ్రీవేంకటేశ నన్ను
నీసరి నున్నది తాను నీకెంతో కాని ॥ చూత ॥ 498

రేకు - 785 మాళవిగౌళ

ఇంక నీవే యెఱుఁగుదు వేమీ నెఱఁగను నేను
వుంకువగా నీగుణాలే వుబ్బు రేఁచీని ॥ పల్లవి ॥

వేఁపులు నీమీఁదివి వరుసలు పెట్టుకొని
తలపించి మదిలోన దైలువారీని
పలుకులలో నీపేరు పలుమారు దొరలుక
యెలయించి నీపొందు లెచ్చరించీని ॥ ఇంక ॥

చూచిననాచూపులలో సూటియై నీరూపులే
కాచుకొని నామనసు గరగించీని
యేచిననావీను లివి యిక్కువై నీకతలు
లాచి లాచి యట్టె మేలములాడీని ॥ఇంక॥

నెమ్మది నాకరములు నీకాఁగిటఁ బెనగొని
వుమ్మగిలురతులలో నోలలాడీని
యిమ్ముల శ్రీవేంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
తమ్మినామోము నీమోవితావి గోలీని ॥ఇంక॥ 499

కేదారగౌళ

నే మెప్పుడూ నొకటే నెఱతలము
నీమసువస్తేఁ జాలు నీకు మేలేకా ॥పల్లవి॥

వోరుచుకోవే యని వొడఁబరచుకొంటాను
సారె బుద్ధులుచెప్పేవు జాణవయ్యా
నేరుతువుగా యిందుకు ని న్నేమనేము నేము
కోరిననీకోరికలు కొనసాగెఁగా ॥నేమె॥

చేయి చేతఁ బట్టుకొని చెక్కులు నొక్కుకొంటాను
చాయకుఁ దెచ్చేవు మాఁట జాణవయ్యా
మాయదారివి తొల్లె మరినీకుఁ జెప్పనేల
నీయుపాయము లెల్లాను నెరవేరెఁగా ॥నేమె॥

నన్నూ నాపెఁ గాఁగిలించి నవ్వులు నవ్వుకొంటాను
చన్ను లంటి కూడితివి జాణవయ్యా
యెన్ని విద్యలవాడవు యే మొక్కే శ్రీవేంకటేశ
సన్నల నీవేడుకలు సతమాయఁగా ॥నేమె॥ 500

కన్నడగౌళ

చెలులాల బలుములు సేయవచ్చునా
చెలఁగి యేలేవిభునిచిత్త మింతేకాక ॥ పల్లవి ॥

పంతమాడ నేఁటికి పాయపువారికిని
కంతుఁడు యేమిసేసునో కనే దెట్టు
యింతులు సిగ్గరికత్తె లేతులంటె నారజము
చెంత నున్నరమణునిచిత్త మింతేకాక ॥ చెలు ॥

చలపట్ట నేఁటికి సతియైనదానికిని
వల పెంతకుఁ దెచ్చునో వద్దనరాదు
నెలఁతలు గుట్టువారు నిష్ఠూరములు బాఁతిగాదు
చెలిమిసేసినపతి చిత్తమింతేకాక ॥ చెలు ॥

బిగియఁగ నేఁటికి ప్రియముగలదానికి
మొగమో టేడనుండునో రఁగాదు
మగువ లిచ్చకురాండ్లు మహి సిట్టె నన్నుఁ గూడె
తిగి శ్రీవేంకటేశ్వరు చిత్తమింతేకాక ॥ చెలు ॥ 501

నాదరామక్రియ

కూరుములూఁ గొసరేవు గుంపెనలూఁ జూపేవు
ఆరితేరినదానవు ఆయా లంటరాదా ॥ పల్లవి ॥

చనవుగలదానవు సణఁగులు రాల్చనేలే
చెనకరాదా విభునిఁ జేతులారాను
వినయపుదానవు వెంగెము లాడనేలే
తనివారఁ బదివేలు దండాలు వెట్టరాదా ॥ కూరు ॥

మచ్చికైనదానవు మనసు సోదించనేలే
పచ్చిదేరఁ గూడరాదా పలుమారును
యిచ్చ యెఱిఁగినదాన వింపు లడుగనేలే
తచ్చి తచ్చి రతులలో తని వందించరాదా ॥ కూరు ॥

ఇతవరిదానవు ఇంత సిగ్గు వడనేలే
తతి విడె మియ్యరాదా తత్తరాననను
చతురత శ్రీవేంకటేశ్వరుఁ డిట్టె నన్నుఁ గూడె
కతలుగా నీ వతనిఁ గలయఁగరాదా ॥ కూరు ॥ 502

## శోకవరాళి

ఎందాఁకాఁ జెప్పించి సుద్దు లీడ కిట్టె రమ్మనవే
పొందికైనతలపోఁత భోగించక తీరునా ॥ పల్లవి ॥

విన్నవినుకలిచేత వేడుకైనవలపులు
కన్నులఁ జూచినఁ గాక కాంతు దీరునా
సన్నలఁ జూపినమోవి చాయలఁ బుట్టినతీపు
అన్నిటాఁ జవిగొనక యాస దీరునా ॥ ఎందాఁ ॥

మనసునఁ బెనగొన్న మరవరానికోరిక
తనువులు సోఁకక తమి దీరునా
పనివడి మునుపనె పాఁగినచుట్టరికము
అనిశముఁ గూడియుండ కాఁకట(టు?)లు దీరునా ॥ఎందాఁ॥

తెరమఱఁగున నుండే తేట వడ్డ సిగ్గులు
పరపుపైఁ బండక గొబ్బ (బ్బు?) నఁ దీరునా
యిరవై శ్రీవేంకటేశుఁ డిట్టె వచ్చి నన్నుఁ గూడె
వరుసకు వచ్చితేఁ గావరములు దీరునా ॥ ఎందాఁ ॥ 503

శుద్ధవసంతం

నీతో చయ్యాటాలకు నే మోపము
ఆతనికి నీకునే యసురుఁగాని ॥పల్లవి॥

మొలచేవి[1] నీమైఁ బులక మోసులు
సెలవులఁ గారేవి చిరునవ్వులు
నెలకొనేవి మోమున నిండుఁగళలు
చెలియ నీ వేమనినాఁ జెల్లునమ్మా ॥నీతో॥

పెరిగేవి పయ్యదలో పెనుగుబ్బలు
వొరగేది మూఁపుమీఁద వొప్పులకొప్పు
సరుసఁ జారేవి నీసళుపుఁజూపు(పులు?)
తరుణి నీకతలకు దండమమ్మా ॥నీతో॥

చిప్పిలేవి మేనఁ బెంజెమటలు
ముప్పిరిగొనేవి నీమోవితేనెలు
యిప్పుడె శ్రీవేంకటేశుఁ డేలె నన్ను
కప్పురగందివి మమ్ముఁ గరుణించవమ్మా ॥నీతో॥ 504

రేకు - 786. దేవగాంధారి

తానిచ్చినచనవునఁ దడఁబడేవారము
మోనముతోడుత నిట్టె మొక్కితి నే ననవే ॥పల్లవి॥

మగువలపంతములు మగవానిచేతివి
పగటునఁ జెల్లఁ బెట్టి పాలార్చును
మగడి తనతో మారుమాఁట లాడేవారమా
తగవు లెల్లాఁ దానే తలఁచు కొమ్మనవే ॥తాని॥

---

1. 'వి' వర్ణము స్పష్టముగ లేదు.

చెలులమందెమేళాలు చేపట్టినవాని కింపు
    పలుదెరఁగుల మెచ్చి పాలార్చను
    బలిమిసేసినతన్నుఁ బచారించేవారమా
    నిలిచినతనవోజ నెరపుట గాక ॥ తాని ॥

నాఁవలపు శ్రీవేంకటనాయకుఁడు తనసొమ్ము
    భావించి నన్ను నేలి పాలించను
    యీవేళఁ దా నన్నుఁ గూడె నిది గాదనేవారమా
    వేవేలకుఁ దానే జాణ వినుతించే నిఁకను ॥ తాని ॥ 505

దేశాళి

చూచితేఁ బిన్నవుగాని సుగుడ (ణ?) వన్నిటా నీవు
    యీచేత లెన్నఁడు నీవు యెఱిఁగితివే ॥ పల్లవి ॥

వదులుఁదురుము యాల వంచి వంచి మొక్కేవే పతి-
    నిదివో నయాన నెంతయొఃయించేవే
    వెదచల్లుఁజూపు లెంతవెదవెట్టేవే
    సదరాలనే యెట్టు జట్టిగొంటివే ॥ చూచి ॥

కనుచూపులనే యెంతకమ్ముకొనేవే యీ—
    పనుల నాతని నెంతభ్రమయించేవే
    వినయము చూపి యేమి వేఁడుకొనేవే — యిట్టి —
    పెనఁగులాటలనే ప్రియము రేఁచితివే ॥ చూచి ॥

కందువకుఁ దీసి యెంత కాఁగిలించేవే
    యిందునే శ్రీవేంకటేశు నెట్టు గూడేవే
    ముందె యీతఁడు నన్నేలె ముచ్చట లేలే
    చందమాయఁ బనులెల్లా సాధించితివే ॥ చూచి ॥ 506

## శుద్ధవసంతం

వెఁపులవసంతము వనితపై నాడేవు
చెలియ నీమీఁద నెంతసేసునో యిందుకు ॥ పల్లవి ॥

పువ్వులఁ గొని చన్నులు పూఁచి నీవు వేయఁగాను
నవ్వుతా నిన్నుఁ దిట్టె నలినాక్షి
పువ్విళ్ళూరి నీ వంతలో నొకివట్టి తియ్యఁగాను
చివ్వన నిన్నాపె యేమిసేసునో యింకను ॥ వల ॥

కుమ్మరించి పన్నీరు కుచ్చెలపైఁ జల్ల రాఁగా
చిమ్మిరేఁగి వొట్టువెట్టీఁ జెలియ
కమ్మర నీ వందుకుఁగాఁ గాఁగిలించి పెనఁగఁగా
దొమ్మిసేసి యాపె యెంతతొడరునో నిన్నును ॥ వల ॥

కడఁగి తురుము మీఁద కప్పురము చల్లఁగాను
అడరి తా వేఁడుకొని నతివ
తొడిఁబడఁ గూడితివి తొలుతే శ్రీవేంకటేశ
చిదుముడిరతి నెంతచెనకునో యిపుడు ॥ వల ॥ 507

## ధన్నాసి

వనితరో పతితోడ వట్టిగుట్టు చెల్లునటవే
చొనిపి మోవితేనెలు చూపుదువుగాక ॥ పల్లవి ॥

బలుచన్నులు నీ వెంత పయ్యదలో దాఁచినాను
వలపులు మూటగట్ట వచ్చునటవే
తలవంచుకొని లోలో తమకము లాఁపినాను
చెలపలచెమటలు చిందకుండునటవే ॥ వని ॥

ధీరతతో నీ వెంత తెర వేసుకుండినాను
పారేటిమనసు పట్టుపరచేవటవే
కూరిమిమాఁటలు నోర గుబ్బతిల నణఁచిన
వీరిడినీచిరునవ్వు వెళ్లకుండునటవే ॥ వని ॥

సన్నపుసిగ్గులతోడ సరిఁ దలవంచినాను
కన్నులచూపులు గంపఁగ(న?)మ్మీ వశే
యిన్నిటా శ్రీవేంకటేశుఁ డేలె నన్ను నింతలోనె
వున్నతపువేడుక నీ వాట్టుకొనేవటవే ॥ వని ॥ 508

లలిత

ఎక్కడ పరాకు నీకు యేమి సేసేవు
తక్కక నీకుఁగానే తమకింపుచున్నది ॥ పల్లవి ॥

జలజాక్షివదనము చక్క నీవు చూడవయ్యా
మలసి పెదవులెత్తి మాఁటాడవయ్యా
తలిరుఁ జేతు లాపెగుబ్బలపై మోపవయ్యా
కలికి యప్పటనుండి కాచుకున్నది ॥ ఎక్క ॥

కొనగోరంట నాపెచే కొప్పు వెట్టించుకోవయ్యా
ననుపునఁ జిరునవ్వు నవ్వవయ్యా
కనుఁగొని యాపెచంద్రగావిచీర గట్టవయ్యా
పనివడి యాపె నీపై బత్తిఁ గాచుకున్నది ॥ ఎక్క ॥

కలసి యాపె నురాన గక్కనఁ గట్టుకోవయ్యా
పిలిచి యాపెపై శాస వెట్టవయ్యా
యెలమి శ్రీవేంకటేశ యేలితి విన్నిటా నీవు
అలమేలుమంగ నీకు నదె కాచుకున్నది ॥ ఎక్క ॥ 509

మలహరి

కడలేనివలపులకతలాఁడి
పెడరేఁచీఁ దమకము ప్రియమా వోయీ ॥ పల్లవి ॥

సన్నలనే మోవితేనెచవులు నీకుఁ జూపి
చన్నులమీఁదిపయ్యెద జారించీ
కన్నులనే మాటలాడి కళలు నీకు రేఁచి
యెన్నిచేఁతలు సేసీని యింతి నీయెదుటను ॥ కడ ॥

సెలవుల కొంతకొంత చిరునవ్వులు నవ్వి
తొలఁకుఁగళల మోము తోఁగి చూచీని
వులి [1]వచ్చిసిగ్గులతో నొయ్యనె కొలువు సేసి
యెలయించీ నిన్ను నిదియేమందు నేను ॥ కడ ॥

అంగపుసోఁకులనే ఆయాలు నీకు రేఁచి
వుంగరాలచేతఁ బాదా లొత్తి యొత్తి
చెంగిట నన్నెలితివి శ్రీవేంకటేశుఁడ తాను
అంగవించి సేసవెట్టీ నప్పుడే నీమీఁదను ॥ కడు ॥ 510

రేకు - 787. సామంతం

చూచితే నాము రేఁగీ సుదతులకెల్లాను
పూచినతంగేడువలె పొదలీ శివఁపు ॥ పల్లవి ॥

నిండువావి సేసుకొని నీతో నవ్వీఁ జెలియ
మెండుగాఁ జెయిముట్టి మేల మాడీని
కొండలవంటిచన్నులు గురుతు లెరిఁగించీని
దండనే చెప్పఁ గొత్తలు తగినమీ పొందులు ॥ చూచి ॥

---

1. నులి+వచ్చి

కలికితనములనె కాఁపురము సేసీ నీతో
 చెలరేఁగి సిగ్గులనే సేసవెట్టీని
 నిలువుఁదురుము చూపి నీమనసు గరఁగించీ
 తలఁచే మనఁగలరా దండిమీవేడుకలు ॥ చూచి ॥

రంగుమోవితేనెలనే రతులఁ జొక్కించీ నిన్ను
 కొంగువట్టి కూరుములు కొసరీఁ దాను
 సంగతిగ శ్రీవేంకటేశ్వర మన్నించితి వీకెఁ
 జెంగటనే కానవచ్చె చేఁతల మీపనులు ॥ చూచి ॥ 511

రామక్రియ

ఎటువంటివేగిరకాఁడే తఁడోయమ్మా
 చిటుకంటే మిట్టిపడి సిగ్గువడీని ॥ పల్లవి ॥

చెప్పక చెప్పినమాట చెవిలోనే వుండఁగాను
 యిప్పుడు నామోము చూచి యెంత నవ్వీనే
 చొప్పుగా నేఁ జూచేచూపు సోఁకీసోఁకకతొల్లే
 తప్పించుక తా నెల్ల తడఁబడీనే ॥ ఎటు ॥

ముట్టక ముట్టినచేయి ముంజేతిపై నుండఁగాను
 గుట్టునఁ జెమట లేల కుమ్మరించీనే
 చిట్టినాసన్నలు తెలిసీఁదెలియకతొల్లే
 బట్టబయ లానలేల పెట్టుకొనీనే ॥ ఎటు ॥

వొత్తకవొత్తినచన్ను లురమున నుండఁగాను
 బత్తిసేసి నాతో నేమి పచారించీనే
 కొత్త శ్రీవేంకటేశుఁడు కూడీఁగూడకతొల్లే
 హత్తి నన్ను నేలి యంత ఆదరించీనే ॥ ఎటు ॥ 512

వరాళి

వద్దనేమా నేము మీరు వావిగూడితేఁ జాలు
వొద్దఁ బెట్టుకొనవయ్యా వువిదను నీవు ॥ పల్లవి ॥

సేసవెట్టేదానికి సిగ్గులు పిడుపడును
ఆసగలదానికి నలవిలేదు
వేసరనిదానికి వెస నలయిక లేదు
సేసుకొవయ్యా పెండ్లి చెలియతోను ॥ వద్ద ॥

పంతమాడేదానిపయ్యెద జారుతా నుండు
మంతనమాడేదానికి మై చెమరించు
చెంత నుండేదానికి చిగిరించు కోరిక
కాంతకు గట్టఁగదయ్యా కంకణము నీవు ॥ వద్ద ॥

రతిసేసేదానికి రసము లోలుకు మోవి
అతిమోహపుదానికి నదరు సంది
యితవై శ్రీవేంకటేశ యిదె నన్నుఁ గూడితివి
అతివా నీవును బువ్వా లారగించు మిపుడు ॥ వద్ద ॥ 513

ముఖారి

నిన్ను రమ్మని పిలువ నే నెంతవారము
కన్నులఁ జూచితే నీవే కరుణించేవయ్యా ॥ పల్లవి ॥

ఉప్పతిల్లుఁగోరికల నుడివోనికాతరాన
యెప్పుడు నీపొందులకే యేఁకరీఁ జెలి
కప్పురగంది నీమీఁదఁ గలిగినవలపులు
చెప్పఁగ వచ్చితి మీకఁ జిత్తగించవయ్యా ॥ నిన్ను ॥

పుదుటుఁదమకముల నొంటిని తలపోఁతల
యెదురుచూచి చూచి యేకరిఁ జెలి
మదిరాక్షి భావ మిది మరఁగు మొరఁగు లేదు
మది నీవే తలఁచుక మన్నించవయ్యా ॥ నిన్న ॥

పట్టరానిజవ్వనాన బయలీఁతయాసలను
యిట్టే నీరతులకు నేఁకరిఁ జెలి
నెట్టన శ్రీవేంకటేశ నీవు నేఁడు గూడితివి
చుట్టరికములు నీవే చూచుకొనవయ్యా ॥ నిన్న ॥ 514

దేసాళం

చూచేముగా యాడలేనిసుద్దులెల్లఁ జెప్పనేల
యేచి పంతాలు మెరచే రెవ్వ రిఁక బలువో ॥ పల్లవి ॥

పడఁతిచన్ను మొనలు పచ్చితామరననలు
అడరుఁజూపులు మరునంపకొనలు
తడవే వాపెను నీవు తతిగొని పెనఁగేవు
యెడయక యిద్దరిలో నెవ్వ రింక బలువో ॥ చూచే ॥

అంగననునుఁగురు లట్టె మోహపుటురులు
సింగారపు(పుఁ?)గురులు మించినతరులు
అంగవించి సారెసారె నాపె నీవు చెనకేవు
ఇంగితాన నెంచి చూడ నెవ్వ రిఁక బలువో ॥ చూచే ॥

కప్పురగంది మోవి కమ్మనితేనెతావి
చెప్పరానిపిరుఁ దిది చేకొన్నదీవి
ముప్పిరి శ్రీవేంకటేశ మున్నె నన్నుఁ గూడితివి
యిప్పు డాపెఁ దడవేవు యెవ్వ రిఁక బలువో ॥ చూచే ॥ 515

సౌరాష్ట్రం

మేలు మేలు దాని నిట్టె మెచ్చితి నేను
తాలిమితోఁ దనపొందు దలపించె నీకును ॥ పల్లవి ॥

కాతరాన నీవిప్పుడు కంటివో యేమో కాని
చేతులెత్తి నీకు మొక్కెఁ జెలి యందుండి
యీతల నీవప్పటిని యేలదాఁచేవో కాని
నీతురుము దాఁక వేసె నిమ్మపంట నిపుడు ॥ మేలు ॥

చెలఁగి సిగ్గువడి దాఁచితివో యేమోకానీ
పలుకుల సోఁకనాడీ పడతి నిన్ను
యెలమిని నీమసున నెట్టున్నదో కానీ
నెలవుల నవ్వు నవ్వి చిమ్మిరేఁచీ నిన్నును ॥ మేలు ॥

కాఁగిటిలో నెటువలెఁ గలసితివో కానీ
చేఁగదేర మోవి చూపిఁ జిగురుఁబోడి
యేఁగి వచ్చి శ్రీవేంకటేశ నన్ను నేలితివి
పాఁగినచన్నులఁ దనపస చూపీ నీకును ॥ మేలు ॥ ॥ 516

రేకు-788 బౌళిరామక్రియ

చెల్లఁబో యెంత కెంతసేసేవు నీవు
కెల్లురేఁగి నవ్వఁగానే గిలిగింతురా ॥ పల్లవి ॥

చెక్కు నొక్కి శా (సే?)ద దేర్చి చేయిమీఁదఁ జేయి వేసి
చొక్కించితి వింతి నతిసులభానను
అక్కరతోఁ దనమీఁద నానవెట్టి పాదాలకు
మొక్కఁగానే నీ వాకెమోవి గంటి సేతురా ॥ చెల్లఁ ॥

ముచ్చటాడి వేఁడుకొని మోమున మోమప్పళించి
నెచ్చెలిఁ గాఁగిలించితి నేరుపునను
అచ్చమైనజాణ వని యట్టె పొగడి పొగడి
మెచ్చఁగానె పిసికేవు మెలుతకుచములు ॥ చెల్లఁ ॥

కళలంటి రతిఁగూడి కలసి శ్రీవేంకటేశ
చెలఁగించితి వీకెను చేచేతనే
బలు సిగ్గుతోడ నీపచ్చడము గప్పుకొంటా
చెలిమి సాయఁగానే చెనకఁగ నేఁటికి ॥ చెల్లఁ ॥ 517

## శ్రీరాగం

అడుగవయ్యా వరము లాపె నేమైనా నీవు
బడిబడి నిదివో ప్రత్యక్షమాయ నీకు ॥ పల్లవి ॥

చెలియ పేరే నీకు సేసేజపమంత్రములు
కలసేటిసన్నలే యంగన్యాసాలు
ములువాఁడికొనగోరిమోపులే నానాముద్రలు
ఫలియించెఁ దప మాపె ప్రత్యక్షమాయ నీకు ॥ అడు ॥

ఆపెపైఁ జల్లేవల పదే తర్పణజలము
దీపించునవ్వు పాయసదివ్యహోమము
దాపగునీయధరామృతమే మంచిభోజనము
నీపాలఁ బ్రత్యక్షమాయ నెలఁత యిదె నీకు ॥ అడు ॥

పొందులకాఁగిటిరతి పురశ్చరణఫలము
అంది యాపెచక్కనిరూపది యంత్రము
యిందునె శ్రీవేంకటేశ యిటు నన్నుఁ గూడితివి
అందమై ప్రత్యక్షమాయ నప్పటిఁ దానె నీకు ॥ అడు ॥ 518

దేశి

ఎన్నఁడు నేరిచితివే యీచేఁతలు
నిన్నుఁ గుప్ప నేఁ డాళ్ళు నీ వెంత నేసేవే ॥ పల్లవి ॥

కూడఁ గొప్ప దువ్వేనంటా కుచములు దాఁకించి
యెడలేని యాసలా(ల?)ను యేల పెట్టేవే
వీడెపుమోవి చూపి వింతమాటలెల్లా నాడి
వాడికలఁ బతి నెంత వలలఁ బెట్టేవే ॥ ఎన్న ॥

పాదాలు గుద్దేనంటా పయ్యెద జారఁదోసి
యీదెస నీతని కెంతయింపు రేఁచేవే
పోదిగా సన్నలుసేసి పొందుగా నో ర్యూరించి
పొందుకొని మోహా మెంత పైఁ జల్లేవే ॥ ఎన్న ॥

కతలు చెప్పేనంటా గక్కనఁ దెరవేసుక
పతి శ్రీవేంకటేశు నెందాఁకాఁ గూడేవే
రతి నన్ను నేలినాఁడు రచ్చలోన నిప్పు డిట్టె
మతకమున నీ వెంతమలయవచ్చేవే ॥ ఎన్న ॥ 519

లలిత

ఇద్దరము నోమిననో మిటువలె ఫలియించె
వద్దికి రావయ్యా నీవు వాకిట నుండనేల ॥ పల్లవి ॥

కన్నుల నేఁ జూచేచూపు కాఁడిపారు నీమేనై తే
అన్నిటా నాచూపే నాకు నానరేఁచును
విన్నవించేనాసొలపు వెస నీమర్మము సోఁకు
పన్ని యీమాఁటలే నాకుఁ బైతరవులౌను ॥ ఇద్ద ॥

చేరి నానవ్వులు నీకు చిత్తమెల్లఁ గరఁగించు
తారుకాణై నాకె(కీ?)నవ్వే తమివుట్టించు
నేరుపుల నాసన్నలు నిన్ను నీడకు రప్పించు
సారె నాసన్నలే నీతో సమరతికి నందించు ॥ ఇద్ద ॥

నెక్కొని నావినయము నిన్నుఁ గడువలపించు
చిక్కి నావినయమే నీసేవ యెంచు
గక్కన శ్రీవేంకటేశ కాఁగిలించితివి నన్ను
పక్కనున్న నాకూటమి పాయనీదు నిన్నును ॥ ఇద్ద ॥ 520

## తోండి

కానీవే దాని కేమి కందము నీపంతము
మేనరిక మయినవావి మీరఁగలవా ॥ పల్లవి ॥

చేలకొంగు వట్టితేనే చీఁదర రేఁగేదానవు
కాలుదొక్కితే నెంత కాఁతాళింతువో
తాలిమి గోర నూఁదితే తప్పించుకొనేదానవు
మేలమాడి పెనఁగితే మేకు లెంతసేతువో ॥ కానీ ॥

కన్నులఁ జూచితేనే కసరేటిదానవు
చన్ను లంటితే నెంతసళుపుదువో
సన్నలు సేసితేనే జంకించేదానవు
చిన్నినవ్వు నవ్వితేను సిగ్గెంత వడుదువో ॥ కానీ ॥

మోవితేనె అడిగితేనే మొరసేటిదానవు
యీవేళఁ గాఁగిలించితే నేమందువో
నీ వలమేలుమంగవు నేను శ్రీవేంకటేశుఁడ
చేవదేరెఁ గూటములు చేఁత లెంతసేతువో ॥ కానీ ॥ 521

పళవంజరం

దోమటిగొల్లవారికి దోసము లేదు
శామలాల మననోము ఫలియించెఁగదరె ॥ పల్లవి ॥

చిం(జిం?)కచూపులనుఁ జూచి సిగ్గులు పడకురే
యింకఁ గృష్ణునికిఁ జేతులెత్తి మొక్కరే
చంకల నిరుకకురే చన్నులు దాఁచుకొంటా
మంకుఁదనా లేలే వానిమాఁటలు వినఁగదరే ॥ దోమ ॥

సెలవుల నవ్వుకొంటా శిరసులు వంచకురే
వలిపచ్చిచేఁతలకు నొడఁబడరే
నిలువెల్లా ఙారెఁడేసినెరులఁ గప్పకురే
చేలరేఁగి యీతఁడు చెప్పినట్టు సేతమే ॥ దోమ ॥

కూరిమితోన నుండఁగా గుబ్బతిల నేఁటికే
చేరి యీతనిఁ బెండ్లాడి చెలఁగుదమే
యీరీతి శ్రీవేంకటేశుఁ డింతలోన నిందరి నేలి
చీర లిచ్చె నిఁక వానిచెక్కులు నొక్కుదమే ॥ దోమ ॥ 522

రేకు 789 లలిత

నీతి యెంచి నాయకుఁడు నిన్నేమీ ననక నగె
చేతుల మొక్కి ప్రియాలు చెప్పఁగదవే ॥ పల్లవి ॥

వెంగెము లాడఁజనదు వేఁడుకొనవలెఁ గాని
పంగెము గలట్టిసతి పతి నేపొద్దు
వుంగరాలవేళ్ల చేత నూఁది వూఁది యీతని-
నెంగిలిమోవి మాఁటల నేల దూరేవే ॥ నీతి ॥

అలుగఁ దగదు మరి నాస చూపవలెఁ గాని
వలచినజవరాలు వంచనతోను
తలవంచుకొని యిట్టె తలుపు మాటున నుండి
యెలయింపుసణఁగులు యేల రాల్చేవే ॥నీతి॥

కడు సిగ్గుపడరాదు కాఁగిలించవలెఁ గాని
యెడసి వుండఁగలేనియింతి లాలించి
అ(అ?)డరి శ్రీవేంకటేశుఁ డట్టె నిన్నేలితే మెచ్చె
యిడియకుండాఁ జన్నుల నెంత వొత్తేవే ॥నీతి॥ 523

సాళంగనాట

ఆదేవారి నెఱఁగవు అందాలు సేసుక నీవు
యేడనైనా వెకలివై యెమ్మెలు చూపేవు ॥పల్లవి॥

అలయక పతితోడ నాడేవు మాఁటలెల్లా
వెలినుండి యాతఁడు వినీనంటాను
కలికితనాల మరిఁ గవకన నవ్వేవు
పలునీనటనలకు భ్రమసీనంటాను ॥ఆదే॥

సారెకు నప్పటి నీవు చన్నుల నొత్తే వతఁడు
వూరకే యెంతవడైనా నోరిచీనంటా
తేరకొనఁ జూచి చూచి తేలించేవు కన్నులను
వేరఁ బెట్టి యాస నీపైఁ బెంచీనంటాను ॥ఆదే॥

చేతిమీఁదఁ జేయి వేసి చెనకే వాతని నీవు
కాతరించి నీచేఁతకుఁ గరఁగీనంటా
యీతల శ్రీవేంకటేశుఁ డేలె నన్ను నీవుఁ దర-
వాత నాతనిఁ గూడేవు వలచునంటాను ॥ఆదే॥ 524

శంకరాభరణం

నెట్టనఁ గస్నియ యిది నీకాఁగిట నెదిగ
చుట్టము పట్టమేలేసుదతి నీకాయ ॥ పల్లవి ॥

ముప్పిరి నింతిచన్నులు మొలచిన(నా?)నాఁటికి
గొప్పలై తిప్పలై కొండలాయను
యిప్పు డిట్టె చూడఁగానె యీపెకన్నులు ముత్తెపు-
చిప్పలై విప్పులై చిలుకమ్ము (?) లాయను ॥ నెట్ట ॥

కారుకమ్మి నెరులివి కలికికొప్పులోనికి
మూరలై బారలై మోపులాయను
యీరీతిఁ దీరుగల దీపెపిరుఁ దింతలో
భారమై తోరమై బండికండ్లాయను ॥ నెట్ట ॥

భోగించునీలేమపాందైనకరములు
సోగలై బాగులై తీగెలాయను
యీగతి శ్రీవేంకటేశ యీకెచక్కఁదనాలు
పో (ప్రో?) గులై లాగులై పూజలు నీకాయను ॥ నెట్ట ॥ 525

కన్నడగౌళ

అతిరాజసపుదొరయంటా నుంటిమి
రతిరాజవిద్యలకు రాజుగదవమ్మా ॥ పల్లవి ॥

వలపు నిలుపలేక వచ్చినమగువరాక
తిలకించి చూచి దయదలఁచీఁ బతి
వలలఁ జిక్కినమగువలకు నీతఁడెంత
సులభుఁడై వున్నాఁడు చూడరే వోయమ్మా ॥ అతి ॥

ఆసతోడ జవరాలు అట్టె జాణతనాలాడ
లాసి తానూ బత్తిగడుఁజేసీఁ బతి
సేసవెట్టినకాంతలు చెప్పినట్టెల్లా విని
చేసూటినే మెలఁగిని చెప్పఁ గొత్తలమ్మా ॥ అతి ॥

వాడికకాంతఁ దొలుతఁ గూడుక నన్నూ నేలె
వేడుకకాఁడు గదె శ్రీవేంకటపతి
జా డెరఁగి వారివారిచనవులు చెల్లించి
తోడఁ బెండ్లికొడుకై దొరసీ నోయమ్మా ॥ అతి ॥ 526

రీతిగౌళ

పతిదెచ్చుకొన్నయట్టిభామ నీకుఁ జెల్లెలు
అతివరో వీరికంటె నాపె నీకు మేలు ॥ పల్లవి ॥

కట్టినది చంద్రకావి కన్నులు మరుబాణాలు
పెట్టినకొప్పే తుమ్మెదపిండు గాదా
[1] చుట్టరిక మిందు నేది సుదతి విరహావేళ
యెట్టు బిగించేవు రావే యిఁక నేడ యలుక ॥ పతి ॥

చిలుకలే పలుకులు చిగురుఁబట్టెము మోవి
కలికి నీచన్నులే జక్కవలు గావా
వలచిన వుండిన వేళ వారే నీకు వేఁగు గాదా
అలయక యిఁక రావే అయఁ బోయ నలుక ॥ పతి ॥

పొదలుచిరుఁదొడలు (?) పొందగునూర్పు లేగాలి
కొదలేనినీయెలుఁగే కోవిల గాదా
యిదివో శ్రీవేంకటేశుఁ డిట్టె నిన్నుఁ గూడినాఁడు
పొదిగె నీవే నీమేనై పుట్ట దిఁక నలుక (?) ॥ పతి ॥ 527

---

1. దీనిభావము స్పష్టము కాలేదు.

మాళవిగౌళ

ఏమయ్యా వూరక చూచే వెత్తి కాఁగిలించుకొక
ఆముకొన్న యాసోదాన నలయుచున్నది ॥ పల్లవి ॥

చిత్తము నీపైఁ బెట్టి సిగ్గులోఁ దాఁ దలవంచి
హత్తి వూడిగాలు సేసీ నదివో చెలి
బత్తి నీపైఁ బెట్టుకొని పాదాలు వా(|వా?)సుకుంటా
కొత్తవలపులతోడ గుబ్బతిలీని ॥ ఏమ ॥

పాయము నీకప్పగించి పాపట దువ్వుకొంటా
పాయక కొలువులోన భావించీఁ జెలి
దోయఁడుచేతుల మొక్కి తూఁగుఁ జెమటలతోడ
సోయగపుఁజూపులఁ జూచి చొక్కీని ॥ ఏమ ॥

తాళి నీకుఁగాఁ గట్టి తనలోనే గుట్టుతోడ
తాలిమితమకమున నైవారీఁ జెలి
యీలీల శ్రీవేంకటేశ ఇంతలో నీవు గూడఁగ
మేలిమిసంతోసాన మించి చెలఁగీని ॥ ఏమ ॥ 528

రేకు - 790 దేసాళం

వచ్చె నదివో రమణుఁడు వాకిటి కోచెలులాల
పచ్చిదేర నొక్కమాటే పలుకరే యిపుడు ॥ పల్లవి ॥

వెలఁదికి వెలినున్నవిభునిఁ దోడుకరాక
చెలు లేమిచెప్పినాను చెవిఁ బట్టవు
మలసి యాతనితోడ మాఁటలెల్లా నాడక
పలువుపచారాలు పనిరావు ॥ వచ్చె ॥

చన్నులపై నాతనిమై సారె నప్పళించుకోక
సన్న లెంతసేసినాను సమ్మతిగాదు
కన్నుల నాతనిరూపు గక్కనఁ గనుఁగొనక
వున్నతి మీరాకలకు వుల్లము గరఁగదు ॥వచ్చె॥

తిరమై యాతనిమోవితేనె చవిచూడక
సరుగ మీకానుకలు సంగతిగావు
యిరవై శ్రీవేంకటేశుఁ డింతలోనె యీకెఁ గూడె
వెరగయ్యా మీనేర్పులు వెలితిలేవు ॥వచ్చె॥ 529

## మేఘరంజి

ఇందాఁకా నెఱఁగవా యిందరూ వద్దనుండేది
సందడి నింతటిలోనే సటలేల సేసేవు ॥పల్లవి॥

కంకణము గట్టితివి; కలికి శిరసుమీఁద
బింకముతో శాసలూనూఁ బెట్టితివి
అంకెల గుబ్బలమీఁదిహారములు దిద్దితివి
యింక మమ్ముఁ జూచి సిగ్గులేల పడేవయ్యా ॥ఇందాఁ॥

ప్రేమ మోము చూచితివి పెండ్లికొడుకవైతివి
దోమటి దొడికితివి దొరతనాన
ఆముకొని వొకరొక రంగము లంటుకొంటిరి
చేముంచి మమ్ముఁ జూచేల సిగ్గువడేవయ్యా ॥ఇందాఁ॥

పానుపుపైఁ గూచుంటిరి బాగా లందుకొంటిరి
పూని తెరలో నిందాఁకా భోగించితిరి
కానుకలు నేమియ్యఁగా గక్కన శ్రీవేంకటేశ
చే నందుకొంటా నేల సిగ్గువడేవయ్యా ॥ఇందాఁ॥ 530

కురంజి

ఔరా మంచి జేర వపుదు వన్నిటానీవు
సారె పయ్యెదమాటున జట్టిశాయవచ్చేవు ॥ పల్లవి ॥

బలునాగుబ్బలనేటి బంగారుకుండలు
వె(వి?)లువలు సేసేటివెరవే మారును
కొలఁదిమీరినవన్నె గోరనే వొరసి నీవు
తులఁదూఁచే నంటాను తొడికి పట్టేవు ॥ ఔరా ॥

మొల్లమిఁ గెమ్మోవియనేముద్దుగారేపగడము
చెల్లఁబో వె(వి?)లువలింకాఁ జేయవచ్చేవు
వెల్లుగా నీములువాఁడిబిత్తరిమూపుఁ జూచి
చిల్లుల సూదివాట్లు సేయఁగ బూనేవు ॥ ఔరా ॥

నిండురంగులైననానెరులనేసీలాలు
అండనే వె(వి?)లువ సేసే వప్పటి నీవు
వెండిపైఁడిగల శ్రీవేంకటేశ నన్ను నేలి
మెండగురతుల నీమీఁద వేసుకొనేవు ॥ ఔరా ॥531

భైరవి

నెంత పరభారము నీది కాదా
పలుమారు నిది యాల పచ్చిసేసేవయ్యా ॥ పల్లవి ॥

కొలువులోపల నుండి గొబ్బున మై చమరించి
చెలియ నీమోము చూచి సిగ్గువడెను
వలపులరసములు వడిసితే నేమాయ
యేలమి నీ విందుకేల యింత నవ్వేవయ్యా ॥ నెలఁత ॥

నీతో మాటలాడి యాడి నివ్వెరగు నొంది నీపై
చేతినిమ్మపండు వేసి సిగ్గువడెను
కాతరాన నీది నీకుఁ గానికైతే నేమాయ
యీతల నిందుకుఁగాను యేల నవ్వేవయ్యా ॥ నెలఁత ॥

వడిఁ జాదా లొత్తి పరవశమంది నిన్నుఁ గూడి
చిడుముడి తెలివొంది సిగ్గువడెను
అడరి పాయపుమద మంతసేసితే నేమాయ
యెడల శ్రీవేంకటేశ యేల నవ్వేవయ్యా ॥ నెలఁత ॥ 532

భూపాళం

ఎటువంటియాగడీఁడ వేమి చెప్పేము
సటలనే కాంతలను సాదించ నేర్చితివి ॥ పల్లవి ॥

వచ్చి వచ్చి తొంగి చూచి వాడిక పొందులు సేసి
రచ్చఁ బెట్టితివిగా రామవయసు
యెచ్చట నీతో నవ్విన దెటువంటియాఁటదైనా
గచ్చురేఁగి మిక్కిలి కాకరి గాకపోవునా ॥ ఎటు ॥

అఁయాలంటఁ గూచుండి యట్టె జూజాలాడి
బాయట వేసితివిగా పడతిసిగ్గు
చాయల నీవున్న వూరసతి యెవ్వతె వుండినా
కాయజవిద్యలఁ గతకారి గాకపోవునా ॥ ఎటు ॥

పలుమారు విడె మిచ్చి వచ్చిమాఁటలాడి కూడి
కళలు రేఁచితివిగా కాంతనెమ్మోము
యెలమి శ్రీవేంకటేశ యేలితివి నన్ను నీకు
వలచిన దెప్పుడూ వెకలి గాకపోవునా ॥ ఎటు ॥ 533

శ్రీరాగం

ఇదివో నీజాణతనా లేమి చెప్పేది
పొదిగి భూసతిని పీఁపునఁ గట్టుకొంటివి ॥ పల్లవి ॥

అంత నేఁ జక్కనిదాననంటా నన్నే పొగడేవు
ఎంత లేదు నీసుద్దు లేమిచెప్పేది
యింతేసి నేరిచికా యెమ్మెలఁ దులిసేదేవి
పొంత నెత్తిఁ బెట్టుకొని పూజ గైకొంటివి ॥ ఇది ॥

వాడలోన నే నీకు వలతునంటా నాడేవు
యేడ గొద్ది నీమహిమ లేమిచెప్పేది
వేడుక లిట్టె రేఁచికా విరిఁదమ్మిపూవుల
మేడెపులకిమమ్మను మెడఁ గట్టుకొంటివి ॥ ఇది ॥

గట్టివి నాచన్నులంటా కాఁగిట బిగించేవు
యిట్టి నీగుణాలెల్లా నేమిచెప్పేది
చుట్టరికాలే చూపి సొరిది శ్రీవేంకటేశ
బెట్టుగాఁ బదారువేలఁ బెండ్లియాడితివి ॥ ఇది ॥ 534

రేకు 791 సౌరాష్ట్రం

చెలులము కన్నమాఁట చెప్పితి మింతే
నెఱకొన్న నీచిత్తము నీకే తెలుసును ॥ పల్లవి ॥

సేసుకొన్న దేవులు సేవ నీకుఁ జేసీ నిదే
ఆస నీ కెక్కడ నుందో అదే రంగము
సేసవెట్టేతమకానఁ జెలికిఁ బయ్యెద జారీ
నీసూటి యెందున్నదో నీకె తెలుసు ॥ చెలు ॥

యిక్కువైనయిల్లాలు యెదుటనే నీ కున్నది
అక్కర నీ కెందున్నదో అదే రంగను
తొక్కులాడేవేడుకను తొయ్యలి మేను సోఁకి
నెక్కొన్న నీ పియ మేదో నీకే తెలుసును ॥ చెలు ॥

పాయపుపట్టుపురాణి పానుపుపై నే వున్నది
ఆయ మెందు ముట్టునో అదే రంగము
చేయివేసేసరసాన సిగ్గుల నవ్వులు రేఁగీ
నీయిచ్చ శ్రీవేంకటేశ నీకే తెలుసును ॥ చెలు ॥ 535

నాదరామక్రియ

ఆఁటది గూళయైతే నంఁదేమున్నది
బూటకపుదిస చూపి పొత్తు గలసీనా ॥ పల్లవి ॥

నవ్వుకొంటా నీవు నేను నంటున వినోదించఁగ
పువ్వులఁ దానేల వేసీఁ బొంచి నిన్నాకె
యివ్వలఁ జెంత సరస మీ[1]ఁతా మోఁతాలై(?) యుండఁగ
దవ్వులఁ బొందులు చూపి తమి రేఁచీనా ॥ ఆఁట ॥

వెన్నెలలో నీవు నేను వేడుకతోఁ గూడి యుండఁగ
సన్నలు తానేల సేసీ సారె నీ కాపె
పన్నినరతు లీడఁ దెప్పలుఁ గుప్పలై యుండఁగ
యెన్నటిపొందులో చూపి యింపు రేఁచీనా ॥ ఆఁట ॥

బలిమి నిద్దరమును పానుపుపైఁ గూచుండఁగ
యెలుఁగెత్తేమిపిలిచీ వెలి నిన్నాపె
వలపు శ్రీవేంకటేశ వాడికై యిందు నుండఁగ
సొలపుఁబొందులు చూపి సొంపులు రేఁచీనా ॥ ఆఁట ॥ 536

1. ఈఁదగాలి మోదుటయా?

సాళంగనాట

అంగనసుద్దులు నీ వేమడిగేవయ్యా
చెంగట నుండి నీవే చిత్తగించవయ్యా ॥ పల్లవి ॥

చెలియ నీరూపము చిత్తరుపటాన వా(|వా?)సి
పొలుపు మిగులఁ దానే పూజించును
కొలువునేసి మరి కొంతవడి నీపేరు
పలుమారు నొడివి జపము నేసును ॥ అంగ ॥

సరుగఁ బొద్దున వంట చవులుగా వండి వడ్డి
పరగఁగ నీకు [1]నుపార(పాహార?) మిచ్చును
అరిది నీప్రసాద మారగించి నీపతిమ-
నురమునఁ బెట్టుకొని వుయ్యాల లూఁచును ॥ అంగ ॥

బాగాలు నీ కొప్పనేసి భావము నీపైఁ బెట్టి
యోగిణి(ని?)యై యానందాన నోలలాడును
యీగతి శ్రీవేంకటేశ యేలితి వింతలో వచ్చి
ఆగురుతు లెల్లాఁ జూడు మట్టె నీకు మొక్కును ॥ అంగ ॥537

సామంతం

యం(ఎం?)త చక్కనిది నీకు నెక్కడఁ గలిగె నయ్యా
పంతపు నీచెలులెల్లా భ్రమసిరి చూచి ॥ పల్లవి ॥

నిగనిగమెరిచేటినిమ్మపండువంటియంతి
చిగురువేళ్లఁ దురుము చెక్కుకొంటాను
జిగి మించఁ జంద్రకావిచీర గట్టుకొని నీతో
పగటుగుబ్బ లదర పకపక నవ్వెను ॥ ఎంత ॥

---

[1] ఉపార; ఉపాహారశబ్దభవమా ?

పసనిగుండుఁ జేతుల బంగారువంటియింతి
పొసఁగఁ దామర చేతఁ బూఁచుకొంటాను
యెసఁగ వింతసొమ్ములు యెన్నైనాఁ బెట్టుకొని
కొసరి దంతకాంతులఁ గులికి మాటాడెను ॥ ఎంత ॥

వరుసఁ బద్మరాగాలవంటిపాదాలయింతి
సరుగ గందవొడి మైఁ జల్లుకొంటాను
తెరలో శ్రీవేంకటేశ తేఁకువతో నిన్నుఁ గూడి
సిరులఁ గొలువులోనఁ జేరి సన్న సేసెను ॥ ఎంత ॥ 538

ముఖారి

ఏమిచెప్పేమయ్యా నీవే యెరుఁగుదువు వలపు
వాములాయ నీకు నాకు; వదలకు వలపు ॥ పల్లవి ॥

చలము గలిగితేను చాయకువచ్చు వలపు
అలుగకుండితేను అంటు వలపు
బలిమిఁ బెనఁగకున్న పాయనియ్యదు వలపు
నిలిచిపోకుండితేను నెట్టుకొను వలపు ॥ ఏమి ॥

వచ్చినట్టే వచ్చితేను వసమైయుండు వలపు
ముచ్చటలు గలిగితేను ముంచు వలపు
కొచ్చికొచ్చి కొసరితేను కొనసాగును వలపు
యిచ్చకము లాడితేను యియ్యకోలౌ వలపు ॥ ఏమి ॥

యెడమాఁట లాడితేను యెంతైనా నిండు వలపు
యెడతెగకుండితేను హెచ్చు వలపు
అడరి శ్రీవేంకటేశ యట్టె నన్నునేలితివి
పెడరేఁచితే నెంతైనాఁ బెరుగును వలపు ॥ ఏమి ॥ 539

మంగళకౌశిక

కైకొని తనమాఁటలు గానిమ్మంటిని
యీకడ నాగుణ మిది యేమిసేతునే ॥పల్లవి॥

మంచిమాఁట లాడఁగాను మరి కోపించఁగరాదు
కొంచక చెక్కునొక్కఁగా గుంపించరాదు
పొంచి తాఁ జేసినచేఁత పోలించి చెప్పఁగరాదు
యెంచ మొగమోటదాన నే నేమిసేతునే ॥కైకొని॥

చన్నులపైఁ జేయిచాఁచఁగా చాలు నోప ననరాదు
కన్నులెదుట నవ్వఁగాఁ గాదనరాదు
వున్నతిఁ దనసుద్దులు వూకొని వినఁగరాదు
యెన్నైనా నిచ్చకురాల నేమిసేతునే ॥కైకొని॥

తక్కక కాఁగిలించఁగాఁ దప్పించుకొనరాదు
పుక్కటివిడె మివ్వఁగఁ బోవఁగరాదు
యిక్కడ శ్రీవేంకటేశుఁ డింతసేసి నన్నుఁ గూడె
యిక్కువ సిగ్గరికత్తె నేమిసేతునే ॥కైకొని॥ 540

రేకు - 792 నాగవరాళి

ఆనతిచ్చేవు నాతోను ఆపెమీఁది మోహమున
కానీవయ్యా తనసిగ్గు కాముకుఁ డెరుఁగునా ॥పల్లవి॥

యితవరి యయినసతి యేమాఁటలాడినాను
తతితో మగని కవి తలఁపులౌను
రతివేళ నెటువలె రాజసము చూపినాను
కతలుఁ గారణములై కడువేడుకౌను ॥ఆన॥

చుట్టమైనకాంత యంత సొలసి చూచినాను
దట్టమై విభుని కవె తలఁపులౌను
ముట్టి చెనకేటివేళ మొనగో రెంతమోసినా
గట్టిగా మేన మదనకళలెల్ల రేఁచును ॥ అన ॥

తగువై నవనిత యెంత గుబ్బల నొత్తినాను
తగుమర్మములు సోఁకి తలఁపులౌను
నిగిడి శ్రీవేంకటేశ నేఁడు నన్ను నేలితివి
తగిలి యవియు నీపీఁ దారుకాణలౌను ॥ అన ॥ 541

## శోకవరాళి

పొంచి నీచక్కఁదనము పొగడితే నేమాయెనే
కొంచి కొంచి వలపేల గుట్టున దాఁచేవే ॥ పల్లవి ॥

మొగమెత్తి నన్నుఁ జూచి మోవి గొంత గదలించి
పగటున నిదియేల పంతాలాడేవే
చిగురునీచేతులు చెక్కిటఁ జేర్చుకొని
సగము గొసరి యంత జంకిఁచేవే ॥ పొంచి ॥

బలిమిఁ జన్నుమీఁదిపయ్యెద బిగించుకొంటా
చలముల సణఁ గెంత చల్లవచ్చేవే
చెలపఁచెమటలు చెరఁగున నద్దుకొని
యెలమి నవ్వుతాఁ బాద మేమిదొక్కేవే ॥ పొంచి ॥

తీపులై నవలపుల తేనెలు పూసి పూసి
పైపైనే సిగ్గులెట్టు పచారించేవే
యేపున నలమేల్మంగ నేను శ్రీవేంకటేశుఁడ
రాపగుకూటము లెందు రచ్చవేసేవే ॥ పొంచి ॥ 542

శ్రీరాగం

అయ్యో యిప్పు డిచ్చకము లాడేవు గాక
గయ్యాళిచేఁతలఁ గాక కైవశ మయ్యేవా ॥ పల్లవి ॥

కన్నుల జంకించక కరఁగునా నీమనసు
సన్నలు సేయక యాసలు రేఁగునా
వున్నతి నిన్నుఁ గొసర కూరకే లోనయ్యేవా
యెన్నఁగ నే గబ్బినంటా నేల నన్ను దూరేవు ॥ అయ్యో ॥

కదుఁ జన్నుల నొత్తక గట్టిపడునా నీమేను
వొడివట్టి తియ్యక వొడఁబడేవా
చిదుముడిఁ బెనఁగక సిగ్గులు విడిపడునా
గడుసరిదాననంటాఁ గాఁతాళించేవు ॥ అయ్యో ॥

సమరతులఁ గూడక చక్కనౌనా నీగుణము
తమకించి మోవియ్యక దప్పి దీరునా
అమర శ్రీవేంకటేశ యంతలో న న్నేలితివి
జమళిరట్టడినంటా సరస మాడేవు ॥ అయ్యో ॥ 543

నాదరామక్రియ

మిక్కిలి మేలుదానవు మెలుత నీ వాతనికి
యెక్కడ సవతిబీరా లీసనితో నేఁటికి ॥ పల్లవి ॥

రమణి నీమొగ మెత్తి రమణునిఁ జూడవే
చెమటచెక్కులచేతిచింత లేఁటికి
సముకమున వలపు చల్లుతా మాఁటాడవే
బొమముడితోడుత పొగపొచ్చ మేఁటికి ॥ మిక్కి ॥

చెలియరో యీతనితో చిరునవ్వు నవ్వవే
సొలపులజంకెనలు చూప నేఁటికే
చెలరేఁగి విడెము చేతికి నందియ్యవే
వలవనిసటలతో వట్టిజాగు లేఁటికి ॥ మిక్కి ॥

వేవేగ జవరాల శ్రీవేంకటేశు మెచ్చవే
కోవరపుసణఁగుల గుట్టేఁటికి
యీవేళ నిన్నితఁ డేలె యిచ్చకము సాయవే
పూవులవేటు లాడ జంపులసిగ్గు లేఁటికి ॥ మిక్కి ॥ 544

## బౌళిరామక్రియ

మారుకు మారుసేసితే మరికొంత రొక్కుడాయ
యీరు దియ్యఁ బేను వచ్చె నిఁకనేలే చింత ॥ పల్లవి ॥

చనవున జవరాలు చల్లె నీపై వసంతము
కొనచూపుల నింతేల కొచ్చి చూచేవు
వొనర నందుకు నీవు వోరుచుకోవై తివి
పెనఁగులాడఁగఁబోతే పిప్పిగట్టె మోవి ॥ మారు ॥

మన్నింతువంటా నాకె మాఁట నిన్ను సోఁక నాడె
సన్నలనే యింత యాల జంకించేవు
చెన్నుమీర నది నవ్వుసేసుకోవై తివి
కన్నెచన్ను లంటఁబోతే కాయగాచె నురము ॥ మారు ॥

ననుపున లలితాంగి నాఁటఁగఁ జన్నుల నొత్తె
పనివడి సారె నేల పంత మాడేవు
యెనసితివి శ్రీవేంకటేశ నీ వందుకుఁ గాను
చెనఁకఁగఁ బోతేను చెమరించె మేను ॥ మారు ॥ 545

హిందోళం

ఎక్కడో సవతిమాఁట కింత చింత నీకేల
చెక్కు నొక్కి రమణుఁడు సేద దేర్చఁగాను ॥పల్లవి॥

గుట్టుతోఁ బతి నేపొద్దుఁ గూడివుండేయట్టినీకు
పట్టినచలము లేలే పడఁతి
జట్టిగొని యాతనితో సరసమాడేనీకు
వట్టిమోనమున నేల వా(వ్రా?)సే విదియేమే ॥ఎక్క॥

మొలకనవ్వులతోడ మోము చూచేయట్టినీకు
తలవంచుకొన నేలే తరుణి
చలిగుబ్బల నతని సారె నద్దుకొనేనీకు
నిలువు నివ్వెరగులు నేఁడిది యేఁటికే ॥ఎక్క॥

రాసి శ్రీవేంకటేశ్వరు రతి నోలలాడేనీకు
సేసకొప్పుతోడ నిఁక సిగ్గు లేఁటికే
బాసయిచ్చి యతఁడు నీపంతము చెల్లించె నీకు
మోసపోకతనిఁ బొంది మొక్కు మొక్క నేఁటికే॥ఎక్క॥546

రేకు-793 రామక్రియ

విన్న[1] వించరే యీమాఁట వీనులఁ బట్టిఁ గాని
అన్నిటా వెన్నెలనాఁడే యల్లునే రేళ్ల ॥పల్లవి॥

తలపోసి తలపోసి తమకమే గనమాయ
యెలమి నారమణుఁడు యేమిసేసీనే
యిలపై నుప్పు చింది యినుమడాయ నందురు
వలపులు తనపైఁ జింది వడి ముమ్మడాయనే ॥విన్న॥

1 ఈపాటలోని భావము స్పష్టము కాలేదు.

విని విని మనసులో వేడుకలే గనమాయ
ఘనుఁడైన తనకు నెక్కడి పరాకే
చెనకి వావి చె (చి?)ట్లచేటఁడాయ నందురు
కొనవాఁడినాగుఱ్ఱలు కోటానఁగోట్లే ॥ విన్న ॥

యెదురులుచూచి చూచి యేఁకటలే గనమాయ
యిదివో తనరాక యింక నెప్పుడే
అడనుఁ బదనుఁ గూడె నందురు శ్రీవేంకటేశుఁ-
గదిసినరతివెద కంతునియామనె ॥ విన్న ॥ 547

వరాళి

కామిని చెలికత్తియఁ గన విన్నవించితి
ప్రేమజవ్వనమదపు పెండ్లికొడుకవు ॥ పల్లవి ॥

నివ్వెరగుతో నున్నది నెలఁత నిన్నుఁ జూచి
చివ్వన మోవి గంటిసేసేవు సుమ్మీ
వుప్పిళ్లూరేనలపుల నొడ్డించుకో నెరఁగదు
నొవ్వఁ బిసుకకుమీ చన్నులు కడుగొప్పలు ॥ కామి ॥

కోరికల తలపోఁతఁ గొలువులో నున్నది
చేరి సిగ్గులు బయలుసేసేవు సుమ్మీ
గారవపు మెయిసోఁకులఁ గరఁగుతా నున్నది
గోర గీరేవు సుమీ చెక్కులు కోమలములు ॥ కామి ॥

పట్టరానితమితోడఁ బారా లొత్తుతా నున్నది
చిట్టకములెల్లా నేఁడే సేసేవు సుమ్మీ
గట్టిగ శ్రీవేంకటేశ కలసితి వీకె మెక్కి
పట్టకుమీ తురుమిది బారెఁడేసినెరులు ॥ కామి ॥ 548

కాళి (క?)

ఇంత సేసి వున్నాఁడవు యెరఁగనట్టే యీడ
సంతోసవార్త చెప్పితిఁ జనవియ్యనయ్యా ॥పల్లవి॥

కలికికి నీచూపు కలువపూదండయై
యెలమి మెడఁ దగిలె నిఁక రావయ్యా
తలకెక్కినవలపు దట్టపు బాసికమాయ
పిలిచీ నాపె నిన్నుఁ బెండ్లాడవయ్యా ॥ఇంతా॥

నీవు వెట్టినవిడెమె నిశ్చయతాంబూలమాయ
వేవేగ సింగారించుక విచ్చేయవయ్యా
మూవంక పెంజెమటలే ముత్యాల శాసలాయ
కావించి కంకణ మిట్టె కట్టుకొనవయ్యా ॥ఇంత॥

పూని నీవాడినమాఁటే బువ్వపుఁబొత్తు గలసె
పానుపుమీఁదికి నిఁకఁ బ(బం?)డవయ్యా
యీనెపాన శ్రీవేంకటేశ యీకె నేలితివి
తేనెమోవివిందులతోఁ దెప్పలఁ దేలవయ్యా ॥ఇంత॥ 549

వేళావళి

ఎంత గబ్బితనమని యెంచుకుమీ
చెంతనున్న చెలులము చెల్లు మాకుఁ జుమ్మీ ॥పల్లవి॥

చెలియకు మాఁటపట్టు సేసినాఁడవు గనుక
వెలయ నీ కొత్తి విన్నవించితిమి
యెలమి నాపెవలపు యెరుఁగుదువు గనక
పిలిచి కొంగువట్టి పెనఁగితిమి ॥ఎంత॥

మగువను నీ వింతేసి మన్నింతువు గనక
బిగిసి యీపెపై నాన వెట్టితిమి
పగటున నీవు గడుబత్తిగలవు గనుక
సొగిసి నీతో నింత నొలసితిమి ॥ ఎంత ॥

యిందుముఖికిఁ జనవు లిచ్చినాఁడవు గనక
అందలానఁ దెచ్చితిమి యలమి నిన్ను
యిందు నీకెను శ్రీవేంకటేశ యేలితి గనక
ముందు ముందుగా నీకు మొక్కితిమి ॥ ఎంత ॥ 550

### శోకవరాళి

అన్నిటాఁ దనకు మేలే యంగన యేల వీఁగీనే
మన్నించీ నాతఁడు నెమ్మది నుండుమనవే ॥ పల్లవి ॥

కలికి చందురుఁ జూచి కన్నులేల మూసీనే
కలువరేకులే యివి గదవే తొల్లి
జలజాలఁ బోలునని జడిసీనో యటులైతే
అలవిరహాసూర్యుండు అండ నున్నాఁడుగదే ॥ అన్ని ॥

యింతి చలిగాలి చూచి యేమిటికి లోఁగీనే
అంతాఁ జందనగంద మంగమేకదే
బంతిఁ దన కారనేటిపాము వొళ్లఁ గలిగితే
దొంతరచనుఁగొండలు తోడున్నవిగదవే ॥ అన్ని ॥

కొమ్మ కోవెలకుఁగాఁ గొంకనేలే తనమోవి-
నుమ్మడి నామనికాల మున్నది గదే
నెమ్మది శ్రీవేంకటాద్రినిలయరాముఁ డేలితే
కిమ్ములసంగాతము సుగ్రీవ మున్నదిగదే ॥ అన్ని ॥ 551

### శుద్ధవసంతం

ఇంక నేమిసేయుమనీ నిదేమే తాను
కంకణము గట్టుకొంటిఁ గరుణించమనవే ॥ పల్లవి ॥

నానుపున నవ్వులతో నన్నేల వేఁడుకొనీనే
మోనమునఁ దనకు నే మొక్కితిఁగదే
పూనుక చెవిలో తట్టుపునుఁ గేల వూసీనే
కానిమ్మని తనమాఁట కైకొంటిఁగదవే ॥ ఇంక ॥

అగ్గలమై తమ్ముల మిడి యాసలేల పెట్టీనే
సిగ్గునఁ బంతము చెల్లించితిఁగదవే
దగ్గరఁ గూచుండి యాల తమకము రేఁచీనే
సగ్గక తనచేఁతకు సమ్మతించితిఁగదే ॥ ఇంక ॥

పెదవితేనియ లాని పిప్పి యాల సేసీనే
వుదుటుగుబ్బలఁ దను నొత్తితిఁగదే
యిదివో శ్రీవేంకటేశుఁ డింక నేల కొసరీనే
పొగిడి తనకూటమిఁ బొగడితిఁగదవే ॥ ఇంక ॥ 552

రేకు - 794

### వసంతం

ఇంత వలపించితి విట్లానే రావయ్యా
పొంతల నీ వున్నాఁడవంటా బొమ్మల జంకించును ॥ పల్లవి ॥

భామ కొంతవడి నీతో బయలు మాటలాడు
ఆముకొని నీవంటా యాందోళన
గోమునఁ జన్నులు మలఁగున నొత్తుదు నీవంటా
కామించినయటువంటికళవళమునను ॥ ఇంత ॥

వనిత కొంతవడి తా వట్టియలుక లలుగు
మనవి చెప్పుతా నీతో మనోరదా(థా?)న
వినయాన వేఁడుకొనుఁ జిలుకను
తనివోనియాసలతమకంబునను ॥ ఇంత ॥

పడఁతి వూరకె నిన్ను భావించి నవ్వులు నవ్వు
తడయక కాఁగిలించు తలపోఁతల
అడరి శ్రీవేంకటేశ యంతలో నీకు మొక్కి (క్కి?)
జడియక కూడినసంతోసమునను ॥ ఇంత ॥ ౫౫౩

## మాళవి

పోటిచెలికత్తెఁ గాన పూఁచుక నే మాఁటాడితి
ఆఁటది గోలయైతే నట్టే వొత్తుదురా ॥ పల్లవి ॥

కొచ్చికొచ్చి చన్నుపై కొంగు జారఁదీసి తీసి
తచ్చనమాఁటలఁ గళ దాఁకించేవు
యిచ్చగించి నీచేఁతల కిట్టె వోరుచుకుండితే
పచ్చిసేసి సిగ్గు లింతబాయట వేతురా ॥ పోటి ॥

చేరిచేరి చెంపలపై చెమటలు గోరఁజిమ్మి
జీరదీసి వలపులు చిమ్మిరేఁచేవు
నీరువలెఁ గరఁగుతా నిలుచున్నదాని నీవు
వారివీరిముందరను వట్టిరట్టు సేతురా ॥ పోటి ॥

చెప్పిచెప్పి కాఁగిలించి జిగిమోవి చవిచూపి
చొప్పుగాఁ గూడి కడుఁ జొక్కించేవు
యిప్పుడె శ్రీవేంకటేశ యిల్లాలయినదాని
అప్పసమై రతి నింతయలయింతురా ॥ పోటి ॥ 554

కాంబోది

అప్పటివావు లడిగీ నద్దిరా వీఁడు
చెప్పరానిచేఁతలెల్లాఁ జేసీనే వీఁడు ॥ పల్లవి ॥

చల్లలమ్మేచోటనెల్ల జాణతనా లాడీ వీఁడు
పిల్లఁగోవిరాగాల బెల్లించీ వీఁడు
గొల్లెతల నేడసై నాఁ గొంగులువట్టీ వీఁడు
యిల్లిల్లు దప్పక వున్నాఁ డెవ్వడే వీఁడు ॥ అప్ప ॥

చేరి చుట్టరికాలెల్లాఁ జెప్పి కాఁగిలించీ వీఁడు
నీరాడేచోటులనెల్ల నిలిచీ వీఁడు
యేరులో జాగరాలు సేయించీ వేగినంతా వీఁడు
దూరులకు వెరవఁ డెం[1]దుండి వచ్చె(చ్చీ?) వీఁడు ॥ అప్ప ॥

చక్క వచ్చి నిద్రించఁగా సంగడిఁ బండీ వీఁడు
ఇక్కవలంటాఁ బట్టీ చన్నులు వీఁడు
వెక్కసపుగుణాల శ్రీవేంకటేశుఁడు వీఁడు
చొక్కపురతులఁ గూడీ చూడరే వీఁడు ॥ అప్ప ॥ 555

సాళంగనాట

ఏఁటికిఁ గాచుకున్నదో యెఱుఁగుదము
కోటి శాయఁ గానుకిచ్చి గుట్టుతోడ నున్నది ॥ పల్లవి ॥

చెలియ విన్నపములు సేయ వచ్చి వున్నదేమో
తిలకించి నీ వడిగి తెలియరాదా
నెలకొని నిన్నుఁ జూచి నివ్వెరగై వున్నదేమో
తలకొన గోర నూఁది తలపించరాదా ॥ ఏఁటి ॥

1. అఖండయతి ఇది. వీరి రచనలలో చాలనపురూపము.

యెంతవని గలిగి తా నిటు వచ్చి వున్నదో
వింతలుగ లాలించి వినఁగరాదా
చింతతోడఁ జెప్పరాక సిగ్గువడి వున్నదేమో
మంతనానకుఁ దీసి మర్మము లంటరాదా ॥ పఁటి ॥

వెస నేమి యాసపడి వేళ గాచుకున్నదో
పొసఁగ నాపెఁ దనివిఁ బొందించరాదా
యెసఁగ శ్రీవేంకటేశ యిట్టె నన్ను నేలితివి
సుసరాన నాపెఁ గూడి చొక్కించరాదా ॥ పఁటి ॥ 556

### రామక్రియ

నీకేల చలము నెట్టుకొన్న విభుఁడవు
ఆకెకుఁ జనవు లిచ్చి యాదరించరాదా ॥ పల్లవి ॥

పంతము లాడితే నేమి పట్టి పెనఁగితే నేమి
కాంతుఁడ నీపై బత్తిగలదానికి
చెంతఁ గొసరితే నేమి సిగ్గులు వడితే నేమి
సంతోసాన విఱ(ఱ్ఱ?)వీఁగే జవ్వనపుదానికి ॥ నీకే ॥

నెలవి నవ్వితే నేమి చేతులు చాఁచితే నేమి
అలరి నిన్నుఁ జెనకేయట్టిదానికి
నిలుచుండితే నేమి నిన్నిట్టె చూచితే నేమి
తలకొని సేవసేసి తనియనిదానికి ॥ నీకే ॥

సంగడిఁ గూచుంటే నేమి చన్నుల నొత్తితే నేమి
అంగవించి నీకు దేవులైనదానికి
యెంగిలి మోవైతే నేమి యిట్టె శ్రీవేంకటేశ
సంగతైన నిన్నుఁ గూడినసమరతిదానికి ॥ నీకే ॥ 557

కన్నడగౌళ

ఎంత ఆసోదకాడవు యేమి చెప్పేది
దొంతి వెట్టేవు వలపు తొయ్యలులమీదను ॥ పల్లవి ॥

చేరదేసికన్నులాపె చెలి నీకొలువు సేసీ
బారెదేసినెరులాపె పాదా లొత్తీని
సారపుబెదవులాపె చౌలుగా మాటలాడీ
యీరీతి మాతో పొందు లింకా నీకు వలెనా ॥ ఎంత ॥

పట్టెదేసిగుబ్బలాపె బాగా లిచ్చీ నీకు
జుట్టెదేసిపాదాలాపె సురటి వట్టీ
అట్టె పిడికెడునడుమాపె నీకు గుంచె వేసీ
జట్టిగ నాతో సరసము లాడవలెనా ॥ ఎంత ॥

నల్లెదేసిగోళ్లాపె ననుపులు నీకు జేసీ
ముల్లెదేసినవ్వులాపె మోము చూపీని
యిల్లిదె శ్రీవేంకటేశ యిటు నన్ను నేలితివి
వెల్లవిరి నాపై జేయి వేయ నింకావలెనా ॥ ఎంత ॥ 558

రేకు-795 బౌళిరామక్రియ

సుదతిలాగులన్ని జూడవయ్యా
యిదివో నిన్నిలాగున నెలయించీ దాను ॥ పల్లవి ॥

చెలరేగి నీకెంత సేవలు సేసీదాను
పలుమారు దండె మీటి పాడీ దాను
కులికి నీవు చూడగా కొప్పులు వెట్టీ దాను
నిలుచుండి యద్దములో నీడ చూచీ దాను ॥ సుదతి ॥

తనివోక నీదిక్కు తళుకునఁ జూచీఁ దాను
నవిచి నీతో సెలవి నవ్వీఁ దాను
పనివడి నీవొద్దనే పయ్యద జారించీఁ దాను
చినుకుఁ జెమటతోట సిగ్గువడీఁ దాను ॥ సుదతి ॥

మొక్కేదానివలె నీకు మురిపెము చూపీఁ దాను
చక్కఁదనాలెల్లాఁ బచారించీఁ దాను
నెక్కొని శ్రీవేంకటేశ నీవు నేనుఁ గూడుండఁగ
గక్కనఁ జుట్టమువలెఁ గాఁగిలించీఁ దాను ॥ సుదతి ॥ 559

## మేఘరంజి

తానేల సిగ్గువడీ తనకు నాకు భేదమా
మేనదాన నన్నిటాను మేలుదాన ననవే ॥ పల్లవి ॥

వెంగె మాడ నేరఁగాని వినయము కాయ నేర్తు
యింగితాన తనమోహ మేడ నుండినా
సంగతి య (యె?) డ మాఁటలు సారె నాడించీఁ దాను
కంగుదేరఁ దానే యిక్కడకు రమ్మనవే ॥ తానే ॥

చలపట్ట నేరఁగాని సమ్మతించ నేరుతును
వెలుపలఁ దన కేమివేడుకైనను
తెలియనా నే నేమైనా తెరమాఁటేల తనకు
కలఁగదు నామనసు కదియ రమ్మనవే ॥ తానే ॥

కోపగించ నేరఁగాని కూరిమిఁ గూడఁగ నేర్తు
యేపాటి చనవు నా కిట్టె యిచ్చినా
యేపున శ్రీవేంకటేశుఁ డే నలమేలుమంగను
చేపట్టి నన్నేలినాఁడు చేరఁగ రమ్మనవే ॥ తానే ॥ 560

## హిజ్జిజి

ఈతనిఁ జూడఁగదే యిన్నిటికీ లోనైనాఁడు
యేతులాఁడిదానితోడ నెంత మొకదాకిరే ॥ పల్లవి ॥

సిగ్గరికత్తెకుఁ గాని సెలవి నవ్వులు రావు
యెగ్గులాఁడికిఁగాని యీసు లేదు
బగ్గడిదానికిఁగాని పచ్చిమాఁట లమరవు
వొగ్గి యంత దాఁకా దీనివోజ చూచేవే ॥ ఈత ॥

పంతపుదానికిఁగాని పల్లదములెల్ల రావు
జంతకుఁగాని కడుఁజలము లేదు
రంతులరాగకుఁగాని రచ్చ లలవాటు లేదు
యెంతలేదు దీనిసుద్ది లేమిచెప్పేవే ॥ ఈత ॥

నాలివనితకుఁగాని నసుపులు దొరకవు
పే(ప్రే?)లరికిఁగాని రతి ప్రేమ వుట్టదు
యేలే శ్రీవేంకటేశ్వరుఁ డే నలమేలుమంగను
లేవే దీనిచేఁత లేల లెక్కవెట్టేవే ॥ ఈత ॥ 561

## శ్రీరాగం

అనతీవయ్యా నీవు ఆకెకు విన్నవించేము
నాని నాని వలపులు నాఁటుకొనెనా ॥ పల్లవి ॥

సొలసి సొలసి నీకు సుద్దులెల్లాఁ జెప్పి పంపీ
చెలియమాఁటలు నేఁడు చెవిఁ బట్టెనా
యెలమి నెదురుచూచి యెప్పుడు వత్తువో యంటా
తలఁపులోపల నీకు దయవుట్టెనా ॥ అన ॥

బడిబడిఁ దనరూపు పటమున వ్రాసి పంపి
జడియ నీవలపులు సరినచ్చెనా
అడియాల మంపఁగాను యాసపడి వున్నది
యెడయ కా పెకడకు నేతెంచేవా ॥ అన ॥

వినయాన నీకు నుంటవింట గప్పుర మంపి
తనిసి నీ కింతట సంతస మాయనా
యెనసితివి శ్రీవేంకటేశ యీ కెలమేల్మంగ
చెనకీ నిన్నియును నీచిత్తము వచ్చెనా ॥ అన ॥ 562

పళవంజరం

ఏదోకా నెరఁగవు యేమే నీవు
సాదించి మందెమేళాన సరసమాడేవు ॥ పల్లవి ॥

సలిగెలు చెప్పేవు చనవులు మెరసేవు
యెలమి నాతనికి నీ కెన్నటిపొందే
పిలిచేవు పేరుకొని బిగిసే వంతటిలోనే
వలచి నీ కతఁడు కైవస మాయనటవే ॥ ఏదో ॥

కుప్పలుగా నవ్వేవు గుబ్బలు దాఁకించేవు
అప్పుడే చేతిలోనివాఁ డాయనటవే
కప్పేవు పయ్యెదకొంగు కాఁగిలించ వచ్చేవు
చిప్పిలి నీరతులకు సెల విచ్చెనటవే ॥ ఏదో ॥

సన్న లెల్లాఁ జేసేవు సంగడిఁ గూచుండేవు
అన్నిటా నీ వితనికి నాలవటవే
యెన్నఁగ శ్రీవేంకటేశుఁ డే నలమేలుమంగను
మన్నించి న న్నేలినాఁడు మహిఁ గంటివటవే ॥ ఏదో ॥ 563

తెలుఁగుఁగాంబోది

సాము సేసినవాఁడవు జగజెట్టివి నీవు
యీమగువ నీతోను యింతేసి కోపునా ॥ పల్లవి ॥

చెక్కులేల నొక్కేవు సిగ్గువడీఁ జెలియ
మొక్కలానఁ జూడఁగాను మోము వంచీని
కక్కసించ కిఁక నీవు కడలేనిజవ్వని-
నిక్కువ లంటి పెనఁగే వింత కోపునా ॥ సాము ॥

చేయి పైనేల వేసేవు చెమరించీఁ గలికి
ఆయము లంటకు వెరగందీ నిట్టె
కాయము చిమ్మిరేఁచకు కడుఁగడుముద్దరాలు
యీయెడ నెంతేసి నవ్వేవింత కోపునా ॥ సాము ॥

అం దేల ముట్టేవు మొక్కీ నలమేలుమంగ
సందడిఁ గొంగువట్టకు సన్న సేసీని
యిందుముఖిఁ గూడితివి యింతలో శ్రీవేంకటేశ
యిందరిలో మేఁమాడే వింత కోపునా ॥ సాము ॥ 564

రేకు - 796 పాడి

చూచినవారు నవ్వేరు సుదతీ నీచేఁతలకు
యీచాయ నాతనికి నెందరైనా నున్నారు ॥ పల్లవి ॥

జారీ నీపయ్యద చక్కఁబెట్టుకొనవే
చేరి పతి నెందాఁకాఁ జూచే విపుడు
కోరకొప్పు వంగీ నది కూడ ముడుచుకొనవే
నీరువలెఁ గరఁగుతా నివ్వెరగు లేఁటికి ॥ చూచి ॥

చెక్కులవెంటఁ గారేచెమట దుడుచుకోవే
అక్కర నాతనితో మాఁటలాడేవుగాని
చిక్కువడ్డ నీసరులు చక్కదిద్దుకొనవే
వెక్కసపునవ్వులతో విఱ్ఱవీఁగ నేఁటికి ॥ చూచి ॥

వెలిఁబడ్డపులకలు వెసఁ గప్పుకొనవే
అలరి వెనకఁ బెండ్లాడేవుగాని
అలమేలుమంగను నే నతఁడు శ్రీవేంకటేశుఁ-
డెలమి నన్నుఁగూడె నిఁకఁ గరఁగ నేఁటికి ॥ చూచి ॥ 565

### భైరవి

కాఁగిలించుకోవయ్యా కడుముద్దరాలు చెలి-
నీఁగరానికోరికతో నివ్వెరగందీని ॥ పల్లవి ॥

పడఁతిచేత నీవు పాదా లొత్తించుకోఁగాను
వుడివోనివలపుల నుమ్మగిలీని
అడియాస మెయిసోఁకు లటుగొంత చూపఁగాను
కడలేనితమకానఁ గరఁగీని మనసు ॥ కాఁగి ॥

కాంతచేత నీ వప్పటి గందము పూయించుకోఁగా
దొంతరపులకలను తోదోపులాడీ
వింత వింతనీమాఁటల వేడుక పుట్టించఁగాను
చెంత మదనకళలఁ జెలరేఁగించీ మొగము ॥ కాఁగి ॥

అలమేలుమంగను నీ వటు రతిఁ గూడఁగాను
పలచనిచెమటలఁ బచ్చిదేరీని
యెలమి శ్రీవేంకటేశ యింతలోఁ జన వియ్యఁగా
సోఁపులసంతోసానఁ జొక్కించీ మేను ॥ కాఁగి ॥ 566

శంకరాభరణం

మరునిబలములెల్లా మగువకుఁ జుట్టాలే
విరహ మెన్నఁడూ లేదు వెలఁదికి నీకును ॥ పల్లవి ॥

చెలులతో నీసుద్దులు చెప్పుకోఁగా వనములో
చిలుకలు చేరవచ్చెఁ జెలివద్దికి
చెలరేఁగి చన్నులపై చెమట లారుచుఁకోఁగా
వలవంత నురముపై వాలెను జక్కవలు ॥ మరు ॥

కమ్మర నిన్నుఁ దలఁచి కరముల మొక్కితేను
తుమ్మిదలు వాలఁజొచ్చె తొయ్యలిమీఁద
యిమ్ముల నీవున్నచోటి కేఁగుదేరఁగాఁ జూచి
దొమ్మిగూడి మయూరాలు తోడురాఁ దొడఁగె ॥ మరు ॥

ముచ్చట నిన్నుఁ బెండ్లాడి మోము దప్పక చూడఁగా
కచ్చుపెట్టి చకోరాలు కాంతపై నిండె
యిచ్చట శ్రీవేంకటేశ యీకె యలమేలుమంగ
కొచ్చి నీతో మాటాడఁగా కోవిలలు పాడెను ॥ మరు ॥ 567

తెలుఁగుఁగాంబోది

ఉడివోనివలపులతో నుమ్మగిలుతా నున్నది
కడలేనివేడుకతోఁ గాఁగిలించవయ్యా ॥ పల్లవి ॥

సేసకొప్పు వెడజారి చెక్కుల చెమట గారి
ఆసతోడ మోవితేనె లట్టె వూరీని
పాసివున్నతమకము పడఁతికి దైలువారీ
గాసిఁబెట్ట కింతటను కరుణించవయ్యా ॥ ఉడి ॥

చెక్కుటిపైఁ జేయి మించి శిర సూర కేల వంచి
కిక్కిరిసి మతిఁ గోరికెలు ముంచీని
అక్కరతోడ సారెసారె నంగన మెయి పులకించీ
కక్కసపెట్టక యిఁకఁ గరుణించవయ్యా ॥ ఉడి ॥

నిలువుఁగళలు నిక్కి నీసుద్దులు విని చొక్కి
నిలిచి నీయెదుటను నీకు మొక్కీని
నెలవై శ్రీవేంకటేశ యలమేలుమంగయీకె
కలసితి విట్లానే కరుణించవయ్యా ॥ ఉడి ॥ 568

ఆహిరి

వట్టిగుట్టు దాఁచేవు వద్దనేనా నే నిన్ను
చుట్టరికాలై నమీఁద సుద్దులు చెప్పవద్దా ॥ పల్లవి ॥

తళుకుఁజెక్కులమీఁద తాచినకెంగేలు
మొలకనవ్వులతోడ మోవిపైడాలు
కలికికి నెంతసింగారమాయఁ జూడరాదా
చెలిమి సేసినమీఁద సిగ్గువడ నేఁటికి ॥ వట్టి ॥

మొనవాఁడిచన్నులపై మూసినపయ్యదకొంగు
మిసుకుబాహుమూలాల మెరిచేరంగు
మునుకొన్నయీపె మేనిమురిపెము చూడరాదా
ననిచిననవులు నారటిల నేఁటికి ॥ వట్టి ॥

నులివచ్చిచెమటల నుదిటికస్తురిబొట్టు
పెలుచుఁగుచ్చులమీఁదిపిరిచుట్టు
అలమేలు మంగ కెంత యమరెనుఁ జూడరాదా
కలిసితివి శ్రీవేంకటేశ జాగేఁటికి ॥ వట్టి ॥ 569

వరాళి

చిత్తగించి చక్కఁజూడు చెలియలాగు
యిత్తల బహుపరాకు లెన్నైనాఁ గలవు ॥ పల్లవి ॥

సిగ్గువడ నేర్చుఁగాని చెలి నీ వేమిసేసినా
యెగ్గుపట్ట నేరదు యెంత మోహమో
వొగ్గి నీ కిచ్చకములే వొనరించ నేర్చుఁగాని
వెగ్గళించ నేరదు వేశు కెట్టిదో ॥ చిత్త

ముద్దు చూప నేర్పుఁగాని మొక్కలానఁ దిట్టినాను
అద్ద[1]లించ నేరదు ఆస యెట్టిదో
వొద్దికలే నేర్చుఁగాని వొట్లు నీవు వెట్టితేను
వుద్దండాలు నేరదు వోరు పిఁక నెట్టిదో ॥ చిత్త ॥

కలయఁగ నేర్చుఁగాని గక్కన శ్రీవేంకటేశ
అల ఇంచ నేరదు అలమేల్ మంగ
వలవఁగ నేర్చుఁగాని వసమై నీవు గూడితే
సొలయఁగ నేరదు చుట్టరిక మెట్టిదో ॥ చిత్త ॥ 570

రేకు - 797. మధ్యమావతి

మిక్కిలి చక్కఁదనాల మేలుదానవు
వొక్కటై నీరమణుఁడు వొనగూడీ నిపుడు ॥ పల్లవి ॥

చిలుకపలుకు లవి చెలరేఁగీ వినవే
తలకొన్న నీమాఁటలవంటివి
కలువరేకు లవిగో కందువఁ జూడఁగదవే
తళుకుఁజూపుల నీకన్నులవంటివి ॥ మిక్కి ॥

---

1. అదలించుటకు రూపాంతరమా?

వేడుకతో చందురునివెన్నెలలు గాయవే
వాడిక నీ నవ్వులకుప్పలు(ల?)వంటివి
వోడక జక్కవలతో వూరక పొందు సేయవే
జాడతోడ నీమెరుఁగుచన్నులవంటివి ॥ మిక్కి ॥

తుమ్మిదపిల్లల నీచేతులఁ బట్టుకొనవే
పమ్మిన నీకురులజొంపాలవంటివి
యిమ్ములఁ శ్రీవేంకటేశుఁ డింతలోనె నిన్ను నేలె
కుమ్మరించురతు లవే కోరికలవంటివి ॥ మిక్కి ॥ 571

కేదారగౌళ

మేలు మేలు యిన్నిటాను మేఁటివైతివి
నీలాగులు వొగడఁగా నేఁడు మాకు వశములా ॥ పల్లవి ॥

సేస లెందాఁకాఁ బెట్టిన (నఁ?జే) చేతులు కందే పట్టవు
వేసరక వలతువు వెలఁదులకు
ఆసల బయలీఁదినా నలయదు నీమనసు
రాసికెక్కె నీమేను రాయిగాఁబోలును ॥ మేలు ॥

కడుమాఁట లెన్నాడినా కాయగాయదు నీనోరు
వుడివోక చూతువు వువిదలను
నడుమ నీసెలవులు (ల?) నవ్వులకు జడియవు
కడలేని నీరూపు కంచు గాఁబోలును ॥ మేలు ॥

చన్ను లెంతవొరసినా సమయదు నీవురము
యెన్నరాక కూడుదువు యింతులను
చెన్నుగ శ్రీవేంకటేశ చిగిరించి నన్నుఁ గూడి
వెన్నుఁడ నీమూర్తి కల్పవృక్షము గాఁబోలును ॥ మేలు॥ 572

ముఖారి

ఉన్నవెల్లా మానరే వువిదలార
వెన్నుఁడే నానుగఁడు వెసఁ బొందు శాయరే ॥పల్లవి॥

చెప్పరే వానిసుద్దులు చెవులపండుగగాను
విప్పైనసంతోసాన వినే నేను
చొప్పు లెత్తిచూపరే సూటి వానియడుగులు
వొప్పుగఁ జూచి వేడుక నోలలాడే నేను ॥ఉన్న॥

యియ్యరే వానితమ్ములమిసుమంతయినాఁ దెచ్చి
చెయ్యారాఁ బుక్కిటఁ బెట్టి చెలఁగే నేను
పుయ్యరే వానిమేనఁ బూసినగంధము నాకు
నెయ్యపుసంతోసాన నిండుకుండే నేను ॥ఉన్న॥

పెట్టరే వానిపాదాలు పిక్కటిల్లేచన్నులపై
గుట్టుననే కాఁగిలించుకొనే నేను
యిట్టె శ్రీవేంకటేశుఁ డతఁడే వచ్చి నన్నెలె
చుట్టపువరుస నిఁక జోడువాయ నేను ॥ఉన్న॥ 573

నాదరామక్రియ

ఏమయ్యా నీ వెఱఁగవా యిందరు (రి?) వంటిదాననా
కామించి మన్ననఁ బొందేకాంతను నేను ॥పల్లవి॥

కలికితనాలు చూపి కాయకపుమాఁటలాడి
తళుకునఁ బొలసేటిదాననా నేను
పిలిచి పీఁట వెట్టి ప్రియములెల్లాఁ జెప్పి
వలచి వలపించేటివనితను నేను ॥ఏమ॥

నను పులు పచరించి నవ్వు లూరకె నవ్వి
తనియక యలయించేదాననా నేను
వినయములెల్లాఁ జేసి వేడుకలు నీకుఁ జూపి
పెనఁగి పెనఁగించేప్రియురాలను నేను ॥ ఏమ ॥

నిగిడి శ్రీవేంకటేశ నిన్నుఁ గూడి కాఁగిటిలో
తగవులు విన్నవించేదాననా నేను
మిగి నన్ను నేలితివి ముందుముందుగానే నిన్నుఁ
దగిలి తగులు సేసేతరుణిని నేను ॥ ఏమ ॥ 574

కన్నడగౌళ

మేలు మేలే జవరాలా మెచ్చిరి చెలులు నిన్ను
యీలీల వలపించితి విపుడు నీవిభుని ॥ పల్లవి ॥

మంచిమాఁట లాడితేను మనసెల్లాఁ గరఁగును
వంచనతో నుండితేఁ గైవసమౌ పతి
కొంచక సేవసేసితేఁ గూరిములు సతమౌను
నించి యీచేఁతలెల్లా నీవే నేరుతువే ॥ మేలు ॥

యిచ్చకమై వుండితేను యితవౌను కాఁపురము
మచ్చికగా నవ్వితేను మర్మము లంటు
విచ్చనవిడి లోనైతే వేడుకలెల్లా రేఁగు
నిచ్చలు నీగుణములు నీయందే కలవే ॥ మేలు ॥

గుట్టున నోరుచుకొంటే కూటమి తానే కలుగు
చుట్టరికమే చూపితే సొంపు వుట్టును
యిట్టె శ్రీవేంకటేశుఁ డింతలో నిన్నుఁ గలసె
నెట్టన నీసొబగులు నీకే యమరునే ॥ మేలు ॥ 575

ఆహిరి

నీ వెఱఁగనిది లేదు నెరజాణవు
వేవేలకు నీకు నేము వినయపువారము ॥ పల్లవి ॥

చలపాది దొక్కొక్కతె చండితోడ నుండుఁ గాని
లలనలమనసులు లక్కవంటివి
పెలుచుఁదనాలదే బెడసరా లాడుఁ గాని
చలువతేనెమాఁటలే సుతులెల్లా నాడేవి ॥ నీవె ॥

గామిడి దొక్కొక్కతె కనలించుకొనుఁ గాని
కామినులమోములు కళదేరేవే
బూమెలాఁడి యైనదే బొమ్మల జంకించుఁ గాని
ఆముకొన్ననవ్వులే యతివలు చల్లేవి ॥ నీవె ॥

కతకారి దొక్కొక్కతె గబ్బియై పెనఁగుఁ గాని
సతులరతులు సంసారఫలమే
యితవై శ్రీవేంకటేశ యిట్టె నన్ను నేలితివి
మితిలేనివేడుకలే మెలుతలు సేసేవి ॥ నీవె ॥ 576

రేకు-798 దేశి

ఇంతిజవ్వనరాజ్య మేలుదువు రావయ్య
పంతముతో నీకు సోబనకాల మబ్బెను ॥ పల్లవి ॥

చెలపలచెమటల చెలమ వూటులెత్తె
కొలఁదిమీరినచనుఁగొండలసంది
అలకలతీగెలు సర్వాంగముల నల్లుకొనె
వలపులసోనలచే వనితమెయి నానెను ॥ ఇంతి ॥

దొరకొని నిట్టూరుపుతూరుపుగాలి విసరె
తరుణిలావణ్యసముద్రముమీఁదను
గరిమఁ జెక్కులపు (లఁబు?) లకల పైరు జాజుకొనె
విరహాపుచిహ్నాలచే వెలఁది రవ్వాయను ॥ ఇంతి ॥

వినయపుమాఁటల కో(లఁగో?)విల వె(యె?)లిగించఁ జొచ్చె
కొ (గొ?) నబైనకు త్తికగూఁటిలో నుండి
యెనసితివి శ్రీవేంకటేశ యింతలో నీకెను
మనసిజబలాలచే మగువ సొంపెక్కెను ॥ ఇంతి ॥ 577

లలిత

మనసుమర్మము గన్నమగఁడు తాను
తనువుఁదనువు సోఁక దండకు రమ్మనవే ॥ పల్లవి ॥

చనవులు చూపఁబోతే చప్పనవును తలపు
వినయము లేకుండితే వెలయదు వలపు
పెనఁగులాడితేను బెండుపడును వలపు
తన కెదురాడేనా దండకు రమ్మనవే ॥ మన ॥

చెలులతో నాడుకొంటే సిగ్గులు రేఁచును వలపు
వలెనని కొసరితే వడిఁబెట్టు వలపు
పలుమారు నవ్వితేను పడనె(బలుపె?) క్కు వలపు
తలఁపించేఁ దనమాఁట దండకు రమ్మనవే ॥ మన ॥

కడుదిష్టించి చూచితే కళదాఁకు వలపు
వొడివట్టి తీసితేను వుమ్మగిలు వలపు
యెడయక శ్రీవేంకటేశుఁడు తా నన్నుఁ గూడె
తడవితే వేడుకవయ్యీ దండకు రమ్మనవే ॥ మన ॥ 578

తోండి

ఎంతపిరికితనమే యేమే నీవు
కాంతుని కిచ్చకముగాఁ గాఁగిలించవలదా ॥ పల్లవి ॥

పేని వట్టి విభునితో బిగిసే వెందాఁకనైనా
నానఁబెట్టేవు వలపు నవ్వుకొంటాను
మేను మేను సోఁకించక మేలు మాతఁ డాడఁగాను
మోనముతో దగ్గరవు ముట్టుదానవటవే ॥ ఎంత ॥

సేసవెట్టి యీతనితో సిగ్గులు వచరించేవు
ఆసలఁ బెట్టేవు బొమ్మ లార్చుకొంటాను
ఆసపడి నీకు సన్న లట్టె సారెఁ జేసేవానిఁ
బాసి వుందానవు బల్లిపాటు దానవటవే (?) ॥ ఎంత ॥

చేరి కాను కీవచ్చేవు చెలువునివద్దనుండి
నారువోసేవు చూపులు నాఁటుకొంటాను
యీరీతి శ్రీవేంకటేశుఁ డేలె నన్ను; నీవితనిఁ
బోరచిఁ గూడే వెంగిలిపొత్తుదానవటవే ॥ ఎంత ॥ 579

ముఖారి

ఎంత నాకుఁ జనవిచ్చి యయ్యకొనీనే తాను
మంతనాన యిట్టె నన్ను మన్నించీఁ గాక ॥ పల్లవి ॥

మనసులు సోదించి మాఁటలాడేదాననా
తనయిచ్చలో మెలఁగేదానఁ గాక
కొనచూపులనుఁ జూచి కొసరేటిదాననా
వినయాన వేఁడుకొని వెలసేదానఁ గాక ॥ ఎంత ॥

నాలిఁ బెట్టి తనతో నే నవ్వేటిదాననా
తాలిమితో సేవ సేసేదానఁ గాక
చాలుకొని బొమ్మలను జంకించేటిదాననా
మేలుమీఁదిదాననై మెచ్చేదానఁ గాక ॥ఎంత॥

యిమ్ములఁ దనకు విడె మిచ్చేటిదాననా
తమ్ములము త న్నడిగేదానఁ గాక
నెమ్మది శ్రీవేంకటాద్రినిలయుఁడు నన్నుఁ గూడె
చిమ్మిరేఁచేదాననా చేతిలోదానఁ గాక ॥ఎంత॥ 580

## సామంతం

వద్దనేనా నే నిన్ను వలసీ(చీ?)నొల్లము వై తే
పొద్దున నాపెకు నీవు బుద్ధి చెప్పరాదా ॥పల్లవి॥

అల్లంత నుండి నన్న లాపె నీకుఁ జేయఁగాను
చెల్లఁబో పరాకేల సేసుకొనేవు
యెల్లవారు నెరిఁగిరి యిఁకనేల మరఁగులు
చెల్లుబడి నాకెమాఁగట చేకొనరాదా ॥వద్ద॥

కనియుఁ గానకుండాఁ గానిక లాపె యంపఁగా
చెనకక కటకటా సిగ్గు వడేవు
వెనకటిపొందులంటా వేసరుకో నిపుడేల
మనసు వచ్చితేఁ గన మందలించ రాదా ॥వద్ద॥

చేరి చేరి యంతా నింతా చేత నాకె మొక్కఁగాను
సారే నయ్యో నీవేల చప్పఁజేసేవు
గౌరవించి నన్ను శ్రీవేంకటేశ కూడితివి
వూరకె నాకె నిఁక నుండుమనరాదా ॥వద్ద॥ 581

పాడి

ఆకె నిన్నేమిసేసినా నందు కేమయ్యా
చేకొన నీ కపయల్లాఁ జెప్పుకొనఁ గొత్తలు ॥పల్లవి॥

యిచ్చకమైనసతి యేమి మాఁటలాడినాను
విచ్చనవిడిఁ బతికి వేడుకై యుండు
పచ్చిగాఁ జెనఁగి మరి పాదము సోఁకించినాను
మచ్చికలు రేఁగి రేఁగి మర్మాలు గరఁగును ॥ఆకె॥

పొందులయాకె యెంత బొమ్మల జంకించినాను
అంది నీకు సంతోసములై యుండును
కందువ నీకంటె నాపె గనముగఁ జెనకిన
సందుకొన నీకు నవి చవులై మెరయును ॥ఆకె॥

అలమేలుమంగ నిన్ను నాసతోఁ గాఁగిలించఁగా
నిలువెల్లఁ బులకలు నిండును నీకు
యెలమి శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
సలిగెలాపెరతి సమ్మతులై మించును ॥ఆకె॥ 582

రేకు—799 దేవక్రియ

ఎందాఁకా సరసము లేమి యాడేవు
కందువరతుల నిఁకఁ గరుణించవయ్యా ॥పల్లవి॥

ముచ్చటమాఁటలు చెప్పి మోహాములే పచరించి
యిచ్చకములే సేసీని యింతి నీకును
కచ్చుపెట్టి యిటువంటికాంతలవలపు నీవు
పచ్చిసేయఁ దగ దింకఁ బాలించవయ్యా ॥ఎందాఁ॥

హత్తి కొలువుసేసి ఆయాలు గరఁగ నవ్వి
బత్తి నీపైఁ బచరించీఁ బలు మారును
చిత్తగించి యూపె సేసేసేవలు నీ విప్పుడు
వొత్తి గరిసించనేల వొనగూడవయ్యా ॥ ఎందాఁ ॥

కందువ నిలుచుండి కప్పుర విడె మిచ్చి
పొందులెల్లా నెరపీని పొసఁగ నేఁడు
అంది శ్రీవేంకటేశుఁడ యంతలోనే కూడితివి
అందుకోలు సిగ్గులేల ఆదరించవయ్యా ॥ ఎందాఁ ॥ 583

మేఘరంజి

కాఁగిలించుకొనరాదా గక్కన నీరమణుని
మాఁగినమీవలపులు మాఁగఁబెట్టనేలే ॥ పల్లవి ॥

శిరసుపై సేసలు చిందెను మీఁగాళ్లమీఁద
యిరవైన నీసిగ్గులు యెందాఁకానే
తెరమఱఁగుమాఁటలు తేనెలై చెవులు సోఁకె-
నరగొరలేల మీకు నడ్డాలు మరేలే ॥ కాఁగి ॥

కన్నులఁ జూచినచూపు కాఁడుకొనె మనసెల్లా
యెన్న రానినీజాగు లెందాఁకానే
చన్నులపై పయ్యద జారించె నీపులకలు
మున్నిటిమీతమకము మూసి దాఁచనేలే ॥ కాఁగి ॥

పిక్కటిల్లి జవ్వనము పెండ్లిపీఁట యెక్కించె
యిక్కువ నీతలపోఁత లెందాఁకానే
చక్కని శ్రీవేంకటేశ్వరుఁడు నిన్నుఁ గూడెను
తక్కక పరవశపుతడఁబాలు లేలే ॥ కాఁగి ॥ 584

కురంజి

మఱి నీ వెప్పుడు నాకు మంచివాఁడవే కావా
గుఱిగాఁ బాదాలు చూపు కోరి మొక్కే నేను ॥ పల్లవి ॥

నంటున నీ వొకతెతో నవ్వుతా రాఁగాఁ జూచి
కంటకా లాడవచ్చునా గయ్యాళిఁ గాక
యింటికి నీవే వచ్చి యిచ్చకము లాడఁగాను
వుంటవింట వేయు మెట్టు వోరువఁ జాలఁ గాక ॥ మఱి ॥

పాయక యాపె నీవు పానుపుపై నుండఁ గాను
రాయడించ వచ్చునా రట్టడిఁ గాక
చేయి వట్టుకొని నీవు చేరి నన్ను వేఁడుకోఁగా
తోయవచ్చునా నేను తుంటరిఁ గాక ॥ మఱి ॥

వసమై మీ రిద్దరును వడి నన్ను బోదించఁగా
కసురుకోవచ్చునా నాగర్వము గాక
యెసఁగి శ్రీవేంకటేశ యిట్టె నన్ను నేలితివి
కొసరి నవ్వు మెట్టు నాగుణ మింతే గాక ॥ మఱి ॥ 585

గౌళ

మగువరో సిగ్గువడను మరి వేళ లేదా
నిగిడి కూడఁగాను నీ కిప్పుడు వలెనా ॥ పల్లవి ॥

చెక్కు నొక్కి పతి నిన్నుఁ జేరి వేఁడుకొనఁగాను
మొక్కఁగదే చేతులెత్తి మొరఁగులేల
చక్కని నీమోమెత్తి సారె నిన్నుఁ జూడఁగాను
అక్కరతో నవ్వఁగదే యణఁచుకోనేలా ॥ మగు ॥

పెనఁగి యాతఁడు నీకు ప్రియములు చెప్పఁ గాను
తనియ మో వియ్యఁగదే దాఁచుకో నేల
చనవిచ్చి యప్పటిని సరసము లాడఁగాను
ననిచి మాఁటాడఁగదే నాలితనమేలా ॥ మగు ॥

చేరి నీచనుగుబ్బలు శ్రీవేంకటేశుఁ డంటఁగా
కోరి కాఁగిలించఁగదే కొంకఁగనేల
వేరుసేయక ని న్నేలి వేడుకతోఁ గూడఁగాను
వూరకే విడె మీఁగదే వుమ్మగిలనేలా ॥ మగు ॥ 586

వేళావళి

రమ్మనవే చెలి యారసికుఁడు తా నెరుఁగు
వుమ్మగిలేతమకము వొద్దుకుంటేఁ బోవునా ॥ పల్లవి ॥

తలఁపులో నావలపు తగులక విడువదు
పెలుచై తానేల తప్పించుకొనీనే
సొలసేటినాసొలపు సూడువట్టకపోదు
పలుమారు తానేల పరాకు సేసీనే ॥ రమ్మ ॥

ఆసపడి చూచేచూపు అంటుకోక విడువదు
సేసుకొన్న వాఁడు యాల సిగ్గువడీనే
వాసితోడి నామొక్కు వరము గొనకపోదు
వోసరించి తానేల వూరకుండీనే ॥ రమ్మ ॥

మేలుమీఁదినాకాఁగిలి మెప్పించక విడువదు
తాలిమిఁ దనబత్తేల దాఁచుకొనీనే
యీలీల శ్రీవేంకటేశుఁ డిట్టె తానె వచ్చి కూడె
నాలాగులకు మెచ్చి నవ్వులేల నవ్వీనే ॥ రమ్మ ॥ 587

మలహరి

మాతో నేల దాఁచేవు మర్మాలు నే మెరఁగమా
యీతల నిన్నింత సేసినాతఁ డెవ్వఁడే ॥ పల్లవి ॥

తలఁ పెక్కడనో కానీ తగ మాతో మాఁటాడేవు
జలజాక్షివలపుఁజాడలే యివి
నిలువు నివ్వెరగంది నేర్పున మాతో నవ్వేవు
లలి లోలో కరఁగులాగులే యివి ॥ మాతో ॥

నేసినపను లేఁటివో సిగ్గువడేవు మావద్ద
మూసి దాఁచి చెప్పరానిముచ్చటే యిది
వాసిఁ జెక్కుచేతితో మావంక చూచేవు వూరకే
లాసేటిరతులమీఁదియాసలే యివి ॥ మాతో ॥

మోమున సంతోసమదే; మొరఁగు మాతోఁ జూపేవు
కామతంత్రపుజాడలగతులే యివి
యీమేర శ్రీవేంకటేశుఁ డిట్టె నన్ను నిదె కూడె
నోములు ఫలించినట్టినోదాలే యివి ॥ మాతో ॥ 588

రేకు - 800 ఆందోళి

ఎడ గొల్లకత్తె యీపె యెవ్వతోయి
అడియాలా లెత్తీ నాతో నాసతీవోయి ॥ పల్లవి ॥

వాలికచూపుల నిన్ను వంచివంచి చూచీని
అలా నీకు తానేమైనా నదేమి యీపె
మేలమాడీ నప్పటిని మేకులు నీతోఁ జేసీ
వోలి వెట్టించుక నిన్ను నొద్దికఁ బెండ్లాడెనా ॥ ఎడ ॥

పువ్వుల వేసి నిన్ను బొమ్మల జంకించీని
దేవులా తా నేమైనా తెగడీ నీపె
వావులు నీతోఁ జెప్పి వట్టిసరసాలాడీ
కావించి నీకుఁగాను కంకణము గట్టెనా ॥ ఎడ ॥

నంటున సంగడి నిన్ను నడుమఁ గాఁగిట నించీ
యింటియాపే తాను నీకు నేమైనా నీపె
జంట న న్నేలితివి సరుగ శ్రీవేంకటేశ
దంటా తా నేమి తొల్లి తలఁబాలు వోసెనా ॥ ఎడ ॥ 589

## భల్లాటి

పువ్వువలెఁ గాఁగిలించి భోగించవలెఁ గాక
కావరానఁ జెలి నింతగాసిగాఁ జేతురా ॥ పల్లవి ॥

చక్కనిరమణి నీసంగడికి వచ్చితేను
చెక్కులు గిల్లుదురా చెల్లఁబో నీవు
జక్కవచన్నులు నీకు సరిమొన చూపెనంటా
కిక్కిరియఁ జేతఁబట్టి గిజిగిజి సేతురా ॥ పువ్వు ॥

కడుఁగోమలపుసతి కదిసి పాదాలొత్తితే
వొడివట్టి తీతురా వోహో నీవు
అడరి మోవిపండు నీ కటు నోరూరించెనంటా
పిడిచి యధర మింత పిప్పిసేతురా ॥ పువ్వు ॥

సింగారించుకొని లేమ సేస నీపైఁ బెట్టితేను
అంగ మింతబిగింతురా ఆహా నీవు
అంగజునిదీము లాచీ ననుచు శ్రీవేంకటేశ
వుంగిటిగతులఁ గూడి వుమ్మగిలసేతురా ॥ పువ్వు ॥ 590

శుద్ధవసంతం

చెలులాల యిటువంటిచెలి నలయించకురే
చలిమందు లివి మీఁచాయలకు వచ్చునా ॥ పల్లవి ॥

వెలినున్న రమణుని వేగమే తెచ్చితేఁ గాక
కలువలఁ గప్పితేను కాఁక దీరీనా
పిలిచి యిద్దరిఁ బెండ్లిపీఁటపైఁ బెట్టితేఁ గాక
వలరాచపౌజులతో వాదించవసమా ॥ చెలు ॥

మనసులోపలివాని మచ్చిక సేసితేఁ గాక
తనువుపై గందమునఁ దాప మారీనా
చెనకించి యిండొరుల సేస వెట్టించితేఁ గాక
మొనసినవలపులు మూసిపెట్ట వచ్చునా ॥ చెలు ॥

కాంతకు శ్రీవేంకటేశుఁ గాఁగిటఁ బెట్టితేఁ గాక
యెంత కప్ప మిచ్చినాను యితవయ్యీనా
యింతలో దయదలఁచి యీతఁడే విచ్చేసి కూడె
పొంతనె యీవేడుకలు పొగడఁగఁ గలమా ॥ చెలు ॥ 591

ఆహిరి

యెం (ఎం?) త నేరుపరి యిది యెంతటి జాణ
యింతేసివేడుకల నెలయించీ నిన్నును ॥ పల్లవి ॥

కన్నులనే మాఁటలాడి కపురానఁ గొని వేసి
సన్న సేసి పిలిచీని సతి నిన్నును
చన్నుమీఁదిపయ్యెద జారఁగాను కొనవేళ(ళ్ల?)
కిన్నెరమీఁటులు మీఁటి గిలిగించీ నిన్నును ॥ ఎంత ॥

కెఱలి కెఱలి నవ్వి కేలెత్తి నీకు మొక్కి
కఱఁగించీ సారె సారె కాంత నిన్నును
మెఱయఁ బూవులకోల మీఁదఁ జాఁచి, వల -
పెఱుకలు సేసి బయలీఁదించీ నిన్నును ॥ ఎంత ॥

కాయమున సోఁకించి కందువ నీకుఁ జూపి
యీయెడనే కాఁగిలించీ నింతి నిన్నును
పాయక శ్రీవేంకటేశ వచ్చితేర నిన్నుఁ గూడి
ఆయము లంటించి ప్రియ మందించీ నిన్ను(నీకు?) ను ॥ ఎంత ॥

శోకవరాళి

నెలఁత మెయి కోమలము నీ చిత్తము
చెలులము విన్నపము సేయవచ్చు మీకును ॥ పల్లవి ॥

చెక్కులవే చెమరించె శిరసుపూవులు రాలె
పిక్కటిల నీ వాపెతోఁ బెనఁగఁగాను
ముక్కున నూర్పులు రేఁగె మోమున ముంచెఁ గళలు
కిక్కిరియఁ గాఁగిలించి గిలిగించఁగాను ॥ నెలఁత ॥

బలిమిఁ జన్ను లదరె పయ్యెదకొంగు జారె
నిలువున నీవు గడు నవ్వించఁగాను
నిలువెల్లఁ బులకించె నిండుకొనెఁ దమకము
మలసి నీవు మర్మము లంటఁగాను ॥ నెలఁత ॥

కన్నులనుఁ గావిదేరె కరఁగె నిట్టె మనసు
యిన్నిటా వేడుకతో నీ వెనయఁగాను
చిన్నలు మేనిపై నిండె శ్రీవేంకటేశ్వర
వున్నతపురతుల నీ వుబ్బించఁగాను ॥ నెలఁత ॥ 593

నాగవరాళి

[1] మెచ్చితి నేనే నీవు మేఁటివాఁడువు
పచ్చిదేరఁ జకువయ్యా బండారాన నుండనీ ॥ పల్లవి ॥

వలపేల చల్లేవే వనిత
తలపోఁత లివి వసంతపునీరయా
మలసేవు నీ వెంతమాఁటకారివే
పొలము పలుకుఁదేనె పోఁకకుఁ బుట్టెఁడయా ॥ మెచ్చి ॥

నవ్వులేల నవ్వేవే నలినాక్షి
పువ్వులు తలివచ్చితేఁ బువ్వకుండునా
నివ్వటిల గబ్బివై నెగడితివే
కువ్వఁబోతే జవ్వనము గుదిగొనీనయా ॥ మెచ్చి ॥

ముట్టేవేమే కొనగోర ముదితా
చెట్టడువ సరసము చేటఁదేసయా
చుట్టమవై తివిగదే సులతానను
యిట్టె శ్రీవేంకటేశ యెనసితి వౌనయా ॥ మెచ్చి ॥ 594

★

1. ఈపాట వాకోవాక్యము.

# 1 వ అనుబంధము.

## సంకీర్తన రాగముల ఆకారాది సూచిక

| రాగములు | | సంకీర్తన సంఖ్యలు |
|---|---|---|
| అమరసింధు | .... | 119, 239, 315 |
| ఆందోళి | .... | 439, 495, 589, |
| ఆహిరి | .... | 12, 56. 75, 92, 99. 116, 128, 145, 156, 158, 181, 205, 218, 225, 236, 248, 285, 334, 403, 441, 453, 479, 497, 569, 576, 592, |
| ఆహిరినాట | .... | 219, 373, |
| కన్నడగౌళ | .... | 64, 93, 107, 125, 230, 262, 292, 330, 336, 443, 463, 501, 526, 558. |
| కన్నడ బంగాళం | | 326, |
| కాంబో(భో)ది | .... | 28, 196, 257, 260, 286, 320, 344. 430, 498, 555, |
| కుంతలవరాళి | .... | 381, |
| కురంజి | .... | 69, 176, 308, 434, 461, 531, 585, |
| కేదారగౌళ | .... | 73, 117, 199, 237, 401, 422· 468, 470, 500, 572, |
| కొండమలహారి | ... | 109, 150, 211 |
| కౌళి | .... | 446, 549, |
| గుండక్రియ | .... | 49, 160, 348, |

| రాగములు | సంకీర్తన సంఖ్యలు |
|---|---|
| గుజ్జరి | .... 38, 212, 393 |
| గౌళ | .... 242, 246, 321, 586, |
| చాయ (ఛాయ) | .... 435, |
| ఛా (చా) యానాట | .... 20, 223, 352, |
| తెలుగుకాం(గాం)బోది | .... 60, 81, 101, 108, 143, 251, 263, 316, 354, 372, 420, 564, 568, |
| తోండి | .... 485, 521, 579, |
| దేవక్రియ | .... 432, 583, |
| దేవగాంధారి | .... 19, 209, 310, 370, 409, 505, |
| దేశా(సా)క్షి | .... 1, 14, 103, 133, 166, 206, 218, 328, 340, 353, 399, 506, |
| దేశి | .... 424, 442, 483, 519, 577, |
| దేసాళం | .... 15, 45, 58, 70, 86. 105, 157, 173, 192, 208, 247, 273, 302, 383, 431, 482, 515, 529, |
| ద్రావిళభైరవి | .... 245, |
| ధ(ద)న్నాశి(సి) | .... 55, 98, 163, 198, 313, 324, 386, 508, |
| నట్టనారాయణి | .... 96, 194, 359, |
| నాగవరాళి | .... 52, 346, 469, 541, 594, |
| నాట | .... 2, 17, 35, 164, 448, |
| నాదరామక్రియ | .... 41, 80, 89, 140, 167, 189, 216, 233, 317. 350, 366, 371, 408, 456, 472, 502, 536, 544, 574, |

| రాగములు | సంకీర్తన సంఖ్యలు |
|---|---|
| నారాయణదేసాళి | .... 300 |
| నారాయణి | .... 21, 291, 410, |
| నీలాంబరి | .... 118, 220, 387, |
| పడ(డి) (ళ)వంజరం | .... [85, 447, 522, 563 |
| పాడి | .... 8, 24, 33, 42, 63, 112, 127, 149, 159, 177, 270, 275, 278, 297, 306, 339, 357, 374, 404, 411, 426, 428, 455, 477, 492, 565, 582 |
| బలహంస | .. . 280, 436 |
| బౌళి (భవుళి) | .... 18, 32, 70, 78, 129, 191, 261, 279, 282, 309, 332, 345, 405, 481 |
| భౌ (బౌ) ళిరామక్రియ | .... 179, 293, 318, 377, 473, 517, 545, 559 |
| బం(భం)గాళం | .... 444 |
| భల్లాటి | .... 440, 496, 590 |
| భూపాళం | .... 165, 289, 325, 533 |
| భైరవి | .... 5, 34, 54, 71, 83, 139, 197, 228, 283, 301, 322, 451, 476, 497, 532, 566 |
| మంగళకైశిక | .... 187 |
| మంగళకౌశిక | .... 16, 226, 231, 276, 429, 540 |
| మధ్యమావతి | .... 68, 131, 217, 241, 284, 394, 423, 467, 571 |

| రాగములు | సంకీర్తన సంఖ్యలు |
|---|---|
| మలహరి | .... 13, 102, 290, 391, 510, 588 |
| మాళవి | .... 255, 474, 554 |
| మాళవిగౌళ | .... 11, 87, 136, 151, 204, 396, 398 457, 499, 528 |
| మాళవి(న)శ్రీ | .... 449, 491 |
| ముఖారి | .... 7, 30, 62, 77, 126, 146, 154 186, 190, 235, 244, 268, 272 287, 323, 361, 375, 382, 414 417, 421, 432, 460, 480, 514 539, 573, 580 |
| మేఘరంజి | .... 433, 462, 530, 560, 581, 584 |
| రామక్రియ | .... 22, 61, 91, 137, 141, 153, 183 214, 252, 296, 329, 347, 358 395, 478, 488, 512, 547, 557 |
| రీతిగౌళ | .... 27, 110, 124, 148, 277, 379 388, 527 |
| లలిత | .... 3, 39, 44, 65, 72, 114, 138, 162 188, 202, 254, 303, 327, 378 384, 419, 484, 509, 520, 523, 578 |
| వరాళి | .... 43, 122, 207, 229, 249, 269 288, 343, 363, 385, 402, 407 445, 452, 459, 489, 518, 548, 570 |
| వసంతం | .... 553 |
| వసంతవరాళి | .... 31, 76, 304, 415 |
| వేళావళి | .... 486, 550, 587 |
| శంకరాభరణం | .... 40, 47, 59, 68, 79, 100, 106 123, 132, 144, 180, 185, 215 240, 266, 311, 314, 338, 349 |

| రాగములు | సంకీర్తన సంఖ్యలు |
|---|---|
| | 360, 368, 412, 416, 454, 466 525, 567 |
| శ్రీరాగం | .... 23, 26, 36, 37, 48, 74, 134 162, 210, 238, 274, 281, 333 335, 362, 427, 471, 494, 518 534, 543, 562 |
| శుద్ధదేశి | .... 4, 152, 224, 253, 356 |
| శుద్ధవసంతం | .... 10, 90, 95, 193, 265, 319, 337 392, 504, 507, 552, 591 |
| శోకవరాళి | .... 53, 464, 503, 542, 551, 593 |
| సామంతం | .... 9, 46, 50, 57, 82, 97, 104, 135 161, 168, 171, 184, 195, 200 222, 256, 298, 305, 331, 351 380, 397, 406, 511, 538, 581 |
| సామవరాళి | .... 120, 243 |
| సాళంగ(ం) | .... 88, 142, 267 |
| సాళంగనాట | .... 6, 25, 29, 84, 94, 121, 147, 178, 221, 234, 264, 271, 294 295, 307, 355, 369, 390, 400 418, 465, 524, 537, 556 |
| సింధురామక్రియ | .... 113, 115, 203, 295, 341, 413 |
| సౌరాష్ట్రం | .... 51, 67, 111, 175, 232, 258, 342 425, 487, 516, 535 |
| హిందోళం | .... 227, 367, 450, 475, 490, 546 |
| హిందోళవసంతం | .... 130, 172, 201, 312, 364 |
| హిజ్జిజి(జ్జి) | .... 174, 438, 458, 561 |

## 2-వ అనుబంధము

### అకారాదిగ సంకీర్తన, రాగ, సంఖ్యాసూచి

| సంకీర్తన మొదలు | రాగము | సంకీర్తన సంఖ్య |
|---|---|---|
| అంగడికెక్కె | తెలుఁగుఁగాంబోది | 251 |
| అంగడిఁబెట్టేవు | సామంతం | 305 |
| అంగడివేసేవు | నాట | 164 |
| అంగనల | కాంబోది | 286 |
| అంగనసుద్దులు | సాళంగనాట | 537 |
| అండనున్న | లలిత | 182 |
| అందరిపాలిటి | పాడి | 306 |
| అందరువిన్నా | ముఖారి | 421 |
| అందాఁకా | ధన్నాశి | 98 |
| అందుకెంత | ముఖారి | 7 |
| అందుకేమిదోస | బౌళిరామక్రియ | 293 |
| అందుకేమినిను | శుద్ధవసంతం | 193 |
| అందువంక | కేదారగౌళ | 422 |
| అంపరాదా | దేశాక్షి | 213 |
| అట్టేనీకు | నాదరామక్రియ | 41 |
| అడుగరే | తెలుఁగుఁగాంబోది | 101 |
| అడుగవయ్యా | శ్రీరాగం | 518 |
| అడుగువెట్టితే | వరాళి | 269 |
| అతని కరుణ | శంకరాభరణం | 59 |
| అతనినేల | సామంతం | 9 |
| అతిరాజసపు | కన్నడగౌళ | 526 |

| సంకీర్తన మొదలు | రాగము | సంకీర్తన సంఖ్య |
|---|---|---|
| అతివ సుద్దు | వసంతవరాళి | 76 |
| అన్నిట నీకు | శంకరాభరణం | 144 |
| అన్నిటాఁగాఁగల | దేసాళం | 58 |
| అన్నిటాజాణ | నాట | 17 |
| అన్నిటాఁ దనకు | శోకవరాళి | 551 |
| అన్నిటా నిన్ను | హిందోళవసంతం | 312 |
| అన్నిటాను | నాగవరాళి | 469 |
| అన్నిటా నేర్పరి | సౌరాష్ట్రం | 175 |
| అన్నిటికి | సామంతం | 351 |
| అన్ని పనులు | గుజ్జరి | 212 |
| అన్నియుఁ జక్క | దేసాళం | 208 |
| అన్నియు మీలో | సాళంగనాట | 418 |
| అన్ని నీవల్ల | బౌళి | 78 |
| అప్పటప్పటి | వరాళి | 407 |
| అప్పటినా | తెలుఁగుఁగాంబోది | 143 |
| అప్పటినాస | మంగళకౌశిక | 16 |
| అప్పటినుంటి | మంగళకైశిక | 187 |
| అప్పటి మాటలు | గుండక్రియ | 348 |
| అప్పటి మానవు | సౌరాష్ట్రం | 111 |
| అప్పటి వావు | కాంబోది | 555 |
| అమ్మెదొకటి | లలిత | 327 |
| అయ్యో నన్నూ | (బం)భంగాళం | 444 |
| అయ్యో యిప్పు | శ్రీరాగం | 543 |
| అలయించకు | కన్నడగౌళ | 125 |
| అల్లదివో | శ్రీరాగం | 134 |
| అల్లవాఁడె | శ్రీరాగం | 74 |

| సంకీర్తన మొదలు | రాగము | సంకీర్తన సంఖ్య |
|---|---|---|
| అవసరము | దేవగాంధారి | 310 |
| ఆఁకలిగొంటి | ఆహిరి | 181 |
| ఆఁటదాన | నీలాంబరి | 118 |
| ఆఁటదిగూళ | నాదరామక్రియ | 536 |
| ఆఁటది గొసరి | నాదరామక్రియ | 233 |
| ఆకె నిన్నేమి | పాడి | 582 |
| ఆడనే తెలుసు | కొండమలహరి | 150 |
| ఆడేవారి | సాళంగనాట | 524 |
| ఆతఁడదె | బౌళి | 279 |
| ఆతఁడదె నేనిదె | శంకరాభరణం | 360 |
| ఆతఁడదె మీరదె | శుద్ధవసంతం | 337 |
| ఆతఁడేమిసేసి | నాదరామక్రియ | 189 |
| ఆతఁడే యీడకు | లలిత | 384 |
| ఆతనిపట్టు | దేసాళి | 166 |
| ఆతనినేల | బౌళి | 405 |
| ఆనతిచ్చేవు | నాగవరాళి | 541 |
| ఆనతియ్యా | దేసాళం | 15 |
| ఆనతీవయ్యా | శ్రీరాగం | 562 |
| ఆపెకు నీకు | బౌళిరామక్రియ | 179 |
| ఆపె నన్నునొక్క | రామక్రియ | 183 |
| ఆపె నిన్ను నిష్ఠూ | సింధురామక్రియ | 203 |
| ఆపె నీ పట్టపు | మధ్యమావతి | 423 |
| ఆయము తనకు | దేసాళి | 353 |
| ఆయలేవే | దేసాళి | 328 |
| ఆయలేవే | సామంతం | 168 |
| ఆలికి మగనికి | బౌళి | 32 |

| సంకీర్తన మొదలు | రాగము | సంకీర్తన సంఖ్య |
|---|---|---|
| అసలనాలో | తెలుఁగుఁగాంబోది | 108 |
| ఇంకనిన్ని | ధన్నాశి | 163 |
| ఇంక నీవే | మాళవిగౌళ | 499 |
| ఇంకనేమి | బౌళిరామక్రియ | 473 |
| ఇంకనేమి సేయు | శుద్ధవసంతం | 552 |
| ఇంకనేల | నాదరామక్రియ | 89 |
| ఇంకనేలే మొక | భల్లాటి | 440 |
| ఇంకనేలే యను | సామంతం | 195 |
| ఇంకనైనా | ధన్నాశి | 55 |
| ఇంకానాకే | సామవరాళి | 120 |
| ఇంకానిట్టే | పాడి | 42 |
| ఇంకా నీయాస | శంకరాభరణం | 123 |
| ఇంకా మానఁడు | సాళంగనాట | 355 |
| ఇంగితమిట్టు | శుద్ధవసంతం | 95 |
| ఇంచుకంతగు | కొండమలహరి | 211 |
| ఇంచుకంత జాణ | శుద్ధదేశి | 356 |
| ఇంచుకైన | శంకరాభరణం | 412 |
| ఇంటికి రమ్మన | భైరవి | 71 |
| ఇంటికి వచ్చి | వసంతవరాళి | 31 |
| ఇంతగడ్డా | మాళవిగౌళ | 396 |
| ఇంత గయ్యాళి | ఆహిరినాట | 219 |
| ఇంతటఁగాని | కన్నడగౌళ | 463 |
| ఇంతటి కలికి | ఆహిరి | 205 |
| ఇంతటి నీచేఁత | లలిత | 202 |
| ఇంతనుండి | శంకరాభరణం | 311 |
| ఇంతలోని | సాళంగం | 88 |

| సంకీర్తన మొదలు | రాగము | సంకీర్తన సంఖ్య |
|---|---|---|
| ఇంతలోనీ | నాదరామక్రియ | 408 |
| ఇంతవలపించి | వసంతం | 553 |
| ఇంత వాఁడవు | కుంతలవరాళి | 381 |
| ఇంత సేసినవాఁడ | బలహంస | 436 |
| ఇంత సేసివున్నా | గౌళ | 549 |
| ఇంతికి నీవు | రామక్రియ | 22 |
| ఇంతిజవ్వన | దేశి | 577 |
| ఇంతితా | సింధురామక్రియ | 115 |
| ఇంతితో | ముఖారి | 126 |
| ఇంతినీకు | కేదారగౌళ | 73 |
| ఇంతేకా | అమరసింధు | 119 |
| ఇంతేసి | రామక్రియ | 395 |
| ఇందరమును | తెలుఁగుఁగాంబోది | 372 |
| ఇందరికినొక్క | దన్నాశి | 324 |
| ఇందరిముందర | గౌళ | 242 |
| ఇందరివంటి | లలిత | 44 |
| ఇందరు | పాడి | 24 |
| ఇందరెరిఁగి | పాడి | 455 |
| ఇందాఁకా నెఱఁగ | మేఘరంజి | 530 |
| ఇందాఁకా నేనో | దేశాక్షి | 206 |
| ఇందాఁకా నేరదా | నీలాంబరి | 387 |
| ఇందాఁకాబుద్ధి | పాడి | 411 |
| ఇందులో | సామంతం | 135 |
| ఇక్కడనక్కడ | నారాయణదేసాక్షి | 300 |
| ఇక్కువదాఁటి | దేసాళం | 273 |
| ఇచ్చకము సేయవే | శ్రీరాగం | 26 |

| సంకీర్తన మొదలు | రాగము | సంకీర్తన సంఖ్య |
|---|---|---|
| ఇచ్చకము సేయవే | మధ్యమావతి | 217 |
| ఇచ్చకురా | సౌరాష్ట్రం | 51 |
| ఇటని | నాదరామక్రియ | 216 |
| ఇటమీఁదఁజవి | భూపాళం | 165 |
| ఇటమీఁద నీ | చాయ (ఛాయ) | 435 |
| ఇటువంటి | మాళవిగౌళ | 457 |
| ఇట్టెమాగుణ | మాళవిగౌళ | 136 |
| ఇట్టెవుూడిగ | ద్రావిడభైరవి | 245 |
| ఇదియేమి | హిందోళం | 490 |
| ఇదివో నీ | శ్రీరాగం | 534 |
| ఇదె పెండ్లి | ఆందోళి | 439 |
| ఇద్దరము నిద్దర | మంగళకౌశిక | 276 |
| ఇద్దరమునోమి | లలిత | 520 |
| ఇద్దరికిఁ జుట్టాల | బౌళి | 481 |
| ఇద్దరికి సరి | వరాళి | 402 |
| ఇద్దరునిద్దరే | సాళంగనాట | 264 |
| ఇద్దరూజాణ | వరాళి | 459 |
| ఇన్నాళ్లవంటి | సాళంగనాట | 390 |
| ఇన్నాళ్ళు నెఱఁగము | ఆహిరి | 468 |
| ఇన్నాళ్లు నెఱఁగవైతి | కొండమలహరి | 109 |
| ఇన్నిటా నీ | సామంతం | 184 |
| ఇన్నేసిపను | కేదారగౌళ | 401 |
| ఇన్నేసిమాట | శ్రీరాగం | 362 |
| ఇప్పుడు | ఆహిరి | 248 |
| ఇప్పుడే | సాళంగనాట | 84 |
| ఇయ్యకోలైనచోట | మధ్యమావతి | 68 |

| సంకీర్తన మొదలు | రాగము | సంకీర్తన సంఖ్య |
|---|---|---|
| ఇయ్యకోలైనమీఁద | పాడి | 159 |
| ఈశుఁడునీకె | ఆహిరి | 75 |
| ఈతనిఁజూడ | హిజ్జిజి | 561 |
| ఈతనికి | శ్రీరాగం | 427 |
| ఈపెకు | సాళంగనాట | 295 |
| ఉండరయ్యా | భైరవి | 34 |
| ఉడివోని | తెలుఁగుఁగాంబోది | 568 |
| ఉన్నతి | పాడి | 275 |
| ఉన్నవారి | సింధురామక్రియ | 341 |
| ఉన్నవెల్లా | ముఖారి | 573 |
| ఉన్నసుద్దులకు | సింధురామక్రియ | 299 |
| ఉల్లము | పాడి | 8 |
| ఊడిగపు | శ్రీరాగం | 210 |
| ఊరకుండ | మాళవశ్రీ | 449 |
| ఊరకున్నా | కేదారగౌళ | 117 |
| ఊరకే నీ | భైరవి | 139 |
| ఊరకే మమ్మేల | ధవళి | 309 |
| ఎంచి చూడ | సాళంగనాట | 25 |
| ఎంత ఆసోద | కన్నడగౌళ | 558 |
| ఎంతకునంతే | సామంతం | 256 |
| ఎంతకెంత | పాడి | 270 |
| ఎంతగబ్బి | వేళావళి | 550 |
| ఎంతచక్కనిది | సామంతం | 538 |
| ఎంతచెప్పినా | శంకరాభరణం | 100 |
| ఎంతనాకు | ముఖారి | 580 |
| ఎంతని చెప్పు | ఆహిరి | 441 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| ఎంతనిపొగడ | పాడి | 426 |
| ఎంతనేరుపరి | మాళవశ్రీ | 491 |
| ఎంతనేరుపరియిది | ఆహిరి | 592 |
| ఎంతపిరికి | తోండి | 579 |
| ఎంతమొగ | ధన్నాశి | 198 |
| ఎంతవడి | దేశి | 424 |
| ఎంతవేగిర | శుద్ధవసంతం | 10 |
| ఎంతవేగిరకాఁడవు | సాళంగనాట | 94 |
| ఎంతవోరట | శోకవరాళి | 53 |
| ఎంతసిగ్గులు | తోండి | 485 |
| ఎంతేసి | ముఖారి | 235 |
| ఎంతైనా | శంకరాభరణం | 40 |
| ఎందాఁకాఁజెప్పె | శోకవరాళి | 503 |
| ఎందాఁకానిద్దిరించే | హిందోళవసంతం | 172 |
| ఎందాఁకామాటలు | గుండక్రియ | 160 |
| ఎందాఁకావట్టి | కేదారగౌళ | 468 |
| ఎందాఁకాసరసము | దేవక్రియ | 583 |
| ఎందాఁకాసిగ్గువడే | ముఖారి | 166 |
| ఎందుకు | సాళంగనాట | 147 |
| ఎందువోయే | సాళంగనాట | 271 |
| ఎక్కడ పరాకు | ఆహిరి | 12 |
| ఎక్కడ పరాకు నీకు | లలిత | 509 |
| ఎక్కడికెక్కడ | తెలుఁగుఁగాంబోది | 354 |
| ఎక్కడి తారు | హిందోళం | 367 |
| ఎక్కడివలపు | నాదరామక్రియ | 140 |
| ఎక్కడో సవతి | హిందోళం | 546 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| ఎగసక్కెపు | సాళంగనాట | 400 |
| ఎగ్గులేల | బౌళిరామక్రియ | 318 |
| ఎటువంటి జాతియ్యా | శ్రీరాగం | 37 |
| ఎటువంటి మచ్చి | శంకరాభరణం | 466 |
| ఎటువంటి మోహా | వరాళి | 445 |
| ఎటువంటి యాగ | భూపాళం | 533 |
| ఎటువంటి వేగిరి | రామక్రియ | 512 |
| ఎటువలె | భైరవి | 54 |
| ఎట్టునమ్మి | సాళంగనాట | 178 |
| ఎట్టు నిద్దిరించె | తెలుఁగుఁగాంబోది | 420 |
| ఎట్టున్నదో | మాళవి | 474 |
| ఎట్టు మఱతు | శ్రీరాగం | 281 |
| ఎడగొల్లకత్తె | ఆందోళి | 599 |
| ఎన్నటి కెన్నటి | ముఖారి | 323 |
| ఎన్నఁడు నేరిచి | దేశి | 519 |
| ఎన్ని బాసలు | సామంతం | 222 |
| ఎన్ని వేదాలు | పాడి | 492 |
| ఎప్పటివలె | ముఖారి | 417 |
| ఎప్పుడునీకే | పాడి | 177 |
| ఎప్పుడూను | ముఖారి | 480 |
| ఎరపరి | దేసాళం | 105 |
| ఎఱఁగమైతి | మధ్యమావతి | 467 |
| ఎఱఁగవు | దేశాక్షి | 103 |
| ఎఱిఁగిన | మాళవి | 255 |
| ఎలమి | రామక్రియ | 296 |
| ఎవరింత | శంకరాభరణం | 180 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| ఎవ్వరికి | ఆందోళి | 495 |
| ఎవ్వరి సుద్దులు | నాదరామక్రియ | 317 |
| ఎవ్వరు చెప్పిరే | పాడి | 149 |
| ఎవ్వరు బుద్ది | ముఖారి | 62 |
| ఎవ్వరు బుద్దులు | మంగళకౌశిక | 226 |
| ఎవ్వరు నెరఁగని | ముఖారి | 375 |
| ఎవ్వరెట్లైనా | దేసాళం | 302 |
| ఏకతానకు | కన్నడగౌళ | 93 |
| ఏఁటికిఁ గనులు | దేసాళం | 247 |
| ఏఁటికిఁ గాచుకు | సాళంగనాట | 556 |
| ఏఁటికి ననునూ | సాళంగనాట | 234 |
| ఏఁటికి నన్ను | వరాళి | 249 |
| ఏఁటికి నవ్వులు | రామక్రియ | 252 |
| ఏఁటికి నానలు | శ్రీరాగం | 162 |
| ఏఁటికి యింత | దేసాక్షి | 340 |
| ఏడనేరుచు | నాట | 35 |
| ఏడలేని | రామక్రియ | 358 |
| ఏతపము | కన్నడగౌళ | 443 |
| ఏదౌతా | పళవంజరం | 563 |
| ఏమంటివో | శోకవరాళి | 464 |
| ఏమనిచెప్ప | బౌళి | 446 |
| ఏమని పోలి | లలిత | 484 |
| ఏమని విన్న | దేవగాంధారి | 19 |
| ఏమమ్మ | లలిత | 188 |
| ఏమయ్యా | ముఖారి | 432 |
| ఏమయ్యా నీ | నాదరామక్రియ | 574 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| ఏమయ్యా వూర | మాళవిగౌళ | 258 |
| ఏమిగట్టు | కాంబోది | 260 |
| ఏమిచెప్పినే | రామక్రియ | 488 |
| ఏమిచెప్పేమయ్య | ముఖారి | 460 |
| ఏమిచెప్పేమయ్యా | ముఖారి | 539 |
| ఏమిచెప్పేరమ్మ | కేదారగౌళ | 237 |
| ఏమిచెప్పేరే | సౌరాష్ట్రం | 425 |
| ఏమిటికి | ఆహిరి | 116 |
| ఏమిదప్పి | దేసాళం | 157 |
| ఏమి విన్న పాలు | భైరవి | 197 |
| ఏమిసేయు | దేసాళం | 86 |
| ఏమిసేయవచ్చు | సాళంగ | 267 |
| ఏమిసేయవచ్చునిఁక | భైరవి | 5 |
| ఏమిసేసినా | దేసాళం | 383 |
| ఏమీననకున్న | శుద్ధవసంతం | 319 |
| ఏమున్నది | ధన్నాసి | 313 |
| ఏమేమైపెఁ డమ్ములు | దేసాళం | 192 |
| ఏరా నీజాణ | రామక్రియ | 214 |
| ఏరానీతో | ఆహిరినాట | 373 |
| ఏరానన్నేణ | శుద్ధదేశి | 152 |
| ఏలనన్నొడ | హిందోళవసంతం | 364 |
| ఏలనవ్వే | ముఖారి | 190 |
| ఏలనీకత | రామక్రియ | 329 |
| ఏలరట్టు | దేసాళి | 1 |
| ఏలసిగ్గు | మాళవిగౌళ | 398 |
| ఏలవూరకున్న | రీతిగౌళ | 277 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| ఏలేమా | మధ్యమావతి | 131 |
| ఒకటికొకటి | సాదరామక్రియ | 472 |
| ఒక్కతొకతె | దేవక్రియ | 432 |
| ఒక్కమనసున | నట్టనారాయణి | 96 |
| ఓపమయ్యా | నాగవరాళి | 52 |
| ఓరినీవు | శుద్ధవసంతం | 90 |
| ఓయమ్మ | మేఘరంజి | 433 |
| ఓవరిలో | తెలుగుగాంబోది | 316 |
| ఔరా మంచి | కురంజి | 531 |
| కంటిమన్నీ | శ్రీరాగం | 335 |
| కంటివిగా | శంకరాభరణం | 185 |
| కటకటాయిది | ఆహిరి | 128 |
| కడలేని | మలహరి | 510 |
| కతలుసేయక | కన్నడగౌళ | 336 |
| కద్దులేదనగ | మాళవిగౌళ | 11 |
| కన్నారము | శంకరాభరణం | 215 |
| కనుగొను | హిజ్జిజ్జి | 458 |
| కన్నులారా | దేసాళం | 45 |
| కప్పురము | ముఖారి | 154 |
| కరుణించ | ఆహిరి | 225 |
| కల్లలాడే | పాడి | 374 |
| కలికి నిన్నిటు | ఆహిరి | 479 |
| కాంతలకు | భైరవి | 301 |
| కాగిలించుకొన | మేఘరంజి | 584 |
| కాగిలించుకో | భైరవి | 566 |
| కాదుకూడదన | శంకరాభరణం | 47 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| కాదుగూడదన | భైరవి | 451 |
| కానవచ్చె | రామక్రియ | 61 |
| కానికాని | రీతిగౌళ | 148 |
| కానీవయ్యా | సౌరాష్ట్రం | 67 |
| కానీలేదాని | తోండి | 521 |
| కానుకలందు | కురంజి | 69 |
| కామినిచెలి | వరాళి | 548 |
| కూచుండు | బౌళి | 129 |
| కూరుములూ | నాదరామక్రియ | 502 |
| కైకొననంటా | ముఖారి | 414 |
| కైకొని తన | మంగళకౌశిక | 540 |
| కొండవేల | భూపాళం | 325 |
| కొత్తపొందో | రామక్రియ | 478 |
| కోరిమమ్ము | సామంతం | 57 |
| గరిమె నెరిఁగి | ఛాయానాట | 223 |
| గుట్టుతోడనుండ | సింధురామక్రియ | 413 |
| గుట్టుతోడ నుండేదే | దేసాళం | 70 |
| గుట్టున నూర | కాంబోది | 257 |
| చక్కనుండితే | మాళవిగౌళ | 87 |
| చక్కసాగిలి | శుద్ధదేశి | 224 |
| చదురంగ | దేసాళం | 482 |
| చాలునమ్మ | రీతిగౌళ | 379 |
| చిత్తగించి చక్క | వరాళి | 570 |
| చిత్తగించి చూడ | భల్లాటి | 496 |
| చిత్తగించి విన | భైరవి | 476 |
| చిత్తములో | శంకరాభరణం | 454 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| చిత్తము వచ్చి | నీలాంబరి | 220 |
| చిత్తాన మఱవ | శ్రీరాగం | 23 |
| చూచితే నాము | సామంతం | 511 |
| చూచితేఁ బిన్న | దేశాళి | 506 |
| చూచినవారు | పాడి | 565 |
| చూచిన సతు | బౌళి | 18 |
| చూచేముగా | దేసాళం | 515 |
| చూడరమ్మ | కాంబోది | 430 |
| చూడవయ్యా | శుద్ధదేశి | 4 |
| చూడవో | సౌరాష్ట్రం | 232 |
| చూతమయ్యా | కాంబోది | 498 |
| చూతముగా | ఛాయానాట | 352 |
| చెప్పకురే | పాడి | 477 |
| చెప్పరాదు | ముఖారి | 146 |
| చెప్పరే బుద్దులు | మలహారి | 102 |
| చెప్పితే | నాట | 2 |
| చెలికత్తెల | నాదరామక్రియ | 80 |
| చెలిభ్రమల | ముఖారి | 77 |
| చెలివంటా | కన్నడగౌళ | 262 |
| చెలులము | సౌరాష్ట్రం | 535 |
| చెలులాల బలు | కన్నడగౌళ | 501 |
| చెలులాల యిటు | శుద్ధవసంతం | 591 |
| చెలులాల యీ | పాడి | 428 |
| చెలులాల వేగి | గుండక్రియ | 49 |
| చెలులిఁక | మధ్యమావతి | 394 |
| చెల్లఁబోనింకా | అహిరి | 92 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| చెల్లఁబో యింకాఁ జెప్ప | ఆహిరి | 156 |
| చెల్లఁబో యింకా నేల | మధ్యమావతి | 241 |
| చెల్లఁబో యెంత | గౌళ రామక్రియ | 517 |
| చెల్లుబడి | కాంబోది | 320 |
| చేతికిలోనై | పాడి | 404 |
| చేతులు చాఁచి | ముఖారి | 268 |
| చేతులు పై | వరాళి | 385 |
| చేరి నీ | లలిత | 3 |
| చేసిన చేఁత | దేవగాంధారి | 409 |
| జాగులేమటికె | శంకరాభరణం | 226 |
| తగినంతె | నారాయణి | 410 |
| తతిగాదు | పాడి | 339 |
| తనంతఁదా | రామక్రియ | 91 |
| తన చిత్తమింతే | ఆహిరి | 56 |
| తన చిత్తమిఁక | లలిత | 303 |
| తనతోడ | మేఘరంజి | 462 |
| తనమేలే | లలిత | 39 |
| తనలోనే | పాడి | 127 |
| తనిసితిమి | గౌళ | 246 |
| తనుఁజూసి | కేదారగౌళ | 470 |
| తప్పులెల్ల | కాంబోది | 344 |
| తమకమే | సామంతం | 200 |
| తమకుఁదమకే | లలిత | 254 |
| తరుణికి | లలిత | 72 |
| తలదడిసి | శ్రీరాగం | 494 |
| తలవంచు | శ్రీరాగం | 48 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| తానదె నేనిదె | శంకరాభరణం | 368 |
| తానిచ్చిన | దేవగాంధారి | 505 |
| తానెంత సేసెనో | కాంబోది | 196 |
| తానేల కొసర | పాడి | 112 |
| తానేల సిగ్గువడీ | మేఘరంజి | 560 |
| తామువిన్న | పడివంజరం | 85 |
| తెలిపించు | నాదరామక్రియ | 350 |
| తొయ్యలుల | భైరవి | 322 |
| తొల్లిటినే | పాడి | 297 |
| దగ్గరితే | శుద్ధవసంతం | 265 |
| దయగల | మధ్యమావతి | 284 |
| దిష్టము చూచితి | కన్నడగౌళ | 64 |
| దోమటిగొల్ల | పళవంజరం | 522 |
| దోసమేల | రీతిగౌళ | 124 |
| నన్ను నేల | శంకరాభరణం | 314 |
| నమ్మితినీ | ఆహిరి | 403 |
| నమ్మితేను | హిందోళం | 475 |
| నవ్వీనూరక | తెలుఁగుఁగాంబోది | 81 |
| నవ్వుతానే | బౌళి | 332 |
| నవ్వేవారి | ముఖారి | 361 |
| నాఁటికి నేఁటికి | సామంతం | 104 |
| నాఁటివలపులు | ముఖారి | 272 |
| నాటకమునకు | సాళంగనాట | 29 |
| నానాఁడు నిన్ను | లలిత | 138 |
| నాపై బత్తి | సాళంగనాట | 465 |
| నాయెడ నీవిటు | శంకరాభరణం | 349 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| నాలికాఁడ | సాళంగనాట | 121 |
| నావల్లఁగడ | రీతిగౌళ | 110 |
| నిండుఁ దమకము | అమరసింధు | 239 |
| నిక్కిచూడ | వరాళి | 288 |
| నిన్నఁ గుప్ప | వరాళి | 452 |
| నిన్నా మొన్నా | సాళంగనాట | 294 |
| నిన్నుఁ జూచి | మలహరి | 13 |
| నిన్ను రమ్మని | ముఖారి | 514 |
| నిన్నేమని | దేవగాంధారి | 209 |
| నిన్నేమీ | వరాళి | 122 |
| నిమ్మలాన | ఆహిరి | 236 |
| నిలుచున్నాడది | సామవరాళి | 243 |
| నిలువుటద్దము | శంకరాభరణం | 338 |
| నీకంటెఁ గోమలము | కన్నడగౌళ | 330 |
| నీకంటె నాపె | కన్నడబంగాళం | 326 |
| నీకంటే నేరు | రీతిగౌళ | 27 |
| నీకుఁ బోదు | ఆహిరి | 334 |
| నీకు నాపెకు | సాళంగనాట | 6 |
| నీకు నిచ్చకు | ముఖారి | 30 |
| నీకు నేమైతే | లలిత | 114 |
| నీకే యరుదు | సాళంగం | 142 |
| నీకేల చలము | రామక్రియ | 557 |
| నీకేల తలవంచ | దేసాళి | 399 |
| నీచిత్తమెట్టు | గుజ్జరి | 38 |
| నీజాణతన | రామక్రియ | 141 |
| నీతియెంచి | లలిత | 523 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| నీతో సయ్యాటాలకు | శుద్ధవసంతం | 504 |
| నీపని నీ | బలహంస | 280 |
| నీ పొరుగున | సామంతం | 97 |
| నీ యెదుట | ఆహిరి | 497 |
| నీలోని మతకాలు | నారాయణి | 291 |
| నీవల్లనైన | నాదరామక్రియ | 167 |
| నీ విట్లుండుట | మలహరి | 290 |
| నీవిందు విచ్చేయు | వరాళి | 229 |
| నీ విన్నిటా | శంకరాభరణం | 106 |
| నీవు మంచి | దేశాళి | 133 |
| నీవెట్టు మగ | నాట | 448 |
| నీ వెరఁగవలె | దేశి | 442 |
| నీ వెఱఁగనిది | ఆహిరి | 576 |
| నీ వెరుఁగుదు | దేవగాంధారి | 370 |
| నీవే అప్పటి | కన్నడగౌళ | 107 |
| నీవే మన్నించి | నాగవరాళి | 346 |
| నీవే యెరిఁగే | హిందోళవసంతం | 130 |
| నీవేల వాదడిచేవు | మాళవిగౌళ | 204 |
| నీవేల సిగ్గు | సామంతం | 46 |
| నెట్టనఁ గన్నియ | శంకరాభరణం | 525 |
| నెమ్మదినోడ | ముఖారి | 382 |
| నెరజాణ | వరాళి | 43 |
| నెలఁత జీవ | ఆహిరి | 145 |
| నెలఁత పర | భైరవి | 532 |
| నెలఁత మెయి | శోకవరాళి | 598 |
| నేఁడు చెలుల | సాళంగనాట | 307 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| నేనెంత మంచి | సింధురామక్రియ | 113 |
| నేనే తప్పుసేసే | ఛాయానాట | 20 |
| నేనే దయ | గౌళ | 169 |
| నేనే నీవల | భైరవి | 228 |
| నేమింత | కన్నడగౌళ | 230 |
| నేమెప్పుడూ | కేదారగౌళ | 500 |
| నేరుచుక | కేదారగౌళ | 199 |
| నేరుపరివై తేను | నారాయణి | 21 |
| పంతగాఁడవగు | నాదరామక్రియ | 366 |
| పచ్చిదేర | దేవగాంధారి | 155 |
| పట్టపుదేవు | బౌళి | 282 |
| పట్టిన చలము | దేసాళం | 365 |
| పట్టినప్పుడె | రామక్రియ | 137 |
| పతి దెచ్చుకొన్న | రీతిగౌళ | 527 |
| పలుమరు | గుజ్జరి | 393 |
| పాయపు మదము | నాదరామక్రియ | 371 |
| పాయపు మోహము | వరాళి | 363 |
| పాయరాని | భైరవి | 83 |
| ప్రియములే | శ్రీరాగం | 36 |
| పువ్వువలె | భల్లాటి | 590 |
| పూవకపూఁచె | వసంతవరాళి | 415 |
| పూవులు ముడువ | దేసాళం | 259 |
| పేరుఁగీర్తి | కన్నడగౌళ | 292 |
| పొంచి నీ | శోకవరాళి | 542 |
| పొత్తులమగఁడవు | మలహరి | 391 |
| పొద్దుగూకు | బౌళి | 261 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| పోటిచెలి | మాళవి | 554 |
| పోపోయింకా | హిందోళవసంతం | 201 |
| పోయినని | సౌరాష్ట్రం | 342 |
| బుద్దిచెప్పె | ధన్యాశి | 386 |
| భళిభళిమాకిది | సామంతం | 380 |
| మంకుదనంబులు | శంకరాభరణం | 416 |
| మగువరో | గౌళ | 586 |
| మనసు మర్మము | లలిత | 578 |
| మన్నించీ | సౌరాష్ట్రం | 487 |
| మరఁగుల | కురంజి | 434 |
| మరుఁడేడ | పాడి | 278 |
| మరునిబలము | శంకరాభరణం | 567 |
| మఱచివున్నా | తెలుఁగుఁగాంబోది | 60 |
| మఱినీవెప్పుడు | కురంజి | 585 |
| మఱియాఁడు | నాదరామక్రియ | 456 |
| మాటకుమును | కురంజి | 308 |
| మాటలాడించకు | హిజ్జిజి | 174 |
| మాటలు నీ వాడి | నట్టనారాయణి | 194 |
| మాతోనేల | మలహరి | 588 |
| మానక నాతో | శంకరాభరణం | 240 |
| మాపుదాఁకా | ఆహిరి | 158 |
| మాపై నింత | మాళవిగౌళ | 250 |
| మామీఁది | గౌళ | 321 |
| మాయదారి | సాళంగనాట | 369 |
| మారుకు మారు | భౌళిరామక్రియ | 545 |
| మించు సన్నలు | నట్టనారాయణి | 359 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| మిక్కిలి చక్క | నాదరామక్రియ | 544 |
| మిక్కిలి మేలు | మధ్యమావతి | 571 |
| మీకు మీకు | రామక్రియ | 153 |
| మీకే చెల్లు | జౌళి | 191 |
| మీరేయెఱఁగ | పాడి | 33 |
| ముందరి వారికి | సౌరాష్ట్రం | 258 |
| ముల్లుముంట | రామక్రియ | 347 |
| మూసిమూసి | శ్రీరాగం | 471 |
| మెచ్చవద్దా | పాడి | 357 |
| మెచ్చితినౌనే | నాగవరాళి | 594 |
| మెచ్చితిమి | వరాళి | 489 |
| మేలనవ్వో నీ | దేశాళి | 14 |
| మేలు మీఁదా | ముఖారి | 244 |
| మేలుమేలుదాని | సౌరాష్ట్రం | 516 |
| మేలుమేలు దొర | మాళవిగౌళ | 151 |
| మేలుమేలు యిన్నిటా | కేదారగౌళ | 572 |
| మేలుమేతే | కన్నడగౌళ | 575 |
| మొకము చూచుచే | తెలుఁగుఁగాంబోది | 263 |
| మొక్కేము నీకు | భూపాళం | 289 |
| మొక్కేనయ్యో | సామంతం | 298 |
| మొగమాయలాడి | వేళావళి | 486 |
| మొన్నటి చేఁతకు | శంకరాభరణం | 192 |
| మోహాంధకారాన | బౌళి | 170 |
| రచ్చలు సేయక | రీతిగౌళ | 388 |
| రమ్మనవే | వేళావళి | 587 |
| లోకమెల్లా | అమరసింధు | 315 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| లోకమేల | శ్రీరాగం | 238 |
| వచ్చెనదివో | దేసాళం | 529 |
| వట్టిగుట్టు | ఆహిరి | 569 |
| వట్టిజోలి | సామంతం | 171 |
| వట్టితగవుల | శుద్ధవసంత | 392 |
| వట్టియుచ్చకము | సామంతం | 397 |
| వట్టినేరా | వరాళి | 343 |
| వద్దనేనా | సామంతం | 581 |
| వద్దనేమా నిన్ను | దేసాళం | 173 |
| వద్దనేమా నేము | వరాళి | 513 |
| వద్దు వద్దు నీకింత | సామంతం | 161 |
| వద్దు వద్దు యింక | బౌళిరామక్రియ | 377 |
| వనితరో | ధన్నాశి | 508 |
| వలచిన | కాంబోది | 28 |
| వలపు గొట్టాన | వసంతవరాళి | 304 |
| వలపుదాఁచ | సామంతం | 50 |
| వలపుల | శుద్ధవసంతం | 507 |
| వలవకుండు | సామంతం | 82 |
| వలెఁగాయివి | కురంజి | 176 |
| వాఁడునాపై | ముఖారి | 287 |
| వాకిటనే | ఆహిరి | 218 |
| వారి వారి | పాడి | 63 |
| వింటూనున్నాఁడు | దేశి | 483 |
| వింటివా వో | కురంజి | 461 |
| విడు విడు | దేవగాంధారి | 376 |
| విడెమియ్యో | హిజ్జిజి | 438 |
| విన్న కన్న | లలిత | 65 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| విన్నపము | వరాళి | 207 |
| విన్నవించరే | భైరవి | 493 |
| విన్నవించురే | రామక్రియ | 547 |
| విభునితో | శంకరాభరణం | 66 |
| వెడ విన్నప | శ్రీరాగం | 333 |
| వెల్ల విరిసే | శ్రీరాగం | 274 |
| వేగిర మేల | ఆహిరి | 285 |
| వేగిరింతు | హిందోళం | 227 |
| వేడుక చూడ | పళవంజరం | 447 |
| వేడుక లెట్టి | దేసాళం | 431 |
| వేరే నేనేమి | సాళంగనాట | 221 |
| వేరెయిఁక | లలిత | 378 |
| వేవేలు గొసరి | సామంతం | 406 |
| వేసరక | భైరవి | 283 |
| వేసాలకు | శుద్ధదేశి | 253 |
| సంతోసమాయ | హిందోళం | 450 |
| సకియకు | మంగళకౌశిక | 429 |
| సాము సేసిన | తెలుఁగుఁ గాంబోది | 564 |
| సిగ్గువడకప్పటి | మంగళకౌశిక | 231 |
| సిగ్గువడకుమిఁక | శంకరాభరణం | 79 |
| సుదతిలాగుల | బౌళిరామక్రియ | 559 |
| సుముఖమంగళము | లలిత | 419 |
| సెలవినవ్వుల | ఆహిరి | 99 |
| సేసిన చేఁతలు | శంకరాభరణం | 389 |
| సేసినట్టు | బౌళి | 345 |
| సేసేటి వూడిగము | సామంతం | 331 |

# 3-వ అనుబంధము

## సందిగ్ధపదసమీక్ష

( ఈ తాళ్లపాకకవుల వాఙ్మయములో అపూర్వపదరాశి గొప్పదని, దానిలో మాకు వింతగ దోచినకొన్నిపదములకు ఉపపత్తులను మాబుద్ధిమితికి తగినట్లు చూపితిమి. 19, 20వ సంపుటములలో వ్రాసినట్లే ఈసంపుటమునను ఆపని యథాశక్తిగ సాగించుచున్నాము. ఈయనుబంధము 3 వ దిగ వేయుట దీనిలో విశేషము.)

1. అడ్డలించు : (570 పాట)

అదలించునకు వింతయగు రూపాంతరము. ప్రాసస్థాన మగుటచే సవరణలకు లోగదు.

2. ఉంటవిఁట : (562 పాట)

ఉంటలు, ఉంటలవంటిచిన్నరాళ్లు వేయు విల్లు కావచ్చు. ఈ జాతిదానికి 'ఇంటెలదబ్బ' అని నేటికి వ్యవహారను గలదు.

3. ఉద్దండీఁడు : (2 పాట)

ఉద్దఁడుఁడు, ఉద్దండత, ఉద్దండను ఇత్యాదులు అతిశయ-సాహ-సాద్యర్థములలో కానవచ్చుచున్నవి. 'ఉద్దండ' భావార్థమై మతు బర్థమున 'ఈఁడు' వచ్చుట వింత. తెగువరి అర్థము కావచ్చు

4. ఎకసక్కెలు : (87 పాట)
ఎగసక్కెము: (263 పాట)

ఏకసఖ్య శబ్దభవమా? అనిపించును. ఎకసక్కెమునకు బహురూపము లిచ్చి, పరిహాసార్థకమని సూ. ని. ఇందు 'ఎగసక్కె' మనియు నున్నది. అర్థములో విశేషము లేదు.

5. ఏటులు: (81 పాట)

ఏటు=వేట అని, 'ఏటు' అను నిర్బిందుకమునకు ప్రధానము వగైరా అర్థమని సూ. ని. దీనియర్థము విచార్యము.

6. ఏతులు: (30 పాట)

ఏచుధాతుభవము కావచ్చు. దంభము అర్థమని సూ. ని. అది కొంత మార్పుతో గొప్పలు అని ఇక్కడ సరిపడవచ్చు.

7. ఒలుగె: (301 పాట)

కన్నడ సంబంధముతో వచ్చినది కావచ్చు. మెల్లగ అని అర్థము

8. కమ్మటి: (11 పాట)

క్రమ్మర అనుట క్రియాపవిభక్తిక రూప మపభ్రంశముగ కాన-వచ్చుచున్నది.

9. కాకరి విద్యలు: (9 పాట)

కాకు = బాధ అని శ-ర, సూ. ని. ప్రౌఢ్యము ఆయర్థమిందు అంతసంగత మనిపించదు. కాకు + అరి = వంచన. మాయలు గలవాడని తోచెడిని.

10. కిమ్మలనే: (220 పాట)

లోలోపలనే అనునర్థమున 'కిమ్మలనే' అని నేటికి వ్యవహారమున కలదు. మెల్లగ, నిదానముగ, గుట్టుగ కావచ్చును.

11. కులిగి: (103 పాట)

కుర్గు = to shink అని కిట్టల్. ఇక్కడ ఘనీభవించుట కావచ్చును.

12. కొండించేరు: (325 పాట)

కొండెము శబ్దమునకు అపభ్రంశమైన ధాతురూపము.

13. కౌనపరిదాన: (334 పాట)

ఈశబ్ద మపురూప మైనది. అర్థమూ విచార్యమే. ప్రకరణముతో గుణవంతురాలు కావచ్చు.

14. గచ్చులు: (235 పాట)

గచ్చు = గార ప్రసిద్ధమే. గచ్చులు = దంభములు అని సూ. ని. దానిఛాయార్థముగ అబద్ధములు కావచ్చును. అబద్ధములు అను నర్థమున ఈపద మీనాటికీ వ్యవహారములో నున్నది.

15. గామిడి: (6 పాట)

గ్రామణీ శబ్దభవము, శ్రేష్ఠుఁడు అర్థమని సూ. ని. 'గామిడి చేఁతలు' ఇత్యాదులందు. పెద్దపనులు. పెద్దరికము గలపనులు అని.సూ. ని. తెల్పిన యర్థము సంగతమైనట్లు కన్పట్టును.

16. గుద్దిరాన: (381 పాట)

కుదిగ్రేశితనము అని కన్నడమున వ్యవహారము. Envy అసూయ అని కిట్టల్. కుద్రిశబ్దభవము కావచ్చు.

17. గొరబు: (61 పాట)

గోరబు. గొరగు అని కన్నడము. A clock made of leaves of gas అని కిట్టల్. వికారవిశేషము. వేషముఇత్యాది కావచ్చును.

18. చిలుగువాఁడి చూపులు: (82 పాట)

'చిలుగు' 'చిలుకు',కు రూపాంతరమా?

19. చిలుపాలు: (77 పాట)

చిరుపాలు అని శ.ర. గ్రాామ్యము. చీఁడ్పాలి, చీళ్పాలు. శిరుపాలి Lailar milk hedge. అని తమిళము. జున్ను అని తెలుగు; గిణ్ణు, గిణ్ణ, గెణ్ణు అని కన్నడము. 'బాగా మీఁగడ గట్టు నట్లి-గరఁగాచినపాలు' అనవచ్చు.

20. చేముంచి: (2 పాట)

ఈ పదము నిఘంటువులలో కానరాదు. 'తలమున్కలు' వలె పూర్తిగ పనిలో దిగి అనునర్థమున ప్రయోగించినట్లున్నది.

21. తావళించి: (259 పాట)

తావళము = అవకాశము అని సూ. ని. ఇక్కడ. అవకాశము చూచుకొని, యథావకాశముగ, అలస్యముగ అనిగూడ అర్థము కావచ్చు.

22. తోతోయ: (120 పాట)

తోయము = తడవ అని శ. ర. దాని ద్విరుక్త రూపము. మాటికి మాటికి అని యర్థము.

23. దాయిదండ: (267 పాట)

'దాయి' ధాత్రి శబ్దభవమని కిట్టల్. తల్లివలె రక్షకురాలవు అని యర్థము కావచ్చు.

24. దోయండు: (528 పాట)

'దోసెండు'కు విచిత్రముగ పరిమాణార్థమున రూపాంతరము గాబోలు.

25. పంకించు: (4 పాట)

బురదగ చేయు, సరిచేయు ఇత్యాద్యర్థములని సూ. ని. అవి ఇక్కడ పొసగవు. గౌరవించు, పెద్దగ చూచు అనునర్థములలో ప్రయోగించినట్లున్నది. 'నిన్నెవరు పంకిస్తారురా' ఇత్యాది వ్యవహార మీనాటికీ గలదు. 'తలపంకించు'లోగూడ దీని తాత్పర్యమే యగపడును.

26. పంగించు: (258 పాట)

పంగించు = కోపగించు అని సూ. ని. పంగెన = ఓడము అని శ.ర. 'దెప్పిపొడుచు' అనునర్థముగ తోచుచున్నది. ఇది మాం-

డలికము. 'బలే పంగిస్తాడు' 'నీ పంగెనలు నాకెందుకు' ఇత్యాది జనవ్యవహార మీనాటికి సుప్రసిద్ధమే. 'భంగించు' శబ్ద-భవము గావచ్చు.

27. పంతమిచ్చు: (34 పాట)

పంతము నిచ్చు=మాటిచ్చు అని సూ.ని. కానీ యీ వాఙ్మయము-నందంతట 'ఇచ్చు' ధాతుసాహచర్యముచే. పట్టుదల వదలుట, తప్పంగీకరించుట ఇత్యాద్యర్థములలో ప్రయోగించినట్లు కన్పడు చున్నది.

28. పరభావము: (532 పాట)

పెద్దబాధ్యత అర్థము కావచ్చు.

29. పాంగిన: (184 పాట)

'పాంగు' అని తమిళ శబ్దము. క్షేమము అని యర్థము. ఇక్కడ క్షేమంకరమైన అని యర్థము కావచ్చు. తెలుగ 'బాగు'గూడ నిదియే కావచ్చు. అరసున్న లేకుండుట విచార్యము.

30. పానిపట్టి: (148 పాట)

'పనిపట్టి' అను శబ్దమునకు, జోరుగ వాడిన వ్యావహారిక రూపమా? అనిపించుచున్నది.

31. పూసుగోడై: (9 పాట)

అస్థిరము; తప్పు కప్పిపుచ్చుట అనునర్థములలో, 'పూసిన గోడ', 'పూసినగోళ్లు' వంటిది కావచ్చు 'పూసుగోళ్లు' అనుటకు 'పూసుగోడు' అను ఏకవచనరూపము అపురూపమే. కన్నడ మున సాధింప వచ్చునేమో?

32. పేరువళి: (365 పాట)

పేరుగలవాడు. ప్రకరణవశమున ప్రశస్తవాచకము గావచ్చు

33 బాసటము: (98 పాట)

బాసట ప్రసిద్ధమే బాసటము = విషము అని సూ.ని. అది ప్రకరణాని కతుకుతుంది గూడ.

34 బెట్టి మాటలు: (119 పాట)

బెట్టు శబ్ద మౌపవిభక్తిక మగుట వింత.

35. రాఁగిన: (152 పాట)

'రాగిల్లు'నకు రూపాంతరమా? అరసున్న ఆశ్చార్యము. 'రంగు'కు రూపాంతరము కావచ్చు అనురాగము గలిగిన ప్రీతిపడిన అని యర్థము కావచ్చు.

36. వాఁడ్లు: (265 పాట)

వాఁడి శబ్దము ప్రథమాబహువచనరూపము, వాఁడి + లు= వాండ్లు. పదనులు అర్థము. ఇట్లే 'వేండ్లు' శబ్దముగూడ. తెనాలి-రామకృష్ణుని ప్రయోగమును గలదు.

37. వారపట్టి: (180 పాట)

ఓరపట్టు శబ్దమేనా? ఒకమూల స్వాధీనము చేసుకోని అని యర్థ ముండవచ్చు.

38. శాఖా: (145 పాట)

పైపాటలో 'చంద్రుని శాఖా శైత్యము' ఛాయార్థముగ కిరణములకు 'శాఖా' శబ్దమును వాశినట్లున్నది.

39. సద్దాత్మ; (2 పాట)

సుద్దాత్మనకు వ్యావహారిక రూపమా యనిపించును.

40. సుసరాన: (7 పాట)

ఇది నిఘంటువులలో కానరాదు. సుస్వర లేక సుషిర శబ్దభవము కావచ్చు, సులభముగ అని యర్థము.

---

పై పదములు చాలపాటలలో నుండవచ్చు, ఉన్నవి. మేము గుర్తు కొకపదమున కొకపాట సంఖ్యయే యిచ్చినాము.

T. T. D. Religious Publications Series No. 188

Price Rs. 16-00

తిరుమల తిరుపతి దేవస్థానంవారి ప్రచురణ

Published by S. Lakshminarayana, I.A.S. Executive Officer,
T. T. Devasthanams and Printed at T.T.D. Press, Tirupati.